గురువారం 19-6-2025

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 88

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



పాక్‌తో భారత్ తొలిపోరు

మహిళల టి20 వరల్డ్‌కప్ షెడ్యూల్‌ను విడుదల చేసిన ఐసీసీ.

-14లో



భారత్‌లో ఫాల్కన్ జెట్స్

డసాల్ట్ ఏవియేషన్‌తో రిలయన్స్ ఇన్‌ఫ్రా ఒప్పందం

-15లో



వార్షిక ఫాస్టాగ్ పాస్

వాహనదారుల టోల్‌ప్లాజా కష్టాలు తీర్చేందుకు కేంద్రం వార్షిక ఫాస్టాగ్ అనే కొత్త పాస్‌తో ముందుకొచ్చింది.

వివరాలు 6లో ▸



మధ్యవర్తిత్వం మాటే లేదు

భారత్, పాక్ మధ్య జరిగిన సైనిక చర్యల ముగింపులో అమెరికా మధ్యవర్తిత్వ పాత్ర పోషించలేదని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



15 రోజుల్లోగా డెలివరీ

ఎలక్టర్ ఫొటో ఐడెంటిటీ కార్డును ఓటర్లకు 15 రోజుల్లోగానే చేరేలా చర్యలు తీసుకోనున్నట్లు ఈసీ వెల్లడించింది.

వివరాలు 6లో ▸



ఆ నోటీసు హక్కుల ఉల్లంఘనే

'ఫార్ములా–ఈ కేసులో నా ఫోన్‌ను ఇవ్వాలని ఏసీబీ కోరటం.. నా ప్రాథమిక హక్కులను ఉల్లంఘించటమే' అని కేటీఆర్ అన్నారు.

వివరాలు 3లో ▸

కేసీఆర్ సూచనతోనే బనకచర్ల!

ఎంపీలతో సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- వృథాగా సముద్రంలో కలుస్తున్న 3 వేల టీఎంసీల గోదావరి జలాలను రెండు రాష్ట్రాలు వాడుకోవాలని నాటి సీఎం అన్నారు
- 2016 అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు సూచించారు
- ఆ సూచనతోనే బనకచర్ల ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది
- 2019లో సీఎంలు కేసీఆర్, జగన్ నాలుగుసార్లు సమావేశమయ్యారు
- 400 టీఎంసీల గోదావరి జలాలు రాయలసీమకు తరలింపుపై చర్చించారు.. దాని ఆధారంగానే 300 టీఎంసీలు తరలించేలా ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదించింది
- నాటి అపెక్స్ కౌన్సిల్ సమావేశం మినిట్స్‌నే తెలంగాణకు గుదిబండగా మార్చాలని ఏపీ చూస్తోందన్న సీఎం
- సీఎం వ్యాఖ్యలకు అభ్యంతరం తెలిపిన బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు
- తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే కేసీఆర్ ఆ ప్రతిపాదనలు చేశారని స్పష్టీకరణ.. సమావేశం నుంచి వాకౌట్
- బనకచర్లను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాం.. రాజకీయ ప్రయత్నాలు ఫలించకపోతే న్యాయపోరాటం చేస్తామన్న రేవంత్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని కృష్ణా బేసిన్‌లో నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదన దశలోని ప్రాజెక్టులకు వెయ్యి టీఎంసీలకి మించి నీళ్లు అవసరం. ఏటా 3 వేల టీఎంసీల గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయి. నీటి లభ్యత ఉన్న నేపథ్యంలో రెండు రాష్ట్రాలు చర్చించుకుని నీళ్లను వాడుకోవాలని 2016 సెప్టెంబర్ 21న అప్పటి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి ఉమాభారతి అధ్యక్షతన జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో నాటి తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రతిపాదించారు. ఏపీ సీఎం చంద్రబాబు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. 3 వేల టీఎంసీలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని కనిపెట్టింది కేసీఆరే. ఆ నీటి వినియోగంపై నిర్ణయం తీసుకోవాలని సూచించింది ఆయనే. కేసీఆర్ సూచన నుంచే గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు అంకురార్పణ

మిగతా 2వ పేజీలో ▶

డిజిటల్ భద్రతతోనే అభివృద్ధి

- ప్రస్తుత టెక్నాలజీ యుగంలో డిజిటల్ సెక్యూరిటీయే కీలకం
- గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్
- ఆసియా–పసిఫిక్‌లో హైదరాబాద్‌లోనే మొదటి జీసెక్: శ్రీధర్‌బాబు

3లో



ఇష్ఫహాన్‌లో ఇరాన్ బలగాలు కూల్చిన ఇజ్రాయెల్ డ్రోన్

క్షిపణుల కుంభవృష్టి

ఇరాన్‌లోని 40 ప్రాంతాలపై ఇజ్రాయెల్ ముప్పేట దాడి

- సెంట్రిఫ్యూజ్, ఆయుధాల ఉత్పత్తి కర్మాగారాలపై క్షిపణుల కుండపోత.. డ్రోన్ల దండుతో చెలరేగిపోయిన ఇజ్రాయెల్
- ఇరాన్‌లో 585 దాటిన మరణాలు.. 1,300 మందికి గాయాలు
- లొంగిపోయే ప్రసక్తేలేదు : ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ
- మా జోక్యం ఉండొచ్చు.. ఉండకపోవచ్చు: ట్రంప్

6లో



రైతుల చేతులకు సంకెళ్లు!

- పోలీసుల తీరుపై విమర్శలు
- ధన్వాడకు చెందిన 12 మందికి మంగళవారమే బెయిల్ మంజూరు
- అయినా సంకెళ్లు వేసి కోర్టులో హాజరుపరిచిన వైనం.. ముగ్గురిని సస్పెండ్ చేశామన్న గద్వాల ఎస్పీ

12లో



మీకు ఊడిగం చేయకపోతే కక్ష సాధింపా?

పచ్చ మీడియా ద్వారా ట్రోలింగ్‌లు, పోలీసులను అడ్డుపెట్టుకుని తప్పుడు కేసులు

ఏపీ సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

11లో

రెంటపాళ్లలో ఆవిష్కరించిన నాగమల్లేశ్వరరావు విగ్రహం వద్ద వైఎస్ జగన్, బాధితుడి కుటుంబసభ్యులు



గాజర్ల రవి

మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి ఎన్‌కౌంటర్

- ఏపీలోని కింటుకూరు అడవుల్లో ఎదురుకాల్పులు.. చలపతి భార్య అరుణ, మరో మహిళా మావోయిస్టు కూడా మృతి
- పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న రవి

5లో



అరుణ



డీఎన్‌ఏ.. బంధం చెప్పేస్తుంది

అనువంశిక లక్షణాలకు చిరునామా ఇదే

బంధుత్వాన్ని కనిపెట్టే డీఎన్‌ఏ పరీక్ష

'ఎయిర్ ఇండియా' మృతుల గుర్తింపులో కీలకం

రకరకాల పరీక్షల ద్వారా కచ్చితమైన ఫలితాలు

ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంతో యావత్ భారతావని ఉలిక్కిపడింది. ఒకరు కాదు ఇద్దరు కాదు.. విమాన ప్రయాణికులు, సిబ్బందితోపాటు మెడికల్ కాలేజ్ విద్యార్థులు, ఇతరులు కలిపి 274 మంది కన్నుమూశారు. ప్రమాద సమయంలో విమానంలో సుమారు 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉండటంతో భారీ పేలుడు సంభవించింది. అందువల్ల కొన్ని మృతదేహాలు గుర్తించలేని స్థితిలో ఉన్నాయి. తమవారి చివరి చూపు కోసం బాధిత కుటుంబ సభ్యులు పరితపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరణించిన వారి అవశేషాలను గుర్తించడానికి డీఎన్‌ఏను (డీ ఆక్సీరైబో న్యూక్లిక్ యాసిడ్) విశ్లేషిస్తున్నారు. దీనిద్వారా బుధవారం వరకు 190 మందిని గుర్తించారు. 159 మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇంతకూ.. ఈ డీఎన్‌ఏ పరీక్షలు ఏమిటి? ఎలా కనిపెడతారు?

సాక్షి, స్పెషల్ డెస్క్

అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతుల కుటుంబ సభ్యుల నుంచి డీఎన్‌ఏ నమూనాలను ఇప్పటికే సేకరించారు. గాంధీనగర్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్‌ఎస్‌ఎల్) 130 శాంపిళ్లను ఒకేసారి పరీక్షిస్తోంది. ఇందుకోసం ఎఫ్‌ఎస్‌ఎల్, జాతీయ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీలకు చెందిన సుమారు 50 మంది శాస్త్రవేత్తలు నిర్విరామంగా పనిచేస్తున్నారు.

డీఎన్‌ఏ... మన లక్షణాలకు చిరునామా

డీఎన్‌ఏ అనేది ప్రతి జీవి కణాల్లో ఉండే ఒక అణువు. జీవుల లక్షణాలను నిర్ణయించే జన్యు సమాచారానికి ఇదే చిరునామా. మన అనువంశిక విశేషాలకు ఒక కేరాఫ్ అడ్రస్. ఒకేలా ఉండే (ఐడెంటికల్) కవలలను మినహాయించి ప్రతి వ్యక్తి శరీరంలోని దాదాపు ప్రతి కణంలో ప్రత్యేక డీఎన్ ఏ ఉంటుంది. మానవ అవశేషాలను గుర్తించడానికి డీఎన్‌ఏ అత్యంత కీలక సాధనం. ముఖ్యంగా అహ్మదాబాద్ విమాన ప్రమాదం లాంటి సందర్భాల్లో సామూహిక మరణాలు సంభవించినప్పుడు శరీరాలను గుర్తించడం సులభం కాకపోవచ్చు. కానీ డీఎన్‌ఏను విశ్లేషించడం ద్వారా ఇది సాధ్యం అవుతుంది.

దృఢ కణజాలం నుంచి..

ఒక వ్యక్తి మరణించిన వెంటనే వారి డీఎన్‌ఏ క్షీణించడం ప్రారంభమవుతుంది. సమయం గడిచే కొద్దీ డీఎన్‌ఏను విశ్లేషించడం కష్టతరం అవుతుంది. కొన్ని సందర్భాల్లో అసాధ్యం కూడా కావచ్చు. డీఎన్‌ఏ నుంచి సంగ్రహించిన కణజాలం రకం, శరీరం ఉన్న పరిస్థితులపై ఈ క్షీణత ఆధారపడి ఉంటుంది. వేడిగా, తేమగా ఉన్నప్పుడు కంటే చల్లని, పొడి పరిస్థితులలో డీఎన్‌ఏ చాలా బాగా మనుగడ సాగిస్తుంది. అందుకే నమూనాలను త్వరగా సేకరించి వీలైనంత చల్లని, పొడి వాతావరణంలో నిల్వ చేయాలి. వాటిని మైనస్ 20 డిగ్రీల సెల్సియస్ వద్ద లేదా చర్మం, కండరాల వంటి మృదు కణజాలాలను 95% ఇథనాల్‌లో నిల్వ చేయవచ్చు. ఎముకలు, దంతాల వంటి దృఢ కణజాలాలతో పోలిస్తే మృదు కణజాలాల నుంచి సేకరించిన డీఎన్‌ఏ చాలా వేగంగా క్షీణిస్తుంది. అందుకే ఫోరెన్సిక్ నిపుణులు సాధారణంగా దృఢ కణజాలం నుంచి డీఎన్‌ఏను సేకరిస్తారు.

రక్త సంబంధీకులైతేనే..

విమాన ప్రమాదాల తర్వాత శిథిలాల నుంచి కణజాల నమూనాలను సేకరించడానికి సాధారణంగా రెండు వారాలు పడుతుంది. విషాదం తీవ్రత ఎక్కువగా ఉంటే మరింత ఆలస్యం అవుతుంది. 2001 సెప్టెంబర్ 11న న్యూయార్క్‌లో జరిగిన దాడుల తర్వాత దాదాపు 3,000 మంది బాధితుల నమూనాలను సేకరించడానికి అధికారులకు 10 నెలలు పట్టింది. సేకరించిన డీఎన్‌ఏ ఎవరికి చెందినదో గుర్తించడానికి రక్త సంబంధీకుల నుంచి రిఫరెన్స్ నమూనాలను సేకరిస్తారు. బాధితుడి తల్లిదండ్రులు, పిల్లలు ఈ నమూనాలను అందించడానికి అనువైన వ్యక్తులు. సేకరించిన నమూనాల నుంచి డీఎన్‌ఏ తీస్తారు. ప్రమాద మృతుల డీఎన్ ఏ నాణ్యతను బట్టి శాస్త్రవేత్తలు అనేక విభిన్న విశ్లేషణ పద్ధతులను ఎంచుకుంటారు.

షార్ట్ టాండమ్ రిపీట్ (ఎస్‌టీఆర్)

ఇది డీఎన్‌ఏ ప్రొఫైలింగ్ సాంకేతికత. వ్యక్తులను గుర్తించడానికి డీఎన్‌ఏలోని న్యూక్లిక్ ఆమ్లాల నమూనాలను పరిశీలిస్తారు. ఇవి వ్యక్తులను బట్టి మారుతూ ఉంటాయి. నేరపరిశోధన, తండ్రి ఎవరో తెలుసుకునే పితృత్వ పరీక్ష, మానవ అవశేషాలను గుర్తించడంలో దీన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు.

మైటోకాండ్రియల్ డీఎన్‌ఏ విశ్లేషణ

పేలుడు జరిగి, రసాయనిక ప్రక్రియల వల్ల న్యూక్లియర్ డీఎన్‌ఏ బాగా ధ్వంసమై చిన్నచిన్నవిగా విడిపోయిన సందర్భాల్లో లేదా అందుబాటులో లేనప్పుడు ఉపయోగిస్తారు. న్యూక్లియర్ డీఎన్‌ఏ కణ కేంద్రకంలో ఉంటుంది. మైటోకాండ్రియాలో ఉండే డీఎన్‌ఏ కంటే ఈ న్యూక్లియర్ డీఎన్‌ఏ భిన్నమైనది. బాగా పాడైన మానవ అవశేషాల నుంచి కూడా ఈ డీఎన్‌ఏని సేకరించడం సులభం. ఈ పద్ధతిలో.. ఒక వ్యక్తి అవశేషాల నుంచి నమూనాలను వారి తల్లి, అమ్మమ్మ, తోబుట్టువులు, అత్తలు, మామలు, వారి పిల్లల నుంచి రిఫరెన్స్ నమూనాలతో సరిపోల్చి మృతులను గుర్తించవచ్చు.



'వై' క్రోమోజోమ్ విశ్లేషణ

మానవులలో ఎక్స్, వై అనే రెండు రకాల లైంగిక క్రోమోజోములు ఉంటాయి. పురుషుల్లో ఒక ఎక్స్, ఒక వై క్రోమోజోమ్ ఉంటాయి. స్త్రీలలో రెండు ఎక్స్ క్రోమోజోమ్‌లు ఉంటాయి. ఈ పద్ధతిలో బాధితుడి అవశేషాలను.. వారి రక్త సంబంధీకుల్లో కేవలం మగవారితోనే సరిపోలుస్తారు.

సింగిల్ న్యూక్లియోటైడ్ పాలిమార్ఫిజమ్స్ (ఎస్‌ఎన్‌పీ) విశ్లేషణ

విశ్లేషించాల్సిన డీఎన్‌ఏ.. పేలుడు జరిగి, రసాయనిక ప్రక్రియల వల్ల బాగా ధ్వంసమై చిన్నచిన్నవిగా విడిపోయిన సందర్భాల్లో ఈ పద్ధతిని కూడా ఉపయోగిస్తారు. ఎస్‌ఎన్‌పీ ప్రతి వ్యక్తికి ప్రత్యేకమైనవి. టూత్ బ్రష్, దువ్వెన వంటి బాధితుడి వ్యక్తిగత వస్తువుల నుంచి తీసుకున్న రిఫరెన్స్ నమూనాల సహాయంతో గుర్తింపు కోసం వీటిని ఉపయోగిస్తారు. ఈ పద్ధతి ఎస్‌టీఆర్ విశ్లేషణ స్థాయిలో అంత ప్రభావవంతమైనది కాదు.

కేసీఆర్ సూచనతోనే బనకచర్ల!

▶ మొదటి పేజీ తరువాయి

జరిగింది..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశం మినట్స్‌లో కేసీఆర్ చేసిన సూచనలను రికార్డు చేశారని, ఆ మినట్స్ కాపీని ఎంపీలందరికీ అందజేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై బుధవారం సచివాలయంలో రాష్ట్ర ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నికర జలాల వినియోగం పూర్తి కాకముందే మిగులు జలాల లభ్యతను ఎలా తేల్చుతారంటూ బీజేపీ ఎంపీ రఘునందర్‌రావు అడిగిన ప్రశ్నకు సీఎం బదులిస్తూ కేసీఆర్‌పై ఆరోపణలు చేశారు.

గోదావరి జలాల తరలింపే ఆ భేటీల లక్ష్యం

'చంద్రబాబు, కేసీఆర్ మధ్య సమస్యలు రావడంతో 2016 తర్వాత 3 వేల టీఎంసీల మిగులు జలాల అంశం మరుగున పడిపోయింది. ఆ తర్వాత 2019 ఆగస్టులో నాటి ఏపీ సీఎం జగన్‌తో ప్రగతిభవన్‌లో నాటి తెలంగాణ సీఎం కేసీఆర్ సమావేశమై మళ్లీ ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తాం అని ఆ సమావేశంలో కేసీఆర్ అన్నారు. కేసీఆర్, జగన్‌లు ప్రగతిభవన్‌లో నాలుగు సార్లు సమావేశమై గోదావరి జలాలను రాయలసీమకు తరలించుకోవడంపై చర్చలు జరిపారు. గోదావరి జలాలను కృష్ణా, పెన్నా బేసిన్లకు తరలించడమే నాటి సమావేశాల లక్ష్యం. ఈ నేపథ్యంలోనే బనకచర్ల ప్రాజెక్టును ప్రస్తుతం ఏపీ చేపట్టింది. 400 టీఎంసీలను రాయలసీమకు తరలించాలని అప్పట్లో కేసీఆర్, జగన్ మాట్లాడుకున్నారు. అందులో భాగంగానే బనకచర్ల ప్రాజెక్టు ద్వారా నేరుగా 200 టీఎంసీలు, పరోక్షంగా 100 టీఎంసీలు కలిపి 300 టీఎంసీలను తరలిస్తామంటూ ఏపీ తాజాగా ప్రతిపాదించింది..' అని రేవంత్ చెప్పారు.

ఆ మినిట్స్‌నే గుదిబండగా మార్చాలని ఏపీ చూస్తోంది..

రాయలసీమకు గోదావరి జలాల తరలింపునకు పెద్దన్నగా సహకరిస్తా అని నాడు కేసీఆర్ హామీ ఇచ్చినట్టు పత్రికల్లో వచ్చిన వార్తలను సీఎం రేవంత్ రెడ్డి చదివి వినిపించారు. దీనిపై బీఆర్‌ఎస్ రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభ్యంతరం తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల దృష్ట్యా గోదావరి జలాలను శ్రీశైలంకు తరలించి.. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు తరలించే ఉద్దేశంతో కేసీఆర్ ఆ ప్రతిపాదనలు చేశారని వివరణ ఇచ్చారు. బనకచర్లతో తెలంగాణ నష్టపోకుండా ప్రభుత్వానికి సహకరించడానికే తాము ఈ భేటీకి వచ్చామన్నారు. సీఎం జోక్యం చేసుకుని అపెక్స్ కౌన్సిల్ సమావేశం మినట్స్‌లో ఉన్న అంశాలను మళ్లీ చదివి వినిపిస్తా అని అన్నారు. 'గోదావరి నీళ్లను శ్రీశైలంలో వేయాలంటే తొలుత సాగర్‌లో వేయాల్సి ఉంటుంది. కానీ బనకచర్ల ప్రాజెక్టు ద్వారా సాగర్‌లో వేయకుండా నీళ్లను నేరుగా తరలించుకుంటామని ఏపీ ప్రతిపాదించింది. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ఏర్పాటైన అపెక్స్ కౌన్సిల్‌లో ఏపీ, తెలంగాణ సీఎంలు చర్చించి తీసుకున్న నిర్ణయం ప్రకారమే బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తున్నామని ఏపీ వాదిస్తోంది..' అని చెప్పారు. దీంతో.. రాజకీయ ఉద్దేశంతో జరుగుతున్న ఈ సమావేశం నుంచి తాము వాకౌట్ చేస్తున్నట్టు వద్దిరాజు ప్రకటించారు. బీజేపీ ఎంపీ డీకే అరుణ నచ్చజెప్పబోగా, 'పోనీయండి' అంటూ సీఎం వారించారు. కొన్ని వాస్తవాలు బయటకు వచ్చినందుకు మిత్రుడు కొంత ఇబ్బంది పడ్డట్టు ఉన్నాడని వ్యాఖ్యానించారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశం మినిట్స్‌నే తెలంగాణకు గుదిబండగా మార్చడానికి ఏపీ ప్రయత్నిస్తోందని అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299, ఏపీకి 512 టీఎంసీల కేటాయింపులను 2015లో నాటి సీఎం కేసీఆర్ అంగీకరించడంతో తెలంగాణకు తీవ్ర నష్టం జరిగిందని విమర్శించారు.



అఖిలపక్ష ఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, వద్దిరాజు రవిచంద్ర, రఘునందన్‌రావు, రేణుకా చౌదరి, రఘువీర్‌రెడ్డి, బలరాంనాయక్, రఘురాంరెడ్డి, అనిల్‌కుమార్, ఒవైసీ తదితరులు

జూలైలో ప్రధాని, కేంద్ర మంత్రులను కలుస్తాం

బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడానికి టెక్నికల్, లీగల్, పొలిటికల్.. మూడు మార్గాల్లో ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. గురువారం మళ్లీ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి అభ్యంతరం తెలుపుతామని అన్నారు. ముందస్తుగా నిర్ణయించిన కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉండడంతో ఈ సమావేశానికి రాలేమని కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలు సమాచారం ఇచ్చారని, వారిని సైతం సీఆర్ పాటిల్ వద్దకు తీసుకెళ్తామని చెప్పారు. జూలైలో జరిగే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ప్రధాని మోదీతో పాటు కేంద్ర జలశక్తి, ఆర్థిక, పర్యావరణ శాఖల మంత్రులను కలిసి అభ్యంతరాలు తెలియజేస్తామని వెల్లడించారు. రాజకీయ ప్రయత్నాలు ఫలించకపోతే న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఎంపీ అసదుద్దీన్ సూచించినట్టు జలవివాదాల్లో నిపుణులైన న్యాయవాదులను నియమించుకుంటామని చెప్పారు. పార్టీలకు అతీతంగా బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఎంపీలందరూ ఈ సమావేశంలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిద్దామని ప్రతిపాదించారు. తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించిన తర్వాతే ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరదామన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌లు ఎంపీలను సమన్వయం చేస్తారన్నారు. కృష్ణా బేసిన్, గోదావరి బేసిన్ ప్రాజెక్టులపై ఒక డాక్యుమెంట్ తయారు చేసి ఎంపీలందరికీ అందించాలని ఆదిత్యనాథ్‌ను ఆదేశించారు. సీఎం ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్తాడంటూ విమర్శలు చేస్తున్నారని, నిరంతరం వెళ్లి సంప్రదింపులు చేస్తేనే ప్రాజెక్టులకు అనుమతులు వస్తాయని సీఎం అన్నారు. భవిష్యత్తులో సైతం కేంద్రంతో సంబంధాలు కొనసాగిస్తామన్నారు. కాంగ్రెస్ ఎంపీలు రేణుకా చౌదరి, మల్లు రవి, బలరాం నాయక్, సురేష్ షెట్కార్, కుందూరు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, రఘురాం రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణ, రఘునందన్ రావు, ఎంఐఎం నుంచి అసదుద్దీన్ ఒవైసీ పాల్గొన్నారు.

మోదీ దగ్గర అనుమతులు తెచ్చుకున్నంత మాత్రాన
మీ ప్రాజెక్టులు పూర్తి కావు

ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్ స్పష్టీకరణ
- రెండు రాష్ట్రాల మధ్య దూరం పెంచుకుంటే సమస్య పరిష్కారం కాదని సూచన

సాక్షి, హైదరాబాద్: 'భగవంతుడితో భక్తుడికి అనుసంధానం అన్నట్టు మోదీకి చంద్రబాబు అవసరం ఉంది. చంద్రబాబుకు గోదావరి జలాల అవసరం ఉంది. రెండు రాష్ట్రాల మధ్య దూరం పెంచుకుంటే సమస్య పరిష్కారం కాదు. మోదీ దగ్గర అనుమతులు తెచ్చుకున్నంత మాత్రాన మీ ప్రాజెక్టులు పూర్తికావు. కృష్ణా, గోదావరి పరీవాహకంలో తెలంగాణ ప్రాజెక్టులకు మీరు నిరభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ) ఇవ్వండి. మిగిలిన నీళ్లను మీరు ఎలాగైనా వాడుకోండి' అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఏపీ చేపట్టిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై బుధవారం సచివాలయంలో ఎంపీలతో సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

అలాగనుకుంటే మీ భ్రమ

'కేంద్రంలో పలుకుబడి ఉందని ప్రాజెక్టులు పూర్తవుతాయనుకుంటే మీ భ్రమ. మా రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందుకు మా ప్రణాళిక మాకుంది. గోదావరి బేసిన్‌లో 3వేల టీఎంసీలు మిగులు జలాలు ఉన్నాయని కేసీఆర్ చెప్పింది మీరు నమ్మితే.. 968 టీఎంసీల నికర జలాల వాటాను వాడుకునేందుకు తెలంగాణకు సంపూర్ణ అనుమతులు వచ్చాక మీరు మిగులు జలాలు తీసుకోండి..' అని చంద్రబాబుకు రేవంత్ సూచించారు.

అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు..

ఏ అంశం వచ్చినా, ఏ విషయం ప్రస్తావనకు వచ్చినా బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ సెంటిమెంట్‌తో మళ్లీ పార్టీని బ్రతికించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేసీఆర్, హరీశ్ సంపూర్ణ అవగాహనతో ప్రభుత్వానికి సహకరించినా, సూచనలు చేసినా స్వీకరిస్తాం. కానీ దురుద్దేశంతో రాజకీయ ప్రయోజనాల కోసం మాపై విమర్శలు చేస్తున్నారు. మా ప్రభుత్వం ఎక్కడా నిర్లక్ష్యం వహించలేదు. రాష్ట్రానికి నష్టం జరగకుండా ఇప్పటికే కేంద్ర జలశక్తి శాఖకు బనకచర్లపై ఫిర్యాదు చేశాం. కానీ ఉన్నఫళంగా హరీశ్ బకెట్‌లో బురద తీసుకుని మాపై చల్లాలని ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు వాళ్లు అధికారంలో లేరని మాపై బురద చల్లాలని చూస్తున్నారు. కానీ ఈ పాపానికి కారకుడు మీ మామే. పాపాల భైరవులు మీరు. వీళ్ళు ఏనాడూ తెలంగాణ ప్రయోజనాల కోసం పాటు పడలేదు. పాలమూరు జిల్లాలోని ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. పదేళ్లలో పెండింగ్‌లో ఉన్న ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మిస్తే గ్రావిటీతో సాగునీరు అందేది. కమీషన్ల కక్కుర్తితో రూ.లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్ష ఎకరాలకు కూడా సాగు నీరు అందివ్వలేదు. పదేళ్లు రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేశారు. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులను గాలికి వదిలేశారు. వాళ్ల ఇల్లు నింపుకునేందుకు రాష్ట్రాన్ని దోచుకున్నారు. బీజేపీకి అవయవ దానం చేసి ఎనిమిది ఎంపీ సీట్లు ఇచ్చారు. ఇప్పుడు కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నారు..' అని సీఎం ధ్వజమెత్తారు.

కేసీఆర్ ద్రోహం వల్లే..

'కేసీఆర్ తెలంగాణకు చేసిన తీరని ద్రోహం వల్లే ఏపీకి నీళ్లు వెళుతున్నాయి. మేడిగడ్డ బరాజ్ గుండెకాయ లాంటిది. అది లేకపోతే కాళేశ్వరం ప్రాజెక్టు ఉన్నా ప్రయోజనం లేదు. పదేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే తెలంగాణకు ఇవాళ ఈ పరిస్థితి వచ్చేది కాదు. మేం పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. కష్టపడి ఎస్‌ఎల్బీసీ పనులు ప్రారంభిస్తే, మనుషులు చనిపోతే వాళ్ళు పైశాచిక ఆనందం పొందుతున్నారు. హరీశ్ రావు హుందాగా వ్యవహరించాలి. అబద్ధాలతో కాలం వెళ్లదీయొద్దు. సాగునీటి ప్రాజెక్టులు, మెట్రో విస్తరణ, రీజనల్ రింగురోడ్డు, మూసీ ప్రక్షాళన అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని కలవొద్దా?. మీరు నిధులు ఇస్తామంటే చెప్పండి.. మీ ఫామ్ హౌస్‌కే వస్తాం. రూ.50 వేల కోట్లు ఇవ్వండి.. ప్రభుత్వం తరఫున బాండ్లు సమర్పిస్తాం..' అని రేవంత్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంపై మంత్రివర్గ సమావేశంలోనే నిర్ణయాలు జరిగినట్టు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన వాంగ్మూలాన్ని సీఎం తోసిపుచ్చారు. గత ప్రభుత్వంలో జరిగిన 96 మంత్రివర్గ సమావేశాల మినట్స్‌లో ఇలాంటి నిర్ణయాలు జరిగినట్టుగా ఎక్కడా ప్రస్తావన లేదన్నారు. నాటి మంత్రివర్గ సమావేశాల మినట్స్‌ను త్వరలో కమిషన్‌కు అందజేస్తామని చెప్పారు.

కిషన్‌రెడ్డి.. కేంద్రమంత్రిని కలవడంలో ఏం కుట్ర దాగుంది?

అఖిలపక్ష భేటీకి రాకుండా దూరంగా ఉన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. కేంద్ర జలశక్తి మంత్రిని కలవడంలో ఆంతర్యం ఏంటి? అని సీఎం ప్రశ్నించారు. గురువారం తాము వెళ్లి కలుస్తామని తెలిసి బుధవారమే వెళ్లి కలవడం వెనక ఏం కుట్ర దాగుంది? అని నిలదీశారు. కేటీఆర్ ఒత్తిడితోనే కిషన్‌రెడ్డి అఖిలపక్ష ఎంపీల సమావేశానికి రాలేదని, ఆయన నిజాయితీని నమ్మలేమని వ్యాఖ్యానించారు.

బనకచర్లపై బీజేపీది బాధ్యతారాహిత్యం: ఎంపీ చామల

సాక్షి, హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ బీజేపీ నేతలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసలు 8 మంది ఎంపీలున్న బీజేపీ ఈ విషయంలో ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

ఇదండీ సంగతి



...ఆ ఓట్లతోనే మనం బతికిపోయాం.. ఇప్పుడెలా!!

బనకచర్ల కట్టినా పోతిరెడ్డిపాడు ఆపరు

ప్రాజెక్టు ప్రీఫీజిబిలిటీ రిపోర్టులోనే ఏపీ ఆ విషయం తెలిపింది
- టీఏసీ ఆమోదించిన మేరకే పోలవరం ఆపరేషన్ షెడ్యూల్స్ ఉండాలి
- బనకచర్లతో పోలవరం ద్వారా తెలంగాణకు మరింత ముప్పు
- ఎంపీలతో సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును నిర్మించి గోదావరి జలాలను బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు తరలించినా.. శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు కృష్ణా జలాల తరలింపును యథాతథంగా కొనసాగిస్తామని ప్రాజెక్టు ప్రీఫీజిబిలిటీ రిపోర్టులో ఏపీ ప్రభుత్వం పేర్కొనడంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏపీ సమర్పించిన ఈ నివేదికను గోదావరి పరీవాహకంలోని రాష్ట్రాలతో పాటు కృష్ణా, గోదావరి బోర్డులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)లకి కేంద్రం పంపించి 15 రోజుల్లోగా అభిప్రాయాలను తెలపాలని కోరిందని తెలిపారు. ప్రాజెక్టుపై ప్రాథమిక అభ్యంతరాలను తెలుపుతూ తక్షణమే కేంద్రానికి లేఖ పంపించామని, నివేదికను క్షుణ్ణంగా అధ్యయనం చేశాక మరోసారి సమగ్ర లేఖ రాస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన బుధవారం సచివాలయంలో గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై తెలంగాణ అఖిలపక్ష ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి మాట్లాడారు. గోదావరి ట్రిబ్యునల్ 1980లో ఉమ్మడి ఏపీకి 1,486 టీఎంసీల జలాలు కేటాయించగా, అందులో తెలంగాణకు 968, ఏపీకి 518 టీఎంసీల హక్కులున్నాయని చెప్పారు. దీనిని విస్మరిస్తూ ఏపీ ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును రూపొందించిందని ఆరోపించారు. భవిష్యత్తులో తెలంగాణ ప్రాజెక్టులకు 'బనకచర్ల'ప్రాజెక్టు ముప్పుగా పరిణమించబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఏపీలో తొలుత తమ ప్రాంతాల్లో ప్రాజెక్టులు కట్టిన నేపథ్యంలో నీటి కేటాయింపుల్లో వాటికే హక్కులుంటాయని కృష్ణా ట్రిబ్యునల్ ఎదుట ఏపీ వాదనలు వినిపిస్తోందని మంత్రి ఉత్తమ్ గుర్తు చేశారు. 'బనకచర్ల'నిర్మిస్తే భవిష్యత్తులో గోదావరి ట్రిబ్యునల్ ఎదుట సైతం ఇదే తరహాలో ఏపీ కోరే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. బనకచర్ల వల్ల పోలవరం ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూల్స్‌లో మార్పులు జరుగుతాయని, అది చట్ట విరుద్ధమని ఉత్తమ్ తెలిపారు. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 90 కింద ఏర్పాటైన పీపీఏ ప్రత్యేక సమావేశం నిర్వహించి బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనలను తిరస్కరించాలని డిమాండ్ చేశారు. ఏపీ పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలిస్తే, దానికి బదులుగా 45 టీఎంసీల కృష్ణా జలాలు మనకు రావాల్సి ఉంటుందని సీఎం రేవంత్ సమావేశంలో గుర్తు చేశారు. ఇదే సూత్రం బనకచర్ల ప్రాజెక్టుకు వర్తిస్తుందని అభిప్రాయపడ్డారు.

నిబంధనల మేరకే బనకచర్లపై నిర్ణయం

కిషన్‌రెడ్డికి స్పష్టం చేసిన కేంద్రమంత్రి సీఆర్ పాటిల్




కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై నిబంధనల మేరకే నిర్ణయం తీసుకుంటామని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డికి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ హామీ ఇచ్చారు. ఈ విషయంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో ఎవరికీ అన్యాయం జరగకుండా నిర్ణయం ఉంటుందని భరోసా ఇచ్చారు. బుధవారం ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, మనోహర్‌లాల్ ఖట్టర్‌లతో కిషన్‌రెడ్డి భేటీ అయ్యారు. బనకచర్ల ప్రాజెక్టుపై సీఆర్ పాటిల్‌తో చర్చించారు. ఈ సందర్భంగా.. తమ మంత్రిత్వశాఖ నిబంధనలకు అనుగుణంగా పరిశీలించిన తర్వాతే బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకుంటామని సీఆర్ పాటిల్ తెలిపినట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్–2 కోసం తెలంగాణ ప్రభుత్వం పంపిన డీపీఆర్ ఇటీవలే అందిందని, దానిని తమ శాఖ అధికారులు పరిశీలిస్తున్నారని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ కిషన్‌రెడ్డికి తెలిపారు.

కేసీఆర్ మాటలను రేవంత్ వక్రీకరించారు

మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: బోడిగుండుకు మోకాలుకు లంకెపెట్టి మాట్లాడటంలో రేవంత్‌రెడ్డి సిద్ధహస్తుడు అని మరోసారి రుజువైందని మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యమంత్రిపై మండిపడ్డారు. అప్పటి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ చెప్పిన వాటిని ఉద్దేశపూర్వకంగా వక్రీకరించారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం గోదావరి–బనకచర్ల అనుసంధానంపై ఎంపీల సమావేశంలో మాట్లాడిన తరువాత హరీశ్‌రావు ఎక్స్‌వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగా అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ ఎజెండా 5లోని అంశాలు దాచిపెట్టి, ఎజెండా నం.1 అంశాలను మాత్రమే ప్రస్తావించారని ఆరోపించారు. 'గోదావరి–కృష్ణా నదుల అనుసంధానం ప్రాజెక్టుల విష యంలో తెలంగాణను సంప్రదించకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకు పోకూడదని, ఒకవేళ వెళ్తే అందుకు తెలంగాణ అంగీకరించదు' అని కేసీఆర్ ఎజెండా 5లో స్పష్టంగా పేర్కొన్నారని వివరించారు. ఈ విషయాన్ని కావాలని దాచిపెట్టి, అసత్యాలను ప్రజల ముందు ఉంచారన్నారు. అబద్ధాల పునాదుల మీద జరిగిన ఈనాటి రేవంత్ తతంగాన్ని ప్రజలు విశ్వసించరని హరీశ్ వ్యాఖ్యానించారు.

సాగునీటి ప్రాజెక్టులపై బీఆర్‌ఎస్ పోరు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ.. సర్కారుపై పోరాటానికి సన్నద్ధమవుతోంది. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రైతుల పక్షాన పోరాటానికి అవసరమైన కార్యాచరణ రూపొందించడంపై దృష్టి సారించింది. పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు సారథ్యంలో త్వరలో బీఆర్‌ఎస్ పార్టీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్లక్ష్యం, పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు ఇతర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అలసత్వం, ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యంపై ప్రధానంగా చర్చిస్తారని తెలుస్తోంది. ఈ సమావేశంలో సాగునీటి ప్రాజెక్టులతో పాటు ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక వైఖరిపైనా చర్చిస్తారు. బీఆర్‌ఎస్ హయాంలో 90 శాతం పూర్తి అయిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టడం, మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగాయనే సాకుతో కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను కేసీఆర్ వివరిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

అమ్మనాన్నలకు భారమైంది.. 'ఊయల' ఆదరించింది

- కరీంనగర్ ఎంసీహెచ్ కేంద్రంలో బాలికను వదిలి వెళ్లిన పేరెంట్స్
- 'ఊయల' ఏర్పాటు చేసిన నెలరోజుల్లో మొదటి బాలిక


ఊయలలో వదిలి వెళ్లిన పాప

కరీంనగర్ టౌన్: కడుపున పుట్టిన బిడ్డను పొత్తిళ్లలో భద్రంగా దాచుకోవాల్సిన తల్లిదండ్రులు వద్దనుకున్నారు. అనారోగ్యంతో పుట్టిన బిడ్డను మూడేళ్లపాటు పెంచిన తల్లిదండ్రులు ఇక ఆ పాపను భరించలేమనుకున్నారేమోగానీ కరీంనగర్ మాతా శిశు కేంద్రంలో ఏర్పాటు చేసిన ఊయలలో వదిలివెళ్లారు. ఊయల ప్రారంభించిన నెలన్నర తర్వాత ఇక్కడకు చేరిన మొదటి బాలిక అని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. బుధవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు ఓ మూడేళ్ల వయసున్న పాపను ఊయలలో వదిలి వెళ్లారు. ఉదయం 6.30 గంటలకు సెక్యూరిటీ సిబ్బంది ఊయల గదిలో పాపను చూసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డికి సమాచారం అందించారు. వెంటనే సూపరింటెండెంట్ చిన్న పిల్లల వైద్యులకు విషయం తెలపడంతో వారు హుటాహుటిన పాపను ఇంటెన్సివ్ కేర్‌కు తీసుకొని వైద్యం అందిస్తున్నారు. పాపకు సెరిబ్రల్ ప్యాల్సీ (కాళ్లు, చేతులు వంకరగా ఉండటం)తో నడవలేని పరిస్థితిలో ఉంది. మానసికంగా కూడా పూర్తిగా ఎదగలేదని వైద్యులు చెబుతున్నారు. ఊయలలో వదిలివెళ్లిన పాపను శిశుగృహకు అప్పగిస్తామని కరీంనగర్ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు. నిరాధార శిశువులకు సురక్షితమైన ఆశ్రయం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం 'ఊయల'కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే.

కార్మికులకు అండగా ఉంటా

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వివేక్ వెంకటస్వామి


సచివాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న వివేక్. చిత్రంలో ఆయన కుటుంబ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న కార్మిక సంక్షేమ పథకాలు, చట్టాలను పటిష్టంగా అమలుచేసి కార్మికులకు అండగా ఉంటానని, రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని కార్మిక, ఉపాధి, మైనింగ్, జియాలజీ శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చెప్పారు. బుధవారం ఆయన కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. టాటా టెక్నాలజీస్‌తో కలసి ఐటీఐలలో 46 స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన మొదటి ఫైల్‌పై సంతకం చేశారు. అనంతరం వివేక్ మాట్లాడారు. ఇసుకను సామాన్యులకు అందుబాటులోకి తెస్తామని, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో గిగ్ వర్కర్స్ పాలసీపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని అన్నారు. నాన్న వెంకటస్వామి, అన్న గతంలో నిర్వహించిన కార్మిక శాఖనే నాకు కేటాయించడం సంతోషంగా ఉందని, మంత్రిగా అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, అధిష్టానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. సింగరేణితో పాటు వేలాది మంది కార్మికుల సంక్షేమానికి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గడ్డం వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

'బడి' బాట పట్టిస్తున్నాం

- ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు పెరుగుతాయి
- పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు వస్తున్నాయని పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బడిబాట కార్యక్రమం పెద్దఎత్తున జరుగుతోందన్నారు. తన కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన ముచ్చటించారు. ప్రభుత్వ స్కూళ్లలో వసతులు, నాణ్యమైన విద్య గురించి అన్ని స్థాయిల్లోనూ ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. బడిబాట కార్యక్రమం ద్వారా టీచర్లు ప్రతి ఇంటికి వెళ్తున్నారని, ప్రజలను జాగృతం చేస్తున్నారని చెప్పారు. గత కొన్నేళ్లుగా విద్యార్థుల మార్పిడి వేగంగా జరుగుతోందని, ప్రభుత్వ బడుల్లో చేరేవారి సంఖ్య తగ్గిందన్నారు. దీనిపై సమగ్ర విశ్లేషణ జరుగుతోందని, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన పూర్వ ప్రాథమిక విద్య పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. విద్యార్థులకు అందించే పుస్తకాలు, యూనిఫాం ఈ ఏడాది సకాలంలోనే అందించామని వెల్లడించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వండి

- సిబ్బందికి వేతనాలు కూడా ఇవ్వలేక పోతున్నాం
- ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూట్స్

సాక్షి, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ప్రైవేటు కాలేజీలు కోరాయి. ఇంజనీరింగ్, ఫార్మా సహా అన్ని ఉన్నత విద్య ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూట్స్ పేరుతో ఓ సంఘాన్ని ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ డాక్టర్ రమేశ్‌బాబు నిమ్మటూరి బుధవారం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికే రూ. 8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. రూ. 2 వేల కోట్లకు టోకెన్లు ఇచ్చారని, కానీ డబ్బులు మాత్రం ఇవ్వలేదని, ఈ నెలాఖరులోనైనా వీటిని ఇవ్వాలని కోరారు. బకాయిలు ఉన్న కారణంగా సిబ్బందికి వేతనాలు కూడా ఇవ్వలేకపోతున్నామని, మెరుగైన అధ్యాపకులు కాలేజీల్లో పనిచేయడం మానేస్తున్నారని, నాణ్యత పడిపోతున్న కారణంగా విద్యార్థులు వేరే రాష్ట్రాలకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలపై ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టాలన్నది తమ ఉద్దేశం కాదని చెప్పారు.

హైబ్రిడ్ పద్ధతి వద్దు.. సాధారణ విధానమే మేలు

రోడ్ల నిర్మాణంపై సీఎంకు బిల్డర్స్ అసోసియేషన్ లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రహదారులను హైబ్రిడ్ యాన్యుటీ పద్ధతిలో కాకుండా సాధారణ విధానంలోనే నిర్మించాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో దాదాపు 120 వరకు బ్యాచ్‌మిక్స్ ప్లాంట్లు ఉన్నాయని, ప్రతి ప్లాంట్‌లో 50 నుంచి 100 మంది కార్మికులు పనిచేస్తుంటారని, ఒక్కో ప్లాంట్‌ను దాదాపు పదికోట్ల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేశారని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డీవీఎన్‌రెడ్డి తెలిపారు. కార్మికుల సంక్షేమంతోపాటు కాంట్రాక్టర్ల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని యాన్యుటీ పద్ధతిని పునఃసమీక్షించాలని అసోసియేషన్ తరఫున ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు చెప్పారు. ప్రతీ నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, దానికి సంబంధించి రోడ్లు రెన్యువల్ చేసి, 7 సంవత్సరాల మెయింటెనెన్స్‌ను కాంట్రాక్టుకు జతచేసి టెండర్లను పిలవవచ్చని సూచించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజనలో 5 సంవత్సరాల వర్కింగ్ పీరియడ్‌తో, ఐదు సంవత్సరాల మెయింటెనెన్స్ కలిపి టెండర్లు పిలుస్తున్నారని, ఈ విధానం సుదీర్ఘ కాలంగా కొనసాగుతోందని తెలిపారు.

డిజిటల్ భద్రతతోనే అభివృద్ధి

- ప్రస్తుత టెక్నాలజీ యుగంలో డిజిటల్ సెక్యూరిటీయే కీలకం
- గూగుల్ ఒక వినూత్న సంస్థ.. మాది ఒక వినూత్న ప్రభుత్వం
- గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్
- ఆసియా–పసిఫిక్‌లో హైదరాబాద్‌లోనే మొదటి జీసెక్: శ్రీధర్‌బాబు


బుధవారం సేఫ్టీ సెంటర్ పనితీరును సీఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తున్న గూగుల్ సంస్థ ప్రతినిధులు. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ మల్లు రవి, జయేశ్‌రంజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ ఐటీ సేవల సంస్థ గూగుల్ ప్రారంభంతో ప్రపంచమే మారిపోయి మానవ జీవితం డిజిటల్‌మయంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అయితే, గోప్యత, భద్రతకు డిజిటలైజేషన్ సవాలు విసురుతోందని, డిజిటల్‌గా సురక్షితంగా ఉంటేనే మరింత అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. గూగుల్ దివ్యశ్రీ భవన్‌లో కొత్తగా ఏర్పాటైన 'గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్'(జీసెక్)ను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అధునాతన సైబర్ సెక్యూరిటీ, భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఉపయోగపడుతుందని సీఎం అన్నారు. జీసెక్ నైపుణ్యాభివృద్ధితో పాటు ఉపాధి కల్పనకు దోహదం చేస్తుందని, దేశ సైబర్ భద్రత ప్రమాణాలను పెంచుతుందని చెప్పారు. 'చెడు చేయొద్దనే గూగుల్ సంస్థ విధానాన్ని నేను ఇష్టపడతాను. గూగుల్ తరహాలోనే మా ప్రభుత్వం కూడా మంచి పనులు మాత్రమే చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు అనువైన ప్రాంతం తెలంగాణ రాష్ట్రం. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చేదిశగా మా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మహిళలు, రైతులు, యువత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు గూగుల్ మద్దతును కోరుతున్నా. తెలంగాణతో గూగుల్ సంస్థకు సుదీర్ఘ అనుబంధం ఉంది. విద్య, భద్రత, మ్యాప్‌లు, ట్రాఫిక్, స్టార్టప్‌లు, ఆరోగ్యం.. ఇలా అనేక రంగాలలో గూగుల్‌తో కలిసి పనిచేస్తున్నాం. గూగుల్ ఒక వినూత్న సంస్థ, మాది ఒక వినూత్న ప్రభుత్వం'అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

ఏఐ యుగంలో సైబర్ సెక్యూరిటీ సవాలు: శ్రీధర్‌బాబు

టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కేకొద్దీ అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఒక్క క్షణం అప్రమత్తంగా లేకపోయినా సైబర్ మోసాల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో గూగుల్ సంస్థ హైదరాబాద్‌లో ఆసియా పసిఫిక్ ప్రాంతంలోనే మొదటి జీసెక్‌ను ఏర్పాటు చేయడం ఆహ్వానించదగిన పరిణామమని అన్నారు. 'సేఫ్ డిజిటల్ తెలంగాణ 2.0'లక్ష్యానికి అనుగుణంగా పాఠశాల స్థాయి నుంచే సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో ఎంపీ మల్లు రవి, గూగుల్ వైస్ ప్రెసిడెంట్లు అరిజీత్ సర్కార్, హీతర్ అడ్కిన్స్, విల్సన్ వైట్, గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్ ప్రీతి లబానా, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

భారత్‌లో తొలి సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్

గూగుల్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్లలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినది నాలుగోది. ఆసియా పసిఫిక్ రీజియన్‌లో ఇదే మొట్టమొదటిది కావడం గమనార్హం. గత ఏడాది ఆగస్టులో సీఎం రేవంత్ అమెరికా పర్యటనలో భాగంగా గూగుల్ హెడ్ ఆఫీసును సందర్శించిన సమయంలో హైదరాబాద్‌లో జీసెక్ ఏర్పాటు కోసం చొరవ చూపారు. గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన 'గూగుల్ ఫర్ ఇండియా 2024'సదస్సులో భారత్‌లో జీసెక్ ఏర్పాటు చేస్తున్నట్లు గూగుల్ ప్రకటించింది. దీని ఏర్పాటుకు గత ఏడాది డిసెంబర్ 4న తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అంతర్జాతీయ సెక్యూరిటీ హబ్‌గా జీసెక్ అధునాతన భద్రత, ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తుల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భద్రత, అత్యాధునిక పరిశోధన రంగంలో పనిచేస్తున్న నిపుణులకు ఇది సహకార వేదికగా ఉపయోగపడుతుంది. జీసెక్ ద్వారా ఐటీ రంగంలో వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాల కల్పన జరుగుతుంది.

ఆ నోటీసు నా హక్కుల ఉల్లంఘనే!

- నా ఫోన్, ఇతర వస్తువులు ఎందుకు అడిగారో ఏసీబీ చెప్పలేదు
- అది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధం
- అన్ని వివరాలు పురపాలకశాఖ వద్దే..
- ఏసీబీకి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి
- ఫార్ములా –ఈ రేసు కేసులో నోటీసుకు లేఖ ద్వారా సమాధానం

సాక్షి, హైదరాబాద్: 'ఫార్ములా ఈ రేసు కేసులో నా వ్యక్తిగత ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను సమర్పించాలని దర్యాప్తు సంస్థ ఏసీబీ కోరటం.. నాకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించటమే'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు.ఈకేసు విచారణలో భాగంగా గతంలో తాను వాడిన మొబైల్‌ఫోన్‌ను సమర్పించాలని ఈ నెల 16న ఏసీబీ ఇచ్చిన నోటీసుపై కేటీఆర్ స్పందించారు. 2024 మొదటి త్రైమాసికంలో తాను మొబైల్ ఫోన్ మార్చానని, తాను గతంలో వాడిన ఆ పాత ఫోన్ ఇప్పుడు తనవద్ద లేదని కేటీఆర్ స్పష్టంచేశారు. తాను ఫోన్ కాకుండా ఏ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను వాడలేదని తెలియజేస్తూ ఏసీబీకి లేఖ ద్వారా సమాధానం పంపించారు. 'ఫిర్యాదులో నాపై చేసిన ఆరోపణల్లో గతంలో వాడిన ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రస్తావన కానీ, సంబంధం కానీ లేనప్పటికీ, వాటిని సమర్పించాలని కోరడం అంటే రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమే. ఇదే అంశంలో రిట్ పిటిషన్ దాఖలు చేసిన పిటిషనర్‌కు సుప్రీంకోర్టు ఉపశమనం ఇచ్చింది. ఆ కేసులో ప్రతివాదిగా ఉన్న ఈడీకి, పొరుడి మొబైల్ ఫోన్‌ను వాడటంకానీ, అందులోని సమాచారాన్ని కాపీ చేయడం కానీ చేయవద్దని కూడా స్పష్టంచేసింది'అని కేటీఆర్ గుర్తుచేశారు.

రికార్డులన్నీ పురపాలక శాఖ వద్దే..

ఫార్ములా –ఈ రేసుకు సంబంధించి అన్నిరకాల అధికారిక సంప్రదింపుల రికార్డులు పురపాలక శాఖ వద్దే ఉన్నాయని కేటీఆర్ స్పష్టంచేశారు. అవన్నీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి హోదాలో తీసుకున్న నిర్ణయాలని చెప్పారు. ఈ కేసులో విచారణకు హాజరు కావాలని ఈ నెల 13న పంపిన లేఖకు స్పందించి 16వ తేదీ ఉదయం 10 గంటలకు ఏసీబీ కార్యాలయంలో స్వయంగా విచారణకు హాజరైన విషయాన్ని గుర్తు చేశారు. ఫార్ములా రేసు కేసులో 16న విచారణ పూర్తయిన తరువాత బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 94 ప్రకారం తనకు మరో నోటీసును అందించారని, అందులో తాను 2021 నవంబర్ 1 నుంచి 2023 డిసెంబర్ 1 వరకు వాడిన మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్, ట్యాబ్, ఐపాడ్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఏసీబీకి సమర్పించాలని కోరినట్టు కేటీఆర్ తెలిపారు. అయితే, ఆ నోటీసులో తన ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను ఎందుకు సమర్పించాలనే కారణం కానీ, ఉద్దేశం కానీ పేర్కొనలేదని తప్పుబట్టారు. విచారణలో భాగంగా ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరించాల్సి వస్తే సుప్రీంకోర్టు నిబంధనలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒకవేళ ప్రత్యేక పరిస్థితుల్లో సేకరించే ఎలక్ట్రానిక్ వస్తువులను విచారణ సంస్థల అధికారులు ట్యాంపర్ చేయకుండా కఠిన నిబంధనలను పాటించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. విచారణ పేరుతో ఒక పౌరుడి నుంచి వస్తువులను ఎందుకు తీసుకుంటున్నారో సరైన కారణం చెప్పకుండా, సేకరించిన సమాచారాన్ని ఆయనకే వ్యతిరేకంగా వాడడం సరైంది కాదని సుప్రీంకోర్టు సూచించిందని పేర్కొన్నారు.

మెడికల్ సీట్లలో కోత లేదు!

- రాష్ట్ర అధికారుల వివరణకు ఎన్‌ఎంసీ సంతృప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల అనుమతులకు గానీ, కళాశాలల్లో సీట్లకు గాని ఎలాంటి ఢోకా లేదని జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) హామీ ఇచ్చింది. రాష్ట్రంలో ఒక్కసారిగా మెడికల్ కాలేజీల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ఫ్యాకల్టీ కొరత, మౌలిక సదుపాయాల కల్పనలో కొన్ని ఇబ్బందులు తలెత్తినట్లు ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్రకుమార్ ఇచ్చిన వివరణతో ఎన్‌ఎంసీ సంతృప్తిచెందింది. రాష్ట్రంలోని 26 ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో ఎన్‌ఎంసీ నిబంధనలు అమలు కావడం లేదని, వ్యక్తిగత విచారణకు హాజరు కావాలని ఈ నెల 13న ఎన్‌ఎంసీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం ఢిల్లీకి వెళ్లిన ఆరోగ్య కార్యదర్శి, డీఎంఈలు ఎన్‌ఎంసీ అధికారులతో సమావేశమై పరిస్థితిని వివరించారు. రాష్ట్రంలో 9 వైద్య కళాశాలలు ఉండేవని, నాలుగేళ్లలో అవి 34కు చేరడం వల్లనే ఫ్యాకల్టీ కొరత, వసతుల లేమి, క్లినికల్ ట్రైనింగ్ సమస్యలు తలెత్తినట్లు వివరించారు. కొత్తగా ఏర్పాటైన కళాశాలలకు పక్కా భవనాల నిర్మాణం మొదలుకొని, జిల్లా, ఏరియా ఆసుపత్రులను బోధన ఆసుపత్రులుగా మార్చి, 300 పడకలకు పెంచి సౌకర్యాలు మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. ఫ్యాకల్టీ నియామకానికి అనుమతులు జారీ అయ్యాయని డీఎంఈ చెప్పారు. దీంతో వీలైనంత త్వరగా ఫ్యాకల్టీని నియమించుకోవాలని, వసతులను మెరుగుపర్చుకోవాలని ఎన్‌ఎంసీ సూచించింది. కాలేజీల అనుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, సీట్ల కోత వంటి ఆలోచనే లేదని స్పష్టం చేసినట్లు డీఎంఈ తెలిపారు.

బ్రహ్మోస్ సంస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయండి

సంస్థ ప్రతినిధులకు సీఎం రేవంత్ వినతి

సాక్షి, హైదరాబాద్: దేశంలో పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం అనుకూల ప్రదేశమని, బ్రహ్మోస్ సంస్థ విస్తరణకు హైదరాబాద్‌ను ఎంచుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ సంస్థ ప్రతినిధులకు సూచించారు. బుధవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధుల బృందం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా సంస్థ ఎండీ, సీఈవో డా. జైతీర్థ్ ఆర్. జోషి, ఇతర ప్రతినిధులతో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో డిఫెన్స్ రంగానికి సంబంధించిన వివిధ సంస్థలు ఉన్నాయని వారికి వివరించారు. హైదరాబాద్‌లో సంస్థ ఏర్పాటుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. సీఎం వినతిపై బ్రహ్మోస్ ఏరోస్పేస్ బృందం సానుకూలంగా స్పందించింది. ఈ భేటీలో బ్రహ్మోస్ హైదరాబాద్ ఈడీ సాంబశివప్రసాద్, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జి.ఎ. శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'జీవ' పరిశోధనలు ఇక వేగవంతం

ప్రత్యేక సరఫరా కేంద్రాన్ని ప్రారంభించిన ఏఐసీ–సీసీఎంబీ, థర్మోఫిషర్

సాక్షి, హైదరాబాద్: జీవవిజ్ఞాన పరిశోధనలో వేగవంతమైన పురోగతికి దోహదపడేలా ప్రముఖ సంస్థలు అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ – సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (ఏఐసీ–సీసీఎంబీ), థర్మో ఫిషర్ సైంటిఫిక్ సంస్థలు సంయుక్తంగా బుధవారం హైదరాబాద్‌లో 'సప్లై సెంటర్'ను ప్రారంభించాయి. అలాగే మూడు రోజులపాటు జరిగే 'సెల్ హెల్త్ అనాలిసిస్'వర్క్‌షాప్‌ను ప్రారంభించాయి. ఏఐసీ–సీసీఎంబీ భవనంలో ఏర్పాటుచేసిన 'సప్లై సెంటర్'ను సీసీఎంబీ సంస్థ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కుమార్ నందికూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సప్లై సెంటర్ ద్వారా పరిశోధకులు, స్టార్టప్‌లు ప్రయోగాలకు అవసరమైన వస్తువులను వెంటనే పొందే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా ఖర్చు తగ్గి, పనితీరు మెరుగుపడుతుందని చెప్పారు. థర్మో ఫిషర్ సంస్థ సంచాలకుడు జయభరత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటివరకు ప్రయోగాలకు అవసరమైన వస్తువుల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని, ఇప్పుడు వేగంగా సాగుతాయని అన్నారు. కాగా, బుధవారం నుంచి 20వ తేదీవరకు నిర్వహిస్తున్న 'సెల్ హెల్త్ అనాలిసిస్'వర్క్‌షాప్ ద్వారా శాస్త్రవేత్తలకు ఆధునిక పరికరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఏఐసీ–సీసీఎంబీ సంస్థ కార్యనిర్వాహక అధికారి డాక్టర్ మధుసూదనరావు చెప్పారు.

ఇక ఫైళ్లు పంపకండి!

సర్కారుకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ లేఖ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంపై విచారణతో ముడిపడిన పత్రాలన్నీ తమకు చేరినందున... ఇకపై ఫైళ్లు పంపవద్దని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు బుధవారం నీటిపారుదల శాఖకు లేఖ రాసింది. బరాజ్‌ల నిర్మాణంపై నిర్ణయం మంత్రివర్గం తీసుకుందని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లు.. కమిషన్ ముందు వాంగ్మూలం ఇచ్చారు. దాంతో బరాజ్‌ల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదం ఉందా? ఒకవేళ ఉంటే ఆ పత్రాలు ఇవ్వాలని ఈనెల 13న కమిషన్ ప్రభుత్వానికి లేఖ రాసింది. అదేరోజు అధికారులంతా వెళ్లి కమిషన్‌కు పత్రాలు సమర్పించారు. 2014 నుంచి 2023 మధ్యకాలంలో 96 మంత్రివర్గ సమావేశాలు జరగ్గా, ఎందులోనూ ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్‌తో పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణానికి అనుమతులకి సంబంధించి నిర్ణయం జరగలేదని తెలియజేశారు. బరాజ్‌ల అంచనా వ్యయం సవరణకి మాత్రమే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపారని తెలియజేశారు.

సైబర్ చట్టాలు మరింత బలోపేతం

- టీజీసీఎస్‌బీ, నల్సార్ మధ్య అవగాహన ఒప్పందం
- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సైబర్ చట్టాలను మరింత బలోపేతం చేయడానికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ), నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ)పై సంతకాలు చేసినట్లు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీజీపీ జితేందర్ సమక్షంలో నల్సార్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు, తాను ఒప్పందంపై సంతకం చేసినట్లు వివరించారు. సైబర్ నేరాలను ఎదుర్కోవడం, చట్టపరమైన అంశాలు, ఫోరెన్సిక్ సామర్థ్యాలు, సాంకేతికతలో టీజీసీఎస్‌బీతో నల్సార్ కలసి పనిచేస్తుందని చెప్పారు. ఈ అవగాహన ఒప్పందం సైబర్ భద్రతా సామర్థ్యాన్ని మరింత పెంచుతుందని డీజీపీ అభిప్రాయపడ్డారు.

పాత జిల్లాలకు ఎంపీడీఓలు బదిలీ

సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా గతేడాది ఫిబ్రవరిలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన మండల పరిషత్ అభివృద్ధి అధికారులను తిరిగి పాత జిల్లాలకు పంపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు.



కష్టంలో ఉన్నప్పుడు గొప్ప మనసు ఉన్నవాళ్లనే పిలుస్తారు.
- సోరెన్ కీర్కెగార్డ్

సాక్షి
గురువారం, 19 జూన్ 2025

జీ7 మేల్కొనదా?!

నానాటికీ మసకబారుతున్న ప్రతిష్ఠను కాస్తయినా పునరుద్ధరించుకోవాలన్న స్పృహ కూడా లేకుండా ఎప్పటిలా జీ7 రెండు రోజుల సమావేశాలు కెనడాలోని ఆల్బెర్టాలో పేలవంగా ముగిశాయి. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం అంతూ దరీ లేకుండా కొనసాగుతుండగా, తాజాగా ఇరాన్‌పై అమెరికా అండతో ఇజ్రాయెల్ దండెత్తింది. కానీ రెండు విషయాల్లోనూ తన వైఖరి ఎలావుండాలో, ఏం చేయాలో జీ7 తేల్చుకోలేకపోయింది. సమావేశాల ముగింపులో లాంఛనంగా విడుదల కావాల్సిన ఉమ్మడి ప్రకటన కరవైంది. ఏకపక్షంగా ఇరాన్‌పై దాడులకు దిగి పశ్చిమాసియాలో మరో మహాసంగ్రామానికి తెరలేపిన ఇజ్రాయెల్‌ను పల్లెత్తు మాట అనకుండా తప్పంతా ఇరాన్‌దేనని ఈ దేశాలు తేల్చాయి. ఆ యుద్ధం పర్యవసానాలు తమను సైతం చుట్టుముడతాయనీ, అమెరికా ఆ ఊబిలోకి దిగితే అది మరో ప్రపంచ యుద్ధంగా పరిణమించే ప్రమాదం ఉన్నదనీ తెలిసినా కిక్కురుమనలేదు. ఇరాన్‌ను ఏదో ఒకటి అనకపోయినా... రష్యాను నిందించే ప్రయత్నం చేసినా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఆగ్రహం కలుగుతుందన్న భయం జీ7 దేశాలను వెన్నాడింది. సమావేశాలకు ముందు బ్రిటన్, కెనడాలు రష్యాపై మరిన్ని ఆంక్షలుంటాయని ఆర్భాటంగా ప్రకటించాయి. కానీ ట్రంప్ తీరు చూశాక వాటికి నోరుపెగల్లేదు. గాజా విషయంలో ఇజ్రాయెల్‌ను తప్పుబట్టినట్టు కనబడుతూనే, ఇరాన్‌పై దండయాత్ర విషయంలో ఒక్క మాట అనలేకపోయాయి. అసలే జీ7 'నిన్నటి క్లబ్' అని పేరుబడింది. ఆ అపకీర్తిని మరింత పెంచుకోవటానికే సభ్యదేశాలు పాటుపడుతున్నట్టు కనబడుతోంది!

ఒకప్పుడు జీ7 మహా శక్తిమంతమైనది. 1980వ దశకంలో ప్రపంచ జీడీపీలో దాని వాటా ఏకంగా 70 శాతం. నిరుడు ఆ వాటా 30 శాతానికి కాస్త అటూ ఇటూగా ఉంది. ఆర్థిక కార్యకలాపాలు పశ్చిమం నుంచి తూర్పు దిశకు వలసవచ్చి చాన్నాళ్లవుతోంది. ఈ పారిశ్రామిక దేశాలకు చైనా సవాలుగా నిలిచింది. ఆర్థికంగా బలపడుతోంది. ఆ దేశానికి జీ7లో చోటు లేదు. అటు రష్యాకు మధ్యలో కొన్నాళ్లు సభ్యత్వం ఇచ్చినా 2014లో క్రిమియాను దురాక్రమించటంతో వెళ్లగొట్టారు. మన దేశం సైతం ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. అయినా పరిశీలక హోదాయే తప్ప సభ్యత్వం లేదు. ట్రంప్ ఏలుబడి మొదలయ్యాక ప్రపంచ సంస్థలను అమెరికా చిన్నచూపు చూడటం మొదలైంది. భద్రతామండలికి విలువే లేకుండా పోయింది. తానే నిర్మించిన డబ్ల్యూటీవోను అమెరికా బేఖాతరు చేస్తోంది. ప్యారిస్ ఒప్పందం నుంచి, ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి బయటికొచ్చింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయంగా ఏర్పడుతున్న ఖాళీని భర్తీ చేయొచ్చన్న ఆలోచనగానీ, అందుకు తగిన ప్రణాళికలుగానీ జీ7 దగ్గర లేవు. ఎంతసేపూ అమెరికా తోకపట్టుకు పోవాలన్న ధోరణే. ట్రంప్ మాటలు గమనిస్తే ఆయనకు ప్రధాన ఎజెండా అయిన వాణిజ్యంపై ధ్యాసలేదన్న సంగతి తెలుస్తుంది. సదస్సులో ఎక్కువసేపుంటే ఉక్రెయిన్ విషయంలో ఒత్తిడి తప్పదన్న భయం వల్లనో, ఇరాన్ సంగతి తేల్చాలన్న ఆవేశంతోనో ఆయన మధ్యలోనే నిష్క్రమించారు. వెళ్లేముందు రష్యా దురాక్రమణకు మీరే కారణమంటూ నిందించారు. తమ మాజీ అధ్యక్షుడు ఒబామా, అప్పటి కెనడా ప్రధాని స్టీఫెన్ హార్పర్‌లు 2014లో రష్యాను జీ7నుంచి బయటకు నెట్టకపోతే ఇవాళ ఆయన సమావేశాల్లో ఉండేవారని, యుద్ధం ఆపటానికి ఒత్తిడి తెచ్చేవారమని నిష్ఠూరమాడారు. అసలు యుద్ధమే వచ్చి వుండేది కాదని కూడా ఆయన చెప్పుకొచ్చారు. అందుకే, ఇక్కడ న్యాయానికి చోటులేదని గ్రహించారో ఏమో... ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సైతం సమావేశాలకు మధ్యలోనే గుడ్‌బై చెప్పారు. నిరుడు జూన్‌లో జరిగిన జీ7 సమావేశాల సందర్భంగా ఉక్రెయిన్‌కు 5,000 కోట్ల డాలర్ల రుణమిస్తామని తీర్మానించారు. దాని ప్రకారం నెలకు వంద కోట్లు ఉక్రెయిన్‌కు అందించాలి. కానీ ట్రంప్ రాకముందే డిసెంబర్‌లోనే అప్పటి అధ్యక్షుడు బైడెన్ దానికి కోత పెట్టారు. ఆయనొచ్చాక ఇక చెప్పేదేముంది? ఈ భారాన్ని ఇతర సభ్య దేశాలు మోస్తున్నాయి.

నిజానికి, గత వైభవం మళ్లీ దక్కాలంటే జీ7 పరిపూర్తి చేయాల్సిన లక్ష్యాలు చాలానే ఉన్నాయి. అంతర్జాతీయ శాంతికి, భద్రతకు తమ వంతు కృషి అవసరం. కృత్రిమ మేధ, క్వాంటమ్‌లకు కావాల్సిన అత్యంత కీలకమైన ఖనిజాల సరఫరా ఆటంకం లేకుండా చూసుకోవాలి. పటిష్ఠమైన మౌలిక సదుపాయాల కల్పనకూ, యువతకు భారీయెత్తున ఉద్యోగావకాశాలు వచ్చిపడే రంగాలపై దృష్టి సారించాలి. కానీ ఇవన్నీ సాకారం కావాలంటే యుద్ధాలు లేని ప్రపంచం ఉండాలి. మరి దానికోసం జీ7 చేసిందేమిటి? ఈ దేశాలన్నీ అమెరికా సాగించిన యుద్ధాల్లో భాగస్వాములుగా మారి చేజేతులా ఆర్థిక వ్యవస్థల్ని ఛిన్నాభిన్నం చేసుకున్నాయి. నిజానికి ఇజ్రాయెల్‌ను పూర్వంలా యూరప్ దేశాల్లో జనం వెనకేసుకు రావటం లేదు. ఇరాన్ అణ్వస్త్రం తయారు చేయటం అనర్థమన్న అభిప్రాయం ఉన్నా ఆ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించి దాన్ని ఒప్పించాలని మెజారిటీ జనం భావిస్తున్నట్టు సర్వేల్లో తేలింది. అయినా జీ7 దేశాలకు పట్టదు.

మనవరకూ చూస్తే ఈ సదస్సు ఎంతో కొంత తోడ్పడిందని చెప్పాలి. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత నేరుగా పారిశ్రామిక దేశాధినేతలందరినీ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా కలిసి ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాకిస్తాన్ తీరు గురించి, దానిపై చర్య తీసుకోక తప్పని పరిస్థితి గురించి వివరించగలిగారు. ఏదేమైనా ఇలాంటి సదస్సులు మొక్కుబడిగా, బాతాఖానీ క్లబ్‌లుగా మారితే ఫలితం ఉండదు. కనీసం వచ్చే సమావేశాల నాటికైనా జీ7 దేశాలు ఈ సంగతి గ్రహించాలి.

భారత్‌లో మధ్యప్రాచ్యపు సెగలు

విశ్లేషణ



శైలేష్ హరిభక్తి

2025 జూన్ 12, 13 వేకువజాముల్లో ఇజ్రాయెల్ భారీ సైనిక చర్యకు తెరతీసింది. ఇరాన్ అణుశక్తి సదుపాయాల మీద దాడులు చేసింది. రెండు దేశాల నడుమ నెలల తరబడిగా సాగుతున్న ఉద్రిక్తత, ఈ ఘటనతో పెను యుద్ధంగా మారింది.

దశాబ్దాల నుంచీ అపరిష్కృతంగా కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ వైరాలు ఎంత దారుణంగా పరిణమిస్తాయో అందరికీ అవగతమైంది. ఈ యుద్ధాలను ప్రజలు ప్రారంభించారా? లేదు! ఎవరెవరి అధికార దాహానికో వారు బలవుతున్నారు.

ఇజ్రాయెల్ దాడి ఫలితంగా మధ్యప్రాచ్యంలో యుద్ధం తప్పదన్న అంచనాలతో బ్రెంట్ క్రూడ్ ధర భగ్గుమని బ్యారెల్ 116 డాలర్లకు చేరింది. కోవిడ్, ఉక్రెయిన్, ఎర్ర సముద్రం సంక్షోభాలతో విచ్ఛిన్నమై ఇప్పుడిప్పుడే కుదుట పడుతున్న ప్రపంచ సరఫరా వ్యవస్థలు మరోసారి ఖంగుతిన్నాయి. ఇరాన్‌లోని హోర్ముజ్ జల సంధి హై–రిస్క్ యుద్ధక్షేత్రంలో ఉండటంతో, అంతర్జాతీయ చమురు సరఫరాలు 20 శాతం నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో నౌకారవాణాపై బీమా చార్జీలు ఒక్కఉదుటున నాలుగు రెట్లు పెరిగాయి. మరోవైపు ఇన్వెస్టర్లు తమ నిధులను సురక్షితమైన బంగారం మార్కెట్లోకి తరలించడంతో, అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్సు (31.1 గ్రాములు) 2,450 డాలర్ల రికార్డు ధర పలికింది. ఈక్విటీ మార్కెట్లు కుప్పకూలాయి.

ఇండియా తప్పించుకోగలదా?

అనేక వర్ధమాన దేశాలతో పాటు ఇండియా సైతం ఈ పరిణామాల ప్రభావం నుంచి తప్పించుకోలేదు. ఇంధన, ఆహార ధరలు పెరుగుతాయి. ఉపాధి దెబ్బతింటుంది. కోట్ల మంది జీవితాలు మధ్యప్రాచ్య ఆర్థిక వ్యవస్థల మీద ఆధారపడి ఉన్నాయి. ఇండియా తన అవసరాల్లో రమారమి 85 శాతం ముడి చమురును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. ధరల్లో కొద్ది పాటి తేడా వచ్చినా రూపాయి విలువ ఆటుపోట్లకు గురవుతుంది. గల్ఫ్ దేశాల్లో ఇంజినీర్లు, నర్సులు, కార్మికులు, ప్రొఫెషనల్స్‌గా 90 లక్షల మంది భారతీయులు పనిచేస్తున్నారు. వారి భద్రత ఇప్పుడు అపాయంలో పడింది. వారు ఏడాదికి 100 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువే నిధులు స్వదేశానికి పంపిస్తున్నారు. ఎన్నో లక్షల కుటుంబాలు ఈ డబ్బుతోనే జీవనం సాగిస్తున్నాయి.

ఇక, మధ్య ఆసియాను ఇండియాతో అనుసంధానం చేసే ఇరాన్ చాబహార్ పోర్టు కూడా యుద్ధ ప్రాంతంలోనే ఉంది. ఇండియాకు ఎంతో ముఖ్యమైన ఈ వాణిజ్య పోర్టు ప్రాజెక్టు నుంచి వైదొలగాల్సిందిగా ఇప్పుడు అమెరికా నుంచి ఒత్తిడి వస్తుంది. రెడ్ సీ, హోర్ముజ్‌ల ముట్టడి ముప్పు కూడా పొంచి ఉంది. 60 శాతం పైగా ఇండియా వర్తకం ఈ కారిడార్ల ద్వారానే జరుగుతోంది. దాడి, ప్రతిదాడుల దృష్ట్యా సరుకు రవాణాలో జాప్యం జరుగుతుంది. బీమా వ్యయాలు చకచకా పెరుగుతున్నాయి. దీంతో విదేశీ వాణిజ్యం దెబ్బతింటుంది. కరెన్సీ మార్కెట్ లోనూ అస్థిరత్వం చోటు చేసుకుంటుంది. డాలరుకు రూపాయి విలువ ఇప్పటికే 86 దాటింది. దీంతో మార్కెట్లో సరఫరా పెంచేందుకు ఆర్బీఐ తన వద్ద ఉన్న డాలర్లను



విక్రయించాల్సి వస్తుంది. ఫలితంగా ప్రభుత్వ విదేశీ మారక నిల్వలు క్షీణిస్తాయి. ఈ అంకెలకు అందని నష్టం మరొకటి ఉంది. అది లెక్కించడానికి అలవి కానిది. పెరిగే చమురు ధరల వెనుక, నౌకా రవాణాలో జాప్యం వెనుక ఎందరో సామాన్యుల ఇక్కట్లు దాగి ఉంటాయి. పూర్తిస్థాయి యుద్ధం కొనసాగితే అది ఒక ప్రాంతానికి పరిమితం కాదు. ప్రపంచ వ్యాప్త అస్థిరతకు నాంది పలుకుతుంది. మధ్యప్రాచ్యపు అగ్నిజ్వాలలు ఖండాంతర కార్పొరేట్ బోర్డు రూముల్లోకి, కుటుంబాల డైనింగ్ టేబుల్స్ మీదకు, పాఠశాలల క్లాస్ రూముల్లోకి నాలుకలు జాపుతూ విస్తరిస్తాయి.

నష్ట నివారణ చర్యలు

వాటి బారిన పడకుండా ఇండియా లోగడ రూపొందించుకున్న వ్యూహాలు, యంత్రాంగాలు ఎంతవరకు ఉపకరిస్తాయన్నది కీలకం. వీటిలో ముందుగా ప్రస్తావించాల్సింది ఇంధన కవచం. దేశంలోని 39 మిలియన్ బ్యారెళ్ల వ్యూహాత్మక రిజర్వుల నుంచి అవసరమైనప్పుడల్లా కొంత కొంత చమురును మార్కెట్లోకి విడుదల చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. స్వల్పకాలిక ధరల ఒడుదొడుకులను ఈ విధానంతో అధిగమించవచ్చు. గల్ఫ్ చమురు సరఫరా లోటు భర్తీ చేసేందుకు రష్యా, వెనిజులా, బ్రెజిల్, గయానా దేశాల నుంచి దిగుమతులను పెంచుతోంది. అత్యవసర పరిస్థితులు ఉత్పన్నమై ఇంధన దిగుమతులకు డాలర్లకు కొరత ఏర్పడేట్లయితే, దాన్ని తట్టుకునేందుకు వీలుగా ద్వైపాక్షిక చెల్లింపు(రూపాయిల్లో పేమెంటు) ఏర్పాట్లను పునః ప్రారంభిస్తోంది.

ప్రవాసుల భద్రత మరో అంశం. యూఏఈ, సౌదీ అరేబియా, ఖతర్, బహ్రెయిన్ దేశాల్లో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రవాసుల కోసం నిరంతరాయంగా పనిచేసే సహాయక కేంద్రాలను ప్రారంభించింది. అత్యవసర పరిస్థితిలో వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించే ప్రణాళికలు రూపొందించి గల్ఫ్ ప్రభుత్వాల సహకారంతో వాటికి రిహార్సల్స్ చేస్తోంది. స్వదేశాలకు డబ్బు పంపించడానికి ఇబ్బంది లేకుండా యూపీఐ ఆధారిత నగదు చెల్లింపు ఏర్పాట్లు జరిగాయి.

దౌత్యపరంగా సున్నితమైన సమతుల్యతను ఇండియా పాటిస్తోంది. ఒమన్, యూఏఈ, సౌదీలతో తెరవెనుక దౌత్యం నెరపుతోంది. తక్షణం వైరాలకు స్వస్తి పలకాలని, ఉద్రిక్తతలను నివారించాలని, బేషరతు చర్చలు జరపాలని యూఎన్ సమావేశంలో పిలుపునిచ్చింది. మరోవంక, ఇండియన్ నేవీ అరేబియా సముద్రంలో 16 యుద్ధనౌకలను సన్నద్ధం చేసింది. గల్ఫ్ గస్తీలను పెంచింది. ప్రస్తుత ఘర్షణలు ఆసరాగా చేసుకుని ఉగ్రవాదులు పేట్రేగిపోకుండా సైబర్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలను అప్రమత్తం చేసింది.

ద్రవ్యరంగంలో కరెన్సీ ఆటుపోట్లను నివారించేందుకు ఆర్బీఐ చేతిలో 643 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉన్నాయి. దేశీయంగా ద్రవ్యోల్బణం జడలు విప్పకుండా కేంద్రం అదనపు ఆహార నిల్వలను విడుదల చేస్తోంది. ఎంఎస్ఎమ్ఈ ఎగుమతిదారులకు ఇచ్చే ఎగుమతి ప్రోత్సాహకాలు, రుణహామీలు రెడ్ సీ బాధిత సంస్థలకూ వర్తింప చేస్తోంది.

మన వ్యూహం

ప్రస్తుత సైనిక ఘర్షణల సమయంలో ఇండియా 'పవర్ ప్లేయర్'గా ఉండాలనుకోవడం లేదు. ఇంధన భద్రత, ప్రవాసుల క్షేమం, వర్తక మార్గాల రక్షణ... ఈ మూడు అంశాలకూ ప్రాధాన్యం ఇస్తూ, ఆర్థిక వ్యవస్థను కాపాడుకోడమే ప్రధాన కర్తవ్యంగా భావిస్తోంది. దీనికోసం అనివార్యంగా 'సంరక్షణాత్మక తటస్థత' అనే సంక్లిష్ట వ్యూహం అనుసరించాల్సి వస్తోంది.

జూన్ 2025 ఒక సంక్షుభిత దశాబ్దాన్ని వినాశకరమైన మలుపు తిప్పింది. ఇరాన్ అణు మౌలిక సదుపాయలపై జరిగిన దాడి, ఇరాన్ ప్రతీకార దాడుల ఫలితంగా మధ్యప్రాచ్యం అంతటా దీర్ఘకాలిక అస్థిరత నెలకొంటుంది. ఇండియా విషయానికి వస్తే, ఈ పరిణామాన్ని విదేశాంగ విధానానికి సవాలుగా మాత్రమే పరిగణించలేము. వ్యూహాత్మక పరిపక్వతకు, ఆర్థిక పటుత్వానికి, నైతిక స్థైర్యానికి ఇది ఒక పరీక్ష లాంటిది. మనం అప్రమత్తంగా ఉంటూ, మధ్యప్రాచ్యంలో శాంతి సుస్థిరతలు నెలకొనాలని, మనకు చేరువలోనే కాలి బూడిదవుతున్న ఈ ప్రాంతంలో తిరిగి వివేకం ఉదయించాలని కోరుకోవాలి.

వ్యాసకర్త పారిశ్రామికవేత్త, పర్యావరణ కార్యకర్త
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

- దౌత్యపరంగా సున్నితమైన సమతుల్యతను ఇండియా పాటిస్తోంది. ఒమన్, యూఏఈ, సౌదీలతో తెరవెనుక దౌత్యం నెరపుతోంది.
- గల్ఫ్ చమురు సరఫరా లోటును భర్తీ చేసేందుకు రష్యా, వెనిజులా, బ్రెజిల్, గయానా దేశాల నుంచి దిగుమతులను పెంచుతోంది.
- ప్రస్తుత ఘర్షణలో ఇండియా 'పవర్ ప్లేయర్'గా ఉండాలనుకోవడం లేదు. ఇంధన భద్రత, ప్రవాసుల క్షేమం, వర్తక మార్గాల రక్షణ... ఈ మూడు అంశాలకూ ప్రాధాన్యం ఇస్తూ, ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడమే ప్రధాన కర్తవ్యంగా భావిస్తోంది.

సోషల్ మీడియా

ఎందుకు ఒప్పుకొంటుంది?



పాకిస్తాన్‌తో ఇటీవలి కాల్పుల విరమణకు తాను మధ్యవర్తిత్వం వహించానని ఎన్నోసార్లు చెప్పుకొన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలను ప్రధాని మోదీ చివరకు బహిరంగంగా తిరగ్గొట్టారు. ఏమంత సంపదతో తులతూగనప్పుడే ఇండియా మధ్యవర్తిత్వాన్ని అంగీకరించలేదు. అలాంటిది మరింత ఆత్మవిశ్వాసంతో ఉన్నప్పుడు అసలు అంగీకరించదు.

- హుస్సేన్ హక్కానీ, అమెరికాలో పాక్ మాజీ రాయబారి

సొంత లాభం



పాకిస్తాన్ ఎలా మాయచేయ గలదో చూడండి: ఇరాన్ మీద అమెరికా దాడులను అనుమతిస్తుంది, అమెరికా స్థావరాల మీద ఇరాన్ దాడి చేయకుండా చూస్తుంది. అదే సమయంలో ఇరాన్ కోసం ఇజ్రాయెల్ మీద అణుబాంబు వేస్తానంటుంది. తనను తాను అమ్ముకోవడం పాకిస్తాన్‌కు ఎప్పుడూ లాభదాయకమే.

- సునందా వశిష్ఠ్, విశ్లేషకురాలు

యుద్ధ పరిశ్రమ



ఇది ఇరాన్, ఇజ్రాయెల్, మరో దేశం గురించో కాదు. ఇది అమెరికా అహంకారం, సిగ్గుమాలినతనం గురించి! ఒక ఆశయం కోసం అది యుద్ధానికి వెళ్లలేదు, కేవలం తన ఆయుధ పరిశ్రమను నడపడం కోసం వెళ్లింది.

- సుహేల్ సేథ్, నటుడు-రచయిత

అనర్థంలో అర్థం



మెదడు ఒక క్రమాన్ని ఇష్టపడుతుంది. అందుకే మనం మేఘాల్లో ముఖాల్నీ, అస్తవ్యస్తతలో అర్థాన్నీ చూస్తాం.

- బెర్నార్డ్ జె. బార్స్, సైకోబయాలజీ రచయిత

అదెందుకు సమస్య?



మోదీని విమర్శించడానికి ఎన్నో అంశాలున్నాయి. కానీ ఆంగ్లంలో మాట్లాడలేని ఆయన అశక్తత మాత్రం అందులో ఒకటి కాదు. అది మీ వర్గస్వభావపు ఎగతాళిని ఎత్తిచూపుతుంది.

- స్వాతీ చతుర్వేది, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

పంచాయతీలను పాడు పెట్టొద్దు!

గత ఏడాది జనవరి 31తేదీతో గ్రామ సర్పంచుల పదవీకాలం పూర్తయిపోయింది. ఫిబ్రవరి నుంచి వారు మాజీ సర్పంచులే. గ్రామ పాలనా వ్యవహారాలు చూడడానికి ప్రత్యేక అధికారులను నియమించారు. ఆగమేఘాల మీద వారి వద్ద నుంచి రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నారు. అయితే అప్పుచేసి పనులు పూర్తిచేసిన సర్పంచులు తమ బిల్లులు వస్తాయో రావో తెలియక త్రిశంకు స్వర్గంలో ఉన్నారు. మరొక పక్క ఎన్నికలు నిర్వహించనిదే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయం గ్రామ పంచాయతీలు అందుకునే అవకాశం లేకుండా పోయింది. గ్రామాల్లో పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది.

ఒకనాడు పంచాయతీరాజ్ వ్యవస్థలో సర్పంచులకు అధికారాల మాట ఎలా ఉన్నా ఎంతో గౌరవ మర్యాదలు ఉండేవి. ఇప్పుడు రకరకాల గ్రామ కమిటీలను నియమించి ప్రభుత్వాలు సర్పంచ్ పదవిని నామమాత్రం చేశాయి. పంచాయతీ వ్యవస్థలో 1952 నుంచి ఎన్నో కమిటీలు, మరెన్నో అధ్యయనాలు, మార్పులు, చేర్పులు చేశారు. కానీ సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు ఇవ్వడానికి మాత్రం పాలక పెద్దలకు మనసు ఒప్పడం లేదు. రాను రాను పంచాయతీరాజ్ వ్యవస్థను నామమాత్రంగా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలు ఎనుకున్న సర్పంచ్‌ను సస్పెండ్ చేసే అధికారం అధికారులకు కట్టబెట్టిన దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది వంటిది. అందులో సర్పంచులు చాలా కీలకం. రాష్ట్రానికి మరిన్ని అధికారాలు కావాలని కేంద్రం ముందు కేకలు పెడుతున్న నాయకులకు, స్థానిక సంస్థలకు మాత్రం అధికారాలు ఇవ్వక పోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం అంటూ పదేపదే వల్లించే నేతలు తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారులతో కాలం గడపడం ఏమాత్రం సమంజసం కాదు. తక్షణమే గ్రామ పంచాయతీల ఎన్నికలు జరపడానికి నడుం బిగించాలి.

– సభావట్ కళ్యాణ్ I ఢిల్లీ విశ్వవిద్యాలయంలో న్యాయ శాస్త్ర విద్యార్థి

డాలర్ వెలవెల... బంగారం ధగధగ

అభిప్రాయం



డి. పాపారావు

బంగారం ఒక విలువైన లోహం. భారతదేశం వంటి దేశాలలో అది మహిళలకు ఇష్టమైన అలంకారం. లేకుంటే, ధనవంతులకు తమ సంపదను దాచుకునే ఒక మార్గం. కానీ ఇదే బంగారం 1971 ఆగస్టు 15 వరకూ అమెరికా డాలర్‌కు విలువను కల్పించిన సాధనం. నాటి వరకూ, అమెరికా డాలర్ అంతర్జాతీయ వాణిజ్య లావాదేవీలకు అవసరమైన రిజర్వ్ కరెన్సీగా కొనసాగగలిగేటందుకు, ఈ డాలర్ – బంగారం లింక్ ఉపయోగపడింది. అయితే, నాటి అమెరికా అధ్యక్షుడు నిక్సన్ ఈ లింక్‌ను తెగ్గొట్టేశాడు. అంటే, ఇక ముందర తాము ముద్రిస్తోన్న డాలర్‌లకు ఆ మేరకు, వెనుక తట్టున బంగారాన్ని నిల్వ పెట్టబోమని తేల్చి చెప్పేశాడు.

ఈ రకంగా డాలర్ అనేది ఫ్లోటింగ్ కరెన్సీగా మారింది. అంటే, బంగారం లింక్ తెగిపోయిన తర్వాత డాలర్ తాలూకు విలువ, ఇతర దేశాల కరెన్సీలతో పోలిస్తే, దానికున్న డిమాండ్‌పై ఆధారపడ సాగింది. ఇదే క్రమంలో, ప్రపంచంలోని అనేక కరెన్సీలు మెల్లమెల్లగా ఫ్లోటింగ్ కరెన్సీలుగా మారాయి. ఒక దేశం వివిధ దేశాలతో చేసిన వ్యాపారం తదితర లావాదేవీల ఫలితంగా సమకూరిన అనేక దేశాల కరెన్సీలతో పాటుగా... వాటిలో ఒకటిగా, కొద్దిపాటిగా బంగారం నిల్వలను కూడా వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు (మన రిజర్వ్ బ్యాంక్ వంటివి) తమ కిట్టీలో అట్టిపెట్టుకోసాగాయి. కాగా, ఈ కేంద్ర బ్యాంకుల వద్ద ఉన్న వివిధ కరెన్సీల నిల్వలు అన్నింటిలోనూ డాలర్‌దే తిరుగులేని పై చేయిగా ఉంటూ వస్తోంది.

కానీ, ఇటీవల మరలా కథ తిరగబడుతోంది. వివిధ దేశాల కేంద్ర బ్యాంకుల వద్ద ఉన్న మారకం నిల్వలలో యూరో కరెన్సీని అధిగమించి డాలర్ తరువాతి స్థానంలోకి బంగారం నిల్వలు చేరుకుంటున్నాయి. అంటే, డాలర్ యుగం ముగుస్తోందన్న మాట. కానీ దానికి తక్షణ ప్రత్యామ్నాయం కనపడని ఈ సంధి దశలో, బంగారం తిరిగి ప్రాభవంలోకి వస్తోంది. దీనికి తార్కాణమే నేడు కేంద్ర బ్యాంకుల వద్ద బంగారం నిల్వల స్థాయి సుమారుగా 36 వేల టన్నులకు చేరుకోవడం. గతంలో ఈ స్థాయిలో అవి ఉన్నది 60 సంవత్సరాల క్రితం మాత్రమే!

1971లోనే బంగారంతో లింక్ తెగిపోయినా... నేటి వరకూ కూడా డాలర్ తన అంతర్జాతీయ రిజర్వ్ కరెన్సీ స్థానాన్ని పదిలంగా అట్టిపెట్టుకోగల్గింది. అయితే 1980ల నుంచీ, ఔట్‌సోర్సింగ్ రూపంలో అమెరికా పరిశ్రమలు చైనా వంటి ఇతర చవక శ్రమ



- అమెరికా తమ ప్రజల కొనుగోలు శక్తిని కాపాడేందుకు 2008 ఆర్థిక సంక్షోభ సమయంలో, కోవిడ్ లాక్‌డౌన్ కాలంలో ఉద్దీపన పథకాల కోసం లక్షల కోట్ల డాలర్లను ముద్రించింది. ఈ క్రమంలోనే డాలర్ కరెన్సీ తన విలువను కోల్పోసాగింది.

శక్తి దేశాలకు తరలిపోవడం, 1990ల మధ్య నుంచీ, ఇంటర్నెట్ సాంకేతికత వలన అమెరికాలోని సేవా రంగం కూడా పెద్ద ఎత్తున భారతదేశం వంటి దేశాలకు తరలి వెళ్ళిపోవడం; యాంత్రీకరణ వేగం పెరిగి అమెరికాలో ప్రజలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం... ఫలితంగా వారి కొనుగోలు శక్తి పడిపోయే పరిస్థితులు వచ్చాయి. ఈ క్రమంలోనే అమెరికా భారీ ఎత్తున ఇతర దేశాల దగ్గర అప్పులు చేయసాగింది. అంతిమంగా నేడు ఈ అప్పు స్థాయి సుమారుగా 35 లక్షల కోట్ల డాలర్లకు చేరింది.

అమెరికా పాలకులు తమ ప్రజల కొనుగోలు శక్తిని కాపాడే ప్రయత్నంలో భాగంగా 2008 ఆర్థిక సంక్షోభ సమయంలో, 2020 కోవిడ్ లాక్‌డౌన్ కాలంలో ఉద్దీపన పథకాల కోసం పెద్ద ఎత్తున లక్షల కోట్ల డాలర్లను ముద్రించారు. అంతకు ముందర అనేక దశాబ్దాలుగా కూడా అమెరికాలో డాలర్ల ముద్రణ శ్రుతి మించి జరిగింది. ఈ క్రమంలోనే డాలర్ కరెన్సీ తన విలువను కోల్పోసాగింది. 2022 అనంతరం, ఆ దేశంలో విజృంభించిన ద్రవ్యోల్బణం లేదా ధరల పెరుగుదల అనేవి దశాబ్దాల పాటు జరిగిన డాలర్‌ల అపరిమిత ముద్రణ ఫలితమే.

ఈ క్రమంలోనే, బలహీనపడుతోన్న డాలర్ రూపంలో తమ తమ విదేశీ మారకద్రవ్య నిల్వలను అట్టిపెట్టుకోవడం కంటే, బంగారం వంటి నికరంగా విలువను నిలబెట్టుకోగల ప్రత్యామ్నాయాన్ని ఆశ్రయించడం మేలని కేంద్ర బ్యాంకులు నిర్ణయించుకుంటున్నాయి. దీనంతటితో పాటుగా, రష్యా – ఉక్రెయిన్ యుద్ధ క్రమంలో, అమెరికా ప్రభుత్వం రష్యాపై అనేక ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలలో భాగంగా అమెరికా డాలర్ కరెన్సీ లావాదేవీల వ్యవస్థ నుంచి, రష్యాను బయటకు నెట్టివేసింది. ఈ బహిష్కరణ అనేది ప్రపంచంలోని చాలా దేశాలకు డాలర్‌పై ఆధారపడడం తాలూకు అభద్రతను బోధపరిచింది. ఫలితంగా, నేడు పలు దేశాలు డాలర్‌పై ఆధారపడడాన్ని తగ్గించుకుంటున్నాయి. ఈ క్రమంలోనే అవి బంగారం దిశగా కూడా మళ్ళుతున్నాయి.

గత 15 ఏళ్లగా అనేక దేశాల కేంద్ర బ్యాంకులు భారీ ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. 2024లో ఇవి రికార్డు స్థాయిలో 1,180 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేశాయి. కేంద్ర బ్యాంకుల కిట్టీలో బంగారం నిల్వల స్థాయి పెరుగుతూ రావడం అనేది... పాత డాలర్ యుగం ఆధిపత్య స్థానంలో మరో సరికొత్త కరెన్సీ లేదా కరెన్సీల సమూహం వచ్చి చేరే వరకూ నడిచే సంధి యుగం లక్షణమే.


వ్యాసకర్త సామాజిక, ఆర్థిక రంగాల విశ్లేషకులు
మొబైల్: 98661 79615

ఎలాంటి దానం?

పవిత్రమపి యత్ క్రూరం కర్మ తన్నహి శోభతే
పరోపకారకం శాంతం కర్మ సద్భిః ప్రశస్యతే

మనం చేసే పని ఎంత పవిత్రమైనదైనా క్రూరంగా ఉంటే మాత్రం రాణించదు. అది శాంతమై, ఇతరులకు ఉపకారం కలిగించేదైతే సజ్జనులు దాన్ని ప్రశంసిస్తారు. పూర్వం ఒక గ్రామంలో వృద్ధ స్నేహితులు ఇద్దరుండేవారు. వాళ్ళిద్దరూ బాగా కలిగిన ధనవంతులే. ఎక్కడికి వెళ్ళినా కలిసే వెళ్ళేవారు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఒకసారి ఊరి బయటకు వారు షికారుకు వెళ్లినప్పుడు వారిని పిచ్చి కుక్క కరిచింది. ఫలితంగా 'రేబిస్ వ్యాధి' సోకింది. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. మరణం తప్పదని నిర్ధారణ అయింది.

ఇప్పుడు వాళ్ళకు ఏదో దాన ధర్మాలు చేసుకుంటే మంచిదనీ, కీర్తి ప్రదమనీ అనిపించింది. పిచ్చికుక్కలు మానవజాతికి ప్రమాదకారులు కనుక వాటివల్ల తమ లాగానే ఇతరులు బాధపడకూడదనే సదుద్దేశంతో వారిలో ఒకాయన, తన యావత్తు ఆస్తినీ పిచ్చికుక్కల్ని చంపటానికి ఖర్చు పెట్టాలని వీలునామా రాశాడు. ఇక రెండవ వ్యక్తి, పిచ్చికుక్క కాటువల్ల వచ్చే రోగానికి మంచి మందు కనిపెట్టి దాన్ని రోగులకు ఉచితంగా ఇచ్చి వైద్యం చేయాలంటూ అందుకోసం తన ఆస్తినంతా ఖర్చుపెట్టాలని వీలు నామాలో రాశాడు.

ఎలా వుంది, వీరిరువురి దానాల తీరు? ఇద్దరూ ముందు తరాలవారికై మంచి పనే చేశారు. కాని మొదటాయన చేసిన దానం చాలా క్రూరమైంది. హింసాత్మకం. రెండవవాడు చేసింది సున్నితమైంది. జాతికి బాగా ఉపయోగపడేది. ఈ రెండవ పద్ధతి దానాన్నే పెద్దలు మెచ్చుకుంటారు.

ఇలాగే దానధర్మాల కోసం ధనం బాగా ఖర్చుపెట్టే దాతలున్నారు. బీదలకు అన్న సత్రాలు కట్టిస్తారు. పాఠశాలలు నెలకొల్పుతారు. బావులు, చెరువులు తవ్విస్తారు. దళిత దీన జనాలకై తిండి, వస్త్రాలు, వసతి వంటివెన్నో కల్పిస్తారు. కానీ ఇలాంటివి చేసే వ్యక్తులకెంతో ఓర్పు, జాలి, దయాదాక్షిణ్యాదులుండటం అవసరం. లేకపోతే ఆ దానాల ఫలితాన్నందుకోలేరు. ముఖ్యంగా 'నేను చేస్తున్నాను' అనే అహంకారం ఉండకూడదు. 'నా గురించి పదిమంది పొగడాలి' అనే కాంక్ష ఉండరాదు. 'దానం చేయటం నా కర్తవ్యం' అని భావిస్తూ ఫలాపేక్ష రహితంగా చేసే దానం ఉత్తమం. జయ గురుదత్త!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.అష్టమి ఉ.8.43 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.8.45 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ఉ.7.08 నుండి 8.39 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.43 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** సా.4.10 నుండి 5.38 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.32.

అగ్రనేతగా ఎదిగి.. శాంతి చర్చల్లో పాల్గొని..

సాక్షి ప్రతినిధి, వరంగల్/టేకుమట్ల: మావోయిస్టు అగ్రనేత, శాంతి చర్చల ప్రతినిధి గాజర్ల రవి అలియాస్ గణేష్, అలియాస్ ఉదయ్ మృతితో ఆయన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) నుంచి అజ్ఞాతవాసంలోకి వెళ్లిన రవి.. దళ సభ్యుడిగా మొదలుపెట్టి కేంద్ర కమిటీ వరకు ఎదిగారు. విద్యార్థి దశనుంచే ఉద్యమాలపై ఆసక్తితో విప్లవాల బాట పట్టారు. 1985–86 సంవత్సరంలో వరంగల్‌లోని ఐటీఐలో చదువుతున్న క్రమంలోనే ఉద్యమాలకు ఆకర్షితుడై ఆర్ఎస్‌యూలో పనిచేశారు. తన అన్న గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్ అప్పటికే ఉద్యమంలో క్రియాశీలకంగా ఉండటంతో ఆ ప్రభావం రవిపై పడింది. 1992లో పూర్తిస్థాయిలో ఉద్యమంలోకి వెళ్లారు. 1994–98 మధ్య ఏటూరునాగారం దళ సభ్యుడిగా, మహాదేవ పూర్‌లో కమాండర్‌గా పని చేశారు. 1994లో లెంకలగడ్డలో మందుపాతర పేల్చి ఏడుగురు పోలీసులను చంపిన కేసులో నిందితుడిగా ఉన్నారు. 1998లో ఎన్‌టీఎస్‌జెడ్‌సీ సభ్యుడిగా నియమితుల య్యారు. 2000 సంవత్సరంలో ఖమ్మం – కరీంనగర్ – వరంగల్ (కేకే డబ్ల్యూ) కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2001లో ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌పై జరిగిన దాడిలో పాల్గొన్నట్టు సమాచారం ఉంది. 2002 సంవత్సరంలో మహాదేవపూర్ కమాండర్‌గా పనిచేస్తున్న స్వరూప అలియాస్ జిలానీ బేగంను వివాహం చేసుకోగా ఆమె ఏవోబీలోని రామగూడలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయింది. 2007లో ఆంధ్ర ఒడిశా బోర్డర్‌కు బదిలీ అయిన రవి.. అక్కడ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతూనే ఆంధ్ర ఒరిస్సా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

శాంతి చర్చల ఎజెండా రూపకల్పనలో కీలకపాత్ర

గాజర్ల రవి 2004లో శాంతి చర్చల ప్రతినిధిగా వ్యవహరించారు. కాల్పుల విరమణ, శాంతి చర్చలకు మేధావులు జరిపిన సంప్రదింపులకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు చర్చల ప్రతినిధులుగా జనశక్తి పార్టీ నుంచి వెంకటేశ్ అలియాస్ రియాజ్, మావోయిస్టు పార్టీ నుంచి అక్కిరాజు హరగోపాల్ అలియాస్ ఆర్కే, గౌతమ్ అలియాస్ సుధాకర్‌లతో పాటు ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హోదాలో గాజర్ల రవి కూడా పాల్గొన్నారు. శాంతి చర్చల ఎజెండాను తయారు చేయడంలో కీలక పాత్ర పోషించారు. రవి అన్న గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్ (మహారాష్ట్ర రాష్ట్ర కమిటీ సభ్యుడు) 2008 ఏప్రిల్ 2న ములుగు జిల్లా తాడ్వాయి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా, ఆయన తమ్ముడు గాజర్ల అశోక్ అలియాస్ ఐతూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఉంటూ అనారోగ్యంతో జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. రవి మృతిపై జిల్లా పోలీసులు బుధవారం మధ్యాహ్నం కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వెలిశాలకు తీసుకువచ్చి గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు..

నా సోదరుడి మరణంపై అనుమానాలున్నాయి. ఇప్పటివరకు మృతదేహాల ఫొటోలను విడుదల చేయలేదు. పోలీసులు మృతుల కుటుంబసభ్యులకు మధ్యాహ్నం వరకు సమాచారమివ్వలేదు. ఇది ఎన్‌కౌంటరో?.. పట్టుకుని కాల్చి చంపారో? ఏదైనా విష ప్రయోగం చేసి ఉండొచ్చు.

– మాజీ మావోయిస్టు గాజర్ల అశోక్

'కమిటీ' సగమై..
'పొలిట్ బ్యూరో' బలహీనమై!
అణచి'వేట'
వివరాలు సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో

మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి ఎన్‌కౌంటర్

- ఏపీలోని కింటుకూరు అడవుల్లో ఎదురుకాల్పులు



రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా)/సాక్షి, పాడేరు : ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలంలోని కింటుకూరు అటవీ ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు కీలక నేతలు సహా ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. కింటుకూరు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో గ్రేహౌండ్స్ బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టులకు, గ్రేహౌండ్స్ బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి, 2004 శాంతి చర్చల ప్రతినిధి గాజర్ల రవి అలియాస్ గణేష్, అలియాస్ ఉదయ్, అలియాస్ బిర్సు, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు అరుణ, ఏవోబీ జోనల్ కమిటీ ఏరియా కమిటీ సభ్యురాలు అంజు మరణించారు. వీరిలో రవి తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు. ఆయన స్వస్థలం భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెలిశాల గ్రామం. అరుణ ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మరణించిన కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి భార్య. ఈమెది విశాఖ జిల్లా పెందుర్తి మండలం కరకవానిపాలెం. గాజర్ల రవి, అరుణపై పోలీస్ రివార్డులున్నాయి. మావోయిస్టులకు సంబంధించిన పలు కీలక సంఘటనల్లో వీరు పాల్గొన్నట్లు పోలీస్ కేసులు నమోదయ్యాయి. అంజుది ఛత్తీస్‌గఢ్ అని తెలిసింది. కాగా సంఘటన స్థలంలో పలు ఏకే–47 తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సేఫ్‌జోన్ అని..: ఆపరేషన్ కగార్ పేరిట దండకారణ్యాన్ని పోలీస్ బలగాలు జల్లెడపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులకు గట్టి ఎదురు దెబ్బలు తగిలాయి. ఈ నేపథ్యంలో పాపికొండలు, అభయారణ్యంలోని కొండమొదలు, కింటుకూరు ప్రాంతాలను సేఫ్‌జోన్‌గా భావించిన మావోయిస్టులు ఇక్కడకు వచ్చినట్లు భావిస్తున్నారు. సుమారు ఆరునెలల క్రితమే పది మంది మావోయిస్టులు కింటుకూరు అటవీ ప్రాంతానికి వచ్చినట్లు నిఘా వర్గాలు పసిగట్టాయి. ఈ నేపథ్యంలో నెలరోజుల క్రితం వై.రామవరం–కొయ్యూరు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే.

అరుణ అలియాస్ అరుణక్క..



చలపతితో అరుణక్క

వెంకటలక్ష్మి చైతన్య అలియాస్ అరుణ, అలియాస్ అరుణక్క (55) మెట్రిక్యులేషన్ వరకు చదువుకున్నారు. 20 ఏళ్ల వయస్సు లోనే మావోయిస్టు ఉద్యమం బాటపట్టారు. అమె తమ్ముడు గోపి అలియాస్ ఆజాద్ కూడా 2006లో అక్క మార్గంలోనే ఉద్యమంలో చేరాడు. 2016లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆజాద్ మృతిచెందారు. అరుణక్క మావోయిస్టు పార్టీలో ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలిగా ఉంటూ మహిళా విభాగాల్లో 30 ఏళ్లుగా కీలకంగా వ్యవహరించారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి భార్య చనిపోవడంతో అరుణక్కను రెండో వివాహం చేసుకున్నారు. ఈ ఏడాది జనవరిలో ఒడిశా–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చలపతి మరణించారు. భర్త మరణంతో అరుణ కుంగిపోలేదు. అనేక ఎన్‌కౌంటర్ల నుంచి ఆమె తప్పించుకున్నారు. పోలీసుల నిర్బంధం తీవ్రంగా ఉండడంతో ఇటీవల కాలంలో రంపచోడ వరం అటవీ ప్రాంతాన్ని సేఫ్‌జోన్‌గా మార్చుకుని తలదాచుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆమెకు ఆరుగురు మావోయిస్టులు భద్రత ఉన్నప్పటికీ ఎన్‌కౌంటర్‌లో బలయ్యారు. ఆమెకు భద్రతగా ఉన్న అంజూ కూడా మృతిచెందారు. ఇక అరుణక్కపై ఏపీలో రూ. 20 లక్షల రివార్డు ఉంది. 2018లో అరకు ఎమ్మెల్యే కిడారి శ్రావణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమలను హత్య చేసిన ఘటనలో అరుణక్క పాల్గొన్నట్లు పోలీసులు కేసు నమోదుచేశారు.

కొద్ది రోజుల క్రితమే పట్టుకుని..

నా కుమార్తెను పోలీసులు కొద్ది రోజుల క్రితమే పట్టుకుని బంధించి ఇప్పుడు హతమార్చారు. దీన్ని ప్రభుత్వ హత్యగానే భావిస్తున్నాం. గతంలో నా కుమారుడు ఆజాద్‌ను బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశారు. దీనిపై న్యాయపోరాటం చేస్తాం

.– లక్ష్మణరావు, అరుణక్క తండ్రి

దేశంలో తగ్గిన మావోయిస్టుల హింస

- వచ్చే మార్చి నాటికి 'నక్సల్స్ రహిత భారత్': కేంద్ర మంత్రి బండి సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో 2010తో పోలిస్తే ప్రస్తుతం వామపక్ష తీవ్రవాద హింస 83 శాతం మేరకు తగ్గిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. ప్రధాని మోదీ ప్రభుత్వ రణనీతి, సుస్థిర పాలనా విధానాల ఫలితంగానే ఈ మార్పు వచ్చిందని పేర్కొన్నారు. 2026 మార్చి నాటికి 'నక్సల్స్ రహిత భారత్'లక్ష్యాన్ని సాధించేందుకు పూర్తి నిబద్ధతతో ముందుకు సాగుతున్నామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం హరియాణా రాష్ట్రంలోని మానేసర్‌లో నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ క్యాంపస్‌కు వెళ్లిన బండి సంజయ్, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎన్ఎస్‌జీ వీరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఎన్ఎస్‌జీ సిబ్బంది నివాస సముదాయాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌జీ సిబ్బంది చేపట్టిన ఆపరేషనల్ డెమోను తిలకించారు.



ఎన్ఎస్‌జీ సిబ్బంది ఆపరేషనల్ డెమోను తిలకిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

వీవీఐపీ అతిథి గృహం నిర్మాణంపై నిపుణుల కమిటీ

సాక్షి, హైదరాబాద్: మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో వీవీఐపీ అతిథి గృహం నిర్మాణంపై నిపుణుల కమిటీ వేయాలని సీఎస్ కె.రామకృష్ణారావుకు సీఎంవో కార్యాలయం సూచించింది. అతిథి గృహం నిర్మాణంలో భాగంగా చేపడుతున్న ఇతర నిర్మాణాల అవసరం, వాటికి చేస్తున్న వ్యయంపై మదింపును నిపుణుల కమిటీ పరిశీలించి తగు సిఫారసులతో నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకోవాలని రామకృష్ణారావును సీఎంవో కోరింది.

మధ్యవర్తిత్వం మాటే లేదు

- పాక్‌తో కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదు
- ట్రంప్‌కు తేల్చిచెప్పిన ప్రధాని మోదీ
- ట్రంప్‌తో మోదీ టెలిఫోన్ సంభాషణ



కననాస్కిస్(కెనడా): ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాల్లో భాగంగా భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన పరస్పర సైనిక చర్యల ముగింపు పర్వంలో అమెరికా ఎలాంటి మధ్యవర్తిత్వ పాత్ర పోషించలేదని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. పాక్‌తో పోరులో శాంతిస్థాపన కోసం తానే చొరవ తీసుకుని ఇరుదేశాల మధ్య ఆపానని ట్రంప్ పదేపదే ప్రకటించుకోవడం, అమెరికా జోక్యంపై విపక్షాలు దుమ్మెత్తిపోసిన నేపథ్యంలో ట్రంప్‌తో మోదీ మాట్లాడటం విశేషం. ఆపరేషన్ సిందూర్ తర్వాత ట్రంప్‌తో మోదీ మాట్లాడటం ఇదే తొలిసారి. అత్యవసరంగా, అర్ధంతరంగా జీ7 భేటీ నుంచి ట్రంప్ నిష్క్రమించిన నేపథ్యంలో ట్రంప్‌తో మోదీ మంగళవారం ఫోన్‌లో సుదీర్ఘంగా సంభాషించారని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ చెప్పారు. ట్రంప్‌తో మోదీ సంభాషణ వివరాలను మిస్రీ మీడియాకు వెల్లడించారు. ''ఆపరేషన్ సిందూర్ తర్వాత వెనువెంటనే భారత్, పాక్ మధ్య మొదలైన పరస్పర కాల్పుల ఉదంతంలో ఇరుదేశాల మిలిటరీ విభాగాల చర్చల తర్వాత దాడులు ఆగాయి. ఇందులో అమెరికా ఎలాంటి మధ్యవర్తిత్వ పాత్ర పోషించలేదు. అయినా మూడోవర్గం మధ్యవర్తిత్వాన్ని భారత్ ఏనాడూ అంగీకరించలేదు. పాకిస్తాన్ అభ్యర్థించడం వల్లే భారత్ కాల్పుల విరమణకు ఒప్పుకుంది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఇకపై పరోక్ష యుద్ధంగానే భావించబోం. ప్రత్యక్ష యుద్ధంగానే భావిస్తాం'' అని ట్రంప్‌కు మోదీ స్పష్టంచేశారు.

వాణిజ్య అంశాల ఊసేలేదు

యుద్ధం ఆపకపోతే మీతో వాణిజ్యాన్ని ఆపేస్తానని భారత్‌ను ట్రంప్ బెదిరించారని వచ్చిన వార్తలపై మోదీ ట్రంప్‌కు స్పష్టతనిచ్చారు. ''ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాల్లో అమెరికా అస్సలు జోక్యం చేసుకోలేదు. భారత్, పాక్ మధ్య మధ్యవర్తిత్వం వహిస్తామని అమెరికా నుంచి ఎలాంటి అధికారిక ప్రతిపాదన కూడా అందలేదు. ఈ మొత్తం ప్రక్రియలో ఎక్కడా, ఏ స్థాయిలోనూ భారత్-అమెరికా వాణిజ్య సంబంధాలు ప్రస్తావన అస్సలు లేదు. భారత్ ఇంతకుముందుగానీ ఇకమీదటగానీ మధ్యవర్తిత్వాన్ని ఏ రకంగానూ అంగీకరించే ఆస్కారంలేదు. ఈ అంశంలో రాజకీయాలకు అతీతంగా భారత్‌లో ఏకాభిప్రాయం ఉంది. మే9వ తేదీ రాత్రి మీ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాకు ఫోన్‌చేశారు. పాకిస్తాన్ ప్రతిదాడులకు సంసిద్ధమవుతోందని నాతో అన్నారు. అదే నిజమైతే పాక్‌కు కనీవినీ ఎరుగని రీతిలో బుద్ధిచెప్తామని స్పష్టంచేశా. మే 9 అర్ధరాత్రిదాటాక పాకిస్తాన్‌లోని కీలక సైనిక, వైమానిక స్థావరాలపై క్షిపణి దాడులుచేసి నాశనం చేశాం. మా దాడుల్లో వాళ్ల సైనిక ఎయిర్‌బేస్‌లు బద్దలయ్యాయి. నిరుపయోగంగా మారాయి. దీంతో దిక్కుతోచక మాతో కాల్పుల విరమణ ఒప్పందానికి వాళ్లే తొలుత అభ్యర్థించారు'' అని ట్రంప్‌తో మోదీ చెప్పారు.

అమెరికాకు ఆహ్వానించిన ట్రంప్

35 నిమిషాలకుపైగా జరిగిన ఈ టెలిఫోన్ సంభాషణలో చివర్లో మోదీని ట్రంప్ అమెరికాకు ఆహ్వానించారు. కెనడాలో జీ7 శిఖరాగ్ర సదస్సు ముగిశాక తిరుగు ప్రయాణంలో అమెరికాకు వచ్చిపోవాలని మోదీని ట్రంప్ కోరారు. క్రొయేషియాలో పర్యటించాల్సి ఉన్నందున అమెరికాలో పర్యటించడం కుదరదని ట్రంప్‌కు మోదీ సుతిమెత్తగా చెప్పి అభ్యర్థనను తిరస్కరించారు.

క్షిపణుల కుంభవృష్టి

ఇరాన్‌లోని 40 ప్రాంతాలపై ఇజ్రాయెల్ ముప్పేట దాడి

- సెంట్రిఫ్యూజ్, ఆయుధాల ఉత్పత్తి కర్మాగారాలపై క్షిపణుల కుండపోత
- డ్రోన్ల దండుతో చెలరేగిపోయిన ఇజ్రాయెల్
- ఇరాన్‌లో 585 దాటిన మరణాలు
- 1,300 మందికి గాయాలు

దుబాయ్/టెహ్రాన్/టెల్ అవీవ్: ఇరాన్ సైనికసామర్థ్యం అణ్వస్త్రస్థాయికి చేరకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా దాడులతో దండయాత్ర చేస్తున్న ఇజ్రాయెల్ బుధవారం తన బాంబుల కుంభవృష్టిని కురిపించింది. ఇరాన్‌లోని 40 కీలక ప్రాంతాలపై క్షిపణులతో విరుచుకుపడింది. యురేనియం శుద్ధి ప్రక్రియలో కీలకమైన సెంట్రీఫ్యూజ్‌లను తయారుచేసే కర్మాగారంపై భీకరస్థాయిలో మిస్సైళ్లను ప్రయోగించింది. ఇరాన్ సాయుధశక్తిని నిర్వీర్యం చేసేందుకు క్షిపణుల ఉత్పత్తి ఆయుధ ప్లాంట్‌లపైనా ఇజ్రాయెల్ వందల కొద్దీ డ్రోన్లను ఎక్కుపెట్టింది. ఇరాన్ అంతర్గత భద్రత శాఖ ప్రధాన కార్యాలయంపైనా యుద్ధవిమానాలు దాడులుచేశాయి. ప్రతిగా ఇరాన్ సైతం ఇజ్రాయెల్ భూభాగాలపై క్షిపణులను పేలుస్తూ విధ్వంసం సృష్టిస్తోంది. దీంతో ఇరుదేశాల మధ్య ఘర్షణ పతాకస్థాయిలకు చేరుకుంటోంది. తమ ఆయుధ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని అమెరికా తన పశ్చిమాసియా మిత్రదేశాల గడ్డపై వేలాది మంది సైనికులను మోహరించిందని ఇరాన్ విదేశాంగ మంత్రి ఇస్మాయిల్ బాఘై ఆరోపించారు. టెహ్రాన్ సమీపంలోని హకీమియా ప్రాంతంలోని ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్‌కు చెందిన అకాడమీపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. పశ్చిమ ఇరాన్‌లోని క్షిపణి నిల్వ కేంద్రాలపై, క్షిపణి లాంచర్లపై దాడులు చేసింది. టెహ్రాన్ నగరంపై తెల్లవారుజామునే తెగబడింది. ఐదు గంటలకే భారీ పేలుడు శబ్దం వినిపించింది. కెర్మాన్‌షా ప్రాంతంలోని బెల్ ఏహెచ్-1 సూపర్‌కోబ్రాస్ రకం దాడి హెలికాప్టర్లను కుప్పకూల్చామని ఇజ్రాయెల్ తెలిపింది. దాడుల కారణంగా మౌలికసదుపాయాలు దెబ్బతిని ఇరాన్‌లో ఇంటర్నెట్ సేవలు దాదాపు నిలిచిపోయాయని అంతర్జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటిదాకా 585 మంది ప్రాణాలు కోల్పోయారని, 1,300 మంది గాయపడ్డారని 'ఇరాన్ హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్స్' సంస్థ తెలిపింది.

దీటుగా స్పందిస్తున్న ఇరాన్

ఇరాన్ జరిపిన ప్రతిదాడుల్లో ఇప్పటిదాకా 24 మంది చనిపోయారు. బుధవారం తమవైపు దూసుకొచ్చిన 10 క్షిపణులను నేలకూల్చామని ఇజ్రాయెల్ పేర్కొంది. జవాదాబాద్‌లో అత్యాధునిక ఎఫ్-35 యుద్ధవిమానాన్ని ఇరాన్ సేనలు పేల్చేశాయి. దాదాపు రూ.140 కోట్ల విలువైన హెర్మెస్ డ్రోన్‌నూ నేలకూల్చాయి. అత్యంత శక్తివంతమైన ఫతాహ్ హైపర్‌సోనిక్ క్షిపణిని ప్రయోగించామని ఇరాన్ ప్రకటించింది. అయితే తమదేశంలో శుక్రవారం నుంచి ఇప్పటిదాకా 15,871 చోట్ల నిర్మాణాలు, దాదాపు 1,300 వాహనాలు, 1,633 ఆస్తులు నాశనమయ్యాయని ఇజ్రాయెల్ బుధవారం ఒప్పుకుంది. దాడుల నేపథ్యంలో ఇరాన్ కేబినెట్ అధ్యక్షుడు పెజెష్కియాన్ సారథ్యంలో అత్యవసరంగా భేటీ అయ్యింది. ఉపాధ్యక్షుడు మొహమ్మద్ రెజా తదితరులు తాజా పరిస్థితిని అధ్యక్షునికి వివరించారు. ఇరాన్‌పై దాడుల ఉధృతి కొనసాగినాసరే యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని ఆపబోమని, అణుశాస్త్రవేత్తలు నిరాటంకంగా పనిచేస్తున్నారని స్విట్జర్లాండ్‌లోని ఇరాన్ రాయబారి అలీ బహ్రెయినీ ప్రకటించారు. ''ఇన్నిరోజులూ కేవలం హెచ్చరికగా దాడులు చేశాం. ఇజ్రాయెల్ దాడులను అడ్డుకునేందుకే క్షిపణుల్ని ప్రయోగించాం. ఇకపై ఇజ్రాయెల్‌కు బుద్ధిచెప్పేలా దాడులను తీవ్రతరం చేస్తాం'' అని ఇరాన్ ఆర్మీ కమాండర్ ఇన్ చీఫ్ జనరల్ అబ్దుల్ రహీమ్ మౌసావీ ప్రకటించారు.



ఇరాన్‌లోని తబ్రిజ్‌లో మిస్సైళ్ల స్థావరం దాడులకు ముందు



ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైన దృశ్యం

మా జోక్యం ఉండొచ్చు.. ఉండకపోవచ్చు: ట్రంప్

ఇజ్రాయెల్‌కు తోడుగా కయ్యానికి కాలు దువ్వితే అమెరికా అంతుచూస్తామని ఖమేనీ వ్యాఖ్యల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. ''ఇరాన్ యుద్ధంలో నేను జోక్యం చేసుకోవచ్చు. చేసుకోకపోవచ్చు కూడా. నేనేం చేస్తానో ఎవరికీ తెలీదు. ఇరాన్ తన అణ్వాయుధ తయారీ కార్యక్రమానికి స్వస్తిపలికేందుకు ఇప్పుడు కూడా సమయమేం మించిపోలేదు. న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను కొనసాగిస్తూ ఇరాన్ నిప్పుతో చెలగాట మాడుతోంది. మరింత సంక్షోభంలో కూరుకుపోతోంది. ఇరాన్‌ను అడ్డుకునేదాకా దేన్నీ ఆపబోం'' అని ట్రంప్ అన్నారు. లొంగిపోబోమని ఖమేనీ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ తనదైన శైలిలో స్పందించారు. ''లొంగిపోయే ఉద్దేశ్యం లేదా?. అయితే సరే. గుడ్ లక్(శుభాశీస్సులు)'' అని వ్యాఖ్యానించారు.

ఇరాన్‌లో భయానక నిశ్శబ్దం

ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థ చాలా వరకు ధ్వంసంకావడంతో ఎప్పుడు ఎటు నుంచి ఇజ్రాయెల్ క్షిపణులు మీదొచ్చి పడతాయోనన్న భయాలు ఇరాన్ ప్రజల్లో కనిపించాయి. చాలా నగరాలు, పట్టణాల్లో దుకాణాలు, ఆఫీస్‌లు, స్కూళ్లు, కాలేజీలు మూతబడ్డాయి. సురక్షిత ప్రాంతాలకు నిత్యావసర సామగ్రితో వలసవెళ్లేవాళ్లు తప్పితే రోడ్లపై ఇంకెవరూ కనిపించట్లేదు. ఇజ్రాయెల్‌లో కాస్తంత భిన్నమైన వాతావరణం కన్పించింది. ఇరాన్‌ను సుదూరంగా ఉన్న ఇజ్రాయెల్ పట్టణాల్లో పౌరసంచారాన్ని స్థానిక యంత్రాంగం అనుమతించింది. ''మా ఆర్థికవ్యవస్థ మళ్లీ పుంజుకోవడమే ఇరాన్‌పై విజయానికి ప్రబల నిదర్శనం'' అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి 'ఇజ్రాయెల్ కట్జ్' అన్నారు. ఆపరేషన్ రైజింగ్ లయన్ లక్ష్యంగా నెరవేరేదాకా ఇరాన్‌తో ఎలాంటి చర్చలు జరపబోమని స్పష్టం చేశారు.

భారతీయుల తరలింపు కోసం ఆపరేషన్ సింధూ

ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయులను 'ఆపరేషన్ సింధూ' పేరిట తీసుకొస్తామని భారతసర్కార్ బుధవారం ప్రకటించింది. టెహ్రాన్‌లోని కెషవార్జ్ వీధిలోని వసతిగృహంపై ఇజ్రాయెల్ దాడిలో కొందరు భారతీయ వైద్య విద్యార్థులు గాయపడ్డారన్న వార్తల నడుమ కేంద్రం ఈ ఆపరేషన్‌ను చేపట్టింది. ఇరాన్‌లో దాదాపు 4,000 మంది భారతీయులు ఉంటున్నారు. వీరిలో సగం మంది వైద్యవిద్యార్థులే. ఇప్పటికే 110 మందిని ఉత్తర ఇరాన్ గుండా ఆర్మేనియా దేశంలోకి సురక్షితంగా తరలించారు. వీళ్లను ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తీసుకొస్తున్నారు. గురువారం ఉదయంకల్లా ఈ విమానం ఢిల్లీకి చేరుకోనుంది.

లొంగిపోయే ప్రసక్తే లేదు: ఖమేనీ



టెహ్రాన్/ దుబాయ్: ఇరాన్ సుప్రీం లీడర్, 86 ఏళ్ల అయాతొల్లా అలీ ఖమేనీ జాడ తమకు తెల్సిపోయిందని, బేషరతుగా లొంగిపోవాలని, లేదంటే ప్రాణాలు తీస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో ఖమేనీ తొలిసారిగా స్పందించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు మొదలయ్యాక ఖమేనీ బహిరంగ ప్రకటన చేయడం ఇదే తొలిసారి. ''నేనుగానీ, ఇరాన్‌గానీ ఎవరికీ బేషరతుగా లొంగిపోయే ప్రసక్తే లేదు. హఠాత్తుగా తమపై దండెత్తిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొంటాం. చిట్టచివరిదాకా పోరాడతాం'' అని ఖమేనీ ప్రకటించారు. లొంగిపోవాలన్న ట్రంప్ వ్యాఖ్యలపై ఖమేనీ స్పందించారు. ''తెలివితేటలు ఉన్న వాళ్లకు ఇరాన్ దేశ చరిత్ర, మా మొండివైఖరి, దృఢచిత్తం గురించి బాగా తెల్సి ఉంటుంది. ఇరాన్ దేశస్థుడు ఎప్పటికీ లొంగిపోడు. ముఖ్యంగా బెదిరింపు భాషలో ఇరాన్‌తో మాట్లాడితే అస్సలు తలొగ్గదు. ఇప్పటికే మాపై దాడులు చేస్తున్న ఇజ్రాయెల్‌కు అమెరికా జతకూడితే అమెరికా భారీ మూల్యం చెల్లించుకోకతప్పదు. కనీవినీ ఎరుగని రీతిలో అమెరికాకు నష్టం చేకూరుస్తాం. ఇజ్రాయెల్ అనేది ఉగ్ర యూదుల మూక. ఇరాన్ వంటి ఇస్లామిక్ గణతంత్ర రాజ్యంపై శాంతి వచనాలు, యుద్ధ బెదిరింపులు బయటి వ్యక్తులు చేస్తే ఊరుకోం. తరుముకొచ్చిన యుద్ధాన్ని తరిమికొడతాం. శాంతికి, మా దేశానికి వ్యతిరేకంగా నిల్చున్న వాళ్లను ఎదుర్కొంటాం. మా దేశం ఎవరి ముందూ తలవంచదు. అమెరికా చేసే బెదిరింపులకు ఇరాన్ ఎప్పటికీ బెదరదు'' అని ఖమేనీ స్పష్టం చేశారు.

నిండుకుంటున్న ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు

- మరో 12 రోజులు మాత్రమే యుద్ధం కొనసాగించగలం
- ఇజ్రాయెల్ సైనిక వర్గాల ఆందోళన

టెల్ అవీవ్: ఇరాన్‌పై యుద్ధంలో తమపై పైచేయి అవుతోందని, ఇరాన్ గగనతలంపై సంపూర్ణ ఆధిపత్యం సాధించామని ఇజ్రాయెల్ పదేపదే చెప్పుకుంటోంది. కానీ, యుద్ధాన్ని కొనసాగించడానికి కావాల్సిన సాధన సంపత్తి రోజురోజుకీ తరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్ క్షిపణులను నేలకూల్చడానికి అవసరమయ్యే లాంగ్‌రేంజ్ మిస్సైల్ ఇంటర్‌సెప్టర్ల సరఫరా తగ్గిపోతోంది. ఇజ్రాయెల్ వద్ద గగనతల రక్షణ వ్యవస్థలు తగినంతగా లేవని అమెరికాకు చెందిన వాల్‌స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. ఇజ్రాయెల్ సైన్యం శుక్రవారం ఇరాన్‌పై ఆపరేషన్ రైజింగ్ లయన్ ప్రారంభించింది. గత ఆరు రోజులుగా ఇరుదేశాల మధ్య నిరంతరం క్షిపణి దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఇరాన్ సైన్యం ఇజ్రాయెల్‌పై దాదాపు 400 బాలిస్టిక్ మిస్సైళ్లు ప్రయోగించింది. వీటిలో చాలావరకు మిస్సైళ్లను ఇజ్రాయెల్ సైన్యం మధ్యలోనే కూల్చివేసింది. ఇజ్రాయెల్ భూభాగాన్ని తాకగలిగే సామర్థ్యం కలిగిన క్షిపణులు ఇరాన్ వద్ద ఇంకా 1,600 ఉన్నాయి. యుద్ధం ఇలాగే కొనసాగితే వీటిని కూడా ఇజ్రాయెల్‌పై ప్రయోగించే అవకాశం ఉంది. కానీ, వాటన్నింటినీ కూల్చే ఇంటర్‌సెప్టర్లు ఇజ్రాయెల్ వద్ద లేవు. అమెరికా నుంచి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు తక్షణమే అందకపోతే ఇరాన్‌పై యుద్ధం కొనసాగించే పరిస్థితి ఉండదని ఇజ్రాయెల్ రక్షణ రంగ నిపుణులు తేల్చిచెబు తున్నారు. ఇప్పుడున్న సిస్టమ్స్ మరో 10 నుంచి 12 రోజు ల వరకు మాత్రమే సరిపోతాయని అంటున్నారు. అమెరికా ప్రత్యక్ష యుద్ధంలోకి దిగితే ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు.

వార్షిక ఫాస్టాగ్ పాస్ అందుబాటులోకి

- ప్రైవేట్ వాహనదారుల కోసం కొత్త ప్లాన్
- ధర రూ.3,000
- గరిష్టంగా 200 ట్రిప్పులు
- టోల్‌ప్లాజా ఎంట్రీ నుంచి ఎగ్జిట్‌కు ఒక ట్రిప్పుగా పరిగణన
- వివరాలు వెల్లడించిన రహదారుల మంత్రి గడ్కరీ

సాక్షి, న్యూఢిల్లీ: వార్షిక ఫాస్టాగ్ ఆఫర్ కోసం చాన్నాళ్లుగా ఎదురుచూస్తున్న వాణిజ్యయేతర, ప్రైవేట్ వాహనదారుల టోల్‌ప్లాజా కష్టాలు తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త పాస్‌తో ముందుకొచ్చింది. గరిష్టంగా 200 ట్రిప్పులకు అనుమతిస్తూ వార్షిక ఫాస్టాగ్ ఆఫర్‌ను తీసుకొస్తున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం ప్రకటించారు. కార్లు, జీప్‌లు, వ్యాన్ల వంటి వాణిజ్యయేతర ప్రైవేట్ వాహనాలకు మాత్రమే ఈ వార్షిక ఫాస్టాగ్ పాస్ వర్తిస్తుంది. కావాలనుకున్న వాహనదారులు మాత్రమే వార్షిక పాస్‌ను కొనుగోలుచేయాల్సి ఉంటుంది. వార్షిక పాస్ అనేది పూర్తిగా స్వచ్ఛందం. ఒకవేళ ఈపాస్‌ను వాణిజ్య వాహనాలకు ఉపయోగించాలని చూస్తే ముందస్తు సమాచారం లేకుండానే వాళ్ల పాస్‌ను ప్రభుత్వం రద్దు చేయనుంది.



ఎప్పటి నుంచి అమల్లోకి?

ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని ఆగస్టు 15వ తేదీ నుంచి ఈ ఫాస్టాగ్ ఆఫర్‌ను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెస్తారు.

ఎలా వసూలు చేస్తారు?

టోల్‌ప్లాజాను దాటిన ప్రతి ఒక్కసారి ఒక ట్రిప్పుగా లెక్కగడతారు. ఉదాహరణకు మనం ప్రయాణంలో నాలుగు టోల్‌ప్లాజాలను దాటితే నాలుగు ట్రిప్పులు పూర్తయినట్లు లెక్కిస్తారు. ఈ లెక్కన వార్షిక ఫాస్టాగ్ పాస్ అనేది 200 సార్లు మాత్రమే పనిచేస్తుంది. 200 సార్లు పూర్తికాకపోతే ఏడాదంతా ఈ పాస్ పనిచేస్తుంది. ఈ రెండింటితో ఏది ముందుగా ముగిస్తే దానిని ఫాస్టాగ్‌కు తుదిగడువుగా పరిగణిస్తారు. ఉదాహరణకు నవంబర్‌కల్లా 200 ట్రిప్పులు అయిపోతే ఆ ఏడాదికి యాన్యువల్ పాస్ ముగిసినట్లే. మళ్లీ యాన్యువల్ పాస్ కావాలంటే ఆ తర్వాత వెంటనే కొనుగోలు చేసుకోవచ్చు.

ఇప్పటికే పాస్ ఉంటే మళ్లీ కొనాలా?

ఇప్పటికే సాధారణ ఫాస్టాగ్ ఉంటే మళ్లీ కొనాల్సిన అవసరం లేదు. ఒకవేళ వార్షిక ఫాస్టాగ్ పాస్ కొంటే ప్రస్తుతం యాక్టివేషన్‌లో ఉన్న కార్డుకే ఆ ఆఫర్ కొనసాగింపుగా ఉంటుంది. విడిగా కొనాల్సిన పనిలేదు.

ఎక్కడెక్కడ పని చేస్తుంది?

దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జాతీయరహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్ వేలపై ఉన్న టోల్‌ప్లాజాల వద్ద కొత్త పాస్ పనిచేస్తుంది. అయితే రాష్ట్ర రహదారులు(ఎస్‌హెచ్)లు, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక యంత్రాంగాల నిర్వహణలో ఉన్న టోల్‌ప్లాజాల వద్ద మాత్రం అదనంగా వాహనదారులు యూజర్ ఫీజు కట్టాల్సి రావొచ్చు.

ఎక్కడ నుంచి కొనొచ్చు?

రాజ్‌మార్గ్ యాత్రా యాప్‌లో త్వరలో సంబంధిత ఫాస్టాక్ కొనుగోలు లింక్‌ను అందుబాటులోకి తేనున్నారు. భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ), రోడ్డు రవాణా, జాతీయరహదారుల మంత్రిత్వ శాఖ(ఎంఓఆర్‌టీహెచ్) అధికారిక వెబ్‌సైట్లలోనూ ఈ లింక్‌ను పెట్టనున్నారు.

కొత్త పాస్ ఖచ్చితంగా తీసుకోవాలా?

ప్రస్తుతమున్న, ఇప్పటికే అందుబాటులో ఉన్న పాస్‌ల వ్యవస్థ యథావిధిగా కొనసాగుతుంది. వార్షిక పాస్ తీసుకోవడమనేది వాహనదారుల స్వచ్ఛంద నిర్ణయం. పాత ఫాస్టాగ్‌లు సైతం కొనసాగుతాయి.

ఉగ్రవాదులను పెంచిపోషించే దేశాలకు

నిధులు, రుణాలా..?

- ఉగ్రవాద మద్దతుదారులను, బాధితులను ఒకేలా పరిగణించడం ఏమిటి?
- పాకిస్తాన్ ఉగ్రవాద ఉత్పత్తి కేంద్రంగా మారింది
- జీ7 సదస్సులో ప్రధాని మోదీ

కననాస్కిస్: తమ పొరుగుదేశం పాకిస్తాన్ ఉగ్రవాద ఉత్పత్తి కేంద్రంగా మారిపోయిందని భారత ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. పాక్ పాలకులు ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్నారని ధ్వజమెత్తారు. ఉగ్రవాదం విసురుతున్న సవాళ్లపై స్పందించకుండా కళ్లు మూసుకొని ఉంటే మానవత్వానికి ద్రోహం చేయడమే అవుతుందని తేల్చిచెప్పారు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం కెనడాలో జీ7 కూటమి సదస్సులో 'ఇంధన భద్రత' అంశంపై ప్రధాని మోదీ ప్రసంగించారు. సీమాంతర ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతిస్తున్న పాకిస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రవాద దాడి ప్రతి భారతీయుడి ఆత్మ, గుర్తింపు, గౌరవంపై జరిగిన ప్రత్యక్ష దాడేనని తేల్చిచెప్పారు. ఉగ్రవాదానికి మద్దతిచ్చే ఏ దేశమైనా తగిన మూల్యం చెల్లించక తప్పదని పేర్కొన్నారు. ముష్కర మూకలను అంతం చేసే విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు తావు ఉండొద్దని ఉద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని పోషకులను, ఉగ్రవాద బాధితులను ఒకే గాటన కట్టడం, ఒకేలా పరిగణించడం ఏమిటని నిలదీశారు. ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారంటే...

నిజంగా నిజాయతీగా పని చేస్తున్నామా?

''ఉగ్రవాదం మానవత్వానికి బద్ధశత్రువు. ప్రజాస్వామ్య విలువలు పాటించే అన్ని దేశాలనూ ఉగ్రవాదం వ్యతిరేకిస్తోంది. ఉగ్రవాద భూతాన్ని సమూలంగా నాశనం చేయాలంటే ప్రపంచ దేశాలన్నీ కలిసి కట్టుగా పనిచేయాలి. అన్ని దేశాలు ఐక్యంగా ఉంటేనే అనుకున్నది సాధించగలం. దురదృష్టవశాత్తూ మా పొరుగుదేశం ఉగ్రవాదులను ఉత్పత్తి చేసే కర్మాగారంగా మారిపోయింది. ప్రపంచ శాంతి, సౌభాగ్యాల కోసం.. ఉగ్రవాదులకు అండగా నిలిచే దేశాలను శిక్షించాలి. అలాంటి దేశాలను జవాబుదారీగా మార్చాలి. కానీ, వాస్తవ పరిస్థితి మరోలా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాలకు నిధులు, రుణాలు ఇచ్చి సత్కరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఉగ్రవాదంపై పోరాటంలో మనం నిజంగా నిజాయతీగా పని చేస్తున్నామా? ఉగ్రవాదం మన ఇంటి తలుపు తట్టినప్పుడు మాత్రమే ఉగ్రవాదానికి అసలైన అర్థాన్ని తెలుసుకుంటామా? ఉగ్రవాదులను ఎగదోస్తున్న వారిని, ఉగ్రవాద బాధితులను ఒకేలా చూడడం ఏమిటి? మన అంతర్జాతీయ సంస్థలు విశ్వసనీయత కోల్పోతున్నాయి. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో నిర్ణయాత్మక చర్యలు అవసరం.

ఇంధన భద్రత మన బాధ్యత

భవిష్యత్తు తరాల కోసం ఇంధన భద్రత సాధించడమే ఇప్పుడు మన ముందున్న అతిపెద్ద సవాలు. ఇంధన భద్రత సాధించడం కేవలం ప్రాధాన్యత మాత్రమే కాదు.. పౌరుల పట్ల మన బాధ్యత కూడా. ఇంధనం రంగంలో ప్రపంచ దేశాలు పరస్పరం సహకరించుకోవాలి. కలిసి పనిచేయాలి. 'నేనొక్కడినే కాదు.. మనమంతా' అనే స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి. ప్రపంచంలో ఎక్కడైనా సంక్షోభాలు, అనిశ్చిత పరిస్థితులు ఏర్పడినప్పుడు ఇంధన సరఫరా లేక గ్లోబల్ సౌత్ దేశాలు నష్టపోవాల్సి వస్తోంది. వాటిపై అధిక భారం పడుతోంది. ఆయా దేశాల్లో ఆహార, ఇంధన, ఎరువులతోపాటు ఆర్థిక సంక్షోభాలు తలెత్తుతున్నాయి. తయారీ, రవాణా రంగాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. ఇలాంటి సమస్యల పరిష్కారానికి ఇంధన రంగంలో స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాం. కృత్రిమ మేధ(ఏఐ)ను ప్రపంచ సౌభాగ్యం కోసం ఒక శక్తిగా మార్చాలి. డీప్‌ఫేక్స్ పెద్ద ముప్పుగా మారుతున్నాయి. దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ఏఐతో సృష్టించే కంటెంట్‌లో వాటర్‌మార్క్ ఉండేలా చర్యలు తీసుకోవాలి'' అని ప్రధాని మోదీ సూచించారు.

జీ7 దేశాల అధినేతలతో మోదీ చర్చలు

కెనడాలో జీ7 సదస్సు సందర్భంగా కూటమి దేశాల అధినేతలతో ప్రధాని మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టెక్నాలజీ, వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, ఉగ్రవాదంపై పోరాటంతోపాటు ప్రపంచానికి ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారంపై చర్చించారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే-మ్యూంగ్, ఫ్రాన్స్ అధినేత ఇమ్మానుయేల్ మాక్రాన్, బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్, ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ, మెక్సికో ప్రెసిడెంట్ క్లాడియా షీన్‌బామ్ పార్డో, జర్మనీ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇన్సియో లులా డసిల్వా, కెనడా ప్రధాని మార్క్ కార్నీ, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా తదితరులతో మోదీ భేటీ అయ్యారు.

క్రొయేషియా ప్రధాని ప్లెంకోవిచ్‌తో చర్చలు

ప్రధాని మోదీ కెనడా పర్యటన ముగించుకొని బుధవారం క్రొయేషియా చేరుకున్నారు. జాగ్రెబ్ ఎయిర్‌పోర్టులో క్రొయేషియా ప్రధానమంత్రి ఆండ్రెజ్ ప్లెంకోవిచ్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. క్రొయేషియాలో పర్యటిస్తున్న మొట్టమొదటి భారత ప్రధానమంత్రి మోదీయే కావడం విశేషం.



కెనడా ప్రధాని మార్క్ కార్నీతో మోదీ చర్చలు



జాగ్రెబ్ విమానాశ్రయంలో మోదీకి క్రొయేషియా ప్రధాని ప్లెంకోవిచ్ స్వాగతం

ట్విట్టర్‌లో పోరాటం సాగిస్తున్నారా?

కెనడాలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్, ప్రధాని మోదీ మధ్య సరదా సంభాషణ జరిగింది. ''ఈరోజుల్లో మీరు ట్విట్టర్‌లో పోరాటం సాగిస్తున్నారా? ట్విట్టర్‌లో మీరు చాలా చురుగ్గా ఉంటున్నారు'' అని మాక్రాన్‌ను ఉద్దేశించి మోదీ వ్యాఖ్యానించడంతో అక్కడ నవ్వులు విరిశాయి. మాక్రాన్, మోదీ సైతం బిగ్గరగా నవ్వేశారు. ఇటీవల వియత్నాం పర్యటనకు వెళ్లినప్పుడు విమానం దిగే సమయంలో మాక్రాన్‌ను ఆయన భార్య బ్రిగెట్టా నెట్టివేసినట్లు వీడియో వైరల్ అయిన సంగతి తెలిసిందే. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ.. ఇలాంటివి జరిగేటప్పుడు తలుపులు మూసి ఉన్నాయో లేదో చూసుకోవాలి అని మాక్రాన్‌కు సలహా ఇచ్చారు. ఈ ఉదంతాన్ని గుర్తుచేస్తూ మోదీ సరదాగా వ్యాఖ్యానించారు. మోదీ-మాక్రాన్ సంభాషణ పట్ల సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయి. మోదీ నవ్వుతూ మాట్లాతూనే మాక్రాన్‌కు గట్టిగా చురక అంటించారని నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు.

ఐ లవ్ పాకిస్తాన్

- భారత్, పాక్ యుద్ధాన్ని నేనే ఆపా
- మోదీతో మాట్లాడిన తర్వాత ట్రంప్ మళ్లీ పాత పాట

న్యూయార్క్/వాషింగ్టన్: భారత్, పాకిస్తాన్ పరస్పర సైనిక చర్యల తర్వాత కాల్పుల విరమణలో అమెరికా జోక్యం లేదని స్వయంగా ప్రధాని మోదీ తనకు సవివరంగా స్పష్టంచేసినాసరే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైఖరిలో వీసమెత్తయినా మార్పురాలేదు. పైగా పాకిస్తాన్ అంటే ఇష్టమని అమెరికా మీడియా సాక్షిగా చెప్పుకొచ్చారు. భారత్, పాక్ యుద్ధాన్ని తానే ఆపానని మరోసారి ప్రకటించారు. బుధవారం వైట్‌హౌస్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ''ఆ యుద్ధాన్ని ఆపింది నేనే. నాకు పాక్ అంటే ఇష్టం. మోదీ నిజంగా ఒక అద్భుతమైన వ్యక్తి. ఆయనతో నిన్న రాత్రే మాట్లాడా. భారత్‌తో వాణిజ్యం ఒప్పందం కుదుర్చుకోబోతున్నాం'' అని ట్రంప్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం శ్వేతసౌధంలోని కేబినెట్ రూమ్‌లో పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు ట్రంప్ విందు ఇవ్వనున్నారు. ''పాక్ వైపు నుంచి మునీర్, భారత్‌వైపు నుంచి మోదీ అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు. అణ్వస్త్ర దేశాలైన పాక్, భారత్ మధ్య యుద్ధం ఆపింది నేనేనని మరోసారి గుర్తుచేస్తున్నా. నావరకు ఇది ఖచ్చితంగా లిఖించాల్సిన విషయం. ఎందుకంటే ఏకంగా రెండు ప్రధాన అణ్వస్త్ర దేశాల మధ్య సమరానికి ముగింపు పలికా'' అని ట్రంప్ అన్నారు.

15 రోజుల్లోగా ఓటర్ ఐడీ కార్డుల డెలివరీ

న్యూఢిల్లీ: ఎలక్టర్ ఫొటో ఐడెంటిటీ కార్డు(ఎపిక్)ను ఓటర్లకు చేరవేసే విషయంలో ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. 15 రోజుల్లోగానే ఈ కార్డులు సంబంధిత ఓటర్లకు చేరేలా చర్యలు తీసుకోనున్నట్లు బుధవారం వెల్లడించింది. ప్రస్తుతం ఈ కార్డుల డెలివరీకి నెల రోజులకుపైగా సమయం పడుతోంది. ఇప్పుడు ఈ సమయం సగానికి తగ్గిపోనుంది. ఇందుకోసం నూతన ప్రామాణిక నియమావళిని ఎన్నికల సంఘం రూపొందించింది. కొత్తగా ఓటర్‌గా పేరు నమోదు చేసుకున్న తర్వాత లేదా ప్రస్తుతం ఉన్న కార్డులో మార్పులు చేర్పులు చేసుకున్న తర్వాత 15 రోజుల్లోగా నూతన ఫొటో గుర్తింపు కార్డు ఓటర్లకు అందనుంది.

'భారత ప్రామాణిక సమయమే ఉపయోగించాలి'

న్యూఢిల్లీ: దేశంలో న్యాయ, వాణిజ్య, డిజిటల్, పరిపాలనా వ్యవహారాలకు ఇండియన్ స్టాండర్డ్ టైమ్‌ను(ఐఎస్‌టీ) ఉపయోగించడాన్ని తప్పనిసరి చేస్తున్నట్లు కేంద్ర ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ బుధవారం చెప్పారు. ప్రస్తుతం కొన్ని రంగాల్లో, కొన్ని సంస్థల్లో విదేశీ ప్రామాణిక టైమ్‌ను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల పలు ఇబ్బందులు తలెత్తుతున్నట్లు వెల్లడించారు. అందుకే ఐఎస్‌టీని తప్పనిసరి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇండియన్ స్టాండర్డ్ టైమ్ వాడకంతో మరింత భద్రతతో కూడిన డిజిటల్ లావాదేవీలు, కచ్చితమైన బిల్లింగ్, సైబర్ నేరాల ముప్పును తగ్గించడం వంటివి సాధ్యమవుతాయని మంత్రి వివరించారు.

సాక్షి
హైదరాబాద్
గురువారం । 19 । జూన్ । 2025



నకిలీ పట్టాలతో టోకరా

డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో నకిలీ పట్టాలు అంటగట్టి పలువురి నుంచి రూ.42.35 లక్షలు వసూలు చేసిన నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. -8లో



ఒత్తిడిని జయించడం సాధ్యమే..

ఒత్తిడి పెరుగుతోందని భయపడాల్సిన అవసరం లేదంటున్నారు మానసిక నిపుణులు. దానిని ఎదుర్కొనడంపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/25.0

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 34, కనిష్టంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

బేగంపేటలో ఆగమాగం!

వాహనాలు ముందుకు కదిలితే ఒట్టు

- ప్రధాన రహదారిలో ట్రాఫికర్‌ తీరేదెన్నడో
- ప్రస్తుత అవసరాలకు సరిపోని ఫ్లైఓవర్లు
- ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధి తప్పనిసరి



బేగంపేటలో నిలిచిపోయిన ట్రాఫిక్ (ఫైల్)

సనత్‌నగర్: బేగంపేట ప్రధాన రహదారి అంటే వీఐపీ, వీవీఐపీల రాకపోకలకు ప్రధాన రాస్తా. ఒక్క నిమిషం ట్రాఫిక్ ఆగిందంటే.. క్షణాల్లో వాహనాలు బారులుదీరుతాయి. దీనికి కారణం వాహన విస్ఫోటానికి తగ్గట్లుగా రహదారుల అభివృద్ధి జరగం లేదు. రోడ్ల మీదకు వచ్చే వాహనాల సంఖ్య అంతకంతకూ పెరుగుతుండే తప్ప రహదారుల విస్తరణ మాత్రం అలాగే ఉంటోంది. ఫలితంగా నత్తకు నడక నేర్పిస్తున్నట్లుగా తయారైంది వాహనదారుల ప్రయాణం. ఇక చినుకు పడిందంటే చాలు.. ట్రాఫిక్ చిక్కులు చుక్కలు చూపిస్తాయి. ఈ పరిస్థితి బేగంపేట ప్రధాన రహదారిలో సర్వసాధారణంగా మారింది.

వీఐపీలు.. వీవీఐపీలతో..

- బేగంపేట రహదారి అంటేనే వాహనదారులు వామ్మో అనాల్సిందే. సికింద్రాబాద్, హైదరాబాద్‌లను కలిపే బేగంపేట ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య దినదిన గండం నూరేళ్లాయుష్షుగా మారింది. ప్రధానంగా ఢిల్లీతో పాటు ఏపీ, ఇతర రాష్ట్రాల నుంచి రాకపోకలు సాగించే వీవీఐపీలు, వీఐపీలు ఎక్కువగా బేగంపేట విమానాశ్రయాన్నే ఉపయోగిస్తుంటారు. ఈ క్రమంలో సాధారణంగానే ఈ రహదారి రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఇక వీవీఐపీలు, వీఐపీలు వస్తున్నారంటే ముందుగానే ట్రాఫిక్‌ను ఆపేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఒక్క నిమిషం ట్రాఫిక్ ఆగినా చాంతాడంత వాహనాల క్యూ నిలిచిపోతుంది. ఈ ప్రభావం కొన్ని గంటల పాటు ఉంటుంది. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి పోలీసులు కూడా నానా కష్టాలు పడాల్సిందే.
- వర్షాకాలంలో అయితే ఈ దారిలో ప్రయాణం అంటే సాహసంతో కూడుకున్నదే. ఎందుకంటే చినుకు పడిందంటే చాలు..కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచి నరకం అంటే ఏమిటో వాహనదారులు చవిచూస్తున్నారు. అటు సికింద్రాబాద్ వైపు నుంచి బేగంపేట మీదుగా అమీర్‌పేట, పంజగుట్ట, బల్కంపేట, సనత్‌నగర్ వైపు వెళ్ళే వాహనాలు, ఇటు సికింద్రాబాద్ వైపు వెళ్లే వాహనాలతో ఎప్పుడు చూసినా రద్దీగానే కనిపిస్తుంది. ఈ రహదారిలో ఫ్లైఓవర్లు ఉన్నా ప్రస్తుత రవాణా అవసరాలను తీర్చలేక పోతున్నాయి.
- ముఖ్యంగా బేగంపేట పీ అండ్ టీ ఫ్లైఓవర్ వద్ద, రసూల్ పురా మెట్రో స్టేషన్ వద్ద ఒకవైపు మెట్రో పిల్లర్లు రోడ్డు మధ్యలో ఉండడం, మరో వైపు బాటిల్ నెక్‌ను తలపించేలా ఉండడంతో ఇక్కడకు వచ్చేసరికి వాహనాల వేగం ఒక్కసారిగా కుంటుపడుతుంది. దీంతో ఆ ప్రభావంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయే పరిస్థితులకు దారితీస్తోంది. ఇక ఏదైనా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే మాత్రం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

ప్రత్యామ్నాయ మార్గాలే శరణ్యం..

వాహనదారుల అవసరాలను ఇక్కడ ఫ్లైఓవర్లు, రహదారులు తీర్చలేకపోతున్నాయి. ఈ క్రమంలో పలు ప్రత్యామ్నాయ రహదారులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రసూల్‌పురా చౌరస్తా నుంచి పాటిగడ్డ మీదుగా గతంలో రోడ్డును అభివృద్ధి చేయాలని నిర్ణయించినా అది ప్రతిపాదనలకే పరిమితమైందే తప్ప పట్టాలెక్కలేదు. ఈ మార్గంలో ఫ్లైఓవర్ నిర్మించడం ద్వారా పంజగుట్ట వైపు వెళ్లే వాహనదారులకు సులువవడంతో పాటు బేగంపేట రహదారిపై ఒత్తిడి తగ్గుతుంది. ఇక్కడి ఫ్లైఓవర్ నిర్మాణ ప్రతిపాదనపై ఇటీవల జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ఈ ప్రాంతంలో పర్యటించి ఈ ప్రాజెక్టు అమలుపై దృష్టిసారించడం ముదావహం. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే బాగుంటుందని వాహనదారులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



'శిల్పా' ఫ్లై ఓవర్‌కు పీజేఆర్ పేరు

28న ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: కొండాపూర్ నుంచి గచ్చిబౌలి వరకు ట్రాఫిక్ చిక్కులు తొలగించేందుకు నిర్మించిన శిల్పా లేఔట్-2 ఫ్లై ఓ వర్‌ను ఈ నెల 28న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి దివంగత పి.జనార్దన్‌రెడ్డి (పీజేఆర్) జ్ఞాపకార్థం ఈ ఫ్లైఓవర్‌కు పీజేఆర్ పేరు పెట్టాలని సీఎం సూచించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవానికి ముందే పెయింటింగ్, సుందరీకరణలతో సహా అన్ని పనులను పూర్తి చేయాలని మేయర్ విజయలక్ష్మి జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను ఆదేశించారు. నగర పౌరులకు ప్రయోజనం చేకూర్చే నాణ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అందించడానికి జీహెచ్ఎంసీ కట్టుబడి ఉందని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

నయా కలెక్టర్.. పెట్టండి నజర్!

ప్రభుత్వ జాగాల్లో అక్రమార్కుల పాగా

- గ్రేటర్‌లో మాయమవుతున్న ఖాళీ స్థలాలు
- సైన్ బోర్డులు పెట్టినా మూణ్నాళ్ల ముచ్చటే..
- కబ్జాదారులకు క్షేత్రస్థాయిలో అండదండలు
- రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యమే కారణం
- కఠినంగా వ్యవహరించాలని హరిచందనకు పౌరుల వినతి



సాక్షి, సిటీబ్యూరో:

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో భూమి బంగారమే. గజం స్థలం విలువ తులం బంగారానికి కంటే అధికమే. ఇప్పటివరకు రెవెన్యూ యంత్రాంగం ఉదాసీన వైఖరి, క్షేత్రస్థాయిలో తహసీల్ అధికారులు, సిబ్బంది అండదండలతో ప్రభుత్వ ఖాళీ స్థలాలు కనుమరుగవుతూనే ఉన్నాయి. నగరంలో రెవెన్యూ అంటే ప్రభుత్వ స్థలాల పరిరక్షణే ప్రధానంగా పని చేయాల్సి ఉంటుంది. కానీ.. కంచే చేను మేసిన విధంగా రెవెన్యూ యంత్రాంగం పనితీరు తయారైంది. ఇటీవల కొత్తగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన యువ ఐఏఎస్ అధికారిణి హరిచందన దాసరి.. సర్కారు స్థలాల పరిరక్షణపై దృష్టి సారించాల్సిన అవసరముందని నగర పౌరులు ఆశిస్తున్నారు. అందరి మాదిరిగానే కేవలం సమావేశాలు, ఆదేశాలకు పరిమితమైతే మాత్రం.. సర్కారు స్థలాల పరిరక్షణ హుళక్కే అన్న చందంగా మారుతుంది. కబ్జాదారులపై ఆమె కఠిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉంది.

ప్రభుత్వ భూముల్లో పాగా..

నగరంలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్రమార్కులు దర్జాగా పాగా వేస్తున్నారు. ప్రభుత్వ స్థలం అంటూ సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నా.. వాటిని సైతం తొలగిస్తూ దర్జాగా తొలగించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఖాళీ స్థలాలపై నిర్మాణాలు వెలసిన తర్వాత ఫిర్యాదులు, ఒత్తిళ్లు వస్తే గానీ స్థానిక రెవెన్యూ యంత్రాంగం స్పందించక పోవడం నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో సర్కారు స్థలాల్లో వెలుస్తున్న అక్రమ కట్టడాలపై చర్యలకు ఉపక్రమించేలోపు.. అవి కోర్టు వివాదాల్లో చిక్కుకోవడం సర్వసాధారణంగా తయారైంది. ఇలా కోర్టు కేసుల్లో చిక్కుకున్న వందల కోట్ల రూపాయల విలువైన భూములపై సమగ్ర ఆధారాలు, వాదనలు లేక ఏళ్ల తరబడి పెండింగ్‌లో మగ్గడం షరామాములుగా మారింది. కొన్ని కేసులకు ఏళ్ల తరబడి కౌంటర్ దాఖలు కాని పరిస్థితి కూడా లేకపోలేదన్న ఆరోపణలు వినపిస్తున్నాయి. రెవెన్యూ యంత్రాంగం వద్ద స్థలాలకు సంబంధించిన సమగ్ర ఆధారాలు లేని కారణంగా క్రమంగా అక్రమ కట్టడాలు సక్రమ కట్టడాల జాబితాలో చేరిపోతున్నాయి.

ఇదీ పరిస్థితి

- హైదరాబాద్ జిల్లా రెవెన్యూ పరిధిలో సుమారు 16 మండలాలు ఉన్నాయి. పదేళ్ల క్రితం వరకు ల్యాండ్ బ్యాంక్‌లో 1,138 పార్శిల్స్ ఉండగా ప్రస్తుతం వాటి 1075 పార్శిల్స్‌కు చేరినట్లు అధికార గణాంకలు స్పష్టం చేస్తున్నా.. వాస్తవ పరిస్థితిలో పార్శిల్స్ మరింత తగ్గినట్లు తెలుస్తోంది. మొత్తమ్మీద 890 ల్యాండ్ పార్శిల్స్‌లో ఎలాంటి వివాదాలు లేకుండా 40,66,914.08 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ స్థలం ఉంది. మిగతా పార్శిల్స్‌లో సుమారు 11,45,334.95 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ స్థలం ఆక్రమితకు గురైనట్లు తెలుస్తోంది. సుమారు 169 పార్శిల్స్‌లోని దాదాపు 11,93,595.12 చదరపు గజాల విస్తీర్ణ గల ఖాళీ స్థలంతోపాటు 445098.64 చదరపు గజాల ఆక్రమిత భూమి కోర్టు కేసుల్లో ఉనట్లు రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

కలెక్టర్లు మారినప్పుడల్లా..

జిల్లా కలెక్టర్ మారి కొత్త వచ్చినవారు సర్కారు స్థలాలపై దృష్టి సారించడం.. పరిరక్షణకు పలు చర్యలు చేపట్టినా.. క్షేత్ర స్థాయిలో అమలు మూణ్నాళ్ల ముచ్చటగానే తయారవుతోంది. ఆరేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ యోగితా రాణా ప్రత్యేకంగా ల్యాండ్ బ్యాంక్ యాప్ రూపకల్పన చేసి ప్రభుత్వ స్థలాలకు కంచె, సైన్ బోర్డుల ఏర్పాటు, ఆన్‌లైన్ మానిటరింగ్, ఫొటోలు తీసి వెబ్‌సైట్‌లో భద్రపర్చడం లాంటి చర్యలు చేపట్టారు. వీఆర్వోలకు బాధ్యతలు అప్పగించి ప్రతిరోజూ భూములపై పర్యవేక్షణతో పాటు పక్షం రోజులకోసారి తనిఖీ చేసి తగిన సమాచారాన్ని సంబంధిత తహసీల్దార్, భూ పరిరక్షణ అధికారులకు అందించేలా కసరత్తు చేశారు.

- యోగితా రాణా బదిలీ తర్వాత ల్యాండ్ బ్యాంక్ యాప్ అమలు మూలకుపడింది. ఆరు నెలల క్రితం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ల్యాండ్ బ్యాంక్ యాప్‌ను పునరుద్ధరించి భూముల వివరాల అప్‌డేట్ ప్రక్రియతో పాటు రక్షణ కోసం చర్యలకు ఉపక్రమించినా.. ఆచరణలో ముందుకు సాగలేదు.

తలకు కవర్ చుట్టుకుని..

హీలియం గ్యాస్ పీల్చుకుని..

యువ చార్టెడ్ అకౌంటెంట్ బలవన్మరణం



ఆత్మహత్యకు ఉపయోగించిన హీలియం గ్యాస్ సిలిండర్



సురేష్ రెడ్డి (ఫైల్)

గచ్చిబౌలి: బాధ, నొప్పి లేకుండా చనిపోవడం ఎలా అని యూ ట్యూబ్‌లో శోధించాడు. హీలియం గ్యాస్‌ను ఎంచుకున్నాడు. తలకు ప్లాస్టిక్ కవర్ చుట్టుకుని.. హీలియం గ్యాస్ పీల్చుకుని ఓ యువ చార్టెడ్ అకౌంటెంట్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గచ్చిబౌలి పీఎస్ పరిధిలోని రాజ రాజేశ్వరీనగర్‌లోని ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజశేఖర్ చెప్పిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం వాడి గ్రామానికి చెందిన నిర్మల సురేష్ రెడ్డి (28) నగరంలో చార్టెడ్ అకౌంటెంట్. మణికొండలోని తన సోదరుడు అజయ్, స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 16న బంధువుల వద్దకు అంటూ బయటికి వెళ్లాడు. సాయంత్రం రాజ రాజేశ్వరీనగర్‌లోని ఎస్‌వీ సెరెనిటీ అపార్ట్‌మెంట్‌లో గదిని అద్దెకు తీసుకున్నాడు. గదిలోకి వెళ్లిన కొద్ది సేపటికే బయటకు వెళ్లి హీలియం సిలిండర్ తీసుకొని ఎవరి కంటపడకుండా లిఫ్ట్ ద్వారా ఫ్లాట్‌లోకి వెళ్లాడు. మంగళవారం రాత్రి తలకు ప్లాస్టిక్ కవర్ చుట్టుకుని, హీలియం గ్యాస్ సిలిండర్ పైపును కవర్‌లోకి పెట్టి బయటి నుంచి ఆక్సిజన్ రాకుండా ప్లాస్టర్లు వేశాడు. ఆ తర్వాత సిలిండర్‌ను ఆన్ చేశాడు. హీలియం గ్యాస్ పీల్చుతూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హీలియం గ్యాస్ పీల్చడంతో సురేష్ శరీరం నలుపు రంగులోకి మారింది. ఉదయం గది శుభ్రం చేసేందుకు వాచ్‌మన్ వెళ్లగా స్పందించలేదు. అనుమానం వచ్చి డోర్ పగులగొట్టి చూడగా చనిపోయి ఉన్నాడు. చార్టెడ్ అకౌంట్ చేయడం ఇష్టం లేదని, ఉద్యోగంలో ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సురేష్‌రెడ్డి తన డైరీలో రాసుకున్నాడు. మానసిక ఒత్తిడితోనే సురేష్‌రెడ్డి బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

పిల్లలూ.. బాగున్నారా?

అంగన్‌వాడీ కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- ఎగ్ బిర్యానీ రుచి చూసిన హరిచందన



కలెక్టర్‌కు గులాబీ ఇస్తున్న చిన్నారి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హరిచందన దాసరి.. విద్య, వైద్యంపై దృష్టి సారించారు. రెండు రోజులుగా క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్తీ దవాఖానాల ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాటి పనితీరుతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పరిశీలిస్తూ తగిన ఆదేశాలు జారీ చేస్తున్నారు. బుధవారం నగరంలోని ఎంజీనగర్ లోని మురాద్ నగర్, చాచా నెహ్రూ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంధుల హాస్టల్, బస్తీ దవాఖానాలను సందర్శించారు. తొలుత అంగన్‌వాడీ కేంద్రం పాఠశాలను సందర్శించి రిజిస్టర్లు, మెనూ ప్రకారం అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. అంగన్‌వాడీ పిల్లలు కలెక్టర్‌కు గులాబీ పుష్పాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం పిల్లలూ.. బాగున్నారా? అని ఆమె అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజనంలో భాగంగా అందిస్తున్న ఎగ్ బిర్యానీ ఆమె రుచి చూసి భేషుగ్గా ఉందన్నారు. పిల్లలకు మెనూ ప్రకారం వారంలో రెండు రోజులు ఎగ్ బిర్యానీ అందించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లను పెంచాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. తదుపరి అంధుల హాస్టల్ కేంద్రంతో పాటు బస్తీ దవాఖానాను సందర్శించారు. కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, సీడీపీఓ రేణుక, వార్డెన్ చిరంజీవి, హెచ్‌ఎంలు అబ్దుల్ సాజిద్, కార్తీక్ ఉన్నారు.

బయోవేస్ట్ టు సీఎన్జీ

త్వరలో అందుబాటులోకి మరో ప్లాంట్

- సీఎస్సార్ నిధులతో ఖైథలాపూర్‌లో..

సాక్షి, సిటీబ్యూరో: వ్యర్థం నుంచి అర్థం సృష్టించే చర్యల్లో భాగంగా బయో వేస్ట్ నుంచి కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) ఉత్పత్తి చేసే మరో ప్లాంట్ త్వరలో వినియోగంలోకి రానుంది. ప్లాంట్ ఏర్పాటు సైతం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) నిధులతో జరగడం విశేషం. కూకట్‌పల్లి జోన్‌లోని బాలానగర్ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) సీఎస్సార్ కింద అందిస్తున్న నిధులతో ఖైథలాపూర్‌లోని చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో జీహెచ్ఎంసీ ఈ ప్లాంట్‌ను నిర్మించింది. ఆగస్టు 15 నాటికి పనులు పూర్తి కానున్నాయి. సెప్టెంబర్ 15 నుంచి అక్కడ ఉత్పత్తయ్యే సీఎన్‌జీ వాహనాలకు వినియోగించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. చెత్త రవాణా కేంద్రానికి వచ్చే చెత్త నుంచి వేరుచేసే 200–300 మెట్రిక్ టన్నుల మేర బయో వేస్ట్‌ను సీఎన్జీ ఉత్పత్తికి వినియోగించనున్నారు. తద్వారా జీహెచ్ఎంసీకి చెత్త నిర్వహణ భారం కూడా తగ్గుతుందని అధికారులు పేర్కొన్నారు.

నిత్యం 20 టన్నులు..

ఈ ప్లాంట్ ద్వారా రోజుకు 20 టన్నుల బయోగ్యాస్ ఉత్పత్తి అవుతుంది. తొలుత రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేసినప్పటికీ, వ్యయం రూ.5.06 కోట్లకు పెరిగింది. ప్లాంట్‌కు సంబంధించిన ఆర్‌సీసీ డైజెస్టర్‌ను తొలుత భూమి లోపల నిర్మించాలనుకున్నారు. నేల లూజ్‌గా ఉండటం తదితర ఇబ్బందులు తలెత్తనుండటంతో భూ ఉపరితలంపైనే నిర్మించారు. క్షేత్ర స్థాయి పనుల్ని పరిశీలించిన హెచ్ఏఎల్ ప్రతినిధులు అదనపు వ్యయాన్ని భరించేందుకూ అంగీకరించినట్లు అధికారులు తెలిపారు.

నెల రోజుల పరిశీలన అనంతరం..

పది టన్నుల సామర్థ్యంతో రెండు డైజెస్టర్లు, మిక్సింగ్ పిట్స్, బయో ఫర్టిలైజర్ సామగ్రి, బయోగ్యాస్ బెలూన్‌తో సహా ప్రాజెక్టుకు సంబంధించిన ఇతరత్రా పనులు పూర్తయ్యాయి. ఇతరత్రా పరికరాల అమరిక, స్కాడా సాఫ్ట్‌వేర్‌తో సహా మిగతా పనులన్నీ ఆగస్టు 15 వరకు పూర్తి చేసే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అప్పటి నుంచే ఉత్పత్తిని లాంఛనంగా ప్రారంభించినప్పటికీ, నెలరోజుల పరిశీలన అనంతరం సెప్టెంబర్ 15 నుంచి వాహనాలకు ఇంధనంగా వినియోగించనున్నారు.

స్వచ్ఛ ఆటోలకు ఉచిత పంపిణీ..

ప్లాంట్ ద్వారా ఉత్పత్తయ్యే సీఎన్‌జీని నగరంలో ఇంటింటి నుంచి చెత్తను సమీపంలోని చెత్త రవాణా కేంద్రాలకు రవాణా చేస్తున్న స్వచ్ఛ ఆటోలకు ఉచితంగా పంపిణీ చేయాలని ఒప్పందంలో పేర్కొన్నారు. సీఎన్‌జీ ఉత్పత్తి ప్రక్రియలో చివరకు మిగిలే ఎరువును జీహెచ్ఎంసీ నర్సరీల్లో వినియోగించడంతో పాటు కోరుకునే ప్రజలకు, రైతులకు ఉచితంగా పంపిణీ చేయాలని హెచ్ఏఎల్ కోరింది. సామాజిక అడవుల్ని, వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఇది ఉపకరిస్తుందని పేర్కొంది.

ఇప్పటికే..

జవహర్‌నగర్‌లోని సైంటిఫిక్ ల్యాండ్‌ఫిల్ నుంచి విద్యుత్ ఉత్పత్తితో పాటు, సీఎన్‌జీ ఉత్పత్తి కూడా ప్రారంభించడం తెలిసిందే. సిలిండర్‌లలో నింపిన సీఎన్‌జీని వాహన ఇంధనంగా వినియోగిస్తున్నారు.

తుది మెరుగుల్లో సీఎన్జీ ప్లాంట్



హైడ్రా కమిషనర్ ఫీల్డ్ విజిట్

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ



పోచారం సంస్కృతి టౌన్‌షిప్‌లో రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో/పోచారం: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి ఆయన క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. పోచారం మున్సిపాలిటీలోని సంస్కృతి టౌన్‌షిప్‌తో పాటు ఏకశిలా నగర్‌కు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల పూర్వాపరాలను పరిశీలించారు. సంస్కృతి టౌన్‌షిప్‌లో 100 ఫీట్ల రహదారికి అడ్డంగా స్థల యజమానులు పెట్టిన గేట్లను హైడ్రా కమిషనర్ తెరిపించారు.

- మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 ఫీట్ల రహదారికి మార్కింగ్ చేసి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొర్రెముల గ్రామంలోని ఏకశిలానగర్ లేఔట్‌కు సంబంధించి వివా దంపైనా ఆయన ఆరా తీశారు. కోర్టు తీర్పులు తమకు అనుకూలంగా ఉన్నా కబ్జాదారులు ఇల్లు కట్టుకొనివ్వడం లేదని ప్లాట్ల యజమాను లు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వివాదానికి సంబంధించి ఇరుపక్షాలను పిలిచి అన్ని రికార్డులను పరిశీలిస్తామని రంగనాథ్ హామీ ఇచ్చారు.
- నెక్నాంపూర్‌లో ప్రధాన రహదారి నిర్మాణానికి ఉన్న ఆటంకాలను ఆయన పరిశీలించారు. అక్కడ దాదాపు 20 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉండగా కొందరు స్థానికులు అది తమదే అంటూ రోడ్డు వేయనీయకుండా అడ్డుకోవడాన్ని ఆయన పరిశీలించారు.
- హైటెన్షన్ వైర్ల కింద నిర్మిస్తున్న రోడ్డుకు ఆటంకాలు కల్పించవద్దని కమిషనర్ స్థానికులకు సూచించారు. దీనిపైనా వచ్చే వారం సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. గచ్చిబౌలిలోని జనార్దన హిల్స్ వద్ద జరుగుతున్న వరద కాలువ పనులను, చుట్టుపక్కల కొన్ని ప్రాంతాల్లో ఉన్న ఆక్రమణలు ఆయన పరిశీలించారు. ఖైతలాపూర్ వద్ద ముల్లకత్వ చెరువు నుంచి ఐడీఎల్ చెరువుకు వెళ్లే వరద కాలువ ఆక్రమణలను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. ఐడీఎల్ చెరువు నుంచి కూకట్‌పల్లి నాలాలకు వెళ్లే వరద కాలువ ఆక్రమణలను తనిఖీ చేశారు. ఐడీఎల్ చెరువు నుంచి వెళ్లే నాలా ఆక్రమణ జరిగినట్టు గుర్తించిన హైడ్రా కమిషనర్ నాలా విస్తరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గంజాయి విక్రయిస్తున్న మైనర్ రిమాండ్

ఘట్‌కేసర్: గంజాయి విక్రయిస్తున్న బాలుడిని అదుపులోకి తీసుకున్న ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం అతడిని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎదులాబాద్‌కు చెందిన ఓ బాలుడు (17) గంజాయి సేవించడమే కాకుండా ఇతరులకు విక్రయిస్తున్నాడు. తన స్నేహితుడి రవితో కలిసి ఒడిశా వెళ్లిన అతను సోను అనే వ్యక్తి నుంచి 3.13 కిలోల గంజాయి కొనుగోలు చేసి రైలులో నగరానికి తీసుకొచ్చాడు. మంగళవారం సాయంత్రం ఎన్‌ఎఫ్‌సీనగర్ చందుపట్లగూడ లింగారెడ్డి వెంచర్‌లో కొందరికి విక్రయిస్తుండగా అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకుని అతడిని రిమాండ్‌కు తరలించారు.

పరువునష్టం కేసు వాయిదా

సిటీ కోర్టులు: భారతీయ జనతాపార్టీ దాఖలు చేసిన పరువునష్టం కేసుపై బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ జరిగింది. విచారణకు ప్రతివాది అయిన సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు కావడంతో ఆయన తరుపు న్యాయవాది విశ్వేశ్వర్‌రావు పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ కేసులో ముఖ్యమంత్రికి హైకోర్టు స్టే ఇచ్చినట్లు కోర్టుకు సూచించారు. అనంతరం మెమోతోపాటు హైకోర్టు మంజూరు స్టే ఉత్తర్వులను ఆయన కోర్టులో దాఖలు చేశారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు సాక్షులను వచ్చే విచారణలో క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలని న్యాయవాదికి సూచిస్తూ విచారణను జులై 3కి వాయిదా వేసింది.

మొండి బకాయిలపై డిస్కం దృష్టి

- 725 హెచ్‌టీ కనెక్షన్లు.. రూ.529 కోట్ల బకాయి
- సర్కిళ్ల వారీగా వివరాలు సేకరిస్తున్న సీఎండీ
- అక్రమాలకు పాల్పడిన ఇంజనీర్ల గుర్తింపు..చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: ఉద్దేశ పూర్వకంగా విద్యుత్ బిల్లులు ఎగ్గొట్టిన వినియోగదారులు, పేరుకు పోయిన మొండి బకాయిలను వసూలు చేయకుండా కనెక్షన్ క్యాన్సిల్ చేసిన పరిశ్రమకు/నిర్మాణానికి మళ్లీ మరో పేరుతో కనెక్షన్లు జారీ చేసిన ఇంజనీర్లపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ దృష్టి సారించింది. సర్కిళ్ల వారీగా హెచ్‌టీ కనెక్షన్లు, వాటి నుంచి రావాల్సిన బిల్లులపై ఆరా తీస్తోంది. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 99 కనెక్షన్ల నుంచి రూ.123 కోట్లు, మేడ్చల్ సర్కిల్లో 313 కనెక్షన్ల నుంచి రూ.66 కోట్లు, రంగారెడ్డి జోన్‌లో 167 కనెక్షన్ల నుంచి రూ.177 కోట్లు, శివారు జిల్లాల్లో 214 కనెక్షన్ల నుంచి రూ.280 కోట్ల వరకు బిల్లు వసూలు కావాల్సి ఉంది. ఉద్దేశపూర్వకంగా బిల్లులను ఎగ్గొ ట్టిన వినియోగదారులను గుర్తించి, ఏళ్లుగా పేరుకు పోయిన బిల్లులను వసూలు చేసే కార్యక్రమాన్ని చేపట్టింది. అంతేకాదు బిల్లు బకాయి పడిన సంస్థకు/ నిర్మాణానికి ఉద్దేశపూర్వకంగా మరో పేరున కనెక్షన్లు జారీ చేసిన ఇంజనీర్లపై కూడా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఒక్కో సెక్షన్‌లో ఈ తరహా కేసులు ఏడు నుంచి ఎనిమిది వరకు ఉన్నట్లు సీఎండీ ముషారఫ్ ఫారూఖీ గుర్తించినట్లు తెలిసింది. సంస్థ ఆర్థిక సంక్షోభానికి కారణమైన ఆయా ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని భావిస్తుండటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

భయంతో కాదు... బాధతో చనిపోతున్నా..

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


గోపీకృష్ణ మృతదేహం

కేపీహెచ్‌బీకాలనీ: భయంతో కాదు...బాధ భరించలేక చనిపోతున్నానంటూ... ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, పుసగూడెం గ్రామానికి చెందిన పుల్లూరి సైదులు కుమారుడు గోపీ కృష్ణ (26) కేపీహెచ్‌బీ కాలనీలోని ఏడవ ఫేజ్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేసేవాడు.ఇటీవల ఉద్యోగం పోవడంతో స్వగ్రామానికి వెళ్లిన అతను మంగళవారం నగరానికి తిరిగి వచ్చాడు. అదే రోజు రాత్రి 'భయంతో కాదు బాధ భరించలేక చనిపోతున్నా' ఎవరినీ నిందించవద్దని, ఇందుకు తానే కారణమని డైరీలో రాసి హాల్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన అతడి రూమ్మేట్ మౌళి, గోపీకృష్ణ తండ్రికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. నగరానికి వచ్చిన అతడి తండ్రి సైదులు పోలీసులకు సమాచారం అందించారు. తన కుమారుడు ఉద్యోగం పోవడంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదరణ తగ్గుతున్న 'గ్రామీణాభివృద్ధి'



ఏజీవర్సిటీ: 1980 దశకం వరకు చేసిన ప్రయత్నాలతో పోలిస్తే కొన్ని దశాబ్దాలుగా అంతర్జాతీయ స్థాయిలో గ్రామీణాభివృద్ధి అనే అంశం ఆదరణ కోల్పోతోందని ఎన్‌ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నరేంద్రకుమార్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ సంస్థ(ఎన్‌ఐఆర్‌డీపీ)లో ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఇందులో ప్రధానంగా మూడు సంస్థలు ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సెంటర్(సీఐఆర్‌డీఏపీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్(ఎన్‌ఐఆర్‌డీపీఆర్), రూరల్ ఎకనామిక్ అండ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ(ఆర్‌ఈఈడీఎస్)లు పాల్గొన్నాయి. ఆయన మాట్లాడుతూ జూలై 6న ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవం సందర్భంగా గ్రామీణాభివృద్ధి విధానాలు, కార్యక్రమాలను పంచుకోవడానికి రాజకీయ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు గ్రామీణ వర్గాలతో ముఖాముఖి చర్చలు జరుపుతున్నారన్నారు. ప్రొఫెసర్ అనిల్ కె.గుప్తా పన్ని మాట్లాడుతూ అభివృద్ధి పటంలో ఆదాయ అసమానతలు పెరుగుతున్నాయని అన్నారు. ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ మోడల్ ఈ అంతరాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపారు. ఐటీ రంగంలో పట్టణ స్టార్టప్‌లకు కేటాయించిన రిస్క్ క్యాపిటల్ మాదిరిగానే గ్రామీణ స్టార్టప్‌లకు సమానమైన మద్దతు అవసరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఇండోనేషియా, శ్రీలంక, మలేషియా, వియత్నాం, లవోపీడీఆర్, మయన్మార్, థాయిలాండ్, పీజీ, ఫిలిప్పీన్స్, బంగ్లాదేశ్, భారతదేశం వంటి 11 సీఐఆర్‌డీఏపీ సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

చందానగర్: ఓ యువకుడిపై విచక్షణా రహితంగా దాడి చేసి హత్య చేసిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సుంకరి విజయ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి...వికారాబాద్ జిల్లా తాండూర్ మండలం, సిరిగిరిపేట్ గ్రామానికి చెందిన మాసన్‌పల్లి రాంచందర్, పసుపు అమరేష్ (25) బతుకుదెరువు నిమిత్తం వారం రోజుల క్రితం లింగంపల్లికి వచ్చారు. లింగంపల్లి రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారంపైనే నిద్రిస్తున్నారు. మంగళవారం రాత్రి అతను కల్లు తాగేందుకు సమీపంలోని కల్లు కాంపౌండ్‌కు వచ్చాడు. కల్లు సీసాలు తీసుకుని బయటికి వెళుతుండగా అక్కడికి వచ్చిన గుర్తు తెలియని మహిళ బైక్‌పై ఎవరిని ఎక్కించుకుని తిరుగుతున్నావని అతడితో వాగ్వాదానికి దిగింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన మరో మహిళ వీడియో కాల్ చేసి చెప్పడంతో అక్కడికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు అమరేష్‌పై దాడి చేశారు. అతని స్నేహితుడు రాంచందర్ తన స్నేహితుడిని కొట్టొందంటూ వేడుకున్న వారు వినలేదు. తీవ్రంగా గాయపడిన అమరేష్ అక్కడికక్కడే కుప్పకూలాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అమరేష్‌ను పరిశీలించగా అప్పటికే అతను మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలిస్తున్నామని త్వరలోనే వారిని పట్టుకుంటామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.


అమరేష్ మృతదేహం

నకిలీ పట్టాలతో టోకరా

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మోసం

- రూ.42లక్షలు వసూలు
- నలుగురు నిందితుల అరెస్టు


మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర

రాంగోపాల్‌పేట్: డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో నకిలీ పట్టాలు అంటగట్టి 42.35లక్షలు వసూలు చేసిన నలుగురు సభ్యుల ముఠాను బండ్లగూడ పోలీసులతో కలిసి ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర వివరాలు వెల్లడించారు. బండ్లగూడ గౌసనగర్‌కు చెందిన మహ్మద్ అహ్మద్ ఏసీ మెకానిక్‌గా బిల్డింగ్ మెటీరియల్ సరఫరాదారుడిగా పని చేసేవాడు. ఈ క్రమంలో అతను ఏసీ ఫిట్టింగ్ కోసం తరచూ బండ్లగూడలోని డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయానికి వెళ్లేవాడు. తాను చేసే పనిలో ఆదాయం తక్కువగా ఉండటంతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని మోసం చేసి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని పథకం వేశాడు. ఇందుకు గాను బండ్లగూడ ఇస్మాయిల్‌నగర్‌కు చెందిన మహ్మద్ అంజా, మీర్‌కౌసర్ అలి అలియాస్ సిరాజ్‌తో కలిసి ముఠా ఏర్పాటు చేశాడు. వారు ముగ్గురూ తమ బంధువులు, తెలిసిన వాళ్లను కలిసి తక్కువ ధరలో డబుల్ బెడ్‌రూమ్‌లు ఇప్పిస్తామని నమ్మించి రూ.50వేల నుంచి రూ.1.70 వరకు వసూలు చేశారు. పథకం ప్రకారం గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఒరిజినల్ పట్టాలపై ఉన్న పేర్ల ఎడిట్ చేసి హైదరాబాద్ ఆర్డీవో సంతకాలను ఫోర్జరీ చేసి, నకిలీ స్టాంపులు వేసి అమాయకులకు అంటగట్టారు. వాటిని తీసుకుని అక్కడికి వెళ్లిన వారికి కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేసే రాజ్‌కుమార్ రెడ్డి అనే వ్యక్తి వారికి అలాట్ అయ్యాయని కొన్ని ప్లాట్లను చూపించేవాడు. ఇందుకు గాను నిందితులు అతడికి కమీషన్ ఇచ్చే వారు. ఇదే తరహాలో నిందితులు ముగ్గురూ 30 మంది నుంచి రూ.42.35 లక్షలు వసూలు చేశారు. వాటిని నకిలీ పట్టాలుగా గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అంబర్‌పేట్, భవానీనగర్, మాదన్నపేట్, మంగళ్‌హాట్, గోల్కొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు అయ్యాయి. బుధవారం నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వారి రూ.5.5లక్షల నగదు, 6 నకిలీ స్టాంపులు, 11 నకిలీ పట్టాలు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ గుర్నాథ్, ఎస్సైలు రాఘవేందర్‌రెడ్డి, నాగరాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నాలా బ్రిడ్జిపై కూలిన వర్టికల్ గార్డెన్



నల్లకుంట: కాలుష్య నివారణ కోసం నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్ హుస్సేన్ సాగర్ నాలా బ్రిడ్జిపై రూ.లక్షల వ్యయంతో నిర్మించిన వర్టికల్ గార్డెన్ ఒకవైపు బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కూలింది. ఆ సమయంలో వాహనదారులు, పాదచారుల సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రత్నానగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్ కుమార్ అందించిన సమాచారం మేరకు హైడ్రా, హార్టికల్చర్, జీహెచ్‌ఎంసీ, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు వెంటనే అక్కడికి చేరుకుని మూడు గంటలపాటు శ్రమించి శిథిలాలను తొలగించారు. హార్టికల్చర్ విభాగం నిర్వహణ లోపం వల్లే వర్టికల్ గార్డెన్ కూలిపోయిందని స్థానికులు అంటున్నారు. ఈ ఘటనలో సుమారు రూ.10 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా. కాగా, బ్రిడ్జి వద్ద తీవ్రమైన దుర్గంధం వెలువడుతుంటంతో కాలుష్య నివారణకుగాను 2023లో అధికారులు రూ.40 లక్షలతో ఇరువైపులా వర్టికల్ గార్డెన్ నిర్మించారు. వివిధ రకాల పూల మొక్కలను ఏర్పాటు చేశారు. గార్డెన్ మధ్యలో ప్రముఖ భవనాలు, దర్శనీయ స్థలాల త్రీడీ ఎఫెక్ట్ చిత్రాలను తీర్చిదిద్దారు.

ఆభరణాల వ్యాపారుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లోని ఆభరణాల వ్యాపారుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్సీ) ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ +91 8712661555 హెల్ప్‌లైన్ నంబర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అత్యవసర భద్రతా సమస్యలను విన్నవించేందుకు, మార్గదర్శకత్వం, కమ్యూనిటీ పోలీసింగ్ చొరవలు తదితరాల కోసం ఈ హెల్ప్‌లైన్‌లో సంప్రదించవచ్చని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అదనపు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, హెచ్‌సీఎస్సీ జనరల్ సెక్రటరీ సి.శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగంటి గోపీనాథ్‌కు ఘన నివాళి


జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు నివాళులర్పిస్తున్న కేటీఆర్ తదితరులు

చందానగర్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు బీఆర్‌ఎస్ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. బుధవారం రాయదుర్గంలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో గోపీనాథ్ దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కుటుంబసభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఈ కార్యక్రమంలో పాల్గొని మాగంటి గోపినాథ్ సతీమణి సునీత, కుమారుడు వాత్సల్యనాథ్, కుమార్తెలు అక్షరనాగ, దిశిరలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, అజయ్ కుమార్, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, సీనియర్ నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్యేలు వివేకానంద్, ముఠా గోపాల్, సినీనటులు జీవితా రాజశేఖర్, శ్రీకాంత్, అలీ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, కేటీఆర్ కుమారుడు హిమాన్షు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ కుటుంబానికి బీఆర్‌ఎస్ అండ

రహమత్‌నగర్: ఆత్మహత్యకు పాల్పడ్డ బోరబండ బీఆర్‌ఎస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సర్దార్ కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ఆయన ఇద్దరు పిల్లల పేరు మీదుగా రూ.10 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. బోరబండ ఎస్‌ఆర్‌టీ నగర్‌లోని సర్దార్ నివాసంలో కుటుంబసభ్యులను ఆయన బుధవారంరాత్రి పరామర్శించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ పేదలపై కాంగ్రెస్ పార్టీ నాయకుల దౌర్జన్యాలు పెరిగిపోయాయని, తమ పార్టీలోకి రావాలంటూ దాడులకు తెగపడుతున్నారని ఆరోపించారు. ఆయన వెంట సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీమంత్రి మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డి, వాసుదేవరెడ్డి, సోహైల్, కార్పొరేటర్లు రాజ్ కుమార్, దేదీప్య, మన్నె కవిత, వెల్దండి వెంకటేష్ పాల్గొన్నారు.

తప్పతాగి బడిబస్సులు నడిపారు..

- ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్
- పట్టుబడిన ఐదుగురు స్కూల్ బస్సు డ్రైవర్లు


డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

బంజారాహిల్స్: మద్యం మత్తులో బడి బస్సులు నడుపుతూ పలువురు డ్రైవర్లు పట్టుబడడం కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే... బుధవారం ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. ప్రధానంగా స్కూల్ బస్సు డ్రైవర్లను టార్గెట్ చేసుకుని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజగుట్ట, బేగంపేట, ఎస్సార్‌నగర్, మారేడ్‌పల్లి, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, మహంకాళి, గోపాలపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 34 ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు 324 మంది డ్రైవర్లను పరీక్షించారు. ఈ సందర్భంగా ఐదుగురు డ్రైవర్లు మద్యం మత్తులో బస్సులు నడుపుతూ పట్టుబడటంతో ట్రాఫిక్ పోలీసులు ఆయా పాఠశాల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని హెచ్చరించారు. పాఠశాల యాజమాన్యాలు ఈ విషయంలో డ్రైవర్లపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా ఎంవీ యాక్ట్ ప్రకారం అన్ని పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.

అమెరికా వర్సిటీతో అగ్రి వర్సిటీ ఒప్పందం


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

ఏజీ వర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజే టీఏయూ), అమెరికాలోని కాన్సస్ స్టేట్ యూనివర్సిటీతో 12 ఏళ్ల విరామం తరువాత సంబంధాలను పునరుద్ధరించుకుంది. బుధవారం కాన్సస్ విశ్వవిద్యాలయం పంటల పరిశోధనా సంస్థ సంచాలకులు వి.వరప్రసాద్, పీజేటీఏయూ వీసీ జానయ్య ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ జానయ్య మాట్లాడుతూ 1964లో ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటైన సమయంలో కాన్సస్ విశ్వవిద్యాలయం సహకరించిందని, 17 మంది ప్రొఫెసర్లకు పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. తాజా ఒప్పందం ప్రకారం వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని డిజిటల్ వ్యవసాయ కేంద్రం, సహజ వనరులు, పర్యావరణ కేంద్రానికి సంబంధించిన పరిశోధనలకు కాన్సస్ వర్సిటీ పూర్తి సహకారం అందిస్తుందని వివరించారు. కృత్రిమ మేధస్సుతో కూడిన సాంకేతికతకు సహకరిస్తుందని అన్నారు. పీజేటీఏయూ విద్యార్థులకు, శాస్త్రవేత్తలకు యూజీ, పీజీ రంగాల్లో 3 నుంచి 6 నెలల శిక్షణ అందించడానికి కాన్సస్ విశ్వవిద్యాలయం అంగీకరించిందని, శాస్త్రవేత్తలకు అధునాతన సాగు పద్ధతులు, నూతన పరిజ్ఞానంపై శిక్షణ ఇస్తుందని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ విద్యాసాగర్, పూర్వ వీసీ రఘువర్ధన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆటో అడ్డు పెట్టారన్నందుకు..

యువకుడిపై కత్తెరతో దాడి

అమీర్‌పేట: కారుకు ఆటో అడ్డుగా పెట్టారంటూ వాచ్‌మెన్‌తో ఓ యువకుడు గొడవ పడుతుండగా వాచ్‌మెన్ కుమారుడు అతడిపై కత్తెరతో దాడి చేసిన సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంబర్‌పేటకు చెందిన ప్రదీప్ మొక్కులు తీర్చుకునేందుకు మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి వచ్చాడు. అదే సమయంలో బీకేగూడ సీనియర్ సిటిజన్ కార్యాలయం ఎదుట జరుగుతున్న విందుకు ప్రదీప్ స్నేహితులు శివప్రసాద్ (25) శ్రీకాంత్‌తో పాటు మరో ఇద్దరు యువకులు హాజరయ్యారు. ధనలక్ష్మి అపార్ట్‌మెంట్ కింద రోడ్డుపై నిలిపిన వారు భోజనం చేసిన అనంతరం కారు వద్దకు వచ్చారు. అయితే కారుకు ఆటో అడ్డుగా ఉండటంతో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ శ్రీనివాస్ వద్దకు వెళ్లి ఆటో ఎవరిదని అడిగారు. అపార్ట్‌మెంట్ యజమాని ఇదే భవనంలో బుక్‌షాప్ నిర్వహిస్తున్నాడని, సామగ్రిని సరఫరా చేసే ఆటో డ్రైవర్ ఆటో పార్కింగ్ చేసి వెళ్లిపోయినట్లు చెప్పాడు. శివప్రసాద్ వాచ్‌మెన్‌తో వాగ్వాదానికి దిగాడు. మాటా మాట పెరగడంతో అక్కడి వచ్చిన వాచ్‌మెన్ కుమారుడు హరీష్ కత్తెరతో శివప్రసాద్ తలపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం అమీర్‌పేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

హష్ ఆయిల్ విక్రేతల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సుధీంద్ర

రాంగోపాల్‌పేట్: ఇతర రాష్ట్రాల నుంచి హష్ ఆయిల్ తెచ్చి విక్రయిస్తున్న ముఠాను పశ్చిమ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాసబ్‌ట్యాంక్ పోలీసులతో కలిసి అరెస్టు చేశారు. బుధవారం టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ సుధీంద్ర వివరాలు వెల్లడించారు. బుధవారం ఉదయం మాసబ్‌ట్యాంకు పెన్షన్ కార్యాలయం వద్ద హష్ ఆయిల్ అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసిన పోలీసులు మహ్మద్ ఫైజాన్, సయ్యద్ ముర్తుజా అలీ హుస్సేన్, వేముల హర్షిత్, మహ్మద్ సమీర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి చరాస్, చిన్న బాక్సుల్లోని హష్ ఆయిల్, గాంజా స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా గాజుల రామారంలో డెలివరీబాయ్‌గా పనిచేస్తున్న కుందుర్తి వీరాచారి, శ్యామ్ అజయ్ కుమార్, శ్యామ్ విజయ్‌కుమార్ నుంచి వాటిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. వారు ఇచ్చిన సమాచారంతో జీడిమెట్లకు చెందిన ఎలగడ నవ్యను అదుపులోకి తీసుకుని ఆమె నుంచి 71 హష్ ఆయిల్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. వాటిని తాను ఏపీకి చెందిన వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపింది. ఆరుగురు నిందితులతో పాటు వినియోగిస్తున్న వ్యామ్ విజయ్‌కుమార్, సయ్యద్ ముర్తుజా అలీ హుస్సేన్‌లను అరెస్టు చేసిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం మాసబ్‌ట్యాంక్ పోలీసులకు నిమిత్తం అప్పగించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు యాదేందర్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాలుష్యపు కోరల్లో తాజ్‌బంజారా చెరువు

- గుర్రపుడెక్కతో నిండిపోయిన తటాకం
- పట్టించుకోని ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ
- ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు
- సుందరీకరణకు ముందుకురాని స్వచ్ఛంద సంస్థలు
- దోమలతో కుస్తీ పడుతున్న స్థానికులు



బంజారాహిల్స్: కనిపిస్తున్న ఫొటో చూస్తే ఏదైనా పార్కులో పచ్చని గడ్డితో లాన్ అనుకుంటున్నారా..? కానే కాదు.. ఇది స్వచ్ఛమైన నీటితో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన చెరువు దుస్థితి. గుర్రపు డెక్కతో నిండిపోయి దుర్గంధంతో స్థానికులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్న ఈ చెరువు ఎక్కడో శివారు ప్రాంతంలో ఉందనుకుంటే పొరపడినట్లే.

- ఇది నగర నడిబొడ్డున బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1లో తాజ్‌బంజారా చెరువు పరిస్థితి. గత రెండు నెలల నుంచి ఈ చెరువులోకి పెద్ద ఎత్తున దుర్గంధం చేరిపోయి గుర్రపు డెక్క విస్తరించి దోమలతో స్థానికులు కుస్తీ పడుతున్నారు. దుర్వాసనలతో నరకాన్ని చవిచూస్తున్నారు.
- నగరం నడిబొడ్డున ఇంత అధ్వానమైన చెరువు కాలుష్య కాసారంగా మారినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. చెరువు మొత్తం గుర్రపు డెక్కతో నిండిపోయి దుర్గంధం పేరుకుపోయిందని, ఇది బాగుచేయాలంటూ స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు.
- ఇటీవల చెరువు చుట్టూ బఫర్ జోన్ కబ్జాకు గురవుతుందని, దీని వల్లనే చెరువులో దుర్గంధం పేరుకుపోతుందని హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. అటు ఇరిగేషన్ శాఖ అధికారులు గానీ, ఇటు జీహెచ్‌ఎంసీ గానీ ఈ చెరువు దుస్థితిపై పట్టించుకుంటున్న పాపానపోవడం లేదు. ఒకవైపు చెరువు కబ్జాకు గురవుతుండగా, మరోవైపు దుర్గంధంతో చెరువు మొత్తం కలుషితమైపోయింది. పరిస్థితి విషమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో ఈ చెరువును రూ.2 కోట్ల వ్యయంతో సుందరీకరించే పనులు చేపట్టారు.
- చుట్టూ వాకింగ్ ట్రాకింగ్ నిర్మించి చేతులు దులుపుకున్నారు. ఇప్పుడు ఆ వాకింగ్ ట్రాక్ కూడా చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయి చెరువు దుర్గంధంలో కలిసిపోయింది.
- తాజ్ బంజారా చెరువులోకి అంబేద్కర్‌నగర్, సింగాడికుంట, ఉదయ్‌నగర్ బస్తీల నుంచి మురుగునీరు రాకుండా కోట్లాది రూపాయలు వెచ్చించారు. అది వృథా ప్రయాసే అయ్యింది.
- చెరువు చుట్టూ పచ్చదనంతో సుందరీకరించాలని కోట్లాది రూపాయలు వెచ్చించారు. ఇవన్నీ చెరువులో పోసిన నీళ్లే అయ్యాయి.
- చెరువు చుట్టూ ఇప్పటికే 108 పైగా ప్లాట్లు తయారుచేశారు. మరో 20 మంది చెరువు ఎఫ్‌టీఎల్ గోడలు నిర్మించుకుని పార్కులు తయారుచేసుకున్నారు.
- చెరువును సుందరీకరిస్తామని, అభివృద్ధి చేస్తామని వచ్చిన స్వచ్ఛంద సంస్థలు ఇక్కడ ఆక్రమణలు చేసి వెనక్కి వెళ్తున్నాయి.
- బంజారాహిల్స్ లాంటి పోస్ట్ లొకాలిటీలో ఉన్న ఏకైక పెద్ద చెరువు ఇదే కావడం, దీనిని అభివృద్ధి చేయకపోవడం స్థానికులు చేసుకున్న దురదృష్టకరంగా భావించవచ్చు.
- ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ శాఖలు ఎవరికి వారే తప్పు తమది కాదన్నట్లుగా ఒకరిపై ఒకరు వేసుకుంటున్నారు.
- తాజ్‌బంజారా చెరువుకు సంబంధించి సరైన ప్రణాళిక లేకుండాపోతుంది.
- చెరువును సుందరంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరగడం లేదు.
- చెరువులోకి మురుగునీరు పారుతున్నా పట్టించుకోవడం లేదు.
- ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ చెరువుపై శీతకన్ను వేశారు.

నేడు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టు

రూ. 5 లక్షల స్కాలర్ షిప్ పొందే అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన ఐఐఎంసి కళాశాలలో డిగ్రీ బీబీఏ, బీఎస్సీ (డేటా సైన్స్), బీకామ్.(బిజినెస్ అనలిటిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఆనర్స్) కోర్సులలో అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థుల కోసం తెలంగాణలో మొదటిసారి అతిపెద్ద మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్‌ను నిర్వహిస్తుంది. ఇందులో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని స్కాలర్ షిప్‌కు అర్హత సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ పరీక్షలో జనరల్ ఇంగ్లిష్, ఆప్టిట్యూడ్, రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బేసిక్ కామర్స్‌కు సంబంధించిన అంశాలపై 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్న ఈ పరీక్షకు ఎలాంటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఫీజు లేదన్నారు. ఎవరు ముందు వస్తే వారికే అవకాశం ఉంటుందన్నారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి 50 మంది విద్యార్థులకు రూ. 5 లక్షల స్కాలర్ షిప్‌ను ఇస్తామన్నారు. వివరాలకు www. iimchyderabad. com లో చూడవచ్చని లేదా ఫోన్స్: 99892 20163, 90107 70605, 87907 65677, 9573027171, 9440147113, 81435 67352లలో సంప్రదించాలని సూచించారు.

పార్కు స్థలాన్ని కాపాడాలని 'హైడ్రా'కు ఫిర్యాదు

బంజారాహిల్స్: పంజగుట్ట కాలనీలోని ఆఫీసర్స్ కాలనీలో వెయ్యి గజాల పార్కు స్థలం ఉండేదని, ఇందులోని 500 గజాల స్థలంలో దుర్గాభవానీ అమ్మవారి ఆలయాన్ని నిర్మించారని, మిగిలిన 500 గజాల స్థలం కబ్జాకు గురికాకుండా కాపాడి జీహెచ్‌ఎంసీ పార్కుగా అభివృద్ధి చేయాలని స్థానికులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఆలయంతో పాటు చుట్టూ ఉన్న దుకాణ సముదాయాల ఆదాయంతో పార్కును అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని, సాధ్యమైనంత త్వరగా ఇక్కడ పార్కును తీర్చిదిద్దేలా చూడాలని కోరారు. అలాగే శ్రీనగర్‌కాలనీ వైపు నుంచి వచ్చే వరద కాలువ తమ కాలనీకి ఆనుకుని వెళ్లేదని, ఇప్పుడు ఆ కాలువ మాయం కావడంతో వరదంతా తమ ఇళ్లను ముంచెత్తుతుందని వాపోయారు. తాము సూచించిన ఈ రెండు సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

అధికార దుర్వినియోగం చేశారని కేసీఆర్‌పై ఫిర్యాదు

పంజగుట్ట: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన అధికారాన్ని దుర్వినియోగం చేసి పోలీసులను వాడుకుని ఫోన్ ట్యాంపరింగ్ చేశారనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో అతనిపై చర్యలు తీసుకోవాలని న్యాయవాది అరుణ్ కుమార్ పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2015లో ఓటుకు నోటు కేసులో అప్పటి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని గుర్తుచేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ తన పదవిని దుర్వినియోగం చేసి ఫోన్ ట్యాంపరింగ్ చేశారని ఆరోపణల నేపథ్యంలో ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ హిమాయత్‌నగర్ కార్యవర్గం

హిమాయత్‌నగర్: బీజేపీ హిమాయత్ నగర్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని డివిజన్ అధ్యక్షురాలు గూడెపు మాధవి బుధవారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ఎ.పద్మజారాణి, రాజు గౌడ్, పి.అనిల్, అంజు కుమార్, ప్రధాన కార్యదర్శులుగా జె.నవీన్ కుమార్, పి.వేణుగోపాల్ గౌడ్, కార్యదర్శులుగా పి.నాగమణి యాదవ్, కె.అనిల్ కుమార్, ఎ.నవీన్, జి.ఎల్.శ్రీకాంత్, కోశాధికారిగా జి.సరిత నియమితులయ్యారు. కార్య నిర్వాహక సభ్యులుగా రాకేష్ సింగ్, భూషణ్, సందీప్ సింగ్, విజయ్ కుమార్, ఓం సింగ్, జి.రాజు, జిత్తు, రామ్ మూర్తి, అరవింద్, మల్లికార్జున్, పి.శివ కుమార్, కె.సంతోష్, సంతోష్ జైస్వాల్, నాగరాజు, చక్రపాణి, పి.అనిత, భాగ్య, శకుంతల, శ్రీశైలం, అఖిల యాదవ్, సి.ఎస్.పుష్ప, ప్రీతి, సీతారామ్‌ను నియమించినట్లు ఆమె ప్రకటించారు.

నీటి వృథాకు చెక్



సాక్షి ఎఫెక్ట్..

ఫిలింనగర్: ఫిలింనగర్ బస్తీల్లో మంచినీటి నల్లాలు వృథాగా వదిలేయడం వల్ల నీళ్లు రోడ్లపై పారుతున్నాయని 'సాక్షి' దిన పత్రికలో బుధవారం ప్రచురితమైన కథనంపై జలమండలి అధికారులు స్పందించారు. ఫిలింనగర్‌లోని గౌతంనగర్ బస్తీతో పాటు స్థానికంగా జలమండలి బంజారాహిల్స్ డీజీఎం షీలారాణి, మేనేజర్ రాంబాబు, స్థానిక నేత నాగేష్‌సాగర్ ఇక్కడ నీళ్లు ఎందుకు వృథాగా వదులుతున్నారో పరిశీలించారు. వాహనాలను కడగడంతో పాటు ఇళ్ల ముందు పైపులు ఖాళీగా వదిలేస్తున్నారని, ఇది పద్ధతి కాదన్నారు. ప్రజలు తమవంతు బాధ్యతగా ఇక్కడ నీరు వదలవద్దని సూచించారు.

అభివృద్ధిలో రాజీపడం: ఎమ్మెల్యే దానం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం

పంజగుట్ట: కాలనీల్లో, బస్తీల్లో ఏ మాత్రం కాంప్రమైజ్ కాకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బుధవారం సోమాజిగూడ డివిజన్ సాదత్ మంజిల్ కాలనీ నీరజ్ పబ్లిక్ స్కూల్ వీధిలో రూ. 22 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డుతో పాటు అమీర్‌పేట్ కాకతీయ మెస్ వెనుకాల ఉన్న శాంతినగర్ కాలనీలో రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను కార్పొరేటర్ వనం సంగీతా శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడమన్నారు. వర్షాకాలంలో వరద నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడకుండా నగరంలో చాలా చోట్ల భారీ సంపులు నిర్మించామని వీటి వల్ల వరద నీరు నిలవకుండా వాహనాలు సాఫీగా ముందుకు సాగుతున్నాయని అన్నారు. కేసీపీ జంక్షన్‌లో, లేక్‌వ్యూ అతిథి గృహం వద్ద నిర్మించిన సంపులు ఇప్పటికే మంచి ఫలితాలను ఇస్తున్నాయన్నారు.

మాగంటికి నివాళి

రహమత్‌నగర్: దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పెద్దకర్మ సందర్భంగా బుధవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రహమత్‌నగర్, బోరబండ డివిజన్ల పరిధిలోని రహమత్‌నగర్, ఎస్పీఆర్‌హిల్స్ కార్మికనగర్, శ్రీరాంనగర్, బోరబండ బస్ స్టాప్‌ల వద్ద మాగంటికి చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఫాల్కన్‌వ్యాలీలో అక్రమ నిర్మాణం సీజ్



అక్రమ కట్టడాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

బంజారాహిల్స్: షేక్‌పేట ఫాల్కన్ వ్యాలీలో అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అనధికారిక కట్టడాన్ని జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఆత్రాబాదర్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణానికి సిల్ట్ ప్లస్ 3 ఫ్లోర్స్‌కు మాత్రమే అనుమతులు మంజూరయ్యాయి. అయితే ఆయన అనుమతులకు విరుద్ధంగా జీహెచ్‌ఎంసీ అధికారుల కళ్లుగప్పి సెల్లార్ ప్లస్ ఐదు అంతస్తులను అనధికారికంగా నిర్మించాడు. నిబంధనలకు విరుద్ధంగా బిల్డింగ్‌ను అదనంగా నిర్మించినందుకు ఈ భవనాన్ని జీహెచ్‌ఎంసీ చట్టం ప్రకారం సీజ్ చేయడం జరిగిందని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. భవన యజమానులు, డెవలపర్స్ సంబంధిత అనుమతులు పొందకుండానే నిర్మాణాలు చేపడితే అలాంటి నిర్మాణాలపై కఠినంగా చర్యలు తీసుకుంటామని డీసీ సమ్మయ్య తెలిపారు. ప్రజలు కూడా తమ నిర్మాణాలకు జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతులు పొందాలన్నారు.

జవహర్‌నగర్ కాలనీ రోడ్డు నెం: 5లో...

జూబ్లీహిల్స్ అన్నపూర్ణ స్టూడియోస్ లేన్ జవహర్‌నగర్ కాలనీలో రోడ్డు నెంబర్–5లో అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మించిన భవనాన్ని జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. రవీందర్‌యాదవ్ పేరిట అనుమతులకు విరుద్ధంగా స్టిల్ట్ ప్లస్ 5 అంతస్తుల అక్రమ నిర్మాణం చేపట్టిన దృష్ట్యా జీహెచ్‌ఎంసీ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. యజమాని ఏవిధమైన పత్రాలను సమర్పించకపోవడమే కాకుండా విచారణలకు కూడా హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ చట్టంలోని సెక్షన్ 461ఏ ప్రకారం నిర్మాణానికి సీల్ వేశారు. అక్రమ నిర్మాణాలపై జీరో టోలరెన్స్ విధానం కొనసాగుతుందని, అనుమతులు పొందకుండా చేసే నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోనున్నట్లు ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ నుంచి ముందుగా అనుముతుల పొందిన తర్వాతనే నిర్మాణాలను మొదలుపెట్టాలన్నారు.

'చిత్రపురిలో డబ్బు చెల్లించి మోసపోవద్దు'

బంజారాహిల్స్: సినీ హౌసింగ్ సొసైటీ చిత్రపురికాలనీలో సఫైర్ షూట్స్ పేరుతో ఇళ్లకు డబ్బులు కట్టాలంటూ కొందరు చిత్రపురికాలనీ అక్రమ అవినీతి కమిటీలో కుమ్మక్కై ప్రచారం చేస్తున్నారని, దీనిని నమ్మి ఎవరూ మోసపోవద్దని ప్రజా నాట్య మండలి సినిమా శాఖ సెక్రటరీ మద్దినేని రమేష్ హెచ్చరించారు. బుధవారం ఆయన ఫిలింనగర్‌లో మాట్లాడుతూ... ఫిలిం చాంబర్‌లో భాగంగా ఉన్న నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్లకు, స్టూడియో సెక్టార్, ఎఫ్ఎన్‌సీసీ సభ్యులకు, ఎగ్జిబిటర్లకు ఈ మేరకు ప్రచారాన్ని నమ్మవద్దని హితవు పలికారు. దీని మీద ఉన్నత న్యాయస్థానంలో స్టే ఉందని, పైగా చిత్రపురి కాలనీ సినిమా కార్మికులకు సంబంధించిన సొసైటీ అన్నారు. ఇప్పటికే ఉన్న 285 ఇళ్ల కోసం దాదాపుగా రూ. 60 కోట్లు కట్టి గత 35 సంవత్సరాల నుంచి 600 మంది ఎదురుచూస్తున్నారన్నారు. కొత్తగా సభ్యత్వాలు ఇవ్వడం గవర్నమెంట్ నోటీసుకు వ్యతిరేకమన్నారు. మీరు ఇళ్లు కొనుక్కోండి అని మిమ్ముల్ని ఎవరైనా అడిగితే వారు ముమ్మాటికీ మోసం చేస్తున్నట్లేనన్నారు. ఇది గమనించి జాగ్రత్త పడాలని, అవినీతి చిత్రపురి కమిటీతో మోసపోవద్దన్నారు. ఒక్కసారి డబ్బు కడితే చిత్రపురి సొసైటీ నుంచి తిరిగి డబ్బు రావడం అనేది అసాధ్యమన్నారు. ఈ మేరకు చిత్రపురి ఉద్యమకారులు కూడా అందరినీ హెచ్చరిస్తూ ఏ ఒక్కరూ మోసపోకుండా చూడాలని గత నాలుగైదు రోజుల నుంచి అవగాహన కలిగిస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా చిత్రపురి అవినీతిపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉదయం 10 నుంచి ఫిలిం చాంబర్ వద్ద జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ సభ్యుల ధర్నా ఉంటుందన్నారు.

వరదలపై సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య

బంజారాహిల్స్: వర్షాకాలాన్ని పురస్కరించుకుని వరద ముంపు ప్రాంతాల్లో హైడ్రా మాన్సూన్ టీమ్‌లతో పాటు జీహెచ్‌ఎంసీ టీమ్‌లు కూడా సమన్వయంగా పనిచేయాలని జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య సూచించారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో హైడ్రా డీఆర్ఎఫ్, ఇంజనీరింగ్ విభాగం, యూబీడీ విభాగం అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వరద వచ్చినప్పుడు ఎక్కడెక్కడ ముంపు ఉంటుందో ఆ వివరాలను అందరూ సమన్వయంగా పంచుకుని ఆ ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని విభాగాలు కలసికట్టుగా పనిచేస్తేనే ముంపు సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. వరద నిలిచినప్పుడు అది కాలువలోకి సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... అమలాపురం ప్రాంతానికి చెందిన బి.వెంకటేశ్వరరావు కార్మికనగర్‌లో ఉంటున్నాడు. ఈ నెల 16న రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.







ఈ రోజుల్లో ప్రతి మనిషి జీవితంలో ఒత్తిడి అనేది ఒక భాగంగా మారిపోయింది. ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ సమస్యలు, భవిష్యత్‌పై భయాలు.. ఐటీ ఉద్యోగాలు కావొచ్చు, తీరికలేని వ్యాపారాలు కావొచ్చు.. జీవితంలో ఇంకేమైనా కారణాలు కావొచ్చు, కానీ ఒత్తిడి అనేది ప్రధాన సమస్యగా మారింది. ఇది దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో పాటు మానసిక రుగ్మతలకు కారణమవుతోంది. దీంతో వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబం పరంగా మనశ్శాంతిని కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో ఒత్తిడిని తగ్గించడానికి పలు థెరపీలు, విధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఒత్తిడిని పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, దాన్ని సమర్థవంతంగా నిర్వహించడం మన చేతిలోనే ఉంది. ▶

ఒత్తిడి పెరుగుతోంది అంటే భయపడాల్సిన అవసరం లేదు దానిని ఎదుర్కొనడంపై దృష్టి సారించాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. మనసుకు శాంతి, శరీరానికి విశ్రాంతి ఇచ్చే మార్గాల్ని అన్వేషించడం ఈ తరానికి చాలా అవసరమని నిపుణుల మాట. ఈ నేపథ్యంలో ఒత్తిడిని తగ్గించేందుకు ఉపయోగపడే '4 ఏ మోడల్' (అవాయిడ్, అడాప్ట్, ఆల్టర్, యాక్సెప్ట్), '6 ప్రాక్టికల్ టెక్నిక్స్' బాగా ఉపయోగపడుతున్నాయి. శ్వాస వ్యాయామాలు, డిజిటల్ డిటాక్స్, మానసిక దృక్పథం మార్పు వంటి చిట్కాలతో మనశ్శాంతి ఎలా పొందాలో స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

ఒత్తిడిని జయించడం సాధ్యమే..

మారుతున్న కాలానికి అనుగుణంగా పెరుగుతున్న ఒత్తిడి

దీర్ఘకాలిక వ్యాధులు, మానసిక సమస్యలు

డిజిటల్ డిటాక్స్, మానసిక దృక్పథంతో తోడ్పాటు

పరిష్కారంగా 4ఏ మోడల్, 6 ప్రాక్టీస్ పద్ధతులు

ఒత్తిడిని తగ్గించేందుకు 6 మార్గాలు..

- **4–7–8 బ్రీత్ టెక్నిక్:** నాలుగు సెకన్లు శ్వాస తీసుకోండి, 7 సెకన్లు ఆపండి, 8 సెకన్లకు మెల్లగా విడిచిపెట్టండి. ఇది నాడీ వ్యవస్థను ప్రశాంతపరుస్తుంది.
- **ప్రోగ్రెసివ్ మసిల్ రిలాక్సేషన్:** ఒత్తడికి లోనైన కండరాలను గట్టిగా పట్టుకుని మెల్లగా విడవండి. శరీరమంతా రిలాక్స్ అవుతుంది.
- **మెల్ రాబిన్స్ 5 సెకండ్ రూల్:** ఒక నిర్ణయం తీసుకునే ముందు 5 నుంచి 1 వరకు వెనక్కి లెక్కించండి. దీని వల్ల ఆలస్యం కారణంగా వచ్చే ఒత్తిడిని నివారించవచ్చు.
- **డిజిటల్ డిటాక్స్:** రోజులో కొన్ని గంటలు స్క్రీన్‌లను పూర్తిగా దూరం పెట్టండి. ప్రత్యేకించి రాత్రి పూట ఫోన్లు, ల్యాప్టాప్‌లు పక్కన పెట్టడం ద్వారా మెదడు విశ్రాంతి పొందుతుంది.
- **ఏబీసీ టెక్నిక్:** ఒత్తిడికి కారణమైన సందర్భాన్ని, దానిపై మన నమ్మకాలను, దాని పరిణామాలను విశ్లేషించండి. ఇందులోని అవాస్తవ పరిస్థితులను మానసికంగా వదిలేయండి.



- **బాక్స్ బ్రీథింగ్:** నాలుగు సెకన్లు శ్వాస తీసుకోండి. నాలుగు సెకన్లు ఆపి వదలాలి. మరో నాలుగు సెకన్ల సమయం తరువాత ఈ పద్ధతిని మళ్లీ కొనసాగించాలి. మానసిక ఒత్తిడి తగ్గి మనోస్థితి స్థిరంగా ఉంటుంది.



ఒత్తిడిని నియంత్రించే '4ఏ మోడల్'..

- **అవాయిడ్ (తగ్గించండి):** అవసరం లేని ఒత్తిడికి తల వంచకండి. కొన్ని పనులను ఇతరులకు అప్పగించండి. జీవితంలో అసలైన ప్రాధాన్యతలను గుర్తించి, వాటినే ముందుగా చేయండి. ఇది మనసును చాలా వరకు ప్రశాంతంగా ఉంచుతుంది.
- **అడాప్ట్ (అనుకూలించండి):** ప్రస్తుత పరిస్థితులను మారుస్తూ, సరికొత్తగా ఆలోచించండి. అంచనాలను ఆచరణీయంగా మార్చుకోండి. నెగటివ్ ఆలోచనల్ని పాజిటివ్ దృష్టితో చూడటం అలవాటు చేసుకోండి. ప్రతి సమస్యలో పాఠం ఉంటుంది. దాన్ని గుర్తించి సమన్వయంగా ముందుకు సాగండి.
- **ఆల్టర్(మార్పు తీసుకోండి):** మీ అవసరాలను స్పష్టంగా వ్యక్తం చేయండి. ప్రతి పనిని చిన్నచిన్న దశల్లో విడదీసి చేయండి. సమస్యలు వచ్చినప్పుడు వాటిని తొలగించే మార్గాలు వెతకండి. ఇది మానసిక ఒత్తిడిని తగ్గించే ఉత్తమ మార్గాల్లో ఒకటి.
- **యాక్సెప్ట్ (అంగీకరించండి):** కొన్ని విషయాలను మనం మార్చలేం. అలాంటి వాటిని అంగీకరించడం వల్ల మనసు హాయిగా ఉంటుంది. గతాన్ని మర్చిపోండి. ప్రతి సవాల్‌లో అభివృద్ధికి అవకాశం ఉందని తెలుసుకోండి.

అధ్యాపకులూ.. విద్యార్థులే..

సాక్షి, సిటీబ్యూరో: వేగంగా మారుతున్న విద్యా వాతావరణ పరిస్థితుల్లో, ప్రస్తుత సాంకేతిక ఆవిష్కరణల వెల్లువలో అధ్యాపకులు సైతం విద్యార్థుల్లానే మారాలని, ఎప్పటికప్పుడు తమ శిక్షణ నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. నగరంలోని కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్‌లో 'డిజిటల్ యుగంలో ఇంగ్లిష్ క్లాస్‌రూమ్: అవకాశాలు– సవాళ్లు' పేరిట విద్యా సదస్సు సోమవారం నుంచి నిర్వహిస్తున్నారు. నగరంలోని ఇంగ్లిష్, ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ), వరంగల్ నిట్‌లోని హ్యూమానిటీస్– సోషల్ సైన్సెస్ విభాగంతో కలిసి నిర్వహిస్తున్న ఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్.. అధ్యాపకులు, పరిశోధకులకు అవసరమైన జ్ఞానాన్ని, సాధనాలను, వ్యూహాలను అందిస్తుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం మరో 2 రోజుల పాటు కొనసాగుతుంది.

'మీకు డీహైడ్రేషన్ సమస్య ఉంది.. అనగానే చాలా మంది 'నేను బాగానే నీరు తాగుతున్నా కదా అంటారు అయితే అది కొందరి అపోహ. నీరు మాత్రమే తాగితే సరిపోదు అని వారు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది' అంటున్నారు ఆలివ్ ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ ఫిజిషియన్ డా.అబ్దుల్ మజిద్ ఖాన్. నగరంలో వాతావరణ మార్పులకు అతీతంగా వేధిస్తున్న డీహైడ్రేషన్ సమస్య గురించి వైద్యులు ఏం చెబుతున్నారంటే.. - సాక్షి, సిటీబ్యూరో

నేర్చుకోవడంపై ఆసక్తి పెంచుకోవాలి



సాక్షి, సిటీబ్యూరో: విద్యా ప్రయాణంలో నేర్చుకోవాలనే ఆసక్తిని విద్యార్థులు పెంపొందించుకోవాలని, నిరంతరం అభివృద్ధి చెందేందుకు ప్రయత్నించాలని నగరంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ(ఐఎంటీ) డైరెక్టర్ ప్రొఫెసర్ బహరుల్ ఇస్లాం సూచించారు. ఐఎంటీ ఆధ్వర్యంలో అభ్యుదయం 2025 మేనేజ్‌మెంట్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిపరమైన ప్రవర్తన, విద్యా నైపుణ్యానికి పునాది వేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత మేనేజ్మెంట్ విద్య, వాస్తవ పరిస్థితుల గురించి ఎలికో లిమిటెడ్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ వనితా దాట్ల వివరించారు. కార్యక్రమానికి హాజరైన టీసీఎస్ హైదరాబాద్ హెడ్ చల్లా నాగ్ మాట్లాడుతూ ఏటీఎంల నుంచి మొబైల్ బ్యాంకింగ్ వరకు, ప్రాథమిక ఏఐ అప్లికేషన్ల నుంచి ఏజెంటిక్ ఏఐ వరకు సాంకేతికత పరిశ్రమలను ఎలా పునర్నిర్మిస్తుందో విశ్లేషించారు.

షూటింగ్ క్రీడకు ఆదరణ కోసం..

- గీఐ రాష్ట్ర షూటింగ్ చాంపియన్‌షిప్‌కు ఆతిథ్యం
- నగరంలోని సాట్స్ షూటింగ్ రేంజ్‌లో జరగనున్న పోటీలు
- 21 నుంచి 30 వ తేదీ వరకు షూటింగ్ చాంపియన్‌షిప్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గచ్చిబౌలిలోని సాట్స్ షూటింగ్ రేంజ్‌లలో ' గీఐ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ చాంపియన్‌షిప్–2025'ను ఈ నెల 21 నుంచి 30 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ ప్రకటించింది. 10మీ ఎయిర్ రైఫిల్/పిస్టల్, 25మీ పిస్టల్, 50మీ రైఫిల్/పిస్టల్‌తో పాటు వివిధ షాట్‌గన్ విభాగాలతో సహా విస్తృత శ్రేణి ఈవెంట్‌లతో జరగనున్న ఈ చాంపియన్‌షిప్‌లో రాష్ట్వ్యాప్తంగా 1,250 మందికి పైగా అథ్లెట్లు పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ చాంపియన్‌షిప్‌లో పిస్టల్‌తో పాటు పలు తుపాకీ ఈవెంట్‌లలో యూత్ కేటగిరీ ప్రవేశపెట్టారు. కీలకమైన నిర్ణయం షూటింగ్ క్రీడకు ఆదరణ పెంచడంతో పాటు విస్తృత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, యువత ప్రతిభను పెంపొందించడానికి ఉపకరిస్తుందని అన్నారు. అంతేకాకుండా తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమిత్ సంఘిని ఎస్ఆర్ఏఐ ద్వారా ఈ–స్పోర్ట్స్ షూటింగ్ చైర్మన్‌గా నామినేట్ చేశారు. ఈ ప్రతిష్టాత్మక నియామకం దేశంలో షూటింగ్ క్రీడలను ఆధునీకరించడానికి ఆయన దార్శనిక నాయకత్వం, నిబద్ధతను గుర్తిస్తుంది.





హైడ్రేషన్.. అటెన్షన్

నగరవాసుల్ని వేధిస్తున్న సైలెంట్ డీ హైడ్రేషన్

వాతావరణ మార్పులకు అతీతంగా మారిన సమస్య

ద్రవ నష్టాన్ని లైట్ తీసుకోవద్దంటున్న వైద్యులు

నీరు తాగాలి.. కానీ అది మాత్రమే సరిపోదని స్పష్టీకరణ



ఎండలు మండే సీజన్‌లో డీహైడ్రేషన్ సమస్య గురించి తరచూ చర్చిస్తుండటం సహజం.. అయితే కాలాలకు అతీతంగా ఈ డీహైడ్రేషన్‌కు గురయ్యే వారి సంఖ్య ఎక్కువే ఉంటోంది అంటున్నారు నగరవైద్యులు. దీనికి కారణాల్లో తగినంత నీరు తాగకపోవడం ప్రధాన కారణమైతే.. విభిన్న రకాల జీవనశైలి అలవాట్లు కూడా మరో కారణంగా చెబుతున్నారు. టీ, కాఫీ, ఆల్కహాల్ వంటి పానీయాలతో పాటు ఎనర్జీ డ్రింక్స్ కూడా శరీరంలో ద్రవనష్టాలకు కారణంగా మారుతున్నాయని స్పష్టం చేస్తున్నారు. ఇవన్నీ సిటిజనుల్ని సైలెంట్ డీహైడ్రేషన్‌కి గురిచేస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. అలాగే వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు సైతం డీహైడ్రేషన్ ముప్పును తెస్తున్నాయన్నారు.

నీరు తాగితే చాలదు..

హైడ్రేషన్ అంటే కోల్పోయిన నీటిని పొందడం మాత్రమే అనే అపోహ చాలా మందిలో ఉంది. అయితే శరీరం ద్రవాలను మాత్రమే కాకుండా, మరిన్నింటిని కూడా పునరుద్ధరించాల్సి ఉంటుందని అంటున్నారు వైద్యులు. దీనినే ఫ్లూయిడ్స్, ఎలక్ట్రొలైట్స్, ఎనర్జీ(ఎఫ్ ఇఇ) ఈక్వేషన్ అని పిలుస్తారు. ఉక్కపోత నుంచి అతి వ్యాయమం వరకూ.. వీటి వల్ల శరీరం సోడియం, పొటాషియం, మెగ్నీషియం మొదలైన ఎలక్ట్రోలైట్‌లను గ్లూకోజ్‌ను కోల్పోతుంది. గుండె లయ, నరాల సంకేతాలు, కండరాల కదలిక మానసిక ఆరోగ్యానికి కూడా ఇవి చాలా ముఖ్యమైనవి. అయితే కేవలం కోల్పోయిన నీటి భర్తీ వల్ల ఈ సమతుల్యత పునరుద్ధరించడం జరగదు. సాదా నీటిపై మాత్రమే ఆధారపడి ఊరుకుంటే సమస్య మరింత తీవ్రం అయ్యే ప్రమాదం ఉంది.

ఆహారమూ కీలకమే..

మన ఆహారంలో తరచూ ఊరగాయలు, పాపడ్స్ ఉప్పగా ఉండే స్నాక్స్ ఉంటాయి. అవి కూడా ద్రవనష్టానికి దారి తీస్తాయి. కండరాల సంకోచాలు, నరాల పనితీరు హైడ్రేషన్‌ను నియంత్రించడానికి కీలకమైన ఖనిజం పొటాషియం. మన దేశంలో పోషకాహార ధోరణులపై జరిపిన అధ్యయనం ప్రకారం, ప్రతి ఐదుగురిలో ఒకరికి పొటాషియం లోపం ఉంది. వేసవిలో పొటాషియం, సోడియం అసమతుల్యత మరింత స్పష్టంగా కనిపిస్తుంది. అరటిపండ్లు, ఆకుకూరలు, పప్పులు, నారింజ లేత కొబ్బరి వంటి పొటాషియం అధికంగా ఉండే ఆహారాలను అత్యంత తక్కువగా తీసుకుంటారు. ఐసిఎంఆర్ ప్రకారం, ఈ ఆహారాలు మన ఉత్తమ సహజ వనరులు అని గుర్తించింది.







సూచనలు:

- ద్రవాలు, ఎలక్ట్రోలైట్స్ గ్లూకోజ్. మూడింటి మేళవింపుగా లభించే రెడీ–టు–డ్రింక్ ఎలక్ట్రోలైట్ సొల్యూషన్స్ ఆదరణ పొందుతున్నాయి. సరైనవి ఎంచుకోవచ్చు.
- డీహైడ్రేటింగ్‌కు కారణమయ్యే టీ, కాఫీ వంటి కెఫిన్ కలిగిన పానీయాలు, అలాగే ఆల్కహాల్, ఎరేటెడ్ డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్ తీసుకోవడం తగ్గించండి.
- డీహైడ్రేషన్ వల్ల కండరాల తిమ్మిరి, నోరు పొడిబారడం, తలనొప్పి, అలసట లేదా మైకం లాంటివి కలుగుతుంటే విస్మరించవద్దు. వెంటనే లవణాలు గ్లూకోజ్ రెండింటినీ కలిగి ఉన్న హైడ్రేషన్ ద్రావణాన్ని తీసుకోండి
- విరేచనాలు వంటి తీవ్ర లక్షణాలు లేకుండానే శరీరాన్ని ఇబ్బంది పెట్టే పరిస్థితిని నిశ్శబ్ద డీహైడ్రేషన్ అని పిలుస్తారు.

– డా.అబ్దుల్ మజీద్ ఖాన్,
కన్సల్టెంట్ ఫిజీషియన్, ఆలివ్ హాస్పిటల్



పల్నాడు జిల్లా రెంటపాళ్లలో భారీ జనసందోహానికి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సత్తెనపల్లిలో వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలుకుతున్న అశేష జనవాహినిలో ఓ భాగం..

మీకు ఊడిగం చేయకపోతే కక్ష సాధింపా?

పచ్చ మీడియా ద్వారా ట్రోలింగ్‌లు, పోలీసులను అడ్డుపెట్టుకుని తప్పుడు కేసులు.. ఏపీ సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో పోలింగ్ రోజు నుంచే దారుణ పరిస్థితులు నెలకొన్నాయని, సంక్షేమాభివృద్ధి అన్నది పక్కకుపోయి రెడ్‌బుక్ రాజ్యాంగం ద్వారా కక్ష సాధింపు మాత్రమే కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. పోలింగ్ రోజు నుంచే రెడ్‌బుక్ రూల్ అమలవుతోందని చెప్పడానికి నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యే నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీలో కమ్మ కులస్తులు ఉండటం తప్పా.. ఏం పాపం చేశారని వైఎస్సార్‌సీపీలోని కమ్మ నేతలను వేధిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించారు. కమ్మ వాళ్లు పుట్టింది మీకు ఊడిగం చేయడానికా అని నిలదీశారు. ఈ ప్రభుత్వం ఎల్లకాలం ఉండబోదని, ఇప్పుడు తప్పు చేస్తున్న అధికారులందరికీ తమ ప్రభుత్వం వచ్చాక సినిమా చూపిస్తామని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో గత ఏడాది ఎన్నికల ఫలితాల తర్వాత అధికార పార్టీ నేతలు, పోలీసుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న ఉప సర్పంచ్ కొర్లకుంట నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన నాగమల్లేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

మరిన్ని వివరాలు, ఫొటోల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రాష్ట్రంలో పోలింగ్ రోజు నుంచే రెడ్‌బుక్ రాజ్యాంగం

దాని ఫలితంగానే నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య

ఈ ప్రభుత్వం ఎల్లకాలం ఉండబోదన్నది వాస్తవం

ఇప్పుడు తప్పు చేస్తున్న కొందరు పోలీసు అధికారుల తీరు హేయం

మళ్లీ మా ప్రభుత్వం రాగానే వారిని బోనులో నిలబెడతాం..

ఏమయ్యా చంద్రబాబూ.. కమ్మవారు మా పార్టీలో ఉంటే నీకు అభ్యంతరమా? కమ్మ వారు పుట్టింది కేవలం మీకు ఊడిగం చేయడానికేనా? చంద్రబాబు అన్యాయాలను ఎవరైనా వ్యతిరేకిస్తే, ప్రశ్నిస్తే.. వారిని వెంటాడి వెంటాడి, హింసించి జైల్లో పెట్టడం, దొంగ కేసులు బనాయించడం, దొంగ సాక్ష్యాలు సృష్టించడం.. పచ్చ మీడియా ద్వారా ట్రోలింగ్ చేయడం.. చివరకు వారంతట వారు ప్రాణాలు తీసుకునేలా అవమానించడం. ఇలా చేయడం కేవలం చంద్రబాబుకు మాత్రమే చెల్లు. ఏం పాపం చేశాడని నాగమల్లేశ్వరరావును చంపారు? ఏం పాపం చేశాడని ఆత్మహత్యాయత్నం చేసుకునేలా లక్ష్మీనారాయణను ప్రేరేపించారు? ఏం పాపం చేశారని మా పార్టీలో ఉన్న కమ్మ వారిపై తప్పుడు కేసులు పెట్టారు?

ఈ రోజు చంద్రబాబుకు వత్తాసు పలుకుతున్న పోలీస్ శాఖలో ఉన్న కొందరు.. అందరూ కాదు.. కొందరికి మాత్రమే ప్రత్యేకంగా చెబుతున్నా. చూస్తూ చూస్తూ ఇప్పటికే ఏడాది గడిచిపోయింది. మరో మూడు నాలుగేళ్లలో మా ప్రభుత్వం ఏర్పడుతుంది. మా ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్కరికీ సినిమా చూపిస్తాం. ఎందుకంటే నాగమల్లేశ్వరరావు కుటుంబానికి చేసిన అన్యాయమే రెడ్‌బుక్ కారణంగా ప్రతి గ్రామంలోనూ కనిపిస్తోంది. ప్రతి గ్రామంలో కనిపిస్తున్న అన్యాయాలను చూసి, ఒకటే చెబుతున్నా. ఈ అన్యాయాల్లో మీరు భాగస్వాములు కావొద్దు. మీరు వాటిలో భాగస్వాములైతే చంద్రబాబుతో పాటు మిమ్మల్ని కూడా కచ్చితంగా బోను ఎక్కించే కార్యక్రమం చేస్తానని హెచ్చరిస్తున్నా.

రౌడీషీట్ ఓపెన్ చేస్తామని బెదిరింపులు

నా పక్కనే ఉన్న వెంకటేశ్వర్లు అన్న (కొర్లకుంట వెంకటేశ్వరరావు) సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో మా పార్టీ నాయకుడు. ఈయన కొడుకు నాగమల్లేశ్వరరావు ఈ గ్రామానికి ఉప సర్పంచ్. పోలింగ్‌కు ముందు టీడీపీ నేతలు వారికి అనుకూలమైన అధికారులందరికీ పోస్టింగులు ఇప్పించుకున్నారు. పోలింగ్ సమయంలో ఈ ప్రాంత ఐజీ, ఎస్పీ, సీఐలు అందరూ కూడా తెలుగుదేశం పార్టీని, కూటమిని గెలిపించడం కోసం ఎలాంటి అన్యాయాలు చేశారన్న సంగతి ఈ ప్రాంతంలో ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసు. పోలింగ్ రోజు నుంచే రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ తెలుగుదేశం పార్టీ ఏ రకంగా ప్రవర్తించింది అన్నది ఈ గ్రామంలో కనిపిస్తుంది. 2024 జూన్ 4న అంటే కౌంటింగ్ రోజున.. అల్లర్లు చేస్తారని చెప్పి తెలుగుదేశం పార్టీ, జనసేన నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడంతో నాగమల్లేశ్వరరావును పోలీసులు స్టేషన్‌కు తీసుకుపోయి సెల్‌లో వేశారు. ఎన్నికల ఫలితాలు టీడీపీకి అనుకూలంగా రావడం మొదలు కాగానే, నాగమల్లేశ్వరరావు ఇంటిపై తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు రాళ్లు విసిరారు. అక్కడ పోలీస్ స్టేషన్‌లో నాగమల్లేశ్వరరావును సీఐ రాజేష్ తీవ్రంగా బెదిరించారు. ఊళ్లోకి పోవద్దని, ఊరు విడిచి పెట్టాలని, లేకపోతే రౌడీషీట్ ఓపెన్ చేయడమే కాకుండా, కాల్చి చంపుతామని హెచ్చరించాడు. జూన్4న కౌంటింగ్ పూర్తయినా, మర్నాడు 5వ తేదీ సాయంత్రం వరకు నాగమల్లేశ్వరరావును స్టేషన్‌లోనే ఉంచి అవమానించి, బెదిరించారు. చేయని నేరాలన్నీ మోపారు. ఆ రోజు రాత్రి పోలీసులు విడిచిపెట్టిన తర్వాత నాగమల్లేశ్వరరావు గుంటూరులోని తన సోదరుడి ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత తన తండ్రి వెంకటేశ్వర్లుకు ఫోన్‌చేసి, స్టేషన్‌లో పోలీసుల బెదిరింపులు, అవమానించిన తీరుతో పాటు, ఏ రకంగా కొట్టి హింసించారనేది చెప్పి, విలపించి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. దీంతో హుటాహుటిన గుంటూరు వెళ్లిన వెంకటేశ్వర్లు, కొడుకు నాగమల్లేశ్వరరావును ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ జూన్ 9న చనిపోయాడు.

దీనికి బాధ్యులెవరు?

నాగమల్లేశ్వరరావుకు భార్య, చిన్న పాప ఉంది. వారికి ఏం సమాధానం చెబుతారని చంద్రబాబును అడుగుతున్నా. మీ పార్టీకి అనుకూలంగా లేరన్న ఒకే ఒక్క కారణంతో కుల ప్రస్తావన తీసుకొచ్చి అవమానించి, బెదిరించి, తిట్టి, కొట్టి ఒక మనిషి చావుకు కారణం అయ్యారు. ఏడాది గడిచింది. ఈ మొత్తం కుటుంబం ఇవాళ్టికి కూడా శోకంలోనే ఉంది. మరి దీనికి బాధ్యులెవరు? వీరి ఇంటిపై రాళ్లు విసిరి, దాడి చేసిన వారి మీద ఎంత మందిని అరెస్టు చేశారు? ఎంత మంది మీద కేసులు పెట్టారు? ఎంత మందికి శిక్ష విధించారు? అని అడుగుతున్నా. ఇంతగా వేధించి చంపిన ఆ సీఐ మీద ఎలాంటి యాక్షన్ తీసుకున్నారని చంద్రబాబును నిలదీస్తున్నా. ఇక్కడ యథేచ్ఛగా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. చివరికి వెంకటేశ్వర్లు అన్న కోర్టు ద్వారా ప్రైవేటు కంప్లయింట్ ఇచ్చినా పట్టించుకునే పరిస్థితి లేదు.

ఆంక్షలపై దండెత్తిన జనం..

79 కిలోమీటర్లు.. ఏడున్నర గంటలు.. అడుగడుగునా పోటెత్తిన జనాభిమానం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జనాభిమానం ముందు ఆంక్షలు చిన్నబోయాయి. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పోలీసులు విధించిన నిబంధనలన్నీ కొట్టుకుపోయాయి. జనాన్ని బెదిరించి, ప్రతిపక్ష నేతను కట్టడి చేయాలనుకున్న వారి గూబ గుయ్.. మనేలా అడుగడుగునా అభిమాన జనం కేరింతలు మిన్నంటాయి. ఇసుకేస్తే రాలనంతగా.. కనుచూపు మేర జనంతో ఆ దారి జనసంద్రంగా మారిపోయింది. ఎక్కడా జనాన్ని తరలించడం కోసం వాహనాలు పెట్టలేదు.. వారికి బిర్యానీ పొట్లాలు అందించ లేదు.. పోలీసులు అడుగడుగునా అడ్డు కుంటున్నా సొంత వాహనాలపై అడ్డంకులు దాటు కుంటూ రెంటపాళ్లకు జనం పోటెత్తారు. రోడ్లపై బారికేడ్లు పెట్టి జనాన్ని రానీయకుండా పోలీసులు అడ్డుకుంటుండటంతో చాలా మంది పొలాల గుండా నడుచుకుంటూ, బైక్‌ల మీద తమ అభిమాన నేతను చూడటానికి తరలి వచ్చారు. కాన్వాయ్‌లో మూడు వాహనాలకే అనుమతి అని.. రెంటపాళ్లలో వందమందికి మించి అనుమతించబోమని 4 రోజుల నుంచి పోలీసులు ఊదరగొట్టినా, పల్నాడు జిల్లా వ్యాప్తంగా 25 చోట్ల చెక్‌పోస్టులు పెట్టి, వందలాది మంది పోలీసులను మోహరించి.. ఆధార్ చూపిస్తేనే పంపిస్తామని ఆంక్షలు పెట్టినా, వీటన్నింటిని దాటుకుని జనసంద్రం సునామీలా ఎగసిపడింది. పోలీసుల వేధింపులు, టీడీపీ నేతల దౌర్జన్యానికి మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామానికి చెందిన నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు 79 కిలోమీటర్ల దూరం ప్రయాణించేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఏడున్నర గంటల సమయం పట్టిందంటే జన స్పందన ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థమవుతోంది. షెడ్యూలు ప్రకారం ఉదయం 11 గంటలకు సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామానికి చేరుకోవలసిన జగన్.. సాయంత్రం 5 గంటలు దాటిన తర్వాత అక్కడికి వచ్చారు. అక్కడ నాగమల్లేశ్వర రావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అక్కడే పార్టీ జెండాను ఎగురవేశారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పాలమూరు బయోసైన్సెస్‌పై కేసు



కర్వెన శివారులోని పాలమూరు బయోసైన్సెస్ లిమిటెడ్ కంపెనీ

భూత్పూర్: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కర్వెన, మద్దిగట్ల గ్రామ శివారులోని పాలమూరు బయోసైన్సెస్ లిమిటెడ్‌పై కేసు నమోదైంది. కుక్కలు, కోతులు, పందులు, మేకలపై అశాస్త్రీయ పద్ధతిలో పరిశోధనలు చేస్తున్నారని పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్మెంట్ ఆఫ్ యానిమల్స్ (పీఈటీఏ) సంస్థ ఫిర్యాదు చేయడంతో ఈ నెల 16న భూత్పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పెటా సంస్థ ప్రతినిధులు, జంతువులపై ప్రయోగాల నియంత్రణ, పర్యవేక్షణ కమిటీ, జంతు సంరక్షణ సంస్థల సమాఖ్య పాలమూరు బయోసైన్సెస్‌ను మూసివేయాలని, కంపెనీ లైసెన్స్‌ను రద్దు చేయాలని కోరుతూ సీసీఎస్‌ఈఏ చైర్మన్‌కు ఫిర్యాదు చేశాయి. దీంతో తక్షణమే పాలమూరు బయోసైన్సెస్‌ను తనిఖీ చేయాలని సీసీఎస్‌ఈఏ చైర్మన్ ఆదేశించడంతో.. హైదరాబాద్ నుంచి నియంత్రణ, పర్యవేక్షణకు చెందిన ఆరుగురు సభ్యుల బృందం బయోసైన్సెస్ సంస్థలో తనిఖీలు నిర్వహించింది. అక్కడ జంతువులపై అశాస్త్రీయంగా పరిశోధనలు చేస్తున్నట్లు బృందం సభ్యులు గుర్తించారు. పీఈటీఏ ఫిర్యాదు మేరకు బయోసైన్సెస్ సంస్థపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ వివరించారు.

ప్రభుత్వ కుట్ర.. సిట్ కుతంత్రం

ఆధారాలు లేకుండానే చెవిరెడ్డిపై కేసు.. అక్రమ అరెస్టు..

రిమాండ్ నివేదిక సాక్షిగా ప్రభుత్వ పన్నాగం బట్టబయలు.. అవాస్తవాలు, అభూత కల్పనలతో రిమాండ్ నివేదిక

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ కుట్రతో సిట్ సాగిస్తున్న అక్రమ కేసు పన్నాగం మరోసారి బట్టబయలైంది. పూర్తిగా అవాస్తవాలు, అభూత కల్పనలతో సిట్ సమర్పించిన రిమాండ్ నివేదికే అసలు కుట్రను మరోసారి బయటపెట్టింది. ఓ కానిస్టేబుల్‌ను ప్రలోభాలకు గురిచేసి అబద్ధపు వాంగ్మూలాలు నమోదు.. తాము చెప్పినట్టు వినని మరో కానిస్టేబుల్‌పై థర్డ్ డిగ్రీతో చిత్రహింసలు.. కేసే లేకుండా అక్రమంగా లుక్ అవుట్ నోటీసులు.. ఆధారాలు లేకుండానే అక్రమ అరెస్టు.. హైకోర్టు ఆదేశాలు ఉల్లంఘన.. ఈసీ పరిధిలోని కేసు వక్రీకరణ.. ఇలా చెప్పుకుంటూ పోతే సిట్ అక్రమాలు, కుట్రలు అంతే లేకుండా సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన స్నేహితుడు వెంకటేశ్ నాయుడును న్యాయస్థానంలో హాజరుపరుస్తూ సిట్ సమర్పించిన రిమాండ్ నివేదికలు ప్రభుత్వ పెద్దల కుట్రను ఆధారాలతో సహా మరోసారి వెలుగులోకి తెచ్చాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోని మద్యం విధానంపై నమోదు చేసిన అక్రమ కేసులో అరెస్టు చేసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్‌నాయుడును సిట్ అధికారులు బుధవారం ఉదయం విజయవాడ తీసుకువచ్చారు. సిట్ కార్యాలయంలో విచారించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వారిద్దరినీ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరిచారు. చెవిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్‌రెడ్డి, వాణి తదితరులు వాదనలు వినిపించారు. ప్రభుత్వ పెద్దల రాజకీయ కుట్ర, దర్యాప్తు ముసుగులో సిట్ అధికారుల కుతంత్రాన్ని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన తరఫు న్యాయ వాదులు న్యాయ స్థానం దృష్టికి తీసుకువెళ్లారు. ఇది పక్కాగా రాజకీయ కుట్రతో పెట్టిన అక్రమ కేసు అని బలంగా వాదనలు వినిపించారు. సిట్ దర్యాప్తులో కుట్రను, లోపాలను ఆధారాలతో సహా వివరించారు.

గన్‌మెన్‌కు ప్రమోషన్ ప్రలోభం.. అబద్ధపు వాంగ్మూలం

ప్రభుత్వ పెద్దల రాజకీయ కుట్రను బట్టబయలు చేసిన సిట్ నివేదికలోని ప్రధాన అంశాలు ఇలా ఉన్నాయి. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వద్ద గతంలో గన్‌మెన్‌గా పనిచేసిన గిరి అనే ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్‌ను బెదిరించి, ప్రలోభపెట్టి లొంగదీసుకోవడం కుట్ర తీవ్రతను బయటపెడుతోంది. అందుకోసమే కానిస్టేబుల్ గిరిని సిట్ అధికారులు తాజాగా తెరపైకి తెచ్చారు. దాదాపు 10 నెలలుగా సాగుతున్న ఈ అక్రమ కేసు వ్యవహారంలో ఇప్పటివరకు ఆయన ప్రస్తావనే లేదు. కానీ.. హఠాత్తుగా తెరపైకి తెచ్చి ఆయనే కీలక సాక్షి అంటూ నమ్మించేందుకు సిట్ యత్నించింది. ఈ విధంగా ప్రతీసారి ఓ కొత్త పాత్రను ప్రవేశపెట్టి తమ కుట్రకు మరింత పదును పెట్టడం సిట్‌కు అలవాటుగా మారింది. అందుకోసం సిట్ అధికారులు పక్కా పన్నాగంతో వ్యవహరించారు. కానిస్టేబుల్ గిరిని వారం రోజుల పాటు సిట్ అధికారులు తమ అదుపులో ఉంచుకుని బెదిరించారు. తాము చెప్పినట్టు అబద్ధపు వాంగ్మూలం ఇవ్వకపోతే ఆయన్ను కూడా ఈ కేసులో నిందితుడుగా చేరుస్తామని.. సస్పెండ్ చేయిస్తామని.. జైలుకు పంపుతామని బెదిరించారు. తాము చెప్పినట్టుగా అబద్ధపు వాంగ్మూలం ఇస్తే జీతం పెంపుదలతోపాటు కోరుకున్న విభాగంలో పోస్టింగ్ ఇస్తామని ప్రలోభపెట్టారు. దాంతో గిరి సమ్మతించారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చెప్పడంతో హైదరాబాద్ నుంచి నగదును వాహనంలో ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు తాను ఎస్కార్టుగా వెళ్లినట్టు ఆయనతో అబద్ధపు వాంగ్మూలం నమోదు చేయించారు. తాము చెప్పినట్టు చేసిన గిరికి వెంటనే 60శాతం జీతం పెంపుదలతో ఆయన కోరుకున్న ఆక్టోపస్ విభాగంలో పోస్టింగ్ ఇచ్చారు. అంటే గిరి బెదిరింపులు, ప్రలోభాలకు గురయ్యే ఆ వాంగ్మూలం ఇచ్చినట్టు స్పష్టమైంది. కానిస్టేబుల్ గిరి చెప్పింది నిజమేనని భావిస్తే.. నగదు అక్రమంగా తరలింపునకు సహకరించిన ఆయన ఈ కేసులో నిందితుడు కావాలి. కానీ ఆయన్ను సిట్ అధికా రులు సాక్షిగా ఎలా పేర్కొంటారని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తరఫు న్యాయవాదులు ప్రశ్నించారు. అక్రమానికి సహకరించిన ప్రభుత్వ ఉద్యోగిని సాక్షిగా పేర్కొనడం సరికాదని.. నిందితుడిగానే పేర్కొనాలని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ప్రస్తావించారు.

ఆధారాలు లేవు.. సేకరించాల్సి ఉందన్న విచారణ అధికారి

ఎలాంటి ఆధారాలు లేకుండానే అక్రమంగా కేసు నమోదు చేసినట్టు సిట్ విచారణ అధికారే పరోక్షంగా అంగీకరించడం గమనార్హం. నగదు అక్రమంగా తరలించారని సిట్ చెబుతున్న రోజుల్లో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కానిస్టేబుల్ గిరితో ఫోన్‌లో మాట్లాడినట్టు కాల్ డేటా రికార్డు ఉందా అని ఆయన తరఫు న్యాయవాది ప్రశ్నించారు. ఇదే విషయాన్ని న్యాయస్థానం ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. ఆయన సరైన సమాధానం చెప్పలేకపోయారు. అప్పుడు విచారణ అధికారిని న్యాయస్థానం ప్రశ్నించింది. ఆ డేటా ఇంకా లేదని.. సేకరించాల్సి ఉందని విచారణ అధికారి చెప్పారు. అంటే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి వ్యతిరేకంగా సిట్ ఇప్పటివరకు కనీస ఆధారాలు కూడా సేకరించలేదని స్పష్టమైంది. ఆధారాలు లేకుండా కేసు నమోదు చేయడం, అరెస్టు చేయడం అక్రమమని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన తరఫు న్యాయవాదులు న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు.

అబద్ధపు వాంగ్మూలం ఇస్తే నామినేటెడ్ పదవి కట్టబెడతానన్నారు

ఈ అక్రమ కేసులో సిట్ అరెస్టు చేసిన వెంకటేశ్ నాయుడు న్యాయస్థానంలో అసలు కుట్రను వెల్ల డించారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి వ్యతిరేకంగా అబ ద్ధపు వాంగ్మూలం ఇవ్వాలని తనను, తన భార్యను సిట్ అధికారులు తీవ్రంగా బెదిరించి, వేధించారని తెలిపారు. ఆయన చెబితే నగదును అక్రమంగా తర లించినట్టు అంగీకరించాలని వేధించారన్నారు. తాము చెప్పినట్టుగా అబద్ధపు వాంగ్మూలం ఇస్తే రూ.2 కోట్ల నగదుతోపాటు ప్రభుత్వంలో నామి నేటెడ్ పదవి ఇస్తామని ప్రలోభపెట్టారని వెంకటేశ్‌నాయుడు వెల్లడించారు. అబద్ధపు వాంగ్మూ లం ఇవ్వడానికి తాము సమ్మతించనందునే తనను ఈ అక్రమ కేసులో నిందితుడిగా చేర్చి అరెస్టు చేశారని ఆయన న్యాయస్థానానికి నివేదించారు.

– న్యాయస్థానానికి నివేదించిన వెంకటేశ్ నాయుడు

వివరాల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కట్ అండ్ పేస్ట్ కుట్రే

ముందస్తు కుట్రతోనే అక్రమ కేసులు, అరెస్టులకు పాల్పడుతున్నట్టు సిట్ మరోసారి తన రిమాండ్ నివేదిక సాక్షిగా వెల్లడించింది. ప్రైవేటు వ్యాపారి అయిన వెంకటేశ్‌నాయుడును రిమాండ్ నివేదికలో ఐఏఎస్ అధికారి అని పేర్కొంది. గతంలో ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డిని అరెస్టు చేసినప్పటి రిమాండ్ నివేదికనే కాపీ పేస్టుచేసినట్టు బయటపడింది. ఆయనను ఐఏఎస్ అధికారిగా పేర్కొన్న సిట్ అధికారులు అదే నివేదికను కాపీ పేస్ట్ చేయడంతోనే వెంకటేశ్‌నాయుడు కూడా ఐఏఎస్ అధికారి అని న్యాయస్థానానికి సమర్పించిన రిమాండ్ నివేదికలో వచ్చింది. ఈ కేసులో సిట్ కాపీ అండ్ పేస్ట్ కుట్ర బయటపడటం ఇది రెండోసారి కావడం గమనార్హం.

'చంద్రబాబు సంతోషం కోసమే అక్రమ అరెస్టులు'

మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

సిట్ అధికారులను ఉద్దేశించి బహిరంగ లేఖ విడుదల


నేడు వైఎస్ జగన్ మీడియా సమావేశం



సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం మీడియా సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, జరుగుతున్న పరిణామాలపై ఆయన మీడియాతో మాట్లాడతారు.

వాసాలమర్రి గ్రామస్తులకు ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ దత్తత తీసుకున్న యాదాద్రి జిల్లా వాసాలమర్రి గ్రామంలో 205 కుటుంబాలకు తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని బుధవారం గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అప్పట్లో సీఎంగా కేసీఆర్ ఆ గ్రామానికి వెళ్లి అర్హులైన అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని, కానీ మళ్లీ ఆ గ్రామాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. గురువారం తాను స్వయంగా ఆ గ్రామానికి వెళ్లి మంజూరు పత్రాలు అందజేస్తానని తెలిపారు. యాదగిరిగుట్ట నుంచి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లే మార్గం ఇదే కావటంతో, రోడ్డు వెడల్పు సమయంలో చాలా మంది ఇళ్లు కోల్పోయారని, నిలువనీడలేక ఇంతకాలం వారు రోడ్డుపక్కన గుడిసెల్లో కాలం వెళ్లదీయాల్సి వచ్చిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...

నేడు మరోసారి ప్రభాకర్‌రావు విచారణ

సాక్షి, హైదరాబాద్‌: అక్రమ ఫోన్‌ ట్యాపింగ్‌ కేసులో కీలక నిందితుల విచారణతోపాటు సాక్షుల వాంగ్మూలాల నమోదు కొనసాగుతోంది. ఎస్‌ఐబీ మాజీ చీఫ్‌ టి.ప్రభాకర్‌రావు గురువారం నాలుగోసారి సిట్‌ విచారణకు హాజరుకానున్నారు. మరికొందరు నిందితులతో కలిపి ప్రభాకర్‌రావును ప్రశ్నించనున్నారు. మరోపక్క మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావును సిట్‌ అధికారులు బుధవారం ప్రశ్నించారు. ట్యాపింగ్‌ బాధితులుగా ఉన్న కాంగ్రెస్‌ నేత జైపాల్‌రెడ్డి, సైదులు, మరికొందరి నుంచి వాంగ్మూలాలు నమోదు చేశారు. కాగా, ఎస్‌ఐబీలోని స్పెషల్‌ ఆపరేషన్‌ టీమ్‌కు నేతృత్వం వహించిన ప్రణీత్‌రావు, రాష్ట్ర నిఘా విభాగాధిపతి కార్యాలయాలను కూడా వాడుకున్నట్లు గుర్తించారు. నిఘా చీఫ్‌కు లక్డీకాపూల్‌లోని ఇంటెలిజెన్స్‌ ప్రధాన కార్యాలయంలో అధికారిక చాంబర్‌ ఉంటుంది. గ్రీన్‌ల్యాండ్స్‌లోని ఎస్‌ఐబీ కార్యాలయంలోనూ మరో చాంబర్‌ ఉంది. ప్రణీత్‌రావు ఈ 2 కార్యాలయాల్లోనూ ఎస్‌ఓటీ ఏర్పాటు చేసుకున్నారని సిట్‌ గుర్తించింది. ఇన్‌స్పెక్టర్, సబ్‌ఇన్‌స్పెక్టర్, హెడ్‌కానిస్టేబుల్, 15 మంది కానిస్టేబుళ్ల సహకారంతో ట్యాపింగ్‌ చేసినట్లు సిట్‌ అధికారులు చెబుతున్నారు. వీరిని విచారిస్తున్న సమయంలోనే ఉన్నతాధికారులకు ఉన్న సంబంధాలు బయటపడ్డాయని అంటున్నారు. 2023 ఎన్నికల సందర్భంలో నిఘా విభాగాధిపతిగా ఉన్న అనిల్‌కుమార్, హోం శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీగా ఉన్న ప్రస్తుత డీజీపీ జితేందర్‌ నుంచి ఈ కేసులో సిట్‌ అధికారులు తాజాగా వాంగ్మూలాలు నమోదు చేశారు. త్వరలోనే మాజీ సీఎస్‌ సహా మరికొందరు ఉన్నతాధికారుల వాంగ్మూలాలు సేకరిస్తారని తెలుస్తోంది.

రిజర్వేషన్లు ఇవ్వకుంటే వందలాదిగా నామినేషన్లు వేస్తాం

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్‌: బీసీ సామాజికవర్గానికి 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే గ్రామగ్రామాన వందలాది మందితో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు నామినేషన్లు వేయిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ఢిల్లీకి వెళ్లడంలో హాఫ్‌ సెంచరీ పూర్తి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి బీసీ బిల్లుపై ప్రధానితో ఒక్కసారి కూడా చర్చించకపోవడం దారుణమన్నారు. బీసీ బిల్లు కోసం బీజేపీ తెలంగాణ వికసిత్‌ యాత్ర చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీసీ బిల్లు కోసం జూలై 16న తాము చేపట్టే రైల్‌ రోకో కార్యక్రమానికి కులసంఘాల నుంచి పెద్దఎత్తున మద్దతు లభిస్తోందన్నారు. కాగా, నల్లమల పులిని అని తరచూ చెప్పుకునే రేవంత్‌రెడ్డి ఏపీ జలదోపిడీని నివారించడంలో కాగితం పులిలా మిగిలిపోయారని కవిత ఎద్దేవా చేశారు. చంద్రబాబు 'గోదావరి- కావేరి అనుసంధానం' పేరిట ప్రాజెక్టు కోసం ప్రయత్నం చేస్తుంటే తెలంగాణ సీఎం ఎందుకు స్పందించడం లేదని ఆమె ప్రశ్నించారు.

రోడ్డు విస్తరణలో జనశక్తి నేతల ఇళ్లు కూల్చివేత



నేలమట్టమైన జనశక్తి అగ్రనేతల ఇళ్లు

వేములవాడ: రోడ్ల వెడల్పులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని ముదిరాజ్‌ వీధిలో జనశక్తి అగ్రనేతలు కూర రాజన్న, కూర దేవేందర్, విమలక్కకు చెందిన ఇంటిని అధికారులు కూల్చి వేశారు. మూడు రోజులుగా జరుగుతున్న రోడ్ల విస్తరణ ప్రక్రియలో భాగంగా బుధవారం పూర్తి స్థాయిలో 80 ఫీట్ల వరకున్న ఇళ్లను కూల్చేశారు.

నిందితురాలిగా కాదు.. సాక్షిగా పరిగణించండి

యాంకర్‌ శ్యామలకు హైకోర్టులో ఊరట

సాక్షి, హైదరాబాద్‌: సైబర్‌ క్రైమ్‌ పోలీసులు నమోదు చేసిన ఓ కేసులో యాంకర్‌ శ్యామలను నిందితురాలిగా కాకుండా.. సాక్షిగా పరిగణించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఒక అంశంపై ఒకసారి కేసు నమోదు చేసిన తర్వాత, మళ్లీ మరో కేసు నమోదు చేయడం సుప్రీంకోర్టు టీటీ ఆంటోనీ కేసులో ఇచ్చిన తీర్పునకు విరుద్ధమని అభిప్రాయపడింది. దర్యాప్తునకు సహకరించాలని శ్యామలను ఆదేశిస్తూ తాజా పిటిషన్‌లో విచారణను ముగించింది. సైబర్‌ క్రైమ్‌ పోలీస్‌స్టేషన్‌లో ఏప్రిల్‌ 2న పెట్టిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ యాంకర్‌ శ్యామల హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్‌ ఎస్‌.తుకారాంజీ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్‌ తరఫున న్యాయవాది గుర్రం రఘు వాదనలు వినిపిస్తూ.. బెట్టింగ్‌ యాప్స్‌కు సంబంధించి గతంలో పిటిషనర్‌పై పంజాగుట్ట పీఎస్‌లో ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేశారన్నారు. దీనిపై హైకోర్టు ఇచ్చిన సూచనలను పిటిషనర్‌ పాటిస్తున్నారని, విచారణకు సహకరిస్తున్నారని చెప్పారు. అయితే రెండు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడం చట్టవిరుద్ధమని వెల్లడించారు. ఈ వాదనలు విన్న న్యాయ మూర్తి.. రెండో ఎఫ్‌ఐఆర్‌లో సాక్షిగా మాత్రమే పిటిషనర్‌ను పరిగణనలోకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

రైతుల చేతులకు సంకెళ్లు!

- పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు
- ధన్వాడకు చెందిన 12 మందికి మంగళవారమే బెయిల్‌ మంజూరు
- అయినా సంకెళ్లు వేసి కోర్టులో హాజరుపరిచిన వైనం.. రాత్రికి విడుదల
- ముగ్గురిని సస్పెండ్‌ చేశామన్న గద్వాల ఎస్పీ



అలంపూర్‌ కోర్టుకు సంకెళ్లతో హాజరైన రైతులు



జైలు నుంచి విడుదల అవుతున్న రైతులు

అలంపూర్‌: ఇథనాల్‌ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకించే క్రమంలో చోటు చేసుకున్న గొడవతో రిమాండ్‌లో ఉన్న రైతులకు పోలీసులు సంకెళ్లు వేసి కోర్టుకు తీసుకురావడం వివాదాస్పదమైంది. వివరాల్లోకి వెళితే.. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో గాయత్రి రెన్యూవబుల్‌ అన్‌లైన్‌ ఇండస్ట్రీస్‌ కంపెనీ ఇథనాల్‌ కంపెనీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే దీనిని పెద్ద ధన్వాడతో పాటు ఆ చుట్టూ ఉన్న 12 గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన కంపెనీ నిర్మాణ పనులు ఆరంభించడానికి యాజమాన్యం సామగ్రి సిద్ధం చేసుకుంది. దీన్ని ప్రజలు అడ్డుకునే క్రమంలో తీవ్ర ఉద్రికత్త చోటు చేసుకుంది. దీంతో 41 మంది రైతులపై రాజోలి పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. అందులో 12 మంది రైతులను ఈ నెల 5వ తేదీన గద్వాల కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌ విధించారు. వీరికి సంబంధించి బుధవారం వాయిదా ఉండటంతో అలంపూర్‌ కోర్టులో హాజరుపర్చారు. అయితే వీరి చేతులకు సంకెళ్లు వేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. అన్నం పెట్టే రైతన్నల చేతికి కరుడుగట్టిన నేరస్తుల తరహాలో సంకెళ్లు వేయడం ఏమిటంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు ఈ దృశ్యాలను సోషల్‌ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. ఆ తర్వాత మీడియాలో కథనాలుగా రావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ అంశం చర్చనీయాంశమయ్యింది. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు రైతులకు మద్దతుగా నిలిచాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం దీన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం.

17నే బెయిల్‌ మంజూరు.. ఎట్టకేలకు విడుదల

మహబూబ్‌నగర్‌ జిల్లా జైలులో రిమాండ్‌ ఖైదీలుగా ఉన్న రైతులకు వాస్తవానికి మంగళవారమే బెయిల్‌ మంజూరైంది. గద్వాల కోర్టు 12 మంది రైతులకు షరతులతో కూడిన బెయిల్‌ మంజూరు చేసింది. రైతులు ఒకవైపు కోర్టు వాయిదాకు హాజరు కాగా.. మరోవైపు వారి బెయిల్‌కు సంబంధించిన జామీన్‌ల ప్రక్రియ కొనసాగింది. చివరకు బుధవారం రాత్రి రైతులు బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం మాట్లాడుతూ పచ్చని పొలాల్లో ఇథనాల్‌ పరిశ్రమ ఏర్పాటుతో రైతుల జీవితాల్లో కాంగ్రెస్‌ పార్టీ చిచ్చు పెట్టిందని ఆరోపించారు.

ముగ్గురు పోలీస్‌ అధికారుల సస్పెన్షన్‌

ఈ ఉదంతంపై జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావును 'సాక్షి' సంప్రదించగా..ఇందుకు కారణమైన ముగ్గురు అధికారులను సస్పెండ్‌ చేసినట్లు ఆయన తెలిపారు. రైతులను జైలు నుంచి కోర్టుకు తీసుకొచ్చే క్రమంలో పోలీస్‌ ఉన్నతాధికారుల సూచనలు పాటించకుండా విధుల పట్ల అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంఘటనలో ఒక ఆర్‌ఎస్‌ఐ, ఇద్దరు ఏఆర్‌ ఎస్‌ఐలను సస్పెండ్‌ చేశామని చెప్పారు.

మరో పదేళ్లలో కరెంటు డిమాండ్‌ డబుల్‌

- గ్రీన్‌ ఎనర్జీతో అదనంగా 20 వేల మెగావాట్ల ఉత్పత్తికి ప్రణాళికలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. విద్యుత్‌ అంబులెన్స్‌లు ప్రారంభం
- మంత్రి పొన్నంతో కలిసి పలు కార్యక్రమాలకు హాజరు



విద్యుత్‌ ఉద్యోగులకు సేఫ్టీ టూల్‌ కిట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం ప్రభాకర్‌

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: మరో పదేళ్లలో కరెంట్‌ డిమాండ్‌ డబుల్‌ కానుందని.. గ్రీన్‌ ఎనర్జీ ద్వారా 2029 – 30 నాటికి అదనంగా 20 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తికి ప్రణాళికలు రూపొందించామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ విద్యుత్‌ శాఖలో లైన్‌మెన్‌ నుంచి సీఎండీ వరకు రూ.కోటి విలువైన బీమా కల్పిస్తున్నామని చెప్పారు. ఖమ్మంలో బుధవారం ఆయన 1912 నంబర్‌తో అందుబాటులోకి తీసుకొచ్చిన విద్యుత్‌ అంబులెన్స్‌లతో పాటు విద్యుత్‌ ఉద్యోగుల హెల్త్‌ క్యాంప్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఆ తర్వాత ఖమ్మం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. బోనకల్‌ మండలం సీతానగరం సబ్‌స్టేషన్‌లో రియల్‌ టైమ్‌ ఫీడర్‌ మేనేజ్‌మెంట్, ఫాల్ట్‌ పాసేజ్‌ ఇండికేటర్‌ సిస్టమ్‌ను ప్రారంభించి, మధిరలో నూతన బస్టాండ్‌ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో భట్టి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్ల పాటు ఎనర్జీ పాలసీని తీసుకురాలేదని, తాము అధికారంలోకి వచ్చాక కొత్త విద్యుత్‌ విధానం అమలు చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్‌ వస్తే కరెంట్‌ ఉండదని కొందరు ప్రచారం చేసినా, ఇప్పుడు విద్యుత్‌ వినియోగం పెరిగినప్పటికీ అవాంతరాలు లేకుండా సరఫరా చేస్తున్నామని తెలిపారు. కాగా, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఇటీవల నియమితులైన వాకిటి శ్రీహరి బుధవారం ఖమ్మంలో భట్టివిక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు.

సెటిల్‌మెంట్లకు అడ్డాగా పోలీస్‌స్టేషన్లు

- బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ ధ్వజం
- పోలీసులు వేధించడంతోనే కుంటయ్య ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపణ
- బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్‌ పార్టీ అండగా ఉంటుందని హామీ



కుంటయ్య కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న కేటీఆర్‌

సిరిసిల్ల: కాంగ్రెస్‌ హయాంలో పోలీస్‌స్టేషన్లు సెటిల్‌మెంట్లకు అడ్డాగా మారాయని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం అంకుశాపూర్‌లో ఆత్మహత్య చేసుకున్న బీఆర్‌ఎస్‌ మాజీ ఎంపీటీసీ కరికవేని కుంటయ్య(48) కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. కుంటయ్య మృతదేహం వద్ద నివాళి అర్పించి, ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ మాట్లాడుతూ, తన భూమిని కాంగ్రెస్‌ నేత కబ్జా చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేస్తే, ఉల్టా కుంటయ్యపైనే కేసు పెట్టి వేధించడంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. సివిల్‌ అంశాల్లో పోలీసులు సెటిల్‌మెంట్లు, అరాచకాలు చేయడం సమాజానికి ఎంతమాత్రం మంచిది కాదని అన్నారు. కుంటయ్య చావుకు కారణమైన పోలీసులపై చర్యలు తీసుకునే వరకు న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. రాజకీయ నాయకులు అంటే అందరూ ఏదేదో ఊహించుకుంటారని, బయటకు గంభీరంగా కనపడ్డా లోపల దుఃఖాన్ని దాచుకొని ప్రజల కోసం పనిచేస్తున్నామని అన్నారు. కుంటయ్య ఇద్దరు పిల్లల చదువులు, వారి పెళ్లిళ్ల విషయాన్ని తాను చూసుకుంటానని కేటీఆర్‌ భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి పార్టీ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందన్నారు.

మెడికల్‌ కాలేజీల్లో 612 అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ పోస్టులు

- నియామకానికి మెడికల్‌ రిక్రూట్‌మెంట్‌ బోర్డు ఆమోదం
- త్వరలో నోటిఫికేషన్‌ – తప్పనున్న బోధన ఇక్కట్లు
- ఇప్పుడున్న అసిస్టెంట్‌ ప్రొఫెసర్లకు అసోసియేట్‌ ప్రొఫెసర్లుగా పదోన్నతి
- త్వరలో 56 మంది ప్రొఫెసర్లకు అదనపు డీఎంఈలుగా పదోన్నతులు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బోధన సిబ్బంది నియామకానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలపటంతో మెడికల్‌ రిక్రూట్‌మెంట్‌ బోర్డు ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్లు సరిపడా లేరని, మౌలిక సదుపాయాలు కూడా లేవని ఇటీవల జాతీయ వైద్య కమిషన్‌ (ఎన్‌ఎంసీ) తప్పుపట్టిన నేపథ్యంలో అవసరమైన నియామకాలకు సీఎం పచ్చజెండా ఊపారు. దీంతో మొదటగా అసిస్టెంట్‌ ప్రొఫెసర్ల నియామకం చేపట్టాలని వైద్యారోగ్య శాఖ నిర్ణయించింది. రాష్ట్రంలోని 34 ప్రభుత్వ కళాశాలలకు 1,323 మంది అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు అవసరమని మెడికల్‌ ఎడ్యుకేషన్‌ డైరెక్టర్‌ ప్రతిపాదించగా, తొలి విడతగా 612 మంది నియామకానికి మెడికల్‌ రిక్రూట్‌మెంట్‌ బోర్డు ఆమోదం తెలిపిందని విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు త్వరలోనే నోటిఫికేషన్‌ విడుదల చేయాలని నిర్ణయించారు.

56 మందికి అదనపు డీఎంఈలుగా పదోన్నతి

రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్‌ కళాశాలల్లో మెడికల్‌ సూపరింటెండెంట్‌ పోస్టులు 71 మంజూరు కాగా, 15 మంది మాత్రమే రెగ్యులర్‌ పోస్టుల్లో ఉన్నారు. మిగతా 56 చోట్ల ఇన్‌చార్జీలనే కొనసాగిస్తున్నారు. ప్రొఫెసర్ల నుంచి అదనపు డీఎంఈలుగా పదోన్నతి పొందిన వారే సూపరింటెండెంట్లుగా నియమితులయ్యే అవకాశం ఉంటుంది. దీంతో అసిస్టెంట్‌ ప్రొఫెసర్ల స్థాయి నుంచి కొందరికి పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం కూడా పదోన్నతులకు అవసరమైన అనుభవం, వయస్సులో కొంత సడలింపు ఇచ్చినట్లు సమాచారం. అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా 4 ఏళ్లు పనిచేసిన వారిని అసోసియేట్‌ ప్రొఫెసర్లుగా, నాలుగేళ్ల అనుభవం ఉన్న అసోసియేట్‌ ప్రొఫెసర్లను ప్రొఫెసర్లుగా, మూడేళ్లు పనిచేసిన ప్రొఫెసర్లను అదనపు డీఎంఈలుగా నియమించాలి. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 1,500 మంది అసిస్టెంట్‌ ప్రొఫెసర్లలో అర్హులైన వారికి అసోసియేట్‌ ప్రొఫెసర్లుగా, అసోసియేట్‌ ప్రొఫెసర్లను ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించనున్నారు. ప్రొఫెసర్లుగా ఉన్న 56 మందికి అదనపు డీఎంఈలుగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈతరం జ్ఞాపకశక్తి ఫోన్‌లోనే..

- ప్రతిదానికి ఫోన్‌పైనే ఆధారపడుతున్నారు
- పిటిషన్లు చదవడం అలవాటు చేసుకోవాలి
- యువ న్యాయవాదులకు జస్టిస్‌ విజయ్‌సేన్‌రెడ్డి సూచన

సాక్షి, హైదరాబాద్‌: ఈ తరం జ్ఞాపకశక్తి అంతా వారి ఫోన్‌లోనే ఉంటోందని, చిన్న చిన్న అంశాలను గుర్తుంచుకోలేకపోతున్నారని జస్టిస్‌ బి.విజయ్‌సేన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఓ కేసు విచారణ సందర్భంగా అడిగిన ప్రశ్నకు న్యాయవాది సమాధానం చెప్పకపోవడంతో ఆయన ఈ విధంగా స్పందించారు. పిటిషన్లు చదవడం, అవసరమైతే రాయడాన్ని యువ న్యాయవాదులు అలవాటు చేసుకోవాలని సూచించారు. నెలలు గడిచినా కేసు వివరాలు తెలియకపోతే ఎలా అని మందలించారు. టీజీ సెట్‌ 2024లో తాను అర్హత సాధించలేదని ప్రకటించడాన్ని సవాల్‌ చేస్తూ, సిద్దిపేట జిల్లా బెజ్జంకికి చెందిన ఎల్‌.సారవ్వ హైకోర్టులో పిటిషన్‌ వేశారు. కీ ప్రకారం వచ్చిన మార్కులకు, వాస్తవ మార్కులకు తేడా ఉందని, తనను ఎంపిక చేసేలా టీజీ సెట్‌ చైర్మన్‌కు, సభ్యకార్యదర్శికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్‌ విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా టీజీ సెట్‌ మొత్తం ఎన్ని మార్కులకు అని ప్రశ్నించగా, న్యాయవాది సమాధానం చెప్పలేకపోయారు. దీంతో న్యాయమూర్తి.. ప్రతీ దానికి ఈ తరం ఫోన్‌పైనే ఆధారపడుతోందని వ్యాఖ్యానించారు. ఉస్మానియా వర్సిటీ తరఫు న్యాయవాది మాట్లాడుతూ.. 'నిపుణులు తేల్చిన తర్వాతే తుది కీ విడుదల చేశాం. పిటిషనర్‌ ప్రాథమిక కీతో పోల్చుకుని రెండు మార్కులు తక్కువ వచ్చాయని ఆరోపిస్తున్నారు. మరోసారి పరీక్ష రాసుకునేందుకు పిటిషనర్‌కు అర్హత ఉంది. పిటిషనర్‌ ఒక్కరే చాలెంజ్‌ చేశారు. ఇతరులు ఎవరు కూడా పరీక్షను సవాల్‌ చేయలేదు. లెక్చరర్లు, అసిస్టెంట్‌ ప్రొఫెసర్ల ఎంపికకు ఇది అర్హత పరీక్ష మాత్రమే'అని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఉత్తర్వుల కోసం విచారణను గురువారానికి వాయిదా వేశారు.

నిషేధముంటే ఎలా అనుమతిస్తారు? సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో

కుటుంబ సభ్యులే కొట్టిచంపారు..



కిషన్‌

- ప్రియుడితో మాట్లాడొద్దని చిన్నకుమార్తెను మందలించిన తండ్రి
- కొట్టి చంపిన భార్య, ఇద్దరు కూతుళ్లు, చిన్నకూతురి ప్రియుడు
- మరిపెడ మండలం డీఎస్సార్‌ జెండాల్‌ తండాలో ఘటన

మరిపెడ రూరల్‌: ఇంటి పెద్దను సొంత కుటుంబమే కబళించింది. ప్రియుడితో మాట్లాడొద్దని చిన్న కుమార్తెను తండ్రి మందలించగా ఆగ్రహం చెందిన అతని భార్య, చిన్న కుమార్తె, ఆమె ప్రియుడు, పెద్ద కుమార్తె కలిసి దారుణంగా కొట్టారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇంటిపెద్ద చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఈ ఘటన మహబూబాబాద్‌ జిల్లా మరిపెడ మండలం డీఎస్‌ఆర్‌ జెండాల్‌ తండాలో చోటు చేసుకుంది. ఎస్సై బొలగాని సతీశ్‌ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కాకరవాయి జీపీ పరిధిలోని మంగలిబండ తండాకు చెందిన ధరావత్‌ కిషన్‌ (45)కు మహబూబాబాద్‌ జిల్లా మరిపెడ మండలం డీఎస్‌ఆర్‌ జెండాల్‌ తండాకు చెందిన కావ్యతో 25 ఏళ్ల క్రితం వివాహమైంది. కిషన్‌ ఇల్లరికం వచ్చి ఉంటున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా, చిన్న కుమార్తె పల్లవి అదేతండాకు చెందిన భూక్య సురేశ్‌తో ప్రేమలో పడింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం సురేశ్‌తో ఫోన్‌లో మాట్లాడుతుండగా కిషన్‌ మందలించాడు. దీంతో ఆగ్రహించిన భార్య కావ్య, చిన్న కుమార్తె పల్లవి, ప్రియుడు సురేశ్, అతడి తండ్రి చందు, మరొకరు దేవేందర్, పెద్ద కుమార్తె రమ్య.. ఆరుగురూ కలిసి కిషన్‌ కాళ్లు, చేతులను తాళ్లతో కట్టేసి కొట్టారు. దీంతో మర్మాయవాలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చూసి కిషన్‌ స్వగ్రామం మంగలిబండతండాలోని కుటుంబీకులకు తెలిపారు. దీంతో వారు హుటాహుటిన వచ్చి కిషన్‌ను మహబూబాబాద్‌ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తల్లి సాంకి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్‌ తెలిపారు. కాగా, బుధవారం మృతుడి కుటుంబ సభ్యులు న్యాయం చేయాలంటూ మరిపెడ పోలీస్‌స్టేషన్‌ ఎదుట ఆందోళన చేశారు.

భూమి కోసమే కడతేర్చారు..

'ఇల్లరికం వెళ్లిన నా కొడుకు కిషన్‌కు అక్కడ 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని మా మనవరాలు పల్లవి ప్రియుడు అదేతండాకు చెందిన భూక్య సురేశ్‌ గతంలో సాదాబైనామా కింద తన కుటుంబ సభ్యుల పేర పట్టా చేయించుకున్నాడు. నా కొడుకు కిషన్‌ ఈ భూమి కోసం సురేశ్‌ను నిలదీశాడు. భూమి పోతుందని మనసులో పెట్టుకున్న సురేశ్‌ నా కొడుకును హత్య చేశాడు'అని బోరున విలపించింది. కాగా, సురేశ్‌ గతంలోనే జైలు జీవితం గడిపాడు.

అన్నదాతలకు సంకెళ్లు అమానుషం

- బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీ రామారావు
- ఇవేనా ఇందిరమ్మ రాజ్య ఆనవాళ్లు?: హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్‌: జోగుళాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో ఇథనాల్‌ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు పోలీసులు బేడీలు వేయడం పట్ల బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీ రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతల చేతికి సంకెళ్లు వేసి అలంపూర్‌ కోర్టుకు తీసుకురావడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక్షస మనస్తత్వానికి పరాకాష్ట అని మండిపడ్డారు. తమ భూముల్లో ఇథనాల్‌ ఫ్యాక్టరీ వద్దంటూ కొన్ని నెలల నుంచి శాంతియుతంగా పోరాడుతున్న రైతుల మీద అక్రమ కేసులు పెట్టడంతో పాటు దొంగల మాదిరిగా బేడీలు వేసి ప్రజాస్వామ్య విలువలకు ఈ ప్రభుత్వం పాతర వేసిందని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తన అల్లుడి ఫార్మా కంపెనీని అడ్డుకుంటున్నారన్న అక్కసుతో లగచర్ల రైతులపై కూడా ఇదే విధంగా రేవంత్‌రెడ్డి అమానుషంగా ప్రవర్తించారని కేటీఆర్‌ విమర్శించారు. గుండెపోటుతో పడిపోయిన వ్యక్తికి కూడా కనికరం లేకుండా బేడీలు వేయించాడని, ఆ ఘటన కాంగ్రెస్‌ ప్రభుత్వం చరిత్రలో మచ్చగా నిలుస్తుందని ధ్వజమెత్తారు. ఇప్పుడు పెద్దధన్వాడ రైతులను లక్ష్యంగా చేసుకొని, పోలీసులతో హింసించడం ప్రజాస్వామ్యంపై దాడేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందని, అన్నదాతలకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. కాగా, లగచర్ల నుంచి రాజోలి దాకా రైతు చేతులకు సంకెళ్లు, పౌరహక్కుల నేతలపై నిర్బంధాలు.. ఇవేనా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన ఇందిరమ్మ రాజ్యం ఆనవాళ్లు? అని మాజీ మంత్రి హరీశ్‌రావు వేరొక ప్రకటనలో ప్రశ్నించారు.

నాలుగెకరాల రైతులకు 'భరోసా'

- మూడో రోజు మరో రూ.1,313.53 కోట్లు విడుదల
- ఇప్పటివరకు రూ.5,215 కోట్లు రైతు భరోసాకు ఇచ్చిన ప్రభుత్వం
- రైతుల సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వం వరుసగా మూడోరోజు కూడా రైతు భరోసా కింద రైతులకు పెట్టుబడి సాయాన్ని విడుదల చేసింది. నాలుగు ఎకరాల లోపు భూమి ఉన్న 6.33 లక్షల మంది రైతులకు చెందిన 21.89 లక్షల ఎకరాలకు రూ.1,313.53 కోట్లను వారివారి బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. రాష్ట్రంలోని మొత్తం 71 లక్షల మంది రైతులకుగాను ఇప్పటివరకు 58.04 లక్షల మందికి రూ.5,215.26 కోట్లు పెట్టుబడి సాయం కింద అందించింది. మరో రూ.3.5 వేల కోట్లు మిగతా రైతుల ఖాతాల్లో జమచేయాల్సి ఉంది.

రైతుభరోసాపై బీఆర్‌ఎస్‌ అబద్ధాలు

9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వరుసగా మూడో రోజు రైతుభరోసా నిధులు విడుదల చేసినట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు భరోసా విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు బీఆర్‌ఎస్‌ నాయకులకు లేదని అన్నారు. బీఆర్‌ఎస్‌ నాయకులు రైతుభరోసా విషయంలో మోసపూరిత ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఒక సందర్భంలో మినహా రైతుబంధు సహాయం ఎప్పుడూ సాగు కాలానికి ముందుగా ఇవ్వలేకపోయిందని తెలిపారు. తమ ప్రభుత్వం తెలంగాణ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్‌ నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు.

సబ్‌కమిటీ ముందుకు కాళేశ్వరం తుది రిపోర్టు రాలేదు

- కమిషన్‌ ముందు ఈటల అసత్యాలు చెప్పారు
- మంత్రి తుమ్మల పునరుద్ఘాటన

సాక్షి, హైదరాబాద్‌: గత ప్రభుత్వ హయాంలో తాను సభ్యునిగా ఉన్న సబ్‌కమిటీ ముందుకు కాళేశ్వరం ప్రాజెక్టు తుది రిపోర్టు రాలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పునరుద్ఘాటించారు. ప్రాణహితతో పాటు రాష్ట్రంలోని అన్ని పెండింగ్‌ ప్రాజెక్టులు, పురోగతిలో ఉన్న ప్రాజెక్టులపై మాత్రమే అప్పట్లో మంత్రివర్గ ఉపసంఘం నియమించారని ఆయన చెప్పారు. మంత్రితో ముఖాముఖి.. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం ఆయన గాంధీభవన్‌కు వచ్చి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో కొద్దిసేపు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. సబ్‌కమిటీ కేవలం సిఫారసులు మాత్రమే చేస్తుందని, బరాజ్‌లు, రిజర్వాయర్‌లకు అనుమతి మంజూరు చేయదని చెప్పారు. కాళేశ్వరం విచారణ కమిషన్‌ ముందు మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ అసత్యాలు మాట్లాడారని అన్నారు. కాళేశ్వరం కమిషన్‌ అడిగిన వివరాల లేఖ ప్రభుత్వానికి అందిందని, బహుశా ఆ వివరాలన్నింటినీ ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా ముఖాముఖి కార్యక్రమంలో ప్రజలు వారి సమస్యల గురించి వినతిపత్రాలు సమర్పించారని, వాటిలో ఎక్కువగా పేదల నుంచే వచ్చాయని చెప్పారు. ఆ వినతులన్నింటినీ పరిశీలించి సాధ్యమైన మేరకు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో మాట్లాడి ఆదేశాలిచ్చినట్టు ఆయన వెల్లడించారు.

'గిరిజన' శాఖను సీతక్కకు ఇవ్వండి

సీఎంకు ఖమ్మం జిల్లా ఆదివాసీ ఎమ్మెల్యేల వినతి

సాక్షి, హైదరాబాద్‌: గిరిజన సంక్షేమ శాఖను తమ వర్గానికి చెందిన మంత్రి సీతక్కకు కేటాయించాలని ఖమ్మం జిల్లా ఆదివాసీ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్యలు బుధవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌ని కలిశారు.

ఆదేశాలు అమలు చేయకుంటే.. 2 వారాలు జైలు

- ఐఏఎస్‌ అరవింద్‌కుమార్‌కు హైకోర్టు హెచ్చరిక
- హెచ్‌ఎండీఏ అధికారి ప్రసూనాంబకు కూడా..
- ధిక్కరణ పిటిషన్‌లో ఉన్నత న్యాయస్థానం తీర్పు

సాక్షి, హైదరాబాద్‌: భూ కేటాయింపునకు సంబంధించి గతంలో తమకు ఇచ్చిన హామీని అమలు చేయనందుకు నాటి హెచ్‌ఎండీఏ కమిషనర్‌ అరవింద్‌కుమార్, మరో అధికారి ప్రసూనాంబపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మూసీ సుందరీకరణ కోసం సేకరించిన భూమికి బదులుగా యజమానికి 2016లో కేటాయించిన మేరకు 666.67 గజాల స్థలాన్ని ఇవ్వాలని 2023, ఫిబ్రవరిలో అధికారులను ఆదేశించింది. అయితే రెండున్నరేళ్లు అవుతున్నా ఆ ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై మండిపడింది. 3 నెలల్లో తమ ఆదేశాలను అమలు చేయాలని, భూమిని యజమానికి రిజిస్ట్రేషన్‌ చేసి ఇవ్వాలని మరోసారి ఆదేశాలు జారీ చేసింది. లేనిపక్షంలో అరవింద్‌కుమార్, ప్రసూనాంబ రెండు వారాలు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని, రూ.వెయ్యి జరిమానా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. జరిమానా చెల్లించకుంటే మరో వారం జైలుకు వెళ్లాలంటూ తీర్పు వెల్లడించారు. మూసీ సుందరీకరణలో భాగంగా ఉప్పల్‌ భగాయత్‌లో భూమిని సేకరించిన అధికారులు, బదులుగా భూమి ఇవ్వడం లేదంటూ బంజారాహిల్స్‌కు చెందిన రాంరెడ్డి హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. నాలుగు వారాల్లోపు 666.67 గజాల ప్లాట్‌ నంబర్‌ 181ను రిజిస్ట్రేషన్‌ చేసి ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో బాధితుడు కోర్టు ధిక్కరణ పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్‌ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఎకరానికి 1,000 గజాల చొప్పున అభివృద్ధి చేసిన స్థలాన్ని యజమానులకు ఇస్తామన్న సర్కార్, పిటిషనర్‌కు 666.67 గజాల ప్లాట్‌ను కేటాయించిందని అతని తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. కోర్టు ఆదేశాలు ఇచ్చినా.. ఉద్దేశపూర్వకంగా అధికారులు ప్లాట్‌ రిజిస్ట్రేషన్‌ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి భూమి అప్పగింతపై ఇప్పటికే అధికారులు పలుమార్లు కోర్టుకు హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. గతంలో ఇచ్చిన ఉత్తర్వుల మేరకు 3 నెలల్లో రిజిస్ట్రేషన్‌ చేసి ప్లాట్‌ ఇవ్వాలని.. లేకుంటే ప్రతివాదులైన అరవింద్‌కుమార్, ప్రసూనాంబ జైలుకు వెళ్లాల్సిందేనని తేల్చిచెప్పారు.



● బడి గంట | నేటి నుంచి వరుస కథనాలు

స్కూల్ ఫీజ్ ఎంత కడుతున్నారో మీకు తెలుసుగాని ఆ కట్టిన డబ్బులోని ప్రతి పైసాకు సరిపడే విధంగా అక్కడ పాఠాలు చెబుతున్నారా? సౌకర్యాలు ఉన్నాయా? టీచర్లు యోగ్యులేనా? విద్యావిధానంలో వారి తాత్త్వికత ఏమిటి? స్టూడెంట్-టీచర్ మధ్య అనుబంధం ఉందా? ఆటలు ఉన్నాయా? విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం నేటి నుంచి అవగాహన కథనాలు...

మీ పిల్లలది మంచి స్కూలేనా?

'మా పిల్లలు చాలా పెద్ద స్కూల్లో చదువుతున్నారు' అని పేరెంట్స్ అనుకున్నంత మాత్రాన అది మంచి స్కూల్ అయిపోదు. 'ఏదో చిన్న స్కూల్‌లో చదువుతున్నారులే' అన్నంత మాత్రాన అది చెడ్డ స్కూల్ అయిపోదు. చాలా ఎక్కువ ఫీజు ఉన్నది చాలా మంచి స్కూల్ అనే భావన తల్లిదండ్రుల్లో ఉంది. దగ్గరగా ఉందనో, ట్రాన్స్‌పోర్ట్ ఉందనో, అందరూ అక్కడే చదువుతున్నారనో... రకరకాల కారణాల వల్ల తల్లిదండ్రులు పిల్లలను ఎంచిన స్కూళ్లలో చేరుస్తుంటారు. చేర్చి, మళ్లీ స్కూల్ వైపే చూడకుండా క్లాసుల మీద క్లాసులు చదివిస్తుంటారు. మన పిల్లలకు వచ్చే మార్కులను బట్టే అది మంచి స్కూల్ అనుకునేవారు కూడా ఉంటారు. అంటే పిల్లలకు నూటికి 90కి పైన వస్తున్నంత కాలం ఆ స్కూల్ ఎలా ఉన్నా వారికి పర్వాలేదు. కాని ఇలాంటి అంచనాలన్నింటితో ఒక స్కూల్‌ని ఎంచడం విద్యార్థికి ఏదో ఒక మేర నష్టం చేయడమే అంటున్నారు నిపుణులు.

ఒక స్కూల్ ఎప్పుడు మంచి స్కూల్ అవుతుంది అనే దానికి కొన్ని నిర్దిష్ట ప్రమాణాలు ఉన్నాయి. పేపర్‌లో ఆ స్కూల్ విద్యార్థుల మార్కుల కనిపించడం వల్ల మాత్రమే మంచి స్కూల్ అనుకోక నిజంగా పిల్లలు సరైన స్కూల్‌లో చేరాలంటే, కొనసాగాలంటే తల్లిదండ్రులు ఆ స్కూల్‌ను ఈ ప్రమాణాల రీత్యా పరిశీలించాల్సి ఉంటుంది.

విద్యా తాత్త్వికత ఎలాంటిది?

ప్రతి మంచి స్కూల్‌కు ఒక తాత్త్వికత ఉంటుంది. తమ బడిలో చదివిన పిల్లల వికాసం ఏ రీతిన సాగాలో ఆ స్కూల్ ఏర్పాటు సమయంలోనే నిర్వచనం చేసుకుని ఉంటారు. భారతీయతలోని భిన్న సమాజాల పిల్లల కలయికతతో తరగతి ఉండాలనీ, అన్ని భాషల సంప్రదాయాల పిల్లల మధ్య సమ భావనతో తరగతి ఉండాలని, ఏ ఒక్క సమూహపు అహం/ప్రాధాన్యం పెరగని విధంగా చూడగలరని, విద్యార్థుల మధ్య పోటీ తత్త్వం ఎగదోసి ఒకరిని ఎక్కువ మరొకరిని తక్కువ చేసే విధానం అవలంబించరని, బోధన ఇంగ్లిష్ మీడియం అయినా ప్రతి మాతృభాషనూ గౌరవించగలిగే స్కూల్‌ను మంచి స్కూల్‌గా ఎంచవచ్చు.

బుర్రలా... మరబొమ్మలా?

చదువు ఎలా నేర్పిస్తారో చూడాలి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సిలబస్ పూర్తి చేయడమే లక్ష్యంగా, పిల్లలు పాఠాలు బట్టీయం వేసి, పరీక్షల్లో ముక్కస్య ముక్కహ రాసి, నూటికి నూరు తెచ్చుకొనేలా తోముతారా లేదా ప్రశ్న మార్చి ఇచ్చినా రాసేలాగా, బుర్ర పెట్టి ఆలోచించగలిగేలాగా, సొంతంగా నేర్చుకునే లాగా, సబ్జెక్ట్‌పై ఆసక్తి కలిగేలాగా చెబుతారా? ఈ రెండో విధానం కలిగినది మంచి స్కూల్

క్రీడలు, కళలు

క్రీడలకు, కళలకు స్థానం లేని స్కూల్‌కు ఆమడ దూరం ఉండాలి. ఆటస్థలం లేని స్కూల్ ప్రైమరీ లెవల్ నుంచి హైస్కూల్ లెవల్ వరకూ పనికి రాదు. ప్లేగ్రౌండ్ ఉన్నా ఆటలను ప్రోత్సహించక చివరి పీరియడ్ వరకూ పాఠాలతో ఊదరగొట్టే స్కూల్స్‌ను మంచివి అనుకోకూడదు. పిల్లల్లో ఎంతో సృజన ఉంటుంది. దానిని ప్రోత్సహిస్తే వారికి ధన, కనక, వాహనాలిచ్చినట్టే. విద్యార్థి ఎదుగుదల సమగ్రంగా జరగాలి. పాఠాలతో పాటు ఆట పాటలకు విలువిచ్చే బడికే ఓటు.

భద్రత, పరిశుభ్రత

అన్నింటి కంటే ముఖ్యం భద్రత. పిల్లలు ఉన్న చోట వేయి కళ్లతో ఉండాలి. స్కూల్లో ఆయాలు, సెక్యూరిటీ వాళ్లు సరైన ట్రయినింగ్ ఉన్న వాళ్లేనా? బస్‌ల డ్రైవర్లు లైసెన్స్‌లు ఉన్నవాళ్లేనా? కెమెరాల నిఘా ఉందా? ఔట్ పాస్ నియమాలు ఎలా ఉన్నాయి? టాయిలెట్ల దగ్గర రక్షణ ఉందా? ఇవి చూడాలి. అలాగే స్కూల్లో పరిశుభ్రత పాటిస్తున్నారా? గాలి వెలుతురు ఉండేలా చూస్తున్నారా? మంచి నీరు ఇస్తున్నారా? పిల్లల ఆరోగ్యం హటాత్తుగా పాడైతే వారు వెంటనే తల్లిదండ్రులకు తెలియ చేస్తున్నారా? ఫస్ట్ ఎయిడ్ ఇవ్వగలుగుతున్నారా... ఇవన్నీ చూసుకుని, సంతృప్తికరంగా ఉంటే అది మంచి స్కూల్.

సామాజిక బాధ్యత నేర్పుతున్నదా?

మన పాటికి మనం చదువుకుని, పెద్ద ఉద్యోగం తెచ్చుకుని, సుఖంగా బతికే ధోరణిని పెంచేలా వీరి తర్ఫీదు ఉంటుందా లేదంటే ఏ సమాజం నుంచి వచ్చామో ఆ సమాజం గురించి ఎరుక పరిచి, అందులో ఉన్న అంతరాల వల్ల బాధ పడేవారి కోసం, సమాజంలో ఉన్నతి కోసం ఎంతో కొంత చేయాల్సిన బాధ్యత రేపు పెద్దయ్యాక ఉంటుంది అనే చెప్పేలా తర్ఫీదు ఉంటుందా చూడాలి. రెండో రకం తర్ఫీదు మంచిది.

వినూత్నమైన టీచింగ్

టీచింగ్ ఎలా ఉంటుందనేది చూడాలి? అదే మూస సంప్రదాయ పద్ధతిలోనే పాఠాలు చెబుతున్నారా? లేదంటే ఆధునికమైన ఉపకరణాలు, సాధనాల సహాయంతో చెబుతున్నారా చూడాలి. ఎప్పటికప్పుడు సిలబస్‌ను వర్తమాన పరిస్థితులను బట్టి మెరుగు పరుచుకుంటూ పిల్లలను ఇన్‌వాల్వ్ చేస్తూ అవసరమైతే ఎక్స్‌పర్ట్‌లను బయటి నుంచి పిలిపించి స్పెషల్ క్లాసెస్ నిర్వహిస్తూ పిల్లలను ఉత్సాహ పరుస్తున్నారా లేదా చూడాలి. రెండో రకం స్కూలుకు ప్రాధాన్యం ఇవ్వాలి.

టీచర్లు ఉన్నారా?

ఒక స్కూల్ మనుగడ ఆ స్కూల్లో పని చేసే టీచర్ల మీద ఆధారపడి ఉంటుంది. ఆ స్కూల్ యాజమాన్యం క్వాలిఫైడ్ టీచర్లను తీసుకుంటున్నారా? వారికి మర్యాదకరమైన జీతాలు ఇస్తున్నారా? టీచర్లు ఆ యాజమాన్యానికి లాయల్‌గా ఉన్నారా? ఐదేళ్లపాటైనా ఒక్కో టీచర్ ఆ స్కూల్లో పని చేయగలుగుతున్నారా? ఈ సంవత్సరం ఉండి మరో సంవత్సరం మారిపోయే టీచర్లు ఉన్న స్కూల్లో పాఠాలు నడవవు. స్కూల్ మీద ప్రేమతో ఉంటూ పాఠాలు చెప్పే తపన కలిగిన టీచర్లు ఉన్న స్కూల్‌ను ఎంచుకోవాలి. అలాగే టీచర్లు మొరటుగా ఉంటూ స్టూడెంట్స్‌తో మూర్ఖంగా వ్యవహరిస్తూ ఉంటే గనక ఆ స్కూల్ జోలికి పోరాదు. స్ట్రిక్ట్‌గా ఉండటం వేరు స్టూడెంట్స్‌ను అవమానిస్తూ, భయభ్రాంతం చేయడం వేరు.

ప్రతి పైసాకు ప్రతిఫలం

స్కూళ్లు ముక్కుపిండి ఫీజులు వసూలు చేస్తాయి. ఆ వసూలు చేసిన ఫీజుకు జవాబుదారీగా స్కూల్‌ను నిర్వహిస్తున్నారా? ప్రతి పైసాకు ప్రతిఫలం ఇస్తున్నంత బాగా విద్యార్థిని తీర్చి దిద్దుతున్నారా? పిల్లలు సంతోషంగా స్కూల్‌కు వెళ్లి సంతోషంగా తిరిగి ఇల్లు చేరుతున్నారా?

ఇవన్నీ పరిశీలించుకుని ఇప్పుడు మీ పిల్లలు చదువుతున్నది మంచి స్కూలో కాదో తేల్చుకోండి.

● మన(సు)లో మాట

టెంట్ చూస్తే భయం!

నాకొక చిత్రమైన సమస్య ఉంది. ఎక్కడైనా సరే ఇంటి ముందు టెంట్ వేసి ఉంటే నాకు విపరీతంగా భయం వేస్తుంది. ఆ ఇంట్లో ఎవరైనా చనిపోయారేమో అని ముందు అనిపించి, తర్వాత మా అమ్మమ్మకి ఏదైనా అవుతుందేమో, తనకేమైనా అయితే నేను ఒంటరి వాణ్ణి అయిపోతా అని భయం వేస్తుంది. ఎవరైనా గృహ ప్రవేశం, పెళ్ళి కోసం టెంట్ వేసుకున్నా నాకు మాత్రం నెగటివ్ ఆలోచనలు వచ్చి ఒళ్ళంతా చెమటలు, గుండెదడ, కళ్ళు తిరగడంలాంటివి అవుతాయి. ఇలా అయినప్పుడు నేను కూడా చనిపోతానేమో అన్నంత భయం కలుగుతుంది. ఈ భయం వల్ల నేను నా ఫ్రెండ్స్, ఇంకా చుట్టాల ఫంక్షన్స్‌కి వెళ్ళడమే మానేశాను. ఎక్కడైనా టెంట్ వేసి ఉంటే అటు వైపు వెళ్ళలేను. అందరూ హేళన చేస్తారని బయటకు చెప్పుకోలేను. దయచేసి ఈ సమస్య నుండి ఎలా బయట పడాలో తెలుపగలరు!

– నాగరాజు, బద్వేల్

నాగరాజు గారు, చిన్న వయసులోనే తల్లిదండ్రుల్ని కోల్పోవడం అనేది మీ మెదడు పైన బాగా ప్రభావం చూపినట్టుంది. దాని వల్ల 'టెంట్'కి మీ మెదడు 'నెగటివ్ కండిషనింగ్'కి గురి అయింది. దీని వల్ల ఎక్కడ టెంట్ కనపడినా మీ మెదడు విపరీతమైన ఆందోళనకి పానిక్ అటాక్స్‌కి గురి అవుతుంది. వైద్య పరిభాషలో దీన్ని 'స్పెసిఫిక్ ఫోబియ్' లేదా 'టిసింటో ఫోబియా' అంటారు. మీకు టెంట్ అంటే భయం ఉన్నట్లే కొందరికి కుక్క లేదా పిల్లి అంటే భయం ఉంటుంది. ఇంకొందరు లిఫ్ట్ అంటే భయపడతారు... అన్ని సందర్భాల్లో కూడా నిజానికి భయం అవసరం లేదు. కానీ ఫోబియాలో ఇలాంటి మాములు విషయాలే విపరీతమైన భయానికి ఆందోళనకి గురి అయ్యేలా చేస్తాయి. మీరు ఒక సైకియాట్రిస్ట్‌ని కానీ, క్వాలిఫైడ్ క్లినికల్ సైకాలజిస్ట్‌ని కానీ కలిస్తే కౌన్సిలింగ్ కొన్ని రిలాక్సేషన్ పద్ధతులు మరియు 'ఎక్స్ పోజర్ అండ్ రెస్పాన్స్ ప్రివెన్షన్' అనే మానసిక చికిత్స విధానం ద్వారా మీ సమస్య నుండి బయట పడేస్తారు. అలాగే 'వర్చువల్ రియాలిటీ' అనే అత్యాధునిక వైద్య విధానం కూడా అన్ని రకాల ఫోబియాస్ నుండి బయట పడేలా సహాయం చేస్తుంది. కొన్ని రకాల మందులు వాడడం వల్ల మీకు తొందరగా ఉపశమనం దొరికి మీరు థెరపీలో మరింత మెరుగ్గా పాల్గొనగలుగుతారు.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ

మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ sakshifamily3@gmail.com

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 18న ముగింపు రూ.లలో	
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,810
బంగారం (22 క్యారెట్లు)	91,256
వెండి	1,09,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,02,300
బంగారం (22 క్యారెట్లు)	92,500
వెండి	1,12,600
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,00,910
బంగారం (22 క్యారెట్లు)	92,500
వెండి	1,21,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,02,300
బంగారం (22 క్యారెట్లు)	95,270
వెండి	1,02,600
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	98,200
బంగారం (22 క్యారెట్లు)	90,340
వెండి	1,08,700
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,00,900
బంగారం (22 క్యారెట్లు)	92,500
వెండి	1,22,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



● ఇన్‌స్పిరేషన్

రిస్క్ ఎంతున్నా రెస్క్యూకి రెడీ!

'కాపాడుకో...కాపాడు' నినాదంతో కోలిండియా వరల్డ్ క్లాస్ ఆల్-విమెన్ రెస్క్యూ అండ్ రికవరీ టీమ్‌లను ఏర్పాటు చేసింది. ఇప్పుడు అదే బాటలో సింగరేణి సంస్థ తొలిసారిగా ఆల్-విమెన్ రెస్క్యూ టీమ్‌లకు శ్రీకారం చుట్టింది. శిక్షణ మొదలైంది. సింగరేణి చరిత్రలో ఇదొక చారిత్రక ఘట్టంగా నిలవనుంది...

రెండేళ్ల క్రితమే సింగరేణిలో మహిళా రెస్క్యూ టీమ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇటీవలి కాలంలో సింగరేణి నిర్వహించిన ఎక్స్‌టర్నల్ పోస్టుల్లో మహిళా గ్రాడ్యుయేట్ ట్రెయినీలు పెద్ద సంఖ్యలో ఉద్యోగాల్లో చేరారు. సంస్థలో మహిళా ఉద్యోగుల సంఖ్య 1,995కి పెరిగింది. రెస్క్యూ శిక్షణ కోసం మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రెయినీలతో ఒక్కో బ్యాచ్‌కు 14 మంది చొప్పున రెండు బ్యాచ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

కోలిండియాలోని పలు సంస్థల్లో ఇప్పటికే మహిళా రెస్క్యూ టీమ్‌లు ఏర్పాటు చేశారు. గత ఏడాది సింగరేణిలో జరిగిన ఆలిండియా రెస్క్యూ పోటీల్లో కోల్ ఇండియాకు చెందిన రెండు మహిళా టీమ్‌లు తలపడ్డాయి. ఈ నేపథ్యంలో సింగరేణిలో కూడా రెస్క్యూ టీమ్‌లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రెండు జట్లకు పదహారు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.



టఫ్ జాబ్ అంటే ఇష్టం...

ఏదో ఒక ఉద్యోగం చేయడం అని కాకుండా టఫ్ జాబ్ చేయడం అంటే మొదటి నుంచి నాకు ఆసక్తి. ఇప్పుడు నా ఉత్సాహానికి తగిన పని దొరికింది. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఎలా స్పందించాలో రెస్క్యూ శిక్షణ ద్వారా నేర్చుకుంటున్నాం. ఈ శిక్షణ మాకు భవిష్యత్‌లో ఎంతగానో ఉపకరిస్తుంది.

- ఎం.లిఖిత, భూపాల్‌పల్లి

ఫస్ట్ ఎయిడ్, రివైవింగ్, రక్షణ పద్ధతులు, గనుల్లో గ్యాస్ ఏర్పడినప్పుడు వాటిని ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా గోడలు కట్టే విధానం, అత్యవసర సమయాల్లో స్పందించే పద్ధతి, అగ్ని ప్రమాదాల్లో చిక్కుకున్నప్పుడు రక్షించే విధానం...మొదలైన అంశాలపై శిక్షణ ఇస్తారు.

'ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా రెస్క్యూ టీమ్‌లో చేరాను' అంటోంది ఎస్.రక్షిత. 'కోల్ ఇండియా స్థాయి రెస్క్యూ పోటీల్లో మా జట్టు సత్తా చూపుతాం' అంది బి.కళ్యాణి. అందరి మాటల్లోనూ ఉత్సాహం కనిపిస్తోంది. సాహసానికి ఇంధనం ఆ ఉత్సాహమే కదా!



ఆత్మ స్థైర్యం పెంచేలా...

మహిళ మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రెయినీలు మూడు షిఫ్టులలో పనిచేస్తున్నారు. రెస్క్యూ బ్రిగేడియర్ శిక్షణ మాలో ఆత్మ స్థైర్యం పెంచడంతో పాటు తోటివారికి సహాయ పడేలా చేస్తోంది.

- అల్లం నవ్యశ్రీ, ఎంజీటీ, జీడీకే-11

– కాల్వ చంద్రశేఖర్‌రెడ్డి, సాక్షి, గోదావరిఖని

● ఇండస్ట్రీ శక్తి

షీ జాబ్స్.. సీత యాప్

'కుటుంబ వారసత్వంగా కోట్ల ఆస్తి వచ్చినా.. నీకు నువ్వు రుపాయైనా సంపాదించుకుంటేనే ఆర్థిక స్వాతంత్ర్యం' అన్న మాటను నమ్ముతారు స్వాతి నెలభట్ల! అది వాళ్ల నాన్న చెప్పిన సత్యం.. ప్రోత్సహించిన మార్గం! దాన్నే ఆశయంగా మలచుకుని ప్రయాణం సాగించిన ఆమె.. నేడు వందల మంది మహిళలకు ఉపాధి భరోసాగా నిలిచారు! దాని పేరే సీత (SITHA.. షి ఈజ్ ద హీరో ఆల్వేస్) సర్వీస్ అండ్ ప్రొడక్ట్స్ యాప్! స్వాతి, 'సీత' వివరాలు...



స్వాతి సొంతూరు కడప. తండ్రి దుర్గాప్రసాద్.. జర్నలిస్ట్. తల్లి సుజాత.. రిటైర్డ్ ఎమ్మార్వో. ఆడవాళ్లకు ఆర్థిక స్వాతంత్ర్యం చాలా అవసరమని చెబుతూ కూతురిలో ఆంట్రప్రెన్యూర్ ఆలోచనలను రేకెత్తించి, ఆ దిశగా ప్రోత్సహించారు తండ్రి. ఆమె టీనేజ్‌లోనే తండ్రి చనిపోవడంతో, సింగిల్ పేరెంట్‌గా తల్లి సాగించిన పోరాటమూ స్వాతికి స్ఫూర్తి అయింది. ఆ ఇద్దరి ప్రభావంతోనే స్వాతి ఆంట్రప్రెన్యూర్‌గా ఎదిగి ప్రతిష్ఠాత్మక 'అర్న్‌స్ట్ అండ్ యంగ్ విన్నింగ్ విమెన్ ఆంట్రప్రెన్యూర్' అవార్డ్‌నూ గెలుచుకున్నారు. చెన్నైలో ఇంజినీరింగ్ పూర్తి చేయగానే ఉద్యోగం, పెళ్లి, బాబు.. వెంటవెంటనే జరిగిపోయాయి. బాబుకు ఆటిజం అని తేలడంతో మంచి ట్రీట్‌మెంట్ కోసం అమెరికా షిఫ్ట్ అయ్యారు.

ప్రయత్నం.. విజయం

అక్కడికి వెళ్లాకే అసలు పోరాటం మొదలైంది. నిలకడైన ఉద్యోగం వెదుక్కునే ప్రయత్నం, ఇంటి పని, పిల్లాడి బాధ్యత ఈ మల్టీ టాస్కింగ్‌లో ఫ్లెక్సిబులిటీ ఉండేది కాదు. ఇంకో వైపు ఆంట్రప్రెన్యూర్ కల. అప్పుడే బలంగా అనిపించింది స్వాతికి.. తనే ఒక కంపెనీ స్టార్ట్ చేస్తే టైమ్ ఫ్లెక్సిబులిటీ దొరకడమే కాదు.. ఆశా నెరవేరుతుంది కదా అని! కసరత్తు మొదలుపెట్టింది. ఆమె శ్రమను చూసినవాళ్లంతా 'ఎందుకీ కష్టం? హాయిగా ఇంట్లో ఉండి బాబును చూసుకోక' అంటూ సలహా ఇచ్చారు. ఆశయానికి తన పరిస్థితులను సాకుగా చూపాలనుకోలేదు స్వాతి. అందుకే చిరునవ్వుతోనే వాళ్లకు బదులిచ్చి, ఐటీ కంపెనీ పెట్టారు.. పిల్లాడిని చూసుకుంటూ! ఆ కంపెనీ ఇతర ఉద్యోగులను తీసుకునే స్థాయికి చేరుకోగానే మహిళలనే ముఖ్యంగా పెళ్లి, పిల్లలతో బ్రేక్ పడి మళ్లీ వర్క్ చేయాలనుకుంటున్న వాళ్లను, తనలా స్పెషల్ నీడ్స్ పిల్లలున్న తల్లులను అపాయింట్ చేసుకోసాగారు. ఇన్నాళ్లుగా వాళ్లంతా అవకాశం కోసం వేచి ఉన్నారేమో.. జాయిన్ అవగానే ఫైర్ చూపించడం మొదలుపెట్టారు. వాళ్ల డెడికేషన్ చూశాక స్వాతికి అనిపించింది.. ఇలాంటి వాళ్ల ఇంకెంతమంది ఉండొచ్చో.. రకరకాల కారణాలతో కెరీర్‌లో గ్యాప్ వచ్చి, మళ్లీ వర్క్ చేయాలన్న పట్టుదలతో! వాళ్లందరి కోసం ఒక ప్లాట్‌ఫామ్‌ని క్రియేట్ చేయాలని! స్పెషల్ నీడ్స్ చిల్డ్రన్ తల్లులకూ అందులో స్పేస్ కల్పించాలని! అనుకున్నదే తడవుగా 'షీ జాబ్స్' పోర్టల్ స్టార్ట్ చేశారు. స్పెషల్ నీడ్స్ పిల్లల తల్లులకు పలు సంస్థల్లో ప్రత్యేకమైన కోటా కోసమూ సంస్థల సిబ్బందితో చర్చలు సాగించారు. అలా ముందుకు వెళ్తున్న సమయంలోనే ఆమెకు లేడీ టైలర్స్, పెయింటర్స్, కుక్స్ ఇలా రకరకాల పనులు చేసే మహిళల దగ్గర్నుంచి మెయిల్స్ రాసాగాయి.. తాము చేయదగ్గ పనులేమైనా ఉన్నాయా అంటూ! అవి ఆమెకు కొత్త ఐడియాను ఇచ్చాయి. చదువు, టెక్నాలజీకి అతీతంగా మహిళలకు ఎన్నో నైపుణ్యాలుంటాయి. వాళ్లకూ ఒక వేదిక కావాలి కదా అని! అదే 'సీత (SITHA)'గా రూపుదిద్దుకుంది. ముగ్గులు పెట్టడం మొదలు కుట్లు అల్లికలు, మెహెందీ డిజైన్స్, వంటల నుంచి ట్యూటరింగ్, కంటెంట్ రైటింగ్ దాకా అన్ని రకాల ఉపాధికి ఇది ప్లాట్‌ఫామ్ అయింది. ఇందులో సేవలే కాదు ఉత్పత్తులనూ పెట్టుకోవచ్చు అమ్మకానికి.



● 'సీత' యాప్ లాంచింగ్‌లో నటి శ్రీలీలతో స్వాతి...

నాకు ఫెయిల్యూర్ అంటే భయం లేదు. జడ్జ్ చేయడాన్నీ పట్టించుకోలేదు. లక్ష్యం మీదే డిసిప్లిన్డ్‌గా ఫోకస్ చేశాను. మా ఫ్యామిలీ చాలా సపోర్ట్ చేసింది. నేను నిలదొక్కుకున్నాక నా భర్త రాజేశ్ ఉద్యోగం మానేసి మా బాబును చూసుకుంటున్నారు. ఒకవేళ నాకు ఫ్యామిలీ సపోర్ట్ దొరక్కపోయినా నేననుకున్నది సాధించేదాన్ని. ఎవరికైనా నేను చెప్పేది ఒకటే.. చేజ్ యువర్ ప్యాషన్!'

- స్వాతి నెలభట్ల

– సరస్వతి రమ

● సోషల్ మీడియా

హృదయాన్ని తాకే ప్రేమ కథ



93 ఏళ్ల వయసులో ఓ వృద్ధుడు తన జీవిత భాగస్వామికి మంగళ సూత్రం కొనిచ్చి, తన ప్రేమ కథతో ఎంతో మంది మనసులను గెలుచుకున్నాడు. జీవితం మొత్తం తోడుగా నడిచిన ప్రేమకు ఇచ్చిన గుర్తుగా వారికే కాదు చూసిన వారందరి మదిలో నిలిచిపోయిందీ సంఘటన. మహారాష్ట్ర, జాల్నా జిల్లాలోని అంభోరా జహంగీర్ గ్రామానికి చెందిన నివృత్తి షిండే, శాంతాబాయి భార్యాభర్తలు. షిండే వయసు 93 సంవత్సరాలు, శాంతాబాయి వయసు 85 పైనే ఉంటుంది. ఇద్దరికీ పెళ్లై 70 ఏళ్లు పైనే అయింది. నడవడానికి కూడా ఇబ్బందిపడే వయసులో ఉన్నారు ఇద్దరు. కొద్దిరోజుల క్రితం భార్యను వన్ గ్రామ్ గోల్డ్ షాపుకు తీసుకెళ్లాడు. పల్లెటూరి దుస్తుల్లో ఉన్న వారిని చూసి షాపు వాళ్లు తప్పుగా అర్థం చేసుకున్నారు. సాయం కోసం లోపలికి వస్తున్నారని అనుకున్నారు. 'ఏం కావాలి' అని షాపు సిబ్బంది అడగ్గా.. 'నా భార్యకు మంగళసూత్రం కావాలి. చూపించండి' అని అన్నాడు. షాపు ఓనర్ ఆశ్చర్యపోయాడు. ఎమోషనల్ కూడా అయ్యాడు. షాపు ఓనర్ మాట్లాడుతూ.. 'భార్యాభర్తలు షాపులోకి వచ్చారు. 1,120 నా చేతిలో పెట్టి, తన భార్య కోసం మంగళసూత్రం కావాలన్నాడు. నేను ఎమోషనల్ అయ్యాను. కేవలం 20 రూపాయలు మాత్రమే తీసుకుని మంగళసూత్రం ఇచ్చేశాను' అని చెప్పాడు. ఇందుకు సంబంధించిన వీడియో గోపిక జ్యూవెలరీ షాపు ఖాతాలో పోస్టు అయింది. వీడియో కాస్తా వైరల్ అయింది. కోటికి పైగా వ్యూస్ తెచ్చుకుంది. ఈ జంటను చూసిన వాళ్లు ఇద్దరూ ఎప్పుడూ కలిసే తిరుగుతూ ఉంటారని, కొడుకు ఉన్నా వారిద్దరూ వేరేగా ఉంటున్నారని చెబుతున్నారు.

● సమ్‌థింగ్ స్పెషల్

సృజనకు వందనం



వేసవి సెలవుల తర్వాత స్కూల్స్ తెరిచిన రోజు సామాజిక మాధ్యమాల్లో ఒక టీచర్ వీడియో వైరల్ అయింది. తొలి రోజు తరగతి గదిలో నృత్యం చేస్తూ, పాట పాడుతూ చిన్నారులను హుషారు పరచడం ఆ వీడియో సారాంశం. ఆ టీచర్ పేరు వందనరాయ్. కర్ణాటకలోని కర్కలకు చెందిన వందన పిల్లలకు అర్థమయ్యే రీతిలో పాఠం చెప్పడంలో దిట్ట. కన్నడ, ఆంగ్ల అక్షరాలను నృత్యం చేస్తూ పిల్లలకు ఆమె నేర్పే తీరు ఆకట్టుకుంటోంది. పండ్లు, కూరగాయలను పరిచయం చేస్తూ వాటిని తినడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆడుతూ, పాడుతూ చెబుతారు. ప్రత్యేక సందర్భాల్లో పిల్లలకు సందర్భోచితంగా మేకప్ వేసి పాటలు నేర్పుతూ ఆటలాడిస్తారు. ఆమె వీడియోలు యూట్యూబ్‌లో వైరల్ అయ్యాయి. బోధనకు, సృజనాత్మకత తోడైతే ఎంత అద్భుతంగా ఉంటుందో ఈ వీడియోలు చెప్పకనే చెబుతాయి.



'షూటౌట్'లో భారత్ పరాజయం

లండన్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) మహిళల ప్రొ లీగ్‌లో భారత జట్టుకు వరుసగా నాలుగో పరాజయం ఎదురైంది. అర్జెంటీనా జట్టుతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో సలీమా టెటె నాయకత్వంలోని భారత **జట్టు 'షూటౌట్'లో 0–2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 2–2** గోల్స్‌తో సమంగా నిలిచాయి. దాంతో విజేతను నిర్ణయించేందుకు 'షూటౌట్' నిర్వహించారు. 'షూటౌట్'లో భారత్ తరఫున వరుసగా దీపిక, రుతుజా, లాల్ రెమ్‌సియామి, బల్జీత్ కౌర్ కొట్టిన షాట్‌లను అర్జెంటీనా గోల్‌కీపర్ క్రిస్టినా కొసెన్‌టినో నిలువరించింది. అర్జెంటీనా తరఫున జో డియాజ్, జూలియెటా గురి తప్పగా... **బ్రిసా బ్రుగెసర్, సోఫియా క్లైరో భారత గోల్‌కీపర్ సవితా పూనియాను బోల్తా కొట్టించి బంతిని లక్ష్యా**నికి చేర్చారు. నిర్ణీత సమయంలో భారత్ తరఫున నవనీత్ కౌర్ (50వ నిమిషంలో), దీపిక (56వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. అర్జెంటీనా జట్టుకు అగస్టీనా (27వ, 37వ నిమిషాల్లో) రెండు గోల్స్ అందించింది. మ్యాచ్ మొత్తంలో టీమిండియాకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు రాగా ఒక్క దానిని సద్వినియోగం చేసుకుంది. ఇప్పటి వరకు 12 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న భారత జట్టు 10 పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది.

నయా నంబర్ 4 గిల్

- నాలుగో స్థానంలో కెప్టెన్ ఖాయం
- రేపటి నుంచి తొలి టెస్టు
- తుది జట్టును ప్రకటించిన ఇంగ్లండ్

లీడ్స్: భారత టెస్టు క్రికెట్‌లో బ్యాటింగ్ ఆర్డర్‌కు సంబంధించి నాలుగో స్థానానికి ఎంతో ప్రత్యేకత ఉంది. 'ఆల్‌టైమ్ గ్రేట్' సచిన్ టెండూల్కర్ తన 200 టెస్టుల సుదీర్ఘ కెరీర్‌లో 179 టెస్టుల్లో నాలుగో స్థానంలోనే బ్యాటింగ్ చేశాడు. 1992లో సచిన్ ఆ స్థానంలోకి వచ్చిన తర్వాత రిటైర్మెంట్ వరకు కొనసాగాడు. సచిన్ వీడ్కోలు పలికిన తర్వాత భారత్ ఆడిన తొలి టెస్టు నుంచే మరో దిగ్గజం విరాట్ కోహ్లి నాలుగో స్థానాన్ని భర్తీ చేశాడు. విరాట్ 99 టెస్టుల్లో ఆ స్థానంలో బరిలోకి దిగాడు. మిడిలార్డర్‌లో పదునైన బ్యాటింగ్‌తో టెస్టు మ్యాచ్ గమనాన్ని శాసించే అవకాశం ఉన్న ఈ స్థానంలోకి ఇప్పుడు కొత్త ఆటగాడు వస్తున్నాడు. ఇంగ్లండ్‌తో శుక్రవారం నుంచి జరిగే తొలి టెస్టులో కెప్టెన్ శుబ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయడం ఖాయమైంది. టీమ్ వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ ఈ విషయాన్ని నిర్ధారించాడు. 'బ్యాటింగ్ ఆర్డర్‌లో శుబ్‌మన్ నాలుగో స్థానంలో ఆడతాడు. నేను ఎప్పటిలాగే ఐదో స్థానంలోనే కొనసాగుతాను. అయితే మూడో స్థానం విషయంలో ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. దానిపై చర్చిస్తున్నాం' అని పంత్ వెల్లడించాడు. తనకూ, కెప్టెన్ గిల్‌కు మధ్య మైదానం బయట ఉన్న సాన్నిహిత్యం జట్టు సానుకూల ఫలితాలు రాబట్టేందుకు ఉపయోగపడుతుందని పంత్ వ్యాఖ్యానించాడు. 'మా ఇద్దరి మధ్య మంచి స్నేహం ఉంది. సహజంగానే ఇది మైదానంలో కూడా ప్రతిఫలిస్తుంది. మేమిద్దరం బాగా కలిసిపోయి ఏ విషయాన్ని అయినా సౌకర్యవంతంగా చర్చించుకోగలం. ఇది మంచి ఫలితాలు ఇస్తుందని నమ్ముతున్నా' అని అతను అన్నాడు. అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్‌లాంటి దిగ్గజాలు దూరం కావడం ఇంగ్లండ్ జట్టుకు కూడా లోటే అని పంత్ అభిప్రాయపడ్డాడు. 'అండర్సన్, బ్రాడ్ లేకపోవడం మాకు కాస్త ఊరట అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎన్నో ఏళ్లు వారు జట్టులో కీలక సభ్యులుగా ఉన్నారు. గత రెండు సిరీస్‌లలో నేను వారిని ఎదుర్కొన్నాను. అయితే ప్రస్తుత ఇంగ్లండ్ బౌలింగ్ బృందం కూడా పదునుగా ఉంది. మేం ఎవరినీ తక్కువగా అంచనా వేయడం లేదు. పరిస్థితులను బట్టి వారిని సమర్థంగా ఎదుర్కొనేందుకు మా యువ ఆటగాళ్లు సిద్ధంగా ఉన్నారు' అని పంత్ వివరించాడు.


బుధవారం ప్రాక్టీస్ సెషన్‌లో హర్షిత్ రాణా, గిల్, పంత్, నితీశ్ రెడ్డి

కోహ్లితో తలపడాలనుకున్నా: స్టోక్స్



తమతో ఆడే సిరీస్‌లో విరాట్ కోహ్లి లేకపోవడం అవమానకరంగా అనిపిస్తోందని ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ వ్యాఖ్యానించాడు. భారత్‌కు ఇది పెద్ద లోటని అతను అభిప్రాయపడ్డాడు. 'మైదానంలో కోహ్లి ప్రదర్శించే పోరాటతత్వం, ఎలాగైనా గెలిచేందుకు పోటీ పడే శైలిని భారత్ కోల్పోయింది. 18 నంబర్ జెర్సీకి అతను ఒక స్థాయిని కల్పించాడు. ఇప్పుడు ఆ జెర్సీ మైదానంలో కనిపించదు. కోహ్లికి ప్రత్యర్థిగా తలపడాలని నేను ఎంతో కోరుకున్నాను. మైదానంలో పోటీపడే విషయం మా ఇద్దరి లక్షణాలు ఒకటే. నీతో ఆడే అవకాశం లేకపోవడం అవమానంగా భావిస్తున్నాను అని నేను కోహ్లికి మెసేజ్ పంపించా' అని స్టోక్స్ వెల్లడించాడు. మరోవైపు భారత జట్టు ఈ సిరీస్ కోసం అన్ని విధాలుగా సన్నద్ధమై వచ్చిందని... తమకు గెలుపు అంత సులువు కాదని ఇంగ్లండ్ ప్రధాన బ్యాటర్ జో రూట్ వ్యాఖ్యానించాడు. 'నా దృష్టిలో ఈ సిరీస్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. భారత్ లాంటి జట్టుతో తలపడేందుకు నేను ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా. టీమిండియా చాలా బలంగా ఉంది. పదునైన పేస్ బౌలింగ్, ప్రతిభావంతులైన బ్యాటర్లు, బలమైన స్పిన్‌తో వారంతా సన్నద్ధమై వచ్చారు. స్వదేశంలో మా రికార్డు మాకు కొంత సానుకూలాంశం' అని రూట్ స్పందించాడు.

బ్యాటింగ్ పిచ్ సిద్ధం...

తొలి టెస్టులో బ్యాటింగ్‌కు బాగా అనుకూలమైన పిచ్ అందుబాటులో ఉండటం దాదాపు ఖాయమైంది. 'బజ్‌బాల్' శైలిలో దూకుడుగా ఆడేందుకు సిద్ధమైన ఇంగ్లండ్ తమ ఆలోచనలకు తగిన రీతిలో పిచ్‌ను సిద్ధం చేయిస్తోంది.

క్రిస్ వోక్స్ పునరాగమనం



తొలి టెస్టుకు రెండు రోజుల ముందే ఇంగ్లండ్ తమ తుది జట్టును ప్రకటించింది. సీనియర్ ఆల్‌రౌండర్ క్రిస్ వోక్స్‌కు ఇందులో చోటు దక్కింది. గాయం కారణంగా వోక్స్ ఇంగ్లండ్ ఆడిన గత రెండు టెస్టులకు దూరమయ్యాడు. మూడో స్థానంలో యువ ఆటగాడు బెథెల్‌ను కాదని ఓలీ పోప్‌కు ఇంగ్లండ్ ప్రాధాన్యత నిచ్చింది. ఇటీవల జింబాబ్వేతో జరిగిన టెస్టును మినహాయిస్తే దాదాపు ఏడాది కాలంగా పోప్ వరుసగా విఫలమవుతున్నా... అతని అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని టీమ్‌లోకి ఎంపిక చేసింది. ముగ్గురు పేసర్లతో పాటు ఏకైక స్పిన్నర్‌గా షోయబ్ బషీర్ బరిలోకి దిగుతాడు.

తొలి టెస్టుకు ఇంగ్లండ్ జట్టు: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, ఓలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్, వోక్స్, కార్స్, జోష్ టంగ్, షోయబ్ బషీర్.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భారత్ X పాకిస్తాన్

- వచ్చే ఏడాది జూన్ 14న దాయాదుల సమరం
- ఐసీసీ మహిళల టి20 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల
- జూన్ 12 నుంచి జూలై 5 వరకు ఇంగ్లండ్‌లో మెగా టోర్నీ



దుబాయ్: వచ్చే ఏడాది జరగనున్న అంతర్జాతీయ **క్రికెట్ మండలి (ఐసీసీ) మ**హిళల టి20 ప్రపంచ**కప్‌లో భారత జట్టు తొలి పో**రులో చిరకాల ప్రత్యర్థి **పాకిస్తాన్‌తో తలపడనుంది**. ఇంగ్లండ్ వేదికగా 2026 జూన్ 12 నుంచి ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) బుధవారం విడుదల చేసింది. 24 రోజుల పాటు సాగనున్న ఈ టోర్నీ ఫైనల్ జూలై 5న ప్రఖ్యాత లార్డ్స్ స్టేడియంలో జరగనుంది. మొత్తం ఏడు వేదికల్లో 33 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. గ్రూప్ 'ఎ'లో ఉన్న భారత జట్టు తమ తొలి పోరులో వచ్చే ఏడాది జూన్ 14న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా దాయాది పాకిస్తాన్‌తో తలపడనుంది.

- ఇంగ్లండ్, బంగ్లాదేశ్ మధ్య జూన్ 12న జరిగే మ్యాచ్‌తో ప్రపంచకప్‌నకు తెరలేవనుంది.
- లార్డ్స్ వేదికగా ఫైనల్ జరగనుండగా... ఎడ్జ్‌బాస్టన్, హ్యాంప్‌షైర్ బౌల్, హెడింగ్లీ, ఓల్డ్ ట్రాఫోర్డ్, ద ఓవల్, బ్రిస్టల్ కౌంటీ గ్రౌండ్స్‌లో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.
- జూన్ 30, జూలై 2న ఓవల్ వేదికగా రెండు సెమీఫైనల్స్ జరగనున్నాయి.
- మహిళల వరల్డ్‌కప్‌లో మొత్తం 12 దేశాలు పాల్గొంటుండగా... అందులో ఆరేసి జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు.
- ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియా, పాకిస్తాన్, దక్షిణాఫ్రికాతో కలిసి టీమిండియా గ్రూప్ 'ఎ' నుంచి బరిలోకి దిగనుంది. మరో రెండు జట్లు క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా గ్రూప్ 'ఎ'లో పోటీపడతాయి.
- డిఫెండింగ్ చాంపియన్ న్యూజిలాండ్, ఇంగ్లండ్, వెస్టిండీస్, శ్రీలంకతో పాటు మరో రెండు క్వాలిఫయింగ్ జట్లు గ్రూప్ 'బి'లో ఉన్నాయి.
- గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిచిన రెండేసి జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధించనున్నాయి.
- తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో పోరు అనంతరం భారత జట్టు వరుసగా... జూన్ 17న క్వాలిఫయింగ్ జట్టుతో... 21న దక్షిణాఫ్రికాతో... 25న క్వాలిఫయింగ్ టీమ్‌తో... 28న ఆస్ట్రేలియాతో తలపడనుంది.
- దేశంలోని ప్రఖ్యాత స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామని... వరల్డ్‌కప్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించేందుకు భారీగా ప్రేక్షకులు తరలివస్తారని టోర్నమెంట్ డైరెక్టర్ బెత్ బారెట్ విల్డ్ ఆశాభావం వ్యక్తం చేశాడు.


'కొచ్చి టస్కర్స్'కు రూ.539 కోట్లు చెల్లించండి!

బీసీసీఐకి ముంబై హైకోర్టు ఆదేశం



ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఒక సీజన్ తర్వాత తగిన కారణాలు లేకుండా తమ జట్టును రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ న్యాయ పోరాటం చేస్తున్న కొచ్చి టస్కర్స్ కేరళ టీమ్‌కు హైకోర్టులోనూ సానుకూల తీర్పు వచ్చింది. ఈ వ్యవహారంలో బీసీసీఐదే తప్పని తేలుస్తూ కొచ్చి యాజమాన్యానికి రూ. 539 కోట్లు చెల్లించాలని ముంబై హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఐపీఎల్ 2011 సీజన్‌లో మాత్రమే ఆడిన టస్కర్స్ టీమ్ ఎనిమిదో స్థానంలో నిలిచింది. అయితే జట్టు మేనేజ్‌మెంట్ నిబంధనలు ఉల్లంఘించిందని, సరైన సమయంలో బ్యాంక్ గ్యారంటీ చెల్లించలేదని పేర్కొంటూ కొచ్చి టీమ్‌ను బీసీసీఐ లీగ్ నుంచి తప్పించింది. దీనిపై టీమ్‌లో భాగస్వాములైన కొచ్చి క్రికెట్ ప్రైవేట్ లిమిటెడ్ (కేసీపీఎల్), రెండేవూ స్పోర్ట్స్ వరల్డ్ (ఆర్ఎస్‌డబ్ల్యూ) కోర్టుకెక్కాయి. చివరకు 2015లో కోర్టు ఆర్బిట్రేటర్ కొచ్చికి అనుకూలంగా తీర్పునిస్తూ రూ. 538 కోట్లు చెల్లించాలని ఆదేశించారు. ఆర్బిట్రేటర్ నిర్ణయాన్ని బోర్డు హైకోర్టులో సవాల్ చేయగా...ఇప్పుడు అదే తీర్పుకు హైకోర్టు కూడా ఆమోద ముద్ర వేసింది. దీని ప్రకారం కేసీపీఎల్‌కు రూ.385.50 కోట్లు, ఆర్ఎస్‌డబ్ల్యూకు రూ.153.34 కోట్లు చెల్లించాలని తీర్పు వెలువరించింది. దీనిపై మళ్లీ అప్పీల్ చేసేందుకు బీసీసీఐకి ఆరు వారాల గడువు ఉంది.

పెద్ది పెద్ద ఫైట్


రామ్‌చరణ్

రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ భాగ్యనగరంలో (హైదరాబాద్) శరవేగంగా జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా రైలులో చిత్రీకరిస్తున్న పెద్ద ఫైట్‌లో విలన్లను రఫ్ఫాడిస్తున్నారు రామ్‌చరణ్. ''పెద్ది' కోసం హైదరాబాద్‌లో ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా అద్భుతంగా వేసిన సెట్‌లో భారీ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నాం. ఇండియన్ యాక్షన్ సినిమాల ప్రమాణాలను పెంచేలా హై బడ్జెట్‌తో రూపొందిస్తున్న ట్రైన్ ఎపిసోడ్ ఇది. ఈ ఎపిసోడ్‌లో రామ్‌చరణ్ తన కెరీర్‌లోనే అత్యంత రిస్కీ స్టంట్స్ చేస్తున్నారు. 'పుష్ప 2' చిత్రంలో తన వర్కింగ్ స్టైల్‌తో ఆకట్టుకున్న నబాకాంత్ మాస్టర్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌కు కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరణ నేటితో ముగుస్తుంది. మార్చి 27న 'పెద్ది' సినిమాని ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది.


హైదరాబాద్‌లో తెలుసు కదా!


సిద్ధు జొన్నలగడ్డ

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' చిత్రాల ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమా ద్వారా డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో వైవా హర్ష కీలక పాత్ర పోషిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చివరి షెడ్యూల్ షూటింగ్ బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ''తెలుసు కదా' మనసు హత్తుకునే కథ. స్వచ్ఛమైన ప్రేమ, అనుబంధాల నేపథ్యంలో అద్భుతమైన భావోద్వేగాలు, వినోదాలతో ప్రేక్షకులని అలరించేలా ఉంటుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా వేసిన సెట్‌లో చివరి షెడ్యూల్ షూటింగ్ జరుగుతోంది. సిద్ధు, రాశీ ఖన్నా, శ్రీనిధిలపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. మరోవైపు సినిమాకు సంబంధించిన డబ్బింగ్ పనులు కూడా జరుగుతున్నాయి. దీపావళి సందర్భంగా అక్టోబరు 17న సినిమా విడుదల కానుంది. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ఈ నెలలో మొదటి పాటను విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ ప్రారంభిస్తాం'' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్ బాబా, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్‌కు ఆస్కార్ అవార్డు

ఆస్కార్ గవర్నర్స్ అవార్డుల ప్రకటన


టామ్ క్రూజ్

హాలీవుడ్ ప్రముఖ నటుడు–నిర్మాత టామ్ క్రూజ్ ఎట్టకేలకు ఆస్కార్ అవార్డు అందుకోనున్నారు. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ పదిహేనేళ్లుగా ప్రతి ఏడాది గవర్నర్స్ అవార్డ్స్‌ను అందిస్తున్న సంగతి తెలిసిందే. 16వ వార్షిక అవార్డు ప్రదానం ఈ ఏడాది నవంబరులో జరగనుంది. ఈసారి ఆస్కార్ గవర్నర్ అవార్డులను అందుకోనున్న వారి వివరాలను ఆస్కార్ కమిటీ అధికారికంగా వెల్లడించింది. హాలీవుడ్ నటుడు–నిర్మాత టామ్ క్రూజ్‌తో పాటు అమెరికన్ నటి–దర్శక–నిర్మాత–కొరియోగ్రాఫర్ డెబ్బీ అల్లెన్, ప్రొడక్షన్ డిజైనర్ విన్ థామస్‌లు ఈ ఏడాది ఆస్కార్ గౌరవ పురస్కారాలను స్వీకరించనున్నారు. అలాగే అమెరికన్ గాయని–నటి–రచయిత– సంగీత దర్శకురాలు డాలీ పార్టన్‌కు జీన్ హెర్షోల్ట్ హ్యూమానిటేరియన్ అవార్డు లభించింది. ''సినిమా రంగంలో సుదీర్ఘమైన కెరీర్, సినిమాల పట్ల ఎంతో అంకితభావం చూపిన నలుగురు దిగ్గజ వ్యక్తులను ఈ ఏడాది ఆస్కార్ గవర్నర్స్ అవార్డ్స్‌తో సత్కరించనున్నాం'' అని ఆస్కార్ అకాడమీ అధ్యక్షురాలు జానెట్ యాంగ్ పేర్కొన్నారు. ఇక ఈ 16వ ఆస్కార్ గవర్నర్స్ అవార్డ్స్ వేడుక కాలిఫోర్నియాలోని లాస్ ఏంజిల్స్‌లో నవంబరు 16న జరగనుంది. ఇక ఇప్పటివరకు నాలుగు ఆస్కార్ అవార్డుల నామినేషన్స్ దక్కించుకున్నప్పటికీ టామ్ క్రూజ్‌కు అవార్డు దక్కలేదు. ఫైనల్‌గా 'అకాడమీ గౌరవ పురస్కారం' దక్కుతున్నందుకు ఆయన ఫ్యాన్స్ హ్యాపీ ఫీలవుతున్నారు. ఇక 98వ ఆస్కార్ అవార్డుల వేడుక వచ్చే ఏడాది మార్చిలో జరగనుంది.


హను రెడ్డి, రవితేజ, అనంతిక, నవీన్, రవిశంకర్, ఫణీంద్ర, హేషమ్ అబ్దుల్ వాహబ్

ఇండియా మొత్తం వెతికితే అనంతిక దొరికింది

– నిర్మాత వై. రవిశంకర్

''క్లాసికల్ డ్యాన్స్, మార్షల్ ఆర్ట్స్ రెండూ వచ్చిన అమ్మాయి కావాలని ఇండియా మొత్తం వెతికితే ఒక్క అమ్మాయి దొరికింది... తనే అనంతిక. '8 వసంతాలు' సినిమా కోసం తను చాలా కష్టపడింది'' అని నిర్మాత వై. రవిశంకర్ తెలిపారు. అనంతికా సనీల్‌కుమార్ లీడ్ రోల్‌లో ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన చిత్రం '8 వసంతాలు'. హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల ఇతర పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా రేపు విడుదల అవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రవిశంకర్ మాట్లాడుతూ– ''ఒక అమ్మాయి ఎనిమిదేళ్ల ప్రయాణమే '8 వసంతాలు'. ఈ సినిమాకి అనంతిక, ఫణి బిగ్గెస్ట్ పిల్లర్స్. విజువల్‌గా అదిరిపోయింది. మా సినిమా ప్రేక్షకులందరికీ నచ్చుతుందని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాం'' అన్నారు. నవీన్ యెర్నేని మాట్లాడుతూ– ''చాలా వైవిధ్యమైన చిత్రమిది. ఈ సినిమా కోసం పని చేసిన కొత్తవాళ్లందరి కోసమైనా ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి'' అని తెలిపారు. ''నవీన్‌గారు, రవిగారు చిన్న సినిమానా? పెద్ద సినిమానా? అని కాదు... మంచి సినిమానా? కాదా? అనేది చూస్తారు. మా '8 వసంతాలు' మంచి చిత్రం'' అన్నారు ఫణీంద్ర నర్సెట్టి. ''శుద్ధి అయోధ్య లాంటి బలమైన పాత్ర చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు. ఇలాంటి పాత్ర చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అని అనంతిక చెప్పారు.


సూటిగా సుత్తి లేకుండా!


మాళవికా మోహనన్

'నన్ను పెళ్లి చేసుకుంటావా?' అని ఓ అమ్మాయిని ఓ అబ్బాయి డైరెక్ట్‌గా అడిగితే తడబడే అమ్మాయిలే ఎక్కువగా ఉంటారు. కానీ మాళవికా మోహనన్‌లాంటి అమ్మాయిలైతే అదే స్పీడుతో సమాధానం ఇచ్చేస్తారు. సరదాగా సోషల్ మీడియాలో ఫ్యాన్స్‌తో కబుర్లు చెప్పాలనుకున్నారు ఈ బ్యూటీ. అభిమానులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఓ అభిమాని 'నన్ను పెళ్లి చేసుకుంటారా' అని అడిగాడు... అంతే... 'నాకు దెయ్యాలంటే భయం' అని సూటిగా సుత్తి లేకుండా చెప్పేశారు మాళవిక. అలా ఎందుకు చెప్పారంటే, అతని 'ఎక్స్' ఖాతా పేరు 'ఘోస్ట్' అని ఉంది. ఆ పేరుని వాడుకుని, ఇలా సరదాగా మాళవిక చెప్పారు.

కథే నన్ను డైరెక్ట్ చేస్తుంది

– దర్శకుడు శేఖర్ కమ్ముల



''నా కెరీర్‌లోని మ్యూజికల్, లవ్‌స్టోరీ చిత్రాలు బ్లాక్ బస్టర్స్‌గా నిలిచాయి. దీంతో నా పై ఓ మార్క్ పడింది. కానీ కథకు ఏం కావాలో అదే చేశాను. 'లీడర్' చాలా నిజాయితీగా చెప్పిన కథ. ఈ కథలో లవ్‌స్టోరీ, మంచి పాటలు పెట్టాలనుకోలేదు. 'హ్యాపీడేస్' కాలేజ్ స్టోరీ కాబట్టి కాలేజీ స్టోరీలానే ట్రీట్ చేశాను. 'కుబేర' సినిమా కూడా అంతే. ఈ కథకు కావాల్సిందే చేశాను. చెప్పాలంటే... నేను కథను డైరెక్ట్ చేయడం కాదు... కథే నన్ను డైరెక్ట్ చేస్తుంటుంది'' అని అన్నారు దర్శకుడు శేఖర్ కమ్ముల. ధనుష్, నాగార్జున హీరోలుగా నటించిన చిత్రం 'కుబేర'. రష్మికా మందన్నా, జిమ్ సర్భ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మించారు. ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో రేపు విడుదల కానున్న సందర్భంగా బుధవారం విలేకరుల సమావేశంలో శేఖర్ కమ్ముల చెప్పిన విశేషాలు.

- 'కుబేర' సినిమా ముంబై నేపథ్యంలో సాగుతుంది. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమాను చిత్రీకరించాం. ఒక సూపర్ రిచ్ ప్రపంచం, ఇంకొకటి అట్టడుగున ఉండే ప్రపంచం... ఇలా రెండు విభిన్నమైన ప్రపంచాలను ప్రేక్షకులు చూస్తారు. తనకి ఏమీ వద్దని, ఏ ఆశ లేని ఒక బెగ్గర్, ఈ ప్రపంచంలోని అన్నీ తనకే కావాలనుకునే ఒక బిలియనీర్ మధ్య ఉండే కాన్‌ఫ్లిక్ట్ ఈ సినిమాలో ఆసక్తికరంగా ఉంటుంది. సింపుల్‌గా చెప్పాలంటే... బెగ్గర్ వర్సెస్ బిలియనీర్. ఈ తరహా కథలను చెప్పినప్పుడు పేదవారే గెలుస్తుంటారు. కానీ అది ఎలా ప్రజెంట్ చేశాం అన్నది ఈ సినిమాలో చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఎమోషనల్ థ్రిల్లర్‌గా ఉంటుందీ సినిమా.
- 'మనం, ఊపిరి' వంటి సినిమాల్లో డిఫరెంట్ వేరియేషన్స్ ఉన్న పాత్రల్లో నాగార్జున గారు నటించారు. 'కుబేర'లో కూడా ఆయన కొత్తగా కనిపిస్తారు. ఈ సినిమాలోని పాత్రలో ఆయన ఇమిడిపోయిన తీరు అద్భుతం. ఇక ఈ చిత్రంలోని దేవా పాత్రలో ధనుష్ సూపర్‌గా నటించారు. ధనుష్ బెగ్గర్‌గా కనిపిస్తారు. దేవా పాత్రలో ధనుష్‌గారిని తప్ప ఆడియన్స్ మరొకరిని ఊహించలేరు. రష్మికా మందన్నా తన యాక్టింగ్‌తో ఆడియన్స్‌ను సర్‌ప్రైజ్ చేస్తుంది. బాలీవుడ్ నటుడు జిమ్ సర్భ్‌కు తెలుగు రాకపోయినా తెలుగు డైలాగ్స్‌ను బట్టీ పట్టి మరీ చక్కగా చెప్పారు. నా గత చిత్రాలతో పోలిస్తే నా మార్క్ 'కుబేర' సినిమాలో పదింతలు ఎక్కువగా ఉంటుంది.
- నా పాతికేళ్ల జర్నీని చూసుకున్నప్పుడు ఎమోషనల్‌గా అనిపిస్తుంది. నా స్నేహితుల దగ్గర డబ్బులు తీసుకుని సినిమాలు తీసిన రోజులు నాకు ఇంకా గుర్తున్నాయి. కానీ ఎక్కడా ఎదురు దెబ్బలు తగలలేదు. అది నా అదృష్టం. సినిమాల లాభాల విషయంలో కూడా నాకింత పర్సంటేజ్ కావాలని ఎప్పుడూ అడగను.. పారితోషికం తీసుకుంటానంతే. దీని వల్ల చాలా నష్టపోయాను. అయినా బాధలేదు. ప్రేక్షకుల ప్రేమే నాకు ముఖ్యం. నా కథలన్నీ నా జీవితంలో నేను చూసిన, నాకు తారసపడిన వ్యక్తుల జీవితాల్లోనివారివే. ఇక 'లీడర్'కు సీక్వెల్ ఆలోచన ఉంది. కానీ ఇప్పటి రాజకీయ వ్యవస్థలో, ప్రజల్లో మార్పులొచ్చాయి. ఏదైనా స్ట్రాంగ్ పాయింట్‌ను పట్టుకోవాలి. ఇక నానీతో చేసే సినిమాకు వర్క్ జరగాల్సి ఉంది.

సాక్షి బిజినెస్

గురువారం
19-6-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
139	41
81,445	24,812

విదేశీ సూచీలు

నాస్‌డాక్	19,577	△	56
డోజోన్స్	42,318	△	102
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,843	△	9
డాక్స్	23,318	▽	117
షాంఘై	3,388	△	1
నికాయ్	38,535	△	348

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. ల్లో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.95	86.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.70	117.67
€	యూరో	ఎస్‌బీఐ	98.08	100.81
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.84	60.36
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.00	57.22
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.10	69.51
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.18	23.70
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.66	24.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.15	12.98

భారత్‌లో ఫాల్కన్ జెట్స్ ఉత్పత్తి

- దసాల్ట్ ఏవియేషన్‌తో రిలయన్స్ ఇన్‌ఫ్రా ఒప్పందం
- తొలిసారిగా ఫ్రాన్స్ వెలుపల తయారీ



న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్ల కోసం భారత్‌లో ఫాల్కన్ 2000 బిజినెస్ ఎగ్జిక్యూటివ్ జెట్ విమానాలను తయారు చేసేందుకు ఫ్రాన్స్ ఏరోస్పేస్ దిగ్గజం దసాల్ట్ ఏవియేషన్‌తో అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఏరోస్ట్రక్చర్ (ఆర్‌ఏఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విమానాలను ఫ్రాన్స్ వెలుపల తయారు చేయడం ఇదే ప్రథమం. ప్యారిస్ ఎయిర్ షో సందర్భంగా ఇరు సంస్థలు ఈ విషయం ప్రకటించాయి. హై ఎండ్ బిజినెస్ జెట్స్ తయారీకి భారత్ వ్యూహాత్మక కేంద్రంగా ఎదిగేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని పేర్కొన్నాయి. దీని ప్రకారం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో 'ఫాల్కన్ 2000 జెట్స్' కోసం అసెంబ్లీ లైన్ ఏర్పాటు చేయనున్నాయి. దీంతో బిజినెస్ జెట్స్‌ను తయారు చేయడంలో అమెరికా, ఫ్రాన్స్, కెనడా, బ్రెజిల్ సరసన భారత్ కూడా చేరుతుంది. మేకిన్ ఇండియా నినాదానికి తమ మద్దతును తెలియజేసేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని దసాల్ట్ ఏవియేషన్ చైర్మన్ ఎరిక్ ట్రాపియర్ తెలిపారు. రిలయన్స్ గ్రూప్ ప్రస్థానంలో ఇదొక కీలక మైలురాయని గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ అనిల్ డి. అంబానీ పేర్కొన్నారు. జంట ఇంజిన్లుండే ఈ విమానాల్లో 8–10 మంది వరకు ప్రయాణించవచ్చు. 2028 నాటికి తొలి మేడిన్ ఇండియా ఫాల్కన్ 2000 విమానం డెలివర్ కానుంది. దసాల్ట్ ఏవియేషన్ గత వందేళ్లలో 90 పైగా దేశాలకు 10,000 మిలిటరీ, పౌర విమానాలను సరఫరా చేసింది. 2017లో దసాల్ట్ ఏవియేషన్, రిలయన్స్ ఏరోస్ట్రక్చర్ (డీఆర్‌ఏఎల్) జాయింట్ వెంచర్ సంస్థను ఏర్పాటు చేశాయి. 2019లో ఫాల్కన్ 2000 ముందు భాగాన్ని ఉత్పత్తి చేసినప్పటి నుంచి 100కు పైగా కీలకమైన సబ్–సెక్షన్లను ఈ జేవీ తయారు చేస్తోంది. అంతర్జాతీయంగా ఫాల్కన్ జెట్స్ తయారీలో కీలకంగా ఎదిగింది.

వెండి రికార్డుల మోత

సరికొత్త జీవిత కాల గరిష్టానికి
- ఢిల్లీ మార్కెట్లో 1,08,200
- రూ.540 లాభపడిన బంగారం



న్యూఢిల్లీ: ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య తీవ్ర ఘర్షణల నేపథ్యంలో వెండి, బంగారం ధరల ర్యాలీ కొనసాగింది. ముఖ్యంగా వెండి ధర గత ఆల్ టైమ్ గరిష్టం రూ.1,08,100ను అధిగమించింది. ఢిల్లీ మార్కెట్లో రూ.1,000 పెరిగి రూ.1,08,200 స్థాయికి చేరుకుంది. మరోవైపు 99.9 శాతం స్వచ్ఛత బంగారం రూ.1,00,710 స్థాయిని తాకింది. రూ.540 లాభపడింది. 'అంతర్జాతీయ మార్కెట్లో 2012 ఫిబ్రవరి తర్వాత మొదటిసారి 37 డాలర్లను వెండి అధిగమించింది. రూపాయిలో బలహీనత దేశీ మార్కెట్లో బులియన్ ధరలకు మద్దతుగా నిలిచింది' అని మెహతా ఈక్విటీస్ కమోడిటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కళంత్రి తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర పెద్దగా మార్పు లేకుండా 3,400 డాలర్ల స్థాయిలో ఉంది. డాలర్ బలపడడం, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల పెరుగుదల బంగారం ధరలపై ప్రభావం చూపించినట్టు కోటక్ సెక్యూరిటీస్ తెలిపింది. దీనికితోడు బుధవారం యూఎస్ ఫెడ్ సమావేశం నిర్ణయాలు బయటకు రానుండడంతో ఇన్వెస్టర్లు అప్రమత్త ధోరణి పాటించినట్టు తెలుస్తోంది.

రెండో రోజూ మార్కెట్ డీలా

- కొనసాగిన పశ్చిమాసియా ఉద్రిక్తతలు
- స్టాక్ మార్కెట్లో 'ఫెడ్' అప్రమత్తత
- సెన్సెక్స్ నష్టం 139 పాయింట్లు
- 24,850 దిగువకు నిఫ్టీ



ముంబై: పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు కొనసాగడంతో దేశీయ స్టాక్ సూచీలు రెండోరోజూ డీలాపడ్డాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన వైఖరి వెల్లడి(బుధవారం రాత్రి)కి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 139 పాయింట్లు కోల్పోయి 81,445 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 41 పాయింట్లు నష్టపోయి 24,812 వద్ద నిలిచింది. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు ఆరంభ లాభాలు నిలుపుకోవడంలో విఫలమయ్యాయి. ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 346 పాయింట్లు కోల్పోయి 81,237 వద్ద, నిఫ్టీ 103 పాయింట్లు పతనమై 24,750 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. క్రూడాయిల్ ధరలు పెరగడం, రిస్క్ సామర్థ్యం తగ్గడంతో డాలర్ మారకంలో రూపాయి విలువ తొమ్మిది పైసలు బలహీనపడి 86.43 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లూ స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- ఈక్విటీ డెరివేటివ్స్ కాంట్రాక్టుల ఎక్స్‌పైరీ రోజును మంగళవారం నుంచి గురువారానికి మార్చడంతో ఎన్‌ఎస్‌ఈలో ట్రేడవుతున్న బీఎస్‌ఈ షేరు ఒకశాతానికి పైగా నష్టపోయి రూ.2,633 వద్ద స్థిరపడింది.
- హిందుస్థాన్ జింక్ షేరు 7% పతనమైన రూ.453 వద్ద స్థిరపడింది. మాతృసంస్థ వేదాంత 7% డిస్కౌంట్ ధరతో 1.6% వాటాను విక్రయించడం షేరు పతనానికి పతనమైంది.
- రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ షేరు 5% పెరిగి రూ.386 అప్పర్ సర్క్యూట్ వద్ద ముగిసింది. భారత్‌లో ఫాల్కన్ బిజినెస్ జెట్‌ల తయారీకి ఫ్రెంచ్ దసాల్ట్ ఏవియేషన్‌తో డీల్ కుదుర్చుకోవడంతో ఈ షేరుకు డిమాండ్ లభించింది.

మేక్‌మైట్రిప్ భారీ నిధుల సమీకరణ

ట్రిప్.కామ్ వాటా కొనుగోలుకి వెచ్చింపు



న్యూఢిల్లీ: షేర్లు, మార్పిడికి వీలయ్యే బాండ్ల విక్రయం ద్వారా 2.5 బిలియన్ డాలర్ల(రూ. 21,500 కోట్లు)కుపైగా సమీకరించనున్నట్లు ట్రావెల్ బుకింగ్ సర్వీసుల దిగ్గజం మేక్‌మైట్రిప్ తాజాగా తెలియజేసింది. నిధులను చైనా సంస్థ ట్రిప్.కామ్ గ్రూప్ వాటా కొనుగోలుకి వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ట్రిప్.కామ్ గతంలో కొనుగోలు చేసిన క్లాస్ బీ షేర్లను సొంతం చేసుకునేందుకు పెట్టుబడులను వినియోగించనున్నట్లు నాస్‌డాక్ లిస్టెడ్ కంపెనీ పేర్కొంది. గత నెలలో పాకిస్తాన్‌పై చేపట్టిన మిలిటరీ చర్యల తదుపరి చైనా, టర్కీ తదితర దేశాల నుంచి బిజినెస్‌లను తగ్గించుకోవాలని దేశీయంగా ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో మేక్‌మైట్రిప్ ప్రణాళికలకు ప్రాధాన్యత ఏర్పడింది. మేక్‌మైట్రిప్‌లో చైనా సంస్థలకు యాజమాన్య హక్కులున్నట్లు ప్రత్యర్థి కంపెనీ ఈజ్‌మైట్రిప్ వ్యవస్థాపకుడు నిశాంత్ పిట్టీ గత నెలలో ఆరోపించిన విషయం విదితమే.

ప్యారిస్ ఎయిర్‌షోలో రఘు వంశీ టర్బోజెట్ ఇంజిన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్యారిస్‌లో జరుగుతున్న 55వ అంతర్జాతీయ ఎయిర్‌షోలో హైదరాబాద్ సంస్థ రఘు వంశీ ఏరోస్పేస్ గ్రూప్ తమ 40 కేజీఎఫ్ మైక్రో టర్బోజెట్ ఇంజిన్‌ను ఆవిష్కరించింది. దీన్ని పూర్తిగా దేశీయంగా రూపొందించినట్లు సంస్థ ఎండీ వంశీ వికాస్ తెలిపారు. అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్స్ (యూఏవీ), క్రూయిజ్ మిసైల్స్ కోసం తయారు చేసిన ఈ ఇంజిన్‌ను డీఆర్‌డీవో అధికారుల సమక్షంలో విజయవంతంగా పరీక్షించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హార్డ్‌వేర్ పార్క్‌లో ఏర్పాటు చేస్తున్న 2,50,000 చ.అ. తయారీ ప్లాంటు 2026 ప్రారంభం నాటికి అందుబాటులోకి రావచ్చన్నారు.



ఐటీలో తాత్కాలిక ఉద్యోగులు

ఐదేళ్లలో డబుల్!

- 2030 నాటికి 9 లక్షలకు ఫ్లెక్సీ వర్క్‌ఫోర్స్
- ప్రస్తుతం వీరి సంఖ్య 3,90,000
- సిబ్బంది నిర్వహణలో స్పష్టమైన మార్పు

ముంబై: ఐటీ, ఐటీఈఎస్ రంగంలో తాత్కాలిక ఉద్యోగులకు (ఫ్లెక్సీ వర్క్‌ఫోర్స్) డిమాండ్ క్రమంగా విస్తరిస్తోంది. ప్రస్తుతం ఈ రంగంలో 3,90,000 మంది ఫ్లెక్సీ వర్క్‌ఫోర్స్ ఉండగా.. వీరి సంఖ్య 2030 నాటికి 9 లక్షలకు చేరుకుంటుందని కెరీర్‌నెట్ నివేదిక వెల్లడించింది. ఏటా వీరి సంఖ్య 15 శాతం చొప్పున పెరగనుందని అంచనా వేసింది. ప్రస్తుతం ఐటీ రంగం 58 లక్షల మంది నిపుణులకు ఉపాధి కల్పిస్తుంటే.. వీరిలో 7 శాతం మేర తాత్కాలిక ఉద్యోగులే ఉన్నట్టు తెలుస్తోంది. ఐటీ రంగంలో పెరుగుతున్న ఫ్లెక్సీ స్టాఫింగ్ పేరుతో కెరీర్‌నెట్ ఒక నివేదిక విడుదల చేసింది. నియామకాల డేటా, మార్కెట్ పరిశోధన, పరిశ్రమలో ధోరణులను విశ్లేషించి ఈ వివరాలు ప్రకటించింది. 'భారత్ ప్రపంచ ఆఫ్‌షోర్ హబ్‌గా మారుతోంది. కనుక ఐటీ, ఐటీఈఎస్ రంగంలో ఫ్లెక్సీ వర్కర్లకు డిమాండ్ పెరగనుంది. డిజిటల్ టెక్నాలజీలకు మళ్లడం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మార్పుల నేపథ్యంలో వేగం, ప్రత్యేకత, విస్తరణ అవసరాలకు మద్దతుగా ఫ్లెక్సీ స్టాఫింగ్ నమూనాను కంపెనీలు అనుసరిస్తున్నాయి' అని కెరీర్‌నెట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ నీలబ్ శుక్లా తెలిపారు.



కెరీర్‌లో పురోగతికి దారి..

నిపుణులకు వృత్తిలో ఎదుగుదల, నైపుణ్యాల అభివృద్ధి, పని–వ్యక్తిగత జీవితం మధ్య మెరుగైన సమతుల్యాన్ని ఫ్లెక్సీ ఉద్యోగాలు ఆఫర్ చేస్తున్నాయని చెబుతూ.. మిలీనియల్స్, జెనరేషన్ జెడ్ నిపుణులకు ఇవి కీలక ప్రాధాన్యతలుగా ఉన్నట్టు ఈ నివేదిక పేర్కొంది. ఐటీ/ఐటీఈఎస్ రంగంలో ఫ్లెక్సీ వర్క్‌ఫోర్స్‌కు బెంగళూరు ప్రముఖ కేంద్రంగా ఉంది. ఈ రంగంలోని మొత్తం తాత్కాలిక సిబ్బందిలో 25 శాతం మంది ఈ నగరంలోనే ఉపాధి పొందుతున్నారు. ఆ తర్వాత హైదరాబాద్ 15 శాతం మంది ఫ్లెక్సీ వర్క్‌ఫోర్స్‌కు ఉపాధి కల్పిస్తోంది. ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై, పుణె, చెన్నై ఒక్కోటీ 10 శాతం మేర తాత్కాలిక ఉద్యోగులకు ఉపాధి కేంద్రాలుగా ఉన్నాయి. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ తాత్కాలిక ఉద్యోగుల సిబ్బందిలో వృద్ధి నమోదవుతున్నట్టు ఈ నివేదిక తెలిపింది. ఐటీ/ఐటీఈఎస్ రంగంలోని ఫ్లెక్సీ వర్క్‌ఫోర్స్‌లో 20 శాతం మేర ఈ నగరాల నుంచే ఉన్నట్టు వెల్లడించింది. నిపుణుల లభ్యతకు, తక్కువ వ్యయాలతో కూడిన వ్యాపార నమూనాలు ఇందుకు మద్దతుగా నిలుస్తున్నట్టు తెలిపింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
'బ్యాటరీ సర్వీస్' ఆప్షన్‌తో విడా ఎలక్ట్రిక్ స్కూటర్ | పీఎస్‌యూల డీలిస్టింగ్ సరళతరం

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–వరల్డ్ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–ఇంగ్లిష్

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ ఢిల్లీలో నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఒప్పంద ప్రాతిపదికన నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** సైంటిస్ట్–1 (నాన్ మెడికల్)–01, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్3–04.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు సైంటిస్ట్‌కు రూ.56,000, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్‌కు రూ.28,000.
- » **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.06.2025
- » **వెబ్‌సైట్:** https://rrp.aiimsexams.ac.in

డీఆర్‌డీవో-ఆర్‌ఏసీలో 152 సైంటిస్ట్-బి పోస్టులు

డిఫెన్స్ రీసెర్చ్–డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో)–రిక్రూట్‌మెంట్ అండ్ అసెస్‌మెంట్ సెంటర్(ఆర్‌ఏసీ) ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఏడీఏ).. వివిధ విభాగాల్లో సైంటిస్ట్–బి పోస్టుల భర్తీకి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన సైంటిస్ట్–బి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 152.
- » **పోస్టుల వివరాలు:** డీఆర్‌డీవోలో సైంటిస్ట్ బి–127, ఏడీఏలో సైంటిస్ట్/ఇంజనీర్ బి–09, ఇతర రక్షణ సంస్థలలో ఎన్కాడెడ్ సైంటిస్ట్ బి–16.
- » **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్–ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్/మెటలర్జికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కెమికల్ ఇంజనీరింగ్, ఏరోనాటికల్/ఏరోస్పేస్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, బయోమెడికల్ ఇంజనీరింగ్, ఎంటమోలజీ, బయోస్టాటిస్టిక్స్, క్లినికల్ సైకాలజీ, సైకాలజీ.
- » **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో వ్యాలిడ్ గేట్ స్కోర్‌తో పాటు ఇంజనీరింగ్/టెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీ లేదా సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉండాలి. చివరి సంవత్సరం/ సెమిస్టర్ విద్యార్థులు కూడా అర్హులు.
- » **వయసు:** జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 35 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులు 38 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 40 ఏళ్లు మించకూడదు. దివ్యాంగులకు పదేళ్ల వరకు అదనపు సడలింపు ఉంటుంది.
- » **బేసిక్ పే:** నెలకు రూ.56,100.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 04.07.2025
- » **వెబ్‌సైట్:** https://rac.gov.in

బెల్ బెంగళూరులో గ్రాడ్యుయేట్ ట్రైనీ అప్రెంటిస్‌లు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల నుంచి గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్ ట్రైనీల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, మెకట్రానిక్స్, ఇండస్ట్రియల్ ప్రొడక్షన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్/సివిల్ ఆర్కిటెక్చర్, కెమికల్ ఇంజనీరింగ్.
- » **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఇంజనీరింగ్/టెక్నాలజీలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** ట్రైనీ ఇంజనీర్‌కు 25 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- » **స్టైపెండ్:** నెలకు రూ.17,500.
- » **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో మార్కులు, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **ఇంటర్వ్యూ తేదీలు:**04.07.2025,07.07.2025
- » **వెబ్‌సైట్:** https://bel-india.in

ఎయిమ్స్ గువాహటిలో 64 ఫ్యాకల్టీ పోస్టులు

గువాహటి(అస్సాం)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 64.
- » **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్–16, అడిషనల్ ప్రొఫెసర్–16, అసోసియేట్ ప్రొఫెసర్–11, అసిస్టెంట్ ప్రొఫెసర్–21.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, డీఎన్‌బీ, ఎంఎస్/ఎండీ, ఎంసీహెచ్, డీఎం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్‌కు 58 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.07.2025
- » **వెబ్‌సైట్:** http://aiimsguwahati.ac.in

నైపర్, మొహాలీలో 19 పోస్టులు

మొహాలీ(పంజాబ్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్) తాత్కాలిక ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 19.
- » **పోస్టుల వివరాలు:** సైంటిఫిక్ కోఆర్డినేటర్–03, సీనియర్ రీసెర్చ్ ఫెలో–06, టెక్నికల్ అసిస్టెంట్–08, క్లర్క్–02.
- » **అర్హత:** పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వేతనం:** సైంటిఫిక్ కోఆర్డినేటర్‌కు రూ.58,000, సీనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.42,000, టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.37,000, క్లర్క్‌కు రూ.30,000.
- » **వయసు:** సైంటిఫిక్ కోఆర్డినేటర్‌కు 40 ఏళ్లు, సీనియర్ రీసెర్చ్ ఫెలోకు 42 ఏళ్లు, టెక్నికల్ అసిస్టెంట్, క్లర్క్‌కు 35 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, సెక్టార్–67, ఎస్.ఏ. ఎస్.నగర్ (మొహాలీ), పంజాబ్ చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 30.06.2025.
- » **వెబ్‌సైట్:** https://niper.gov.in

ఎన్‌టెట్‌తో ఆయుష్ ప్రొఫెసర్

» ఎన్‌టెట్ నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్‌టీఏ
» వైద్య విద్య పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు

ఆయుష్ కోర్సుల బోధనా రంగంలో ప్రవేశించాలని కోరుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. ఆయుష్ కోర్సులుగా పేర్కొనే ఆయుర్వేద, సిద్ధ, యునానీ, హోమియోపతి విభాగాల్లో బోధించాలనుకునే వారికోసం నిర్వహించే అర్హత పరీక్ష.. నేషనల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(ఎన్‌టెట్)-2025కు నోఫికేషన్ విడుదలైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఈ పరీక్షను నిర్వహించనుంది. ప్రతి విభాగానికి ప్రత్యేకంగా ఈ పరీక్ష ఉంటుంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌టెట్ 2025పై ప్రత్యేక కథనం..

ఎన్‌టెట్ అనేది అర్హత పరీక్ష. ఇందులో ప్రతిభ చూపిన అభ్యర్థులకు సర్టిఫికెట్ అందజేస్తారు. ఇది పదేళ్లపాటు పరిగణనలో ఉంటుంది. ఆయుష్ కోర్సులను అందించే విద్యాసంస్థల్లో బోధనా పోస్టులకు ఎన్‌టెట్‌లో అర్హత సాధించడం తప్పనిసరి.

✦ **పరీక్ష:** నేషనల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(ఎన్‌టెట్)– 2025 ✦ **విభాగాలు:** ఆయుర్వేదం, సిద్ధ, యునానీ, హోమియోపతి.

అర్హతలు

బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్ వంటి గ్రాడ్యుయేట్ స్థాయి కోర్సుల ఉత్తీర్ణతతోపాటు సంబంధిత విభాగంలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ(ఎండీ/ఎంఎస్) ఉత్తీర్ణులై ఉండాలి. ఆయుర్వేదం, సిద్ధ, యునానీ కోసం పీజీ ప్రోగ్రామ్‌లో కనీసం 30 నెలలు పూర్తి చేసుకొని ఉండాలి. హోమియోపతికి మాత్రం సంబంధిత పీజీ కోర్సు పూర్తిచేసుకోవడం తప్పనిసరి.

✦ **వయసు:** ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.

వంద మార్కులకు పరీక్ష

ఎన్‌టెట్ పరీక్ష వంద మార్కులకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో జరుగుతుంది. ఇందులో ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. నెగిటివ్ మార్కుల నిబంధన లేదు. పరీక్ష సమయం 2 గంటలు. ప్రశ్న పత్రం ఇంగ్లిష్/హిందీలో ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధించేందుకు కనీసం 50 శాతం మార్కులు పొందాలి.

50 శాతం మార్కులు తప్పనిసరి

ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్‌లో బోధన వృత్తిలో అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఎన్‌టెట్ పరీక్షకు హాజరుకావచ్చు. ఆయుష్ సంస్థల్లో బోధనా వృత్తిలో మొదటిసారి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరాలనుకునేవారు ఎన్‌టెట్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది.



ముఖ్య సమాచారం

- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 23.06.2025
- ✦ **పరీక్ష(సీబీటీ) తేది:** 17.07.2025
- ✦ **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ, తిరుపతి.
- ✦ **వెబ్‌సైట్:** https://www.nta.ac.in/, https://exams.nta.ac.in/NTET

ఎన్‌ఐఏసీఎల్‌లో అప్రెంటిస్

ముంబై కేంద్రంగా గల ప్రభుత్వ రంగ సంస్థ.. ద న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఎన్‌ఐఏసీఎల్).. 500 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. కంపెనీకి దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో ఖాళీలకు రాత పరీక్ష ద్వారా ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది.

- **అప్రెంటిస్ ఖాళీల సంఖ్య:** 500
- **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** తెలంగాణలో 17, ఆంధ్రప్రదేశ్‌లో 16.
- **అప్రెంటిస్ శిక్షణ వ్యవధి:** ఒక ఏడాది
- **స్టైపెండ్:** నెలకు రూ.9000

స్కిల్ డవలప్‌మెంట్



అర్హతలు

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ లేదా తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి. 01.04.2021 తర్వాత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. గతంలో అప్రెంటిస్ శిక్షణ పొంది ఉండరాదు. ఎలాంటి అనుభవం లేని ఫ్రెషర్స్ మాత్రమే దరఖాస్తుకు అర్హులు.

వయసు

01.06.2025 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ఇలా

ఆన్‌లైన్ రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ పరీక్ష 100 ప్రశ్నలు–100 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహాలో జరుగుతుంది. ఇందులో జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు–25 మార్కులు, జనరల్ ఇంగ్లిష్ 25 ప్రశ్నలు–25 మార్కులు, క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ అప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–25 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 25 ప్రశ్నలు –25 మార్కులకు ఉంటాయి.పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ప్రశ్న పత్రం ఇంగ్లిష్/హిందీలో ఉంటుంది.

రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్

ఆన్‌లైన్ రాత పరీక్షతోపాటు స్థానిక భాష పరీక్ష కూడా నిర్వహిస్తారు. అయితే పదో తరగతి,ఇంటర్మీడియెట్ స్థాయిలో సదరు స్థానిక భాషను ఒక సబ్జెక్టుగా చదివినట్లు సరిఫికెట్ సమర్పిస్తే రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్ నుంచి మినహాయింపు లభిస్తుంది. రాత పరీక్షలో ప్రతిభతోపాటు స్థానిక భాష పరీక్షలోనూ అర్హత సాధించి తుది ఎంపిక జాబితాలో నిలిచిన అభ్యర్థులకు ఈమెయిల్ ద్వారా సమాచారం అందిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులు https://bfsissc.com/ లో 'కెరీర్ ఆపర్చునిటీస్' విభాగాన్ని క్లిక్ చేసి అప్రెంటిస్ రాత పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి. అంతకుముందే నాట్స్ వెబ్‌సైట్‌లో తమ పేరు నమోదు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 20.06.2025
- **పరీక్ష తేది:** 26.06.2025
- **వెబ్‌సైట్:** https://nats.education.gov.in

మెడికల్ పీజీ విద్యార్థుల స్టైపెండ్‌కు ఎగనామం!

ప్రైవేటు వైద్య కళాశాలల నిర్వాకంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

- జూనియర్ డాక్టర్లకు నెలనెలా ఇవ్వాల్సిన మొత్తం ఎగ్గొడుతుండటంపై నిరసనలు
- ఎన్ఎంసీ నిబంధనల మేరకు ఇచ్చినట్టే ఇచ్చి తీసేసుకుంటున్నారనే ఆరోపణలు
- బ్యాంకు పాస్‌బుక్కులు, ఏటీఎం కార్డులు, చెక్‌బుక్కులు వారి వద్దే..!
- నెలనెలా రూ.కోట్ల మొత్తం వెనకేసుకుంటున్న యాజమాన్యాలు?
- ఎన్ఎంసీ, ప్రభుత్వం తమకు న్యాయం చేయాలంటున్న పీజీ విద్యార్థులు



వికారాబాద్ మహావీర్ ఆస్పత్రి ఆవరణలో నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో పీజీ కోర్సులు చేసే జూనియర్ డాక్టర్లు, ఎంబీబీఎస్ పూర్తి చేసి డ్యూటీ డాక్టర్లుగా పనిచేసే విద్యార్థులకు నెలనెలా ఇవ్వాల్సిన స్టైపెండ్‌ను యాజమాన్యాలు ఎగ్గొడుతున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. కొన్ని కాలేజీలు మొత్తం స్టైపెండ్‌కు ఎగనామం పెడుతుండగా, కొన్ని కాలేజీలు నామమాత్రంగా ఇస్తూ, 70 శాతం వరకు వెనకేసుకుంటున్నట్లు సమాచారం. విద్యార్థులతో బ్యాంకు ఖాతాలు తెరిపించి ఏటీఎం కార్డులు, చెక్కులు ముందే తీసుకుంటున్న యాజమాన్యాలు..జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) నిబంధనల మేరకు స్టైపెండ్ విద్యార్థుల ఖాతాల్లో వేసినట్టే వేసి తిరిగి విత్ డ్రా చేసుకుంటున్నాయని తెలుస్తోంది. ఈ విధంగా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు నెలనెలా విద్యార్థులకు ఇవ్వకుండా సొమ్ము చేసుకుంటున్న మొత్తం రూ.కోట్లలోనే ఉంటుందని అంచనా. ఇలా గత కొన్నేళ్లుగా ప్రైవేటు యాజమాన్యాల కక్కుర్తి దందా కొనసాగుతోందంటూ పీజీ విద్యార్థులు తాజాగా నిరసనలకు దిగారు. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల వద్ద ఆందోళనలు చేస్తున్నారు. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) మార్గదర్శకాల ప్రకారం కళాశాలల్లో కనీస సౌకర్యాలు లేకున్నా.. విద్యార్థుల నుంచి కోట్లలో ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలు చివరకు..ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తించేవారికి నెలవారీ ఖర్చుల కింద చెల్లించే స్టైపెండ్ విషయంలోనూ కక్కుర్తి పడుతున్నాయని జూనియర్ డాక్టర్లు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు.

నెలకు సగటున రూ.60 వేల చొప్పున

రాష్ట్రంలో మొత్తం 35 పీజీ కళాశాలలు ఉండగా, అందులో ప్రభుత్వ ఆధ్వర్యంలో 12, ప్రైవేటు యాజమాన్యాల కింద 23 ఉన్నాయి. 35 కళాశాలల్లో కలిపి 2,750 పీజీ సీట్లు ఉండగా..వీటిలో ప్రభుత్వ కళాశాలల్లో 1,313, ప్రైవేటు కళాశాలల్లో 1,296, మూడు మైనారిటీ కాలేజీల్లో 141 సీట్లు ఉన్నాయి. ఎంబీబీఎస్ పూర్తయిన విద్యార్థులు ఏడాది ఇంటర్న్‌షిప్ కింద హౌస్ సర్జన్లుగా పనిచేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతినెలా రూ.22,527 మొత్తాన్ని ఏడాది పాటు యాజమాన్యాలు చెల్లించాల్సి ఉంటుంది. ఇక పీజీ డాక్టర్లకైతే ఫస్ట్ ఇయర్ రూ.50,686, సెకండ్ ఇయర్ రూ.53,503, థర్డ్ ఇయర్ 56,319 చెల్లించాలి. పీజీ డిప్లొమా చదివే మొదటి సంవత్సరం విద్యార్థులకు రూ.50,686, రెండో సంవత్సరం వారికి రూ.53,503 చెల్లించాలి. సూపర్ స్పెషాలిటీ కోర్సులు చేసే వారికి మూడేళ్ల పాటు వరుసగా రూ.80,500, రూ.84,525, రూ.88,547 ఇవ్వాలి. ఎండీలకు మూడేళ్ల పాటు 50,686, రూ.53,503, రూ.56,319 లెక్కన చెల్లించాలి. సీనియర్ రెసిడెంట్లకు రూ.80,500 చెల్లించాలి. ఇలా ఒక్కో విద్యార్థికి నెలకు సగటున రూ.60 వేల చొప్పున చెల్లించాల్సి ఉంటుందని అంచనా. 2023లో వచ్చిన జీవో నంబర్ 59 ప్రకారం రెండేళ్లకోసారి స్టైపెండ్‌ను 15 శాతం పెంచాల్సి ఉంటుంది. దీని ప్రకారం ఈ ఏడాది నుంచి స్టైపెండ్ పెరగాల్సి ఉంది. అయితే అసలు స్టైపెండ్‌కే దిక్కులేని పరిస్థితుల్లో పెంచే మాటే ఉత్పన్నం కాదని విద్యార్థులు వాపోతున్నారు.

ఖాతాలు తెరిపించి.. ఏటీఎం కార్డులు, చెక్కులు తీసేసుకుని..

పీజీ కోర్సులో విద్యార్థి అడ్మిషన్ తీసుకున్న సమయంలోనే కాలేజీల యాజమాన్యాలు వారి పేరిట కొత్తగా బ్యాంకు ఖాతాలు తెరిపిస్తాయి. విద్యార్థులు చెప్పిన సమాచారం ప్రకారం ..పాస్‌బుక్, ఏటీఎం కార్డు, సంతకం చేసిన చెక్‌బుక్‌లు తీసేసుకుంటున్నాయి. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం విద్యార్థుల ఖాతాల్లో నిర్దేశిత స్టైపెండ్‌ను జమ చేసి, రెండు, మూడురోజుల్లోనే తిరిగి ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేసేసుకుంటున్నాయి. కొన్ని కళాశాలలు మరీ కక్కుర్తితో వ్యవహరిస్తూ మొత్తం స్టైపెండ్‌ను విత్‌డ్రా చేసుకుంటుండగా, మరికొన్ని కళాశాలలు మాత్రం కొంత మొత్తాన్ని విద్యార్థి ఖాతాలో ఉంచేస్తున్నాయి. తమకు స్టైపెండ్ ఇవ్వకపోవడంతో నెలవారీ ఖర్చులకు ఇబ్బంది అవుతోందని విద్యార్థులు వాపోతున్నారు. ఇలా వుండగా జూనియర్ డాక్టర్ల ఆందోళనలను అణచివేసేందుకు యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. గతంలో ఇదే అంశంపై దాదాపు 13 ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. అయినా యాజమాన్యాల్లో ఎలాంటి స్పందన లేదని, ఎన్ఎంసీ మరోసారి జోక్యం చేసుకోవాలని, ప్రభుత్వం కూడా స్టైపెండ్ ఇప్పించి తమకు న్యాయం చేయాలని పీజీ మెడికల్ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

‘కబుర్ల దేవత’కు కేంద్ర బాల సాహిత్య పురస్కారం

- పురస్కారం అందుకోనున్న గంగిశెట్టి శివకుమార్
- ప్రసాద్ సూరి రచించిన ‘మైరావణ’కు సాహిత్య యువ పురస్కారం


శివకుమార్

సాక్షి, న్యూఢిల్లీ: 24 భాషల్లో ఉత్తమ రచనలకు గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను ప్రకటించింది. తెలుగు భాషకు సంబంధించి పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు గ్రామానికి చెందిన గంగిశెట్టి శివకుమార్ రచించిన ‘కబుర్ల దేవత (స్టోరీ) పుస్తకానికి కేంద్ర బాల సాహిత్య పురస్కారం లభించగా, విశాఖపట్నం జిల్లా వాడరాంబిల్లి గ్రామానికి చెందిన ప్రసాద్ సూరి రచించిన మైరావణ (నవల) సాహిత్య యువ పురస్కారానికి ఎంపికైనట్లు సాహిత్య అకాడమీ ఓ ప్రకటనలో పేర్కొంది. భారతీయ భాషల్లో సాహిత్య రంగంలో సుప్రసిద్ధమైన వ్యక్తులు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించి పలు పుస్తకాలను ఈ ప్రతిష్టాత్మక అవార్డులకు సిఫారసు చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన బుధవారం సమావేశమైన సాహిత్య అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఈ పురస్కారానికి ఎంపికైన పుస్తకాల పేర్లను ప్రకటించింది. పురస్కార గ్రహీతకు జ్ఞాపికతో పాటు రూ.50 వేల నగదును అందచేస్తారు. తెలుగు భాషకు సంబంధించి బాల సాహిత్య పురస్కారాలకు జ్యూరీ సభ్యులుగా కన్నెగంటి అనసూయ, డా.ఎం.భూపాల్‌రెడ్డి, కిలపర్తి దాలినాయుడు వ్యవహరించారు. యువ పురస్కారాలకు జ్యూరీ సభ్యులుగా జీఎస్ చలం, కుప్పిలి పద్మ, పెద్దింటి అశోక్‌కుమార్‌లు వ్యవహరించారు. ఈ పురస్కార విజేతలకు త్వరలో ఢిల్లీలో ఏర్పాటు చేసే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేయనున్నారు.

పురస్కారం ఉత్సాహాన్నిచ్చింది..


ప్రసాద్ సూరి

తన ‘మైరావణ’ నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం దక్కడంపై ప్రసాద్ సూరి ఒక ప్రకటనలో ఆనందం వ్యక్తం చేశారు. తెలుగు సాహిత్యంలో రికార్డు మాత్రంగానైనా తన జాతి జనుల కతలు, వెతలు మిగలాలని తాను చేసిన ప్రయత్నానికి గుర్తింపు దక్కిందన్నారు. ఈ పురస్కారం మరిన్ని రచనలు చేసే ఉత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు.

బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు

సనత్‌నగర్: బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు మెయిల్ కలకలం రేపింది. విమానయానానికి సంబంధించి ఇటీవల వరుస ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఈ బాంబు బెదిరింపు కాల్ అందరినీ కలవరానికి గురిచేసింది. ఎయిర్‌పోర్ట్‌ను పేల్చేసేందుకు బాంబులు పెట్టామంటూ గుర్తుతెలియని వ్యక్తి ఎయిర్‌పోర్ట్‌కు మెయిల్ చేసి ఉరుకులు పరుగులు పెట్టించాడు. వెంటనే ఎయిర్‌పోర్ట్ ఉద్యోగులు, సిబ్బంది బయటకు పరుగులు తీశారు. తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, ఇతర భద్రతా బలగాలు వెంటనే అప్రమత్తమయ్యాయి. పోలీసు జాగిలాలు, బాంబు ఎక్స్‌ప్లోజివ్ నిపుణులు, బాంబు డిటెక్షన్ స్క్వాడ్ రంగంలోకిదిగి ఎయిర్‌పోర్ట్‌ను అణువణువూ గాలించి తనిఖీలు చేపట్టారు. దాదాపు రెండు గంటలపాటు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టిన భద్రతా బలగాలు బాంబు లేదని నిర్ధారించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మెయిల్ పంపిన వ్యక్తి గురించి తెలుసుకునేందుకు సైబర్ క్రైమ్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.


తనిఖీలు చేస్తున్న భద్రతా బలగాలు

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
గురువారం । 19-6-2025

'కమిటీ' సగమై... 'బ్యూరో' బలహీనమై!



- మావోయిస్టు పార్టీ పరిస్థితి..
- సగానికి సగం తగ్గిపోయిన కేంద్ర కమిటీ సభ్యులు
- బలహీనపడిన పొలిట్‌బ్యూరో
- వరుస ఎన్‌కౌంటర్లతో ఉక్కిరిబిక్కిరి
- కేంద్ర కమిటీలో ముగిసిన ఏపీ నేతల ప్రస్థానం
- రెడ్ కారిడార్‌కు తెలంగాణ నేతలే పెద్దదిక్కు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఆపరేషన్ కగార్‌లో భాగంగా వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీ తీవ్రంగా నష్టపోతోంది. ఆ పార్టీకి చెందిన అగ్రనేతలు ఒక్కొక్కరుగా నేలకొరుగుతున్నారు. దీంతో పార్టీలో అత్యున్నత నిర్ణయాలు తీసుకునే కేంద్ర కమిటీ సభ్యుల సంఖ్య సగానికి సగం పడిపోగా పొలిట్‌బ్యూరో కుంచించుకుపోయింది.

34 మందితో కమిటీ..

పీపుల్స్ వార్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ పార్టీలు రెండూ విలీనమై 2004 సెప్టెంబర్ 21న భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టుగా ఏర్పాటైంది. ఆ సమయంలో పొలిట్‌బ్యూరోలో 16 మంది సభ్యులు ఉండగా కేంద్ర కమిటీకి 18 మందిని ఎన్నుకున్నారు. పార్టీ పరంగా రాజకీయ, మిలటరీ వ్యూహాలు అమలు చేయడంలో ఈ రెండు కమిటీలదే కీలక పాత్ర. పార్టీని నడిపించడంలో ఈ 34 మంది సభ్యులు కీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు. అయితే గడిచిన ఇరవై ఏళ్లలో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో కీలక నేతలు చనిపోగా, అనారోగ్య కారణాలు/అరెస్టులతో మరికొందరు పార్టీకి దూరమయ్యారు. ప్రస్తుతం కేంద్ర కమిటీలో 16 మంది సభ్యులు ఉండగా.. పొలిట్‌బ్యూరోలో అగ్రనేత గణపతి కాకుండా కేవలం ముగ్గురు సభ్యులు మిగిలినట్టు సమాచారం. ఇందులో ఇద్దరు తెలంగాణ నేతలు కాగా మరొకరు జార్ఖండ్ నుంచి ఉన్నారు.



ఈ ఏడాది ఐదుగురు..

ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో గాజర్ల రవి అలియాస్ ఉదయ్ చనిపోయారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతూనే ఆయన ఏవోబీ ఇన్‌చార్జ్, సెంట్రల్ మిలిటరీ కమిషన్, సీఆర్‌బీ సభ్యుడిగా ఉన్నారు. అంతకుముందు ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి నేషనల్ పార్క్ ఏరియాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెంటు లక్ష్మీనరసింహాచలం అలియాస్ సుధాకర్ చనిపోయారు. ఈ ఏడాది ఆరంభంలో చలపతి చనిపోయిన ఘటన నుంచి తేరుకోకముందే ప్రయాగ్ మాంఝీని జార్ఖండ్‌లో మట్టుబెట్టారు. మే 21న గుండెకోట్ ఎన్‌కౌంటర్‌లో ఏకంగా ఆ పార్టీ చీఫ్ కమాండర్ నంబాల కేశవరావు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లోనే కేంద్ర కమిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ఐదుగురు అగ్రనేతలు చనిపోగా ఇందులో నలుగురు తెలుగువారే ఉన్నారు.

తెలంగాణ నేతలే కీలకం..

నేపాల్ నుంచి తిరుపతి వరకు మావోయిస్టులు లక్ష్యంగా పెట్టుకున్న రెడ్‌కారిడార్‌కు నిన్న మొన్నటి వరకు ఏపీ, తెలంగాణకు చెందిన నేతలే పెద్ద దిక్కుగా ఉన్నారు. అయితే ఈ ఏడాది జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో నంబాల, చలపతి, సుధాకర్ మరణించడంతో ఏపీ నుంచి నాయకత్వం వహిస్తున్న అగ్రనేతలను ఆ పార్టీ కోల్పోయింది. ప్రస్తుతం తెలంగాణకు చెందిన నేతలే ఆ పార్టీకి చుక్కానిగా ఉన్నారు. ప్రస్తుతం కేంద్ర కమిటీలో 16 మంది సభ్యులు ఉండగా అందులో 11 మంది తెలంగాణ వారే. మరో ఇద్దరు ఛత్తీస్‌గఢ్ నుంచి, ముగ్గురు జార్ఖండ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేంద్ర కమిటీలో ఉన్న ఏకైక మహిళా నాయకురాలు పోతుల సుజాత కూడా తెలంగాణకు చెందినవారే కావడం గమనార్హం.

కేంద్ర కమిటీ సభ్యుడి హోదాలో ఇతర బాధ్యతలు నిర్వర్తిస్తున్న ముఖ్యమైన మావోయిస్టు నేతలు

పేరు (అలియాస్)	స్వస్థలం	ఇతర హోదా
1) ముప్పాళ్ల లక్ష్మణరావు (గణపతి) (76)	బీర్పూర్, జగిత్యాల జిల్లా	సీఆర్‌బీ, ఐఏ
2) మల్లోజుల వేణుగోపాల్ (అభయ్) (70)	పెద్దపల్లి	పీబీ, సీఆర్‌బీ
3) తిప్పిరి తిరుపతి (దేవ్‌జీ) (62)	కోరుట్ల, జగిత్యాల జిల్లా	పీబీ, సీఎంసీ
4) కడారి సత్యనారాయణరెడ్డి (కోసా) (67)	సిరిసిల్ల జిల్లా	సీఆర్‌బీ
5) పుల్లూరి ప్రసాద్ (చంద్రన్న) (64)	పెద్దపల్లి	సీఆర్‌బీ
6) మోడం బాలకృష్ణ (బాలన్న) (61)	హైదరాబాద్	సీఆర్‌బీ, ఒడిశా
7) పాక హన్మంతు (ఉకే గణేశ్)	నల్లగొండ	సీసీ
8) కట్టా రామచంద్రారెడ్డి (వికల్ప్)	సిద్దిపేట జిల్లా	డీకేఎస్‌జెడ్‌సీ
9) మల్లా రాజిరెడ్డి (సంగ్రామ్)	పెద్దపల్లి జిల్లా	సీసీ
10) పసునూరి నరహరి (విశ్వనాథ్)	హనుమకొండ జిల్లా	ఈఆర్‌బీఎం
11) పోతుల కల్పన (సుజాత (మైన)	మహబూబ్‌నగర్ జిల్లా	జనతన్‌సర్కార్
12) మిసిర్ బెస్రా (సాగర్) (63)	జార్ఖండ్	పీబీ, సీఎంసీ
13) మడావి హిడ్మా (సంతోశ్)	ఛత్తీస్‌గఢ్	పీఎల్‌జీఏ-1, డీకే ఎస్
14) అనల్‌దా (తుపాన్‌దా)	జార్ఖండ్	బిహార్,ఈఆర్‌బీఎం
15) మాజీదేవ్ (రణ్‌ధీర్)	ఛత్తీస్‌గఢ్	డీకేఎస్‌జెడ్‌సీ ఇన్‌చార్జీ
16) సహదేవ్ సోరేన్ (అంజూ)	జార్ఖండ్	ఈఆర్‌బీఎం

నోట్: పీబీఎం: పొలిట్‌బ్యూరో మెంబర్, సీసీ: కేంద్ర కమిటీ, సీఎంసీ: సెంట్రల్ మిలిటరీ కమిషన్, డీకేఎస్‌జెడ్‌సీ: దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, ఏవోబీ: ఆంధ్రా ఒడిశా బోర్డర్, సీఆర్‌బీ: సెంట్రల్ రీజినల్ బ్యూరో, ఈఆర్‌బీ: ఈస్ట్ రీజినల్ బ్యూరో, పీఎల్‌జీఏ: పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ, ఐఏ-అంతర్జాతీయ వ్యవహారాలు

అణచి 'వేట'



మావోయిస్టులపై భద్రతా దళాల ముప్పేట దాడి

సమాచారం, సాంకేతికత, నిర్బంధంతో ముట్టడి

తాజా ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రతా దళాలు చేపడుతున్న ముప్పేట దాడిలో మావోయిస్టు పార్టీ తీవ్రంగా నష్టపోతోంది. ఈ వరుసలో తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో గాజర్ల గణేశ్, రావి వెంకట చైతన్య ఆలియాస్ అరుణ, మరొక మావోయిస్టు చనిపోవడంతో ఆ పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలినట్టయింది. ఆంధ్రా ఒడిశా బోర్డర్‌లో మావోయిస్టు పార్టీని విస్తరించే పనిని గాజర్ల గణేశ్ దశాబ్దకాలంగా చూస్తున్నారు. పార్టీ అవసరాల రీత్యా 2022లో ఏవోబీ నుంచి దండకారణ్యం వచ్చిన కొద్ది కాలానికే తిరిగి ఏవోబీకి వెళ్లినట్టు తెలుస్తోంది. ఇటీవల జనతన సర్కార్‌కి ఆయువు పట్టులాంటి దండకారణ్యంలో పార్టీకి జరుగుతున్న వరుస నష్టాలతో మరోసారి ఉదయ్ ఆలియాస్ గణేశ్ దండకారణ్యానికి చేరుకున్నట్టు పోలీసులకు పక్కా సమాచారం ఉంది. ముఖ్యంగా ఇంద్రావతి నేషనల్ పార్క్ ఏరియాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సుధాకర్, మైలారపు ఆడెల్లు ఆలియాస్ భాస్కర్ చనిపోయాక యాంటీ నక్సలైట్ బలగాలు గణేశ్‌పై దృష్టి పెట్టినట్టు సమాచారం. దీంతో తిరిగి ఏవోబీకి వెళ్లే క్రమంలో ఏపీలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయన ప్రాణాలు కోల్పోయారు.

వెల్లువలా సమాచారం

ఆపరేషన్ కగార్ 2024 జనవరిలో మొదలైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 1,200 మందికి పైగా మావోయిస్టులు లొంగిపోగా మరో 300 మంది వరకు అరెస్టయ్యారు. ఇలా లొంగిపోయిన/అరెస్టయిన మావోయిస్టుల నుంచి పోలీసు ఇంటెలిజెన్స్ విభాగానికి వెల్లువలా సమాచారం అందుతోంది. పార్టీకి సంబంధించిన కీలక, రహస్య సమాచారం వెల్లడించేందుకు లొంగిపోయిన మావోయిస్టులు సుముఖంగా లేకపోయినా వివిధ పద్ధతుల ద్వారా పోలీసులు కొద్దికొద్దిగా సమాచారం సేకరిస్తూ దాన్ని విశ్లేషిస్తున్నారు. చివరగా తేలిన సమాచారాన్ని తమకున్న ఇన్‌ఫార్మర్ల ద్వారా నిర్ధారించుకుని పక్కా ఆపరేషన్లకు దిగుతున్నారు.

శాటిలైట్ టెక్నాలజీ

ఒకప్పుడు మొబైల్ ఫోన్లు వాడడంతో నష్టం జరిగిందనే సాకుతో మావోలు ఫోన్లను దూరం పెట్టారు. డ్రోన్ల ద్వారా పోలీసులు నిఘా పెంచారనే సందేహంతో తమ స్థావరాలు ఉన్న చోట విపరీతంగా నేలమాళిగలు, బంకర్లు నిర్మించారు. ఆయుధాలను సైతం నేలమాళిగల్లోనే తయారు చేస్తూ వచ్చారు. దీంతో డ్రోన్లకు అదనంగా శాటిలైట్ ఇమేజేస్, నైట్ విజన్ కెమెరాలు, థర్మల్ ఇమేజెస్ టెక్నాలజీని ఉపయోగిస్తూ బలగాలు కూంబింగ్ ఆపరేషన్లను చేపట్టడం మొదలుపెట్టాయి.

నిర్బంధంతో ఉక్కిరిబిక్కిరి

భద్రతా దళాలు/ పోలీసులు ఎన్ని ఆపరేషన్లు చేపట్టినా ప్రజల మద్దతుతో చాకచక్యంగా తప్పించుకోగలమనే ధీమా మావోయిస్టుల్లో ఉండేది. బస్తర్‌తో పాటు తెలంగాణ, ఏవోబీ, జార్ఖండ్, ఒడిశా వంటి ప్రాంతాల్లో ఇప్పటికీ మావోయిస్టు పార్టీకి మద్దతుగా నిలబడే ప్రజలు ఉన్నారని లొంగిపోయిన వారు చెబుతున్నారు. అయితే మావోయిస్టులు, వారి సానుభూతిపరుల మధ్య సంబంధాలను తెంచడంలో ప్రభుత్వం సఫలం అవుతోంది. తీవ్ర నిర్బంధం అమలు చేయడం ద్వారా మావో సాయుధ దళాలకు ప్రజలకు మధ్య సంబంధాలు విచ్ఛిన్నం చేయగలగుతోంది. ఇందు కోసం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఏకంగా 320 సీఆర్‌పీఎఫ్ క్యాంపులు, 68 హెలిప్యాడ్లు ఏర్పాటు చేశారు. అంతేకాదు 2014లో 65గా ఉన్న పోలీస్‌స్టేషన్ల సంఖ్యను 555కు పెంచారు. దీంతో నెట్‌వర్క్ పెరిగింది.

ఆత్మస్థైర్యం సన్నగిల్లేలా..

సీఆర్‌పీఎఫ్‌కు అదనంగా డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, కోబ్రా వంటి దళాలు ఛత్తీస్‌గఢ్‌లో ఉండగా సీ-60 (మహారాష్ట్ర), ఎస్‌వోజీ (ఒడిశా), గ్రేహౌండ్స్ (ఏపీ, తెలంగాణ) ప్రత్యేక బలగాలు పని చేస్తున్నాయి. జంగిల్ వార్‌ఫేర్‌లో ఆరితేరిన ఈ దళాలు మావోల అంబూష్‌లను తప్పించుకుంటున్నాయి. వరుసగా ఎన్‌కౌంటర్లకు పాల్పడుతూ మావోలతో పాటు సానుభూతిపరుల్లో ఆత్మస్థైర్యం సన్నగిల్లే పరిస్థితిని కల్పిస్తున్నాయి. ఫలితంగా మావోలకు సంబంధించిన వివరాలు పోలీసులకు వెనువెంటనే తెలుస్తుంటే అందుకు తగ్గట్టుగా ప్రతివ్యూహాలు రూపొందించడంలో మావోయిస్టులకు స్థానికుల నుంచి సహకారం కష్టమవుతోంది. ఫలితంగా వరుస ఎన్‌కౌంటర్లలో మావోయిస్టులు మరణిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

రక్షణ కేంద్రాలుగా బంకర్లు, మెట్రోస్టేషన్లు

ఇజ్రాయెల్‌లో యుద్ధవాతావరణంలో తెలంగాణ వలస కార్మికులు



మోర్తాడ్: ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతుండడంతో ఇజ్రాయెల్‌లో ఉపాధి పొందుతున్న తెలంగాణ వలస కార్మికులు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. ఇరాన్ నిర్విరామంగా బాంబుల వర్షం కురిపిస్తుండడంతో వలస కార్మికులు తమ ప్రాణాలను రక్షించుకునేందుకు బంకర్లు, మెట్రో స్టేషన్లలో రోజులు గడుపుతున్నారు. బాంబు దాడి జరుగుతుందని సంకేతాలు అందగానే ఇజ్రాయెల్ ప్రభుత్వం అక్కడి పౌరులు, వలస కార్మికుల మొబైల్ ఫోన్లకు అలర్ట్ మెసేజ్ పంపిస్తోంది. ఆ తర్వాత సైరన్ మోగుతోంది. అంతలోపే బంకర్లు, అందుబాటులో ఉన్న మెట్రో రైల్వేస్టేషన్లకు పరుగులు పెడుతున్నామని టెల్ అవీవ్ పట్టణంలో పనిచేస్తున్న నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి చెందిన గుగ్గిల దేవరాజు తెలిపారు. ఇజ్రాయెల్‌లో మొదటి నుంచీ బంకర్ల వ్యవస్థ ఉంది. తమ దేశంపై శత్రు దేశాలు దాడి చేస్తాయనే ఉద్దేశంతో పౌరుల రక్షణ కోసం బంకర్ల వ్యవస్థను ఇజ్రాయెల్ ప్రభుత్వం విస్తృతం చేసింది. బంకర్లు అందుబాటులో లేని చోట మెట్రోస్టేషన్‌లో తలదాచుకోవడంతో అనేకమంది ప్రాణాలు రక్షించుకుంటున్నారు. మెట్రో స్టేషన్లు భూగర్భంలో మూడు అంతస్తుల కింద ఉండడంతో బంకర్ల కంటే ఎక్కువ రక్షణ కల్పిస్తున్నాయి. ఇజ్రాయెల్‌లో చాలా సంవత్సరాల నుంచి ఉపాధి పొందుతున్న వారికి యుద్ధ వాతావరణం కొత్త కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల ఇజ్రాయెల్ భారతీయులకు అనేక వీసాలు జారీ చేయడంతో చాలామంది ఉపాధి కోసం ఆ దేశం బాట పట్టారు. కొత్తగా వెళ్లిన వారు మాత్రం యుద్ధ వాతావరణంతో భీతిల్లుతున్నారు. ఇరాన్‌తో ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం తమకు కొంత ఆందోళన కలిగిస్తున్నా, రక్షణ వ్యవస్థ బాగుండడంతో భద్రంగా ఉన్నామని నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌కు చెందిన కిషోర్ 'సాక్షి'కి వివరించారు. తాను ఇటీవలే ఇజ్రాయెల్‌కు వచ్చానని తెలిపారు. యుద్ధం సద్దుమణిగితే క్షేమంగా పని చేసుకుంటామని అక్కడ ఉపాధి పొందుతున్న మన వలస కార్మికులు చెబుతున్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి: మంత్రి



సాక్షి, హైదరాబాద్: వానాకాలం ప్రారంభమైనందున గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు కురిసి వరదలు వచ్చినప్పుడు వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని పేర్కొన్నారు. బుధవారం తనను కలిసేందుకు వచ్చిన అధికారులకు ఆయన ఈమేరకు సూచనలు చేశారు. రోడ్లు వానలకు పాడైతే వెంటనే మరమ్మతు చేసి వాహనాల రాకపోకలు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

దివ్యాంగులకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోయింది

ఎంపీ అర్వింద్ విమర్శ



సాక్షి, హైదరాబాద్: దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడు ధర్మపురి అర్వింద్ విమర్శించారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇచ్చిన హామీలు అమలు చేయనందువల్లే భరోసా కార్యక్రమానికి దివ్యాంగులు వస్తున్నారని, అత్యంత తక్కువ సంఖ్యలో ఉన్న దివ్యాంగుల సమస్యలు పరిష్కరించకపోవడం ప్రభుత్వ చేతకానితనమే అని అన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డైవర్ట్ పాలిటిక్స్‌కు తెరతీశారని, ఆయన సగం కాంగ్రెస్, సగం బీఆర్ఎస్ అని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాలని నిన్న ఉత్తమ్ తనకు ఫోన్‌లో చెప్పారని, జగన్ సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ ఈ ప్రాజెక్టుకు ఒకే చెప్పారన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల జరిగే లాభ, నష్టాల గురించి కనీసం చర్చించారా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఏర్పాటైన సిట్‌పైన తనకు నమ్మకం లేదని, ఈ కేసులతో సీఎం రేవంత్ వ్యాపారం చేసుకుంటున్నారని అర్వింద్ విమర్శించారు.

ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి: జాజుల లింగంగౌడ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని నిలువరించాలంటే రాష్ట్ర ప్రభుత్వమే ఇంటర్ కాలేజీల ఫీజులను నిర్ణయించాలన్నారు. చాలా కాలేజీలు విద్యార్థుల నుంచి 60 శాతం ఫీజులు ముందస్తుగానే వసూలు చేస్తున్నాయని, వారికి కనీసం వాయిదాలు చెల్లించే అవకాశం లేకుండా ఒత్తిడి చేస్తున్నాయన్నారు. ఈ కాలేజీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

నిషేధముంటే ఎలా అనుమతిస్తారు?


సాక్షి, హైదరాబాద్: డ్యూగో అర్జెంటీనో జాతి కుక్కపై నిషేధం ఉందని మీరే చెబుతున్నారు.. అలాంటప్పుడు బ్రీడింగ్, పెంచేందుకు అనుమతి ఎలా ఇస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఢిల్లీ హైకోర్టు నిషేధం విధించిందా.. లేదా.. అన్నది తెలుసుకుని స్పష్టత ఇవ్వాలని స్టాండింగ్ కౌన్సిల్‌ను ఆదేశించింది. పిటిషనర్‌కు అతని కుక్కను అప్పగించాలని జీహెచ్ఎంసీ, వెటర్నరీ అధికారులకు చెప్పింది. అయితే, అదే ఇంట్లో కుక్కను ఉంచవద్దని, వీలైతే కొత్త వ్యక్తులకు దూరంగా ఉంచాలని పిటిషనర్‌కు స్పష్టం చేశారు. తదుపరి విచారణను వచ్చే నెల 9కి వాయిదా వేస్తూ.. పిటిషనర్ సోదరుడిని ఇంప్లీడ్ చేయాలని రిజిస్ట్రీకి సూచించింది. తాము లైసెన్స్ పొందిన తర్వాతే కుక్క(ఆరీస్)ను పెంచుతున్నామని, అయినా చట్టవిరుద్ధంగా పోలీసులు, జీహెచ్ఎంసీ తమ కుక్కను కస్టడీలోకి తీసుకున్నారంటూ చిక్కడపల్లికి చెందిన దక్షిణామూర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అధికారుల తీరు చట్టవిరుద్ధమని, దురుసుగా, సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘిస్తూ తమ నుంచి కుక్కను లాక్కెళ్లారని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ వెటర్నరీ సెక్షన్‌లో ఉన్న తమ కుక్కను వెంటనే అప్పగించేలా డిప్యూటీ డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు.

'డ్యూగో అర్జెంటీనో'పై సర్కార్‌ను ప్రశ్నించిన హైకోర్టు

- ఢిల్లీ హైకోర్టు నిషేధం విధించిందన్న స్టాండింగ్ కౌన్సిల్
- బ్రీడింగ్, పెంచేందుకు ఎలా అనుమతిస్తున్నారన్న న్యాయమూర్తి
- పిటిషనర్‌కు కుక్కను అప్పగించాలని అధికారులకు ఆదేశం
- కొత్త వాళ్లకు కుక్కను దూరంగా ఉంచాలన్న జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి
- బ్రీడ్‌పై నిషేధం ఉంటే చర్యలు తీసుకోవచ్చని అధికారులకు స్వేచ్ఛ

నిషేధం ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చు..

పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్ భార్యను అతని సోదరుడు బెదిరించిన కారణంగానే కుక్క అతనిపై దాడి చేసింది. అతన్ని కరవడంలాంటివి చేయలేదు. పిటిషనర్‌కు ఎలాంటి నోటీసులు కూడా ఇవ్వకుండా గత నెల 19న కుక్కను కస్టడీలోకి తీసుకున్నారు. డ్యూగో అర్జెంటీనోపై దేశంలో ఎలాంటి నిషేధం లేదు. ఇకపై బయటికి వదలకుండా బోన్‌లోనే ఉంచుతాం. అధికారులు కోతులను ఉంచే బోన్‌లో ఉంచి.. ఆహారం కూడా సరిగా ఇవ్వడం లేదు. ఇలాగే ఉంచితే దాని ప్రాణాలుపోయే ప్రమాదం ఉంది'అని వాదించారు. స్టాండింగ్ కౌన్సిల్ వాదనలు వినిపిస్తూ.. 'కుక్క తనపై దాడి చేసిందని పిటిషనర్ సోదరుడు చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు కూడా నమోదైంది. పోలీసులు రాసిన లేఖ ఆధారంగా కుక్కను కస్టడీలోకి తీసుకుని వెటర్నరీ సెక్షన్‌కు తరలించాం. దేశంలో ఈ రకం కుక్కపై నిషేధం ఉంది'అని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. డ్యూగో అర్జెంటీనో ఓ క్రూరమైన కుక్క అంటున్నారు కదా, దీని పెంపకంపై మన దేశంలో నిషేధం ఉందా అని ప్రశ్నించారు. ఢిల్లీ హైకోర్టు ఆ మేరకు తీర్పు ఇచ్చిందని స్టాండింగ్ కౌన్సిల్ బదులిచ్చారు. మరి బ్రీడింగ్‌కు ఎలా అనుమతిస్తారని న్యాయమూర్తి అడిగారు. ఎవరిపైనా దాడి చేయదని చెబుతున్నారు.. మరి డీఫ్యాక్టో కంప్‌లెయినెంట్‌పై దాడి చేసింది కదా.. మెడికల్ రికార్డులు, ఫొటోలు, వీడియోలు దాడి జరిగినట్లు స్పష్టం చేస్తుండగా, అది అలాంటి స్వభావమున్న జంతువు కాదని ఎలా చెబుతారని పిటిషనర్ న్యాయవాదిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్క కావాలంటే మరోచోటికి వెళ్లండి.. సోదరుడు కావాలంటే కుక్కను మరోచోటికి మార్చండని సూచించారు. జీహెచ్ఎంసీలో తగిన వైద్య సౌకర్యాలు అందుబాటులో లేవన్న వాదన మేరకు తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు కుక్కను పిటిషనర్‌కు అప్పగించాలని డిప్యూటీ డైరెక్టర్(వెటర్నరీ)ని ఆదేశించారు. అలాగే, దేశంలో డ్యూగో అర్జెంటీనో జాతి కుక్కపై నిషేధం ఉంటే.. పిటిషనర్‌కు సరైన నోటీసు జారీ చేసి, చట్టబద్ధమైన చర్యలు చేపట్టవచ్చని అధికారులకు స్వేచ్ఛ ఇచ్చారు.




రైతు సంక్షేమానికి తెలంగాణ కృషి అభినందనీయం

సుప్రీంకోర్టు నియమించిన ఉన్నతస్థాయి కమిటీ ప్రశంస



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం చేస్తున్న కృషి అభినందనీయమని పంజాబ్ రైతుల విషయంలో సుప్రీంకోర్టు నియమించిన ఉన్నతస్థాయి కమిటీ పేర్కొంది. రైతుల ఆర్థికాభివృద్ధికి తెలంగాణ ప్రత్యేకంగా పథకాలు తేవడం ముదావహమని కొనియాడింది. హరియాణాలో పర్యటిస్తున్న విత్తన చట్టం రూపకల్పన కమిటీ పంచకుల నగరంలోని ప్రభుత్వ వ్యవసాయ కార్యాలయంలో హైపవర్ కమిటీతో సమావేశమైంది. రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, విత్తన చట్టం కమిటీ సభ్యు డు, హైపవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ నవాబ్‌సింగ్, ఇతర సభ్యులతో సమావేశమై వివిధ అంశాలను చర్చించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాలు, ప్రధాన పంటలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ, రైతు భరోసా, సన్నాలకు బోనస్, రాయితీలపై వ్యవసాయ పనిముట్లు పంపిణీ వంటి పథకాలపై హైపవర్ కమిటీకి తెలంగాణ బృందం వివరించింది. ఇతర రాష్ట్రాల్లో కన్నా తెలంగాణ విధానాలు బాగున్నాయని ఈ సందర్భంగా ఉన్నతస్థాయి కమిటీ పేర్కొన్నట్లు సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి తెలిపారు. ములుగు విత్తనోత్పత్తి ఘటనపై కూడా హైపవర్ కమిటీ ఆరా తీసింది. ములుగులో జరిగిన సంఘటనలను మల్టీనేషనల్ విత్తన కంపెనీల మోసాలను రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి హైపవర్ కమిటీ దృష్టికి తెచ్చారు. సమగ్ర విత్తన చట్టంతోనే విత్తన కంపెనీలను కట్టడి చెయ్యొచ్చని, విత్తనోత్పత్తి చేసే రైతులకు న్యాయం జరుగుతుందని వివరించారు. అయితే విత్తన చట్టం తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదని, వ్యవసాయం రాష్ట్ర పరిధిలోని అంశమని, విత్తన చట్టం రాష్ట్ర పరిధిలోకే వస్తుందని, కేంద్రం అడ్డుకునే విధానం సరికాదన్నారు. ఈ సమావేశంలో రైతు కమిషన్ సలహాదారులు రామాంజనేయులు, డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి, వ్యవ సాయశాఖ అధికారులు శివప్రసాద్, హరివెంకటప్రసాద్, హరియాణా, పంజాబ్ రాష్ట్రాల వ్య వసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



విశాఖ వాసుల ట్రాఫిక్ పాట్లు...

జూన్ 21న విశాఖలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆ కార్యక్రమ ఏర్పాట్లలో భాగంగా బీచ్ రోడ్డును మూసివేయడంతో విశాఖలోని వెంకోజీపాలెం వద్ద బుధవారం భారీగా ట్రాఫిక్ ఇలా నిలిచిపోయింది. - విశాఖపట్నం



ఐదు వేల మందితో 'యోగా'

యోగాంధ్ర మహోత్సవంలో భాగంగా వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో యోగా కార్యక్రమాన్ని ఐదువేల మందితో నిర్వహించారు. ఇందులో అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. - కడప



మా గోడు... వినండి సారూ!

ఇదేదో.. సంక్షేమ పథకాల కోసమో.. సినిమా టిక్కెట్ల కోసమో కట్టిన క్యూ కాదు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను కొల్లేరు సాధికారిక కమిటీ సభ్యుల ముందు వినిపించేందుకు బుధవారం ఏలూరు జిల్లాలోని కొల్లేరు గ్రామాల్లో నివసించే మహిళలు..ఏలూరు కలెక్టరేట్ వద్ద ఇలా క్యూ కట్టారు. - ఏలూరు

క్లుప్తంగా...

పొగాకు రైతుల ఆత్మహత్యలు ఆందోళనకరం

నల్లమడ రైతు సంఘం నాయకుడు డాక్టర్ కొల్లా



నాదెండ్ల: నల్లబర్లీ పొగాకు సాగు చేసిన రైతుల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతుందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పొగాకు కొనుగోళ్ళకు చర్యలు తీసుకోవాలని నల్లమడ రైతు సంఘ నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహనరావు చెప్పారు. పల్నాడు జిల్లా నాదెండ్ల, తూబాడు గ్రామాల్లో ఆత్మహత్యకు పాల్పడిన ఇరువురు పొగాకు రైతులకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలు తీవ్ర విషాదకరమన్నారు. రైతులు పొగాకును నిల్వ చేసి కొనుగోళ్ళకు ఎదురు చూస్తున్నారన్నారు. కనీస ఖర్చులు కూడా రావనే ఆలోచనతో కొందరు రైతులు పొగాకును పొలాల్లో ఎరువుగా పనికి వచ్చేలా చిమ్మి దున్నేస్తున్నారన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు.

ఆన్‌లైన్‌లో కేక్ తిని బాలుడు మృతి

బనశంకరి: ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన కేక్ తిని తల్లిదండ్రులు అస్వస్థతకు గురికాగా వారి ఆరేళ్ల కుమారుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన బెంగళూరు కేపీ అగ్రహార పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు అక్కడే ఉండే బంధువులు ఇంటికి వెళ్లారు. సాయంత్రం ఆన్‌లైన్‌లో కేక్ ఆర్డర్ చేసి తెప్పించుకున్నారు. కేక్ కట్‌చేసి తినగానే వినయ్ (6) కడుపునొప్పి, వాంతులు విరేచనాలతో అస్వస్థతకు గురయ్యాడు, వెంటనే కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బాలుడు చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడు. తల్లిదండ్రులు కూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేపీ.అగ్రహార పోలీసులు కేసు నమోదు చేశారు. కేక్ చేసి చాలారోజులై ఉంటుందని, దీనివల్ల ఫంగస్, బ్యాక్టీరియాతో కలుషితమై ఉంటుందని అనుమానిస్తున్నారు. డెలివరీ బాయ్, అలాగే కేక్ తెచ్చిన షాపు కోసం గాలింపు చేపట్టారు.

కొల్లేరుపై సీఈసీ సభ్యుల సమీక్ష

ఏలూరు(మెట్రో): కేంద్ర సాధికారత కమిటీ (సీఈసీ) సభ్యులు చంద్రశేఖర్ గోయల్, మెంబర్ కార్యదర్శి డా. జేఆర్ భట్, జి.భానుమతి, కమిటీ సభ్యులు సునీల్ లిమాయే, ప్రకాష్ చంద్రభట్ బుధవారం ఏలూరు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. చంద్రశేఖర్ గోయల్ మాట్లాడుతూ ఉప్పుటేరులోకి కలిసే ఇరిగేషన్ డ్రైన్లు, డ్రైన్ల ద్వారా కొల్లేరులోకి వచ్చే కాలుష్యం నివారణకు తీసుకుంటున్న చర్యలు, డ్రైన్ల డీసిల్టింగ్‌పై నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ నాగార్జునరావుని ఆదేశించారు. కొల్లేరు వన్యప్రాణి అభయారణ్యంగా ప్రకటించక ముందు కొల్లేరు గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, గ్రామాలను కలిపే లింక్ రోడ్లు, ప్రస్తుతం వాటి నిర్వహణపై నివేదిక అందించాలని పంచాయతీరాజ్ ఎస్ఈ రమణమూర్తిని కమిటీ సభ్యులు ఆదేశించారు.

5 కేజీల గంజాయి పట్టివేత

ఒంగోలు టౌన్: ఒడిశా నుంచి గంజాయి తెప్పించి స్థానికంగా విక్రయించే నలుగురు వ్యక్తులను ఒంగోలులో బుధవారం అరెస్టు చేశారు. వారి వద్ద 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం, బాపట్ల జిల్లా చినగంజాం గ్రామానికి చెందిన కుక్కల గోవర్ధన్‌రెడ్డి, ఒడిశాకు చెందిన రాజేష్ నాయక్, ఒంగోలులోని బండ్లమిట్టకు చెందిన షేక్ ముజీర్‌లు ఒడిశాకు చెందిన మహేశ్వర్ ముఠుడి ద్వారా 5 కిలోల గంజాయి తెప్పించారు. ఒంగోలు పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు ప్లాన్ చేశారు. తీసుకొచ్చిన గంజాయిని పంచుకునేందుకు సీతారాంపురం కొండమీదకు చేరుకున్నారు. తగిన సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు జరిపిన దాడిలో దొరికిపోయారు. తదుపరి విచారణ కొనసాగుతోంది.



శిశువుకు ముహూర్తం గండం

- ప్రసవాలకూ ముహూర్తం నిర్ణయించుకుంటున్న వైనం
- డిమాండ్‌ను సొమ్ము చేసుకుంటున్న కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు
- తల్లీబిడ్డ ప్రాణానికి ప్రమాదమున్నా.. ముహూర్తానికే సిజేరియన్
- ముందస్తు ప్రసవాలతో పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం

నిర్ణయించుకున్న సమయానికే పిల్లలకు జన్మనిచ్చేందుకు ఆరాటం

- హిందూపురానికి చెందిన వివాహితకు నెలలు నిండాయి. ప్రసవానికి ఇంకా 15 రోజుల గడువుందని వైద్యులు చెప్పారు. అయితే తన భర్త పుట్టిన రోజునాడే తాను బిడ్డకు జన్మనివ్వాలని భావించిన గర్భిణి అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరి సిజేరియన్ ద్వారా మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే ఆ తర్వాత బిడ్డ ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో బెంగళూరుకు తీసుకెళ్లి రూ.6 లక్షలు ఖర్చు చేసి రెండు నెలల పాటు చికిత్స తీసుకున్నారు. అయినా బిడ్డ మానసిక ఎదుగుదలలో లోపం కనిపిస్తోందని.. మూర్ఖత్వంతో ముందుగానే సిజేరియన్ చేయించి తప్పు చేశామని ఈ దంపతులు ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నారు.
- దొడ్డబల్లాపురానికి చెందిన ఓ వ్యక్తి గర్భిణీగా ఉన్న తన భార్యకు హిందూపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రతి నెలా పరీక్షలు చేయించేవాడు. ఓ పురోహితుడి సూచన మేరకు మంచి ముహూర్తం ఉందని నెలలు నిండకముందే భార్యకు సిజేరియన్ చేయించాడు. చిన్నారి ఆరోగ్యం అదృష్టవశాత్తూ బాగుంది.. కానీ తల్లి ఆరోగ్యం క్షీణించడంతో తర్వాత బెంగళూరుకు తీసుకెళ్లారు.

సాక్షి, పుట్టపర్తి : మనిషి చంద్రమండలంలో అడుగు పెడుతున్న నేటి రోజుల్లోనూ... చాలా మంది ఇంకా మూఢనమ్మకాలను వీడడం లేదు. ముఖ్యంగా ముహూర్తాల పిచ్చితో కష్టాలు కొనితెచ్చుకుంటున్నారు. ముహూర్తం కలిసి వస్తే ఫర్వాలేదు గానీ... ఫలానా రోజే..ఫలానా ముహూర్తమే అన్నది ఇబ్బందిగా మారింది. కొందరైతే ప్రసవాలకూ ముహూర్తాలు నిర్ణయిస్తూ శిశువులు, వారికి జన్మనిచ్చే తల్లుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ముహూర్తాల పిచ్చితో అమ్మ కడుపునకు గాటు పెట్టించి.. బిడ్డలను బలవంతంగా తీస్తున్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యానికి ముప్పు తలపెడుతున్నారు. ఈ జాఢ్యాన్ని కొందరు తల్లులతో పాటు వారి కుటుంబ సభ్యులు ప్రోత్సహిస్తుండటం వైద్యులను సైతం ఆందోళనకు గురి చేస్తోంది. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులకు మాత్రం కాసుల వర్షం కురిపిస్తోంది.

సిజేరియన్‌కే మొగ్గు

ఒకప్పుడు సిజేరియన్ పేరు చెబితే గర్భిణులు భయపడేవారు. బిడ్డ అడ్డం తిరిగినప్పుడు.. గర్భిణి నీరసంగా ఉన్నప్పుడు, రక్తపోటు అధికంగా ఉన్నప్పుడు, గర్భంలో బిడ్డ అడ్డం తిరిగినప్పుడు, ఉమ్మనీరు పోతున్నప్పుడు, గర్భాశయ ముఖద్వారాన్ని మాయ కమ్మేసినప్పుడు తదితర అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే గతంలో సిజేరియన్ చేసేవారు. కానీ ప్రస్తుత కాలంలో సిజేరియన్ సర్వసాధారణంగా మారింది. సహజ కాన్పుతో కలిగే దీర్ఘకాలిక ప్రయోజనంపై అవగాహన లేకపోవడంతో చాలామంది సిజేరియన్‌కే మొగ్గు చూపుతున్నారు. సరైన ముహూర్తానికే పురుడు పోయాలని వైద్యులపై ఒత్తిడి చేస్తున్నారు.

మారుమూల పల్లెల వరకు

ముహూర్తానికే సిజేరియన్ చేసి పురుడుపోసే సంప్రదాయం పట్టణాల నుంచి పల్లెల వరకూ పాకింది. ముహూర్తాల పేరుతో తమకు నచ్చిన రోజు.. నచ్చిన సమయానికే బిడ్డలకు జన్మనిచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏడాదిన్నర వ్యవధిలో జిల్లా పరిధిలో జరిగిన ప్రసవాల సంఖ్యలో సిజేరియన్ల సంఖ్య ఎక్కువగా ఉండటం... అందునా ప్రైవేటు ఆస్పత్రుల్లోనే అధికంగా నమోదు కావడం గమనార్హం. ముహూర్తాల పేరుతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి.. కావాల్సిన సమయానికి బిడ్డలకు జన్మనిస్తున్నారు. ఈ చెడు సంస్కృతి పట్టణాల నుంచి పల్లెల వరకు వ్యాపించింది. ఫలితంగా ప్రొలాక్టిన్ వంటి హార్మోన్లు విడుదల కాక పిల్లలు పుట్టిన వెంటనే పాలు ఇవ్వడం కష్టంగా మారుతోంది. ఈ క్రమంలో తల్లిపాలు పట్టకపోతే బిడ్డ ఎదుగుదలపై ప్రభావం చూపిస్తుంది. సిజేరియన్‌తో పలు మూత్రాశయ వ్యాధులు కూడా సోకే ప్రమాదం ఉంది.

ప్రోత్సహిస్తున్న ప్రైవేటు డాక్టర్లు

కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు కూడా సిజేరియన్లను ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. ఒక సిజేరియన్‌కు ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాల్లో 80 శాతం వరకు సిజేరియన్లు ఉండటం విశేషం. సిజేరియన్ చేస్తే ఆస్పత్రిలోనే వారం రోజుల పాటు బాలింతలు ఉండాల్సి వస్తోంది. దీంతో అదనంగా మరో రూ.15 వేల వరకు దండుకుంటున్నారు. సహజ ప్రసవమైతే రూ.20 వేల లోపు ఖర్చుతో పాటు రెండు రోజుల్లో డిశ్చార్జి కావచ్చు.

శిశువులకు ప్రమాదం



బిడ్డ జననం సహజంగా జరిగితే అది శిశువు మానసిక, శారీరక వికాసానికి దోహదపడుతుంది. సిజేరియన్ ద్వారా మంచి ముహూర్తాల కోసం నెలల నిండక ముందే జన్మనిస్తే.. ఊపిరితిత్తుల సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. తక్కువ బరువు ఉంటారు. మానసిక ఎదుగుదల లోపిస్తుంది. బిడ్డలో ఆ సమయానికి అవసరమైన దాని కంటే తక్కువ హార్మోన్లు విడుదల కావడంతో పిల్లల భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉంది.

– డాక్టర్ శివకుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, హిందూపురం

ముహూర్తం..మూర్ఖత్వం



కొందరు ముహూర్తం చూసుకుని సిజేరియన్ ద్వారా పిల్లలకు జన్మనిస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. కడుపు కోత తల్లుల ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అంతేకాకుండా సమయానికి ముందే జన్మించడంతో చిన్నారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. సిజేరియన్ విషయంలో మూర్ఖత్వంతో వైద్యులపై ఒత్తిడి తేరాదు.

– డాక్టర్ ఫైరోజా బేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, పుట్టపర్తి

టమాటా.. నష్టాల మూట



అన్నమయ్య జిల్లా రెడ్డివారిపల్లెలో వర్షాలకు దెబ్బతిన్న టమాటా తోట

- వర్షాలకు తెగుళ్లు సోకి దెబ్బతిన్న పంట
- నల్లమచ్చలు, ఊజి రోగంతో నాణ్యత లోపం
- ధర పుంజుకొంటున్నా తగ్గుతున్న దిగుబడి
- లబోదిబోమంటున్న రైతులు



టామాటకు సోకిన నల్లమచ్చల రోగం

గుర్రంకొండ: ఇటీవల కురుస్తున్న వర్షాలు, మారిన వాతావరణం కారణంగా.. జిల్లాలోని టమాటా తోటలు దెబ్బతిన్నాయి. నల్లమచ్చలు, ఊజిరోగాలతో పంట దిగుబడి తగ్గిపోయింది. ఇప్పుడిప్పుడే ధరలు పుంజు కొంటుండటంతో రైతుల ఆశలు చిగురించాయి. అయితే పంట దెబ్బతిని దిగుబడులు తగ్గిపోవడంతో వారి ఆశలు అడియాసలుగా మారాయి.

నల్లమచ్చలు, ఊజిరోగాలతో దెబ్బతిన్న తోటలు

వరుసగా కురుస్తున్న వర్షాలు, మరోవైపు మారుతున్న వాతావరణం దెబ్బకు టమాటా తోటలకు నల్లమచ్చలు, ఊజి, గజ్జి రోగాలు ఆవహించడంతో పంట భారీగా దెబ్బతినింది. చెట్టులోని కాండం, ఆకులు, పిందెలు, చిన్నసైజు కాయలకు నల్లమచ్చ లు ఏర్పడ్డాయి. కాయల సైజు పెరిగినా మచ్చలు అలాగే ఉంటున్నాయి. దీంతో వీటికి మార్కెట్‌లో డిమాండ్ లేకపోతోంది. ఊజీ రోగాలతో ప్రస్తుతం తోటల్లో ఉన్న కాయలకు రంధ్రాలు ఏర్పడుతున్నాయి. ఊజి ఈగలు, ఆకుమడత రోగాలు చెట్టును, ఆకుల్ని సైతం పీల్చి పిప్పిచేస్తున్నాయి.

30 శాతం మేరకు నల్లమచ్చలున్న టమాటాలే

మంచి కాపు మీదున్న టమాటా తోటలు వర్షాల ప్రభావానికి గురై 30 శాతం మేరకు కాయలు దెబ్బతిన్నాయి. వివిధ రకాల రోగాలు సోకి తోటల్లో కాయలు దెబ్బతిన్నాయి. తోటల్లో కాయల కోత సమయంలో వంద క్రేట్లకు గాను 30 క్రేట్లు నల్లమచ్చలున్న టమాటాలే ఉండటం గమనార్హం. వీటిని ప్రత్యేకంగా మామూలు టమాటాల నుంచి వేరు చేసి.. మార్కెట్‌కు తరలించాలంటే తలప్రాణం తోకకు వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీంతో చేసేది లేక నల్లమచ్చలున్న కాయల్ని పొలాల వద్ద రోడ్ల పక్కనే పారబోస్తున్నారు.

గిట్టుబాటు ధరలున్నా నష్టపోతున్న రైతులు

ప్రస్తుతం మార్కెట్‌లో టమాటా ధరలు రోజురోజుకు పుంజుకొంటున్నాయి. ఒక క్రేట్(25కేజీల) ధర రూ.400 నుంచి రూ.500 వరకు పలుకుతున్నాయి. అయితే ఊజి రోగం ప్రభావంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. ప్రస్తుతం ఒక ఎకరానికి 240 నుంచి 280 క్రేట్ల వరకు నల్లమచ్చలున్న కాయలు వస్తున్నాయి. దీంతో ఎకరానికి రూ.1.40 లక్షల చొప్పున రైతులు నష్టపోతున్నారు. జిల్లా మొత్తం మీద రూ.16 కోట్లు నష్టపోతున్నారు. చాలా రోజుల తరువాత మార్కెట్లో టమాటాలకు గిట్టుబాటు ధరలు పలుకుతున్నాయి. అయితే టమాటా రైతులను దురదృష్టం నల్లమచ్చలు, ఊజిరోగం రూపంలో మరోసారి వెంటాడింది. దీంతో రైతులు అన్ని విధాలా నష్టపోతున్నారు.



రోడ్డు పక్కనే పారబోసిన తెగుళ్లు వ్యాపించిన కాయలు

కొనేవారు లేరు



నల్లమచ్చల రోగంతో దెబ్బతిన్న టమాటాలను కొనేవారు లేరు. విధిలేక మార్కెట్‌కు తీసుకుపోతున్నా.. అక్కడ వ్యాపారులు కొనడం లేదు. చేసేదిలేక టమాటాలను తోటల్లో కోసి అక్కడే వదిలేసి వస్తున్నాం. మంచి టమాటాలు, నల్లమచ్చలున్న టమాటాలను వేరు చేసి.. దెబ్బతిన్ని వాటిని పొలాల వద్ద, రోడ్ల పక్కనే పారబోస్తున్నాం. రోగాల దెబ్బతో టమాటా పంట రోజు రోజుకు దెబ్బతింటోంది. –వెంకటాచలపతి, టమాటా రైతు, చినకంపల్లె

నష్టపోయాం



రోగాలతో బాగా నష్టపోయాం. ఎకరం టమాటా సాగు చేశాను. ఇప్పుడు కురిసిన వర్షానికి నల్లమచ్చల రోగం బాగా ఎక్కువగా ఉంది. పంట దిగుబడిలో 30 శాతం టమాటాలు రోగాలతో దెబ్బతిన్నాయి. ఒక కోతకు 30 క్రేట్ల నల్లమచ్చలు, ఊజి రోగాలతో దెబ్బతిన్న టమాటాలే వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో టమాటా ధరలు పుంజుకొంటున్నాయి. ఈ సమయంలో రోగాలతో లక్షలాది రూపాయలు నష్టపోతున్నాం. – కృష్ణమూర్తి, టమాటా రైతు, రెడ్డివారిపల్లె



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. సోమవారం అర్ధరాత్రి వరకు 84,681 మంది స్వామివారిని దర్శించుకున్నారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

దుర్గమ్మ సేవలో కేంద్ర సాధికార కమిటీ సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను కేంద్ర సాధికార కమిటీ సభ్యులు, శాసన సభ ఉప సభాపతి బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన కమిటీ సభ్యులు చంద్రశేఖర్ గోయల్, జెఆర్. భట్, సునీల్ లిమాయేలను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. కేంద్ర సాధికార కమిటీతో పాటు ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌లు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు. కమిటీ సభ్యులతో పాటు అటవీ, పర్యావరణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై సుందరరాజస్వామి విహారం

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ సుందరరాజ స్వామివారి అవతార మహోత్సవాలు రెండవ రోజు బుధవారం వైభవంగా సాగాయి. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు స్వామి వారికి కళ్యాణోత్సవం చేపట్టారు. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ కృష్ణస్వామివారి ముఖ మండపంలో శ్రీ సుందరరాజ స్వామివారికి వైభవంగా అభిషేకం చేశారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనాలతో వేడుకగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం రాత్రి హనుమంత వాహనంపై నాలుగు మాడ వీధుల్లో స్వామివారు విహరించారు.

అక్రమ నిర్మాణదారులపై చర్యల్లో అలసత్వం ఎందుకు?

సాక్షి, అమరావతి: విశాఖ, భీమునిపట్నం పరిధిలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై సంబంధిత కోర్టులో ఫిర్యాదు చేయడంపై అలసత్వం ఎందుకు ప్రదర్శిస్తున్నారంటూ సీఆర్‌జెడ్ మేనేజ్‌మెంట్ అథారిటీ సభ్య కార్యదర్శిపై ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన హైకోర్టు ధర్మాసనం బుధవారం అసహనం వ్యక్తం చేసింది. తాము ఆదేశాలు ఇచ్చి నెలల గడుస్తున్నా అక్రమార్కులపై క్రిమినల్ చర్యలు చేపట్టేందుకు సభ్య కార్యదర్శి ఎందుకు తాత్సారం చేస్తున్నారని నిలదీసింది. తదుపరి విచారణ నాటికి తమ ఆదేశాలను అమలు చేసి తీరాలని అల్టిమేటం జారీ చేసింది. లేని పక్షంలో పర్యవసానాలను ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించింది. అలాగే అక్రమ నిర్మాణం చేపడుతున్నా పట్టించుకోని అధికారుల పేర్లను తమ ముందుంచాలని సభ్య కార్యదర్శితో పాటు జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశించింది.

14 విమానాశ్రయాలు, 20 పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 14 ఎయిర్‌పోర్టులు, 20 పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్టు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలపై చర్చకు వచ్చే నెల 4న 7వ రాష్ట్రస్థాయి సాగరమాల సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆర్ఎల్‌సీ సమావేశం 26కు వాయిదా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు, కాంట్రాక్టర్ల అసోసియేషన్లతో బుధవారం రీజనల్ లేబర్ కమీషనర్(ఆర్ఎల్‌సి) మొహంతి సమక్షంలో జరిగిన చర్చలు వాయిదా పడ్డాయి. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు ఆర్ఎల్‌సిని కోరారు. దీనిపై ఆర్ఎల్‌సీ మాట్లాడుతూ 26లోగా యాజమాన్యం, కాంట్రాక్టర్లు, కార్మిక సంఘాలు చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. తదుపరి సమావేశాన్ని ఈ నెల 26కు వాయిదా వేశారు.



పళని మురుగన్‌కి ప్రణామాలు!

తమిళనాడులో శివమహాదేవునికి, ఆ స్వామి మహితపరివార మైన అర్ధాంగి పార్వతీదేవి, పెద్దకుమారుడు గణేశుడు, చిన్న కుమారుడు సుబ్రహ్మణ్యులకు ఉన్న ప్రాచుర్యం, ప్రాధాన్యం, ప్రసిద్ధి అత్యంత విశిష్టమైనవి.. ప్రత్యేకించి సుబ్రహ్మణ్య స్వామి విషయానికి వస్తే చిన్న స్వామి అయిన ఈ ముద్దు మురిపాల ముగ్ధమోహన స్వామికి ఘనమైన చరిత్రే ఉంది. సుబ్రహ్మణ్యుని పేర్ల విషయానికి వస్తే... కుమార, కుమరన్, కుమార స్వామి, స్కంద, షణ్ముఖ, షణ్ముగం, శరవణ, శరవణన్, గుహ, గుహన్ మురుగ, మురుగన్ - ఇలా ఎన్నో పేర్లున్నాయి. తమిళనాడులో సుబ్రహ్మణ్యస్వామి గల వైభవ ఆలయాలలో 'పళని' ప్రముఖమైంది.

ఈ పుణ్యనామానికి ఒక ఆసక్తికరమైన పురాణ గాథ ఉంది. శివదేవుడు ఒక సందర్భంలో తన కుమారులైన గణేశుని, కుమారుని పిలిచి, యావత్తు విశ్వాన్ని ఎవరు ముందుగా ప్రదక్షిణ చేసి వస్తారో, వారికి ఒక అద్భుతమైన ఫలాన్ని ఇస్తానని చెప్పాడు. వెంటనే కుమారస్వామి నెమలి వాహనం ఎక్కి విశ్వాన్ని చుట్టి రావడానికి బయల్దేరుతాడు. తన వాహన వేగం ఏమిటో బాగా తెలిసిన వినాయకుడు కొద్దిసేపు ఆలోచించి, విశ్వరూపులైన తన తల్లి, తండ్రుల చుట్టూ అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రదక్షిణ గావించి ఆ అద్భుత ఫలాన్ని పొందుతాడు. త్వరత్వరగా విశ్వప్రదక్షిణం పూర్తి గావించుకొని వచ్చిన సుబ్రహ్మణ్యస్వామి జరిగిన సంగతి తెలుసుకొని అలుగుతాడు. అది చూసి శివదేవుడు జాలిపడి 'అన్నయ్యకు ఇచ్చిన ఫలం గురించి నీకెందుకు చింత! నీవే ఒక అద్భుత ఫలానివి 'ఫలం - ని' నీ పేరిట ఒక సుందర మహిత పుణ్య క్షేత్రం ఏర్పడేటట్లు అనుగ్రహిస్తున్నాను, అది నీ స్వంత క్షేత్రం, అక్కడికి వెళ్లి నివాసం ఉండు' అంటూ కుమారుని బుజ్జగించాడు. దీంతో వైభవమైన 'పళని' రూపుదిద్దుకుంది. అది కుమారుని విశిష్ట నివాస క్షేత్రమయింది!





మురుగన్ కొండ


పళనిలోని మురుగన్ ఆలయం సహజ సిద్ధమైన ప్రకృతి శోభలతో విలసిల్లే కన్నుల పండుగైన కొండపై నిర్మితమైంది! దీనిని 'మురుగన్ కొండ' అని కూడా అంటారు. ఆలయ సందర్శనకు 659 మెట్లను ఎక్కవలసి ఉంది. అంత శక్తి లేని వారి కోసమై 'ఏరియల్ రోప్ - వే' ఏర్పాటు చేయబడింది. గిరి ప్రదక్షిణ కోసమై కొండ చుట్టూరా చక్కని రోడ్డు వేయబడింది. సాధారణంగా భక్తులు ముందు గిరి ప్రదక్షిణ చేసి ఆ తర్వాత కొండ ఎక్కుతారు!

ప్రకృతి దృశ్యాలు

మెట్లన్నీ ఎక్కి కొండపై భాగం చేరగానే చుట్టూరా కనిపించే సుందర ప్రకృతి దృశ్యాలు మనసును పులకింపజేస్తాయి. మొట్టమొదట మనకు మనోహరమైన రాజగోపురం దర్శనమిస్తుంది. గోపుర ద్వారం గుండా కాస్త ముందుకు వెలితే వరవేల్ మండపం కనిపిస్తుంది. ఈ మండప స్తంభాలు అత్యంత సుందరమైన శిలాచిత్రాలతో మంత్రముగ్ధులు గావిస్తాయి. ఈ మండపం తర్వాత నవరంగ మండపం ఉంది. ద్వారం వద్ద ద్వారపాలకుల విగ్రహాలు ఆకర్షణీయంగా మలచబడ్డాయి.

విశిష్టమైన విగ్రహం


గర్భగుడిలో ప్రతిష్ఠితమైన కమనీయ కుమారస్వామి విగ్రహం 18 మంది సిద్ధులలో ప్రముఖుడైన భోగార్ పర్యవేక్షణంలో రూపొందింపబడిందని, ఇది ఔషధ గుణాలు కలిగిన అపురూప విగ్రహమని చెబుతారు. దీనిని 'నవ పాషాణం' అనే విశేషమైన శిలను మలచి తయారు చేశారని, ఇందులో శక్తిమంతమైన మూలికా పదార్థాలను నిక్షిప్తం గావించారని అంటారు. ఈ విగ్రహం విశిష్టత ఏమంటే, స్వామి పూజల సందర్భంగా ధూప, దీప సమర్పణల సమయాలలో వెలువడే ఉష్ణానికి విగ్రహంలోని సునిశితమైన మూలికా పదార్థం క్రియాశీలమై ఒక విధమైన వాయువులను వెలువరిస్తుందని, వాటిని పీల్చిన వారికి కొన్నివ్యాధులకు సంబంధించిన దోషాలు హరించుకుపోతాయని ఆరోగ్యవంతులవుతారని చెబుతారు!.



మూలస్థానంలో కొలువు దీరిన కుమారస్వామి భక్త జన సంరక్షకుడుగా, కోరిన వరాలు ప్రసాదించే కొండంత దేవుడుగా అపురూప దివ్య దర్శనభాగ్యాన్ని అందజేస్తారు. కృత్తికా సూనుడైన కుమారునికి ప్రతి నెల కృత్తికా నక్షత్రం నాడు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆషాఢ కృత్తిక సందర్భంగా విశేష వైభవ ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

– డి.వి.ఆర్





బోగర్ సిద్ధుని సమాధి

ఈ పళని కొండలో బోగర్ సిద్ధుని సమాధి, ప్రత్యేక గర్భగుడి ఉన్నాయి. ఇక్కడి స్వామివారి విగ్రహం చిలుక బొమ్మను కలిగి ఉంటుంది. ఇక్కడి స్వామిని కీర్తిస్తూ "తిరుపుగళ్" అనే పాటలను అరుణగిరినాథుడు రచించాడు. అంతేకాదు, తన పాటలతో చిలుక రూపంలో కుమారస్వామితో ఉండే వరం పొందాడని భక్తుల విశ్వాసం. పళని కొండకు వెళ్లే దారిలో ఇదుంపన్ మందిరం ఉంది. తెల్లవారుజామున ఇక్కడ పూజలు చేసిన తర్వాతే, కొండపై ఉన్న కుమారస్వామికి పూజలు చేస్తారు.

● కథానీతి

ఆదిశంకరులు చేసిన ఆ తప్పులు..?

ఒకసారి జగద్గురు ఆదిశంకరాచార్యుల వారు, శిష్యులతో కాశీ విశ్వేశ్వర ఆలయాన్ని దర్శించారు... గంగానదిలో స్నానం చేసి, కాశీ విశ్వేశ్వరుడి దర్శనానికి ఆలయం లోపలకి వెళ్లి, విశ్వేశరుని ఎదుటచేతులు జోడించి... ''నేను 3 దోషములు/పాపములను చేశాను, నన్ను క్షమించండి'' అని ప్రాధేయ పడ్డారు... ఇది విన్న శిష్యులు ''ఆచార్యులవారు, ఏమి పాపాలు చేశారో ఏమో పరమేశ్వరుని ముందు ప్రాయశ్చిత్త పడుతున్నారు?'' అని తమలో తాము గుసగుసలాడుకోసాగారు. ఇంతలో ఒక శిష్యుడు కాస్త ధైర్యం చేసి, ''గురువర్యా! మీరు చేసిన ఆ పాపాలు ఏమిటి? మేము తెలుసుకోవచ్చా?'' అని ఆచార్యుల వారిని అడిగాడు. దానికి శ్రీ ఆది శంకరాచార్య ఇలా సమాధానం చెప్పారు...



● ''నేను భగవంతుడిని సర్వాంతర్యామి, సర్వవ్యాపి అని వాక్కుతో స్తుతించాను, సృష్టి అంతా నిండి ఉన్న ఆ విశ్వేశ్వరుడిని చూడడానికి మటుకు కాశీ నగరానికి వచ్చాను...'' అంటే 'మనసా వాచా కర్మణా' నేను నమ్మిన సత్యాన్ని నిత్య జీవితంలో ఆచరించలేక పోయాను, అది నేను చేసిన ప్రథమ తప్పిదం'' అని సమాధానమిచ్చారు.

● తైత్తరీయ ఉపనిషద్ లో ''యతో వాచో నివర్తన్తే, అప్రాప్య మనసా సః'''భగవంతుడు మన బుద్ధికి ఆలోచనకి అందని వాడు' ఇది తెలిసి కూడా శ్రీ కాశీవిశ్వనాథ అష్టకం వ్రాశాను. ఇది నేను చేసిన రెండవ తప్పు!''

● నిర్వాణ శతకంలో...

''న పుణ్యం న పాపం, న సౌఖ్యం న దుఃఖం న మంత్రో న తీర్థం, న వేదా న యజ్ఞః అహం భోజనం, నైవ భోజ్యం న భోక్త చిదానందరూపం శివోహం శివోహం'' అని వ్రాశాను అంటే...నాకు పాప పుణ్యాలు, సుఖ దుఃఖాలు లేనే లేవు. మంత్ర జపాలు తీర్థసేవలు, వేద యజ్ఞాలు లేవు. భోజన పదార్థం, భోజనం, భోక్త (భుజించేవాడు) నేను కాదు! నేను చిదానంద స్వరూపుడను, శివుడను, శివుడను! అని వ్రాసికూడా నేను తీర్థయాత్రలు చేస్తున్నాను... అంటే నేను వ్రాసినవి, చెప్పినవి నేనే పాటించటం లేదు. అదే నేను చేసిన ఈ మూడవ తప్పు..! ఈ తప్పులని మన్నించమని, ఆ భగవంతుడిని క్షమాపణ కోరుకుంటున్నాను.'' అన్నారు.

నీతి : మన ఆలోచన, ప్రవర్తన, మాటా అన్ని ఒకేలాగా ఉండాలి అన్నది శ్రీ ఆదిశంకరాచార్యుల వారు శిష్యులకే కాదు, ఈ జగత్తుకే చేసిన గొప్ప ఉపదేశంలా మనకి కథను బట్టి తెలుస్తోంది.

● బౌద్ధ ధమ్మం

సరిదిద్దుకున్న తప్పు



''మనల్ని ముందుండి నడిపించేది మనసే! అతి శ్రేష్ఠమైందీ మనసే. చెడ్డమనస్సుతో చేసిన పనులు మనల్ని వదిలిపెట్టవు. ఎడ్ల కాలి అడుగుల వెనకే దొర్లి వచ్చే బండి చక్రాల్లా మన వెనకే వస్తాయి'' అంటుంది ధమ్మపదం.

నరేష్ అల్లరి పిల్లాడు. ఐదోతరగతి చదువుతున్నాడు. క్రమశిక్షణ తక్కువైనా మంచి తెలివైనవాడే. ఇతర సబ్జెక్టుల్లో ఒక మాదిరిగా ఉన్నా గణితంలో అందరికంటే ముందుంటాడు. అందుకే, కేంద్రప్రభుత్వం నిర్వహించే నవోదయ పాఠశాలలో ప్రవేశ పరీక్ష కోసం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐదో తరగతిలోని పదిమందితో ఈ పరీక్ష రాయిస్తున్నాడు. ఆయనే వారికి ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నాడు. వారిలో నరేష్ ఒకడు.

నరేష్‌ని భరించడం హెడ్మాస్టర్ గార్కి కష్టమైపోయింది. దానికి కారణం వాడి అల్లరి కాదు, దొంగబుద్ధి. తరగతిలో ఎవరో ఒకరి పెన్నో, పెన్సిలో, స్కేలో లేదంటే నోట్ బుక్కో ఏదో ఒకటి కాజేస్తాడు. పాస్‌కి అని చిటికెన వేలు చూపించి, బయటకు పోయి ఆ దొంగిలించిన వస్తువుల్ని దాచి వస్తాడు. రెండు మూడుసార్లు పట్టుబడ్డాడు. మాష్టారు మందలించారు. తప్పని ఎంతో నచ్చచెప్పారు. వాళ్ళ తల్లిదండ్రులను పిలిచి విషయం చెప్పారు. వాళ్ళూ పలురకాలుగా చెప్పి చూశారు. అయినా వాడు దొంగతనాలు మానుకోలేదు.

నాలుగు నెలలు గడిచాయి. కొత్త సంవత్సరం వచ్చింది. నవోదయ ప్రవేశ పరీక్షలూ వచ్చాయి. పిల్లలందరూ దగ్గర్లో ఉన్న పట్టణానికి వెళ్ళారు. అక్కడ ఒక కాలేజీలో పరీక్ష కేంద్రం. అంతా కోలాహలంగా ఉంది. ఇంట్లో అమ్మ దాచుకున్న పోపుల డబ్బాలోని డబ్బు దొంగిలించి కొత్త జామెట్రీ బాక్సు కొన్నాడు. పరీక్ష అట్ట కొన్నాడు. పిల్లలందరూ తరగతి గదుల్లోకి వెళ్ళి ఎవరి స్థానాల్లో వాళ్ళు కూర్చొన్నారు.

తన మిత్రులు ఎక్కడెక్కడ ఉన్నారో చూద్దామని వెళ్ళాడు. అంతలో గంటలు మోగాయి. గబగబా తన గదిలోకి వచ్చాడు. వచ్చి చూసి నిలువు గుడ్లు పెట్టాడు. అట్ట ఉంది. కానీ జామెట్రీ బాక్సు లేదు. అటూ ఇటూ వెతికాడు. అందర్నీ అడిగాడు. ఎవ్వరి దగ్గరా లేదు.పెద్దగా అరచి ఏడ్పు లంకించుకున్నాడు. మాష్టారు వచ్చారు. ''ఎందుకు ఏడ్తున్నావ్?'' అని అడిగాడు. ''నా జామెట్రీ బాక్స్ ఎవడో కొట్టేశాడండీ'' అన్నాడు వెక్కి వెక్కి ఏడుస్తూ.. ''పోతే పోయిందిలే. ముందు పరీక్ష రాయి''. ''బాక్సు పోతే ఏడ్చేవాణ్ణి కాదండి. దాన్లో నా హాల్‌టికెట్ ఉందండీ ...'' అంటూ పెద్దగా ఏడ్చాడు.

''ముందు నీవు బైటకు వెళ్ళు. హాల్‌టికెట్ తీసుకుని గదిలోకి రా'' అని బైటకు పంపాడు మాష్టారు. దొంగతనం వల్ల ఎంత చెరుపో అప్పుడే వాడికి అర్థమైంది. తనపై జాలి చూపించక పోగా నీ తప్పులే నిన్ను వెంటాడాయి'' అన్నారు అందరూ. అప్పుడు తన తప్పు తాను తెలుసుకుని తనను తాను సరిదిద్దుకున్నాడు నరేష్.

– డా. బొర్రా గోవర్ధన్

● నిర్మల వాణి

భవసాగరం అంటే..

మనలోని ఏడు పొరలలోని భవసాగరం, నాభి రెండూ ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉంటాయి. ధర్మ సంరక్షణలో మనం ఆనందాన్ని పొందుతాం. మనం ఎవరితోనైనా మంచిగా ఉన్నప్పుడు మనకు ఆనందం కలుగుతుంది. ఈ ధర్మ బద్ధత అనేది మనలోని భవసాగరం పరిశుభ్రంగా ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. ఉదయం 4 గంటలకే నిద్రలేచి పెద్దగా హారతిపాటలు పాడుతూ, గంధంచెక్క అరగదీస్తూ పెద్ద పెద్ద స్తోత్రాలు పాడుతూ స్నానమాచరించి ఇంటిల్లిపాదికీ నిద్రాభంగం చేసినంత మాత్రాన అది సదాచార పరాయణత్వం కాక పోవచ్చు. పిల్లల్ని నిద్రపుచ్చి తల్లి బహుశా



ఎప్పుడో ఆలస్యంగా పడుకుని ఉండవచ్చు. ఈ ధర్మం అనేది అంతర్గతమైనది. ఉదాహరణకు మీరు ఏదైనా ఎవరికైనా దానం చేయాలనుకున్నారనుకోండి. అది మీకు, పరమాత్మునికి మధ్య విషయం మాత్రమే. దానిని బాహ్యంగా ప్రకటించ వలసిన పని లేదు.

ధర్మమంటే మిమ్మల్ని మీరు అంతర్ముఖంగా పరిశుభ్రపరచుకోవటం ముఖ్యం. అంతే కానీ వేరెవరినో కాదు. మీ హృదయాన్నుండి వచ్చే ఆ ధర్మానందాన్ని, ఆ రసాన్ని మీరే ఆస్వాదించాలి. మీ పవిత్రతను మీరే ఆస్వాదిస్తారు. ఆనందిస్తారు. ధర్మం అనేది మీ హృదయంలో ఎంతవరకు ఉన్నదనేది ముఖ్యం.

అనాహత చక్రం

ఇది చాల ముఖ్యమైన చక్రం. అదే హృదయ(అనాహత) చక్రం '' ఉదార చరితానామ్ వసుధైక కుటుంబం'' అంటే ఉదార స్వభావులైన వారు ప్రపంచమంతా వారి కుటుంబమే అని భావిస్తారు. ప్రతి ఒక్కరిపట్ల ప్రేమ ప్రవహిస్తూంటుంది. ప్రతి ఒక్కరి సమస్య తమ సమస్యగానే భావిస్తారు. ప్రతి ఒక్కరికీ తానొక తల్లిగా ఉండాలి అని భావించుకోవటం అనే గుణం మధ్య హృదయం నుండి వస్తుంది. ప్రప్రథమంగా హృదయ చక్రం విశిష్టత భద్రత. మీలోని భద్రతా భావాన్ని మీరు అనుభూతి చెందటం. ఆత్మ సాక్షాత్కారం పొందిన వారు ఆ భద్రతాభావాన్ని అనుభూతి చెందగలరు.

మీ సంపూర్ణ భద్రత అనేది మీలోని ఆత్మ మాత్రమే. అంతేగాని వేరే ఏవీ ముఖ్యం కావు. మీరు అలాంటి భద్రతా భావం కలిగి ఉన్నవారైతే మీ పిల్లలు కూడా ఆ భద్రత అనేది తమలోనే ఉన్నదని గ్రహిస్తారు. అటువంటి పిల్లలు నిజమైన ధైర్యవంతులుగా ఉంటారు.

మీలోని మీ భద్రతాభావాన్ని మీరు ఆస్వాదించండి. భద్రతాభావం వలన కలిగే ఆనందమే మిమ్మల్ని అధ్యాత్మిక లోతులకు తీసుకుని వెళుతుంది.

ఎవరిలో అయితే భగవంతుడు ఉంటాడో, ఎవరికైతే భగవంతుని ఆశీర్వాదాలు ఉంటాయో వారికి అంతకన్నా ఇంకేమి కావాలి? ఎందుకంటే భగవంతుడు సర్వ శక్తిమంతుడు. ఎవ్వరిశక్తీ ఆ భగవంతుని శక్తి కన్నా ఎక్కువకాదు. కాబట్టి మొదటగా మీ మీరు విశ్వాసాన్ని కలిగి ఉండండి. ఆ విశ్వాసాన్ని మీ హృదయ చక్రంలో పదిల పరచుకోండి. ఆ విశ్వాసమే మీకు రక్షణ ఆనందాన్నిస్తుంది. ప్రపంచంలోని అభద్రతా భావాలన్నింటికీ విశ్వాసమే సమాధానం. మన హృదయంలో జగదంబ అయిన దుర్గామాతను స్థిరపరచుకోవాలి.



శ్రీ మాతాజీ నిర్మలాదేవి

– డా. పి. రాకేష్
(మన అంతర్గత సూక్ష్మ శరీర నాడీ వ్యవస్థ గురించి శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనం ఆధారంగా)

● ఇస్లాం వెలుగు



హక్కులే కాదు... బాధ్యతలు కూడా..

సమాజంలో ప్రతి ఒక్కరికీ కొన్ని హక్కులు, బాధ్యతలు ఉంటాయి. ముహమ్మద్ ప్రవక్త(స),ప్రజల సామాజిక బాధ్యతలను గుర్తుచేస్తూ, ధర్మం వారికిచ్చినటువంటి హక్కులను కూడా విశద పరిచారు. ముఖ్యంగా మానవ హక్కులను గురించి, వ్యక్తిగత స్వేచ్ఛను గురించి విడమరిచి చెప్పారు. పరుల సంపదను హరించడం గురించి ఖురాన్ ఆదేశాలను వివరిస్తూ... ఒకరి ధన ప్రాణాలను మరొకరు కబళించడాన్ని, ఒకరి మాన మర్యాదలను, గౌరవ ప్రతిష్ఠలను మంటగలిపే చర్యలన్నిటినీ నిషేధించారు. అల్లాహ్ ఆదేశం ఇలా ఉంది. 'ఒకజాతి ప్రజలు మరోజాతి ప్రజలను అవహేళన చేయవద్దు. ఒకరికొకరు తమ ప్రతిష్ఠలకు భంగం కలిగించుకోవద్దు. మారుపేర్లతో ఒకరినొకరు పరిహసించుకోవద్దు. ఒకరివెనుక ఒకరు చెడుగా మాట్లాడుకోవద్దు. నిందలు వేసుకోవద్దు. ప్రవక్త మహనీయులు తమ చివరి హజ్ యాత్ర సందర్భంగా చేసిన ప్రసంగం కూడా చరిత్రాత్మకమైనది: 'ప్రజలారా! బాగా వినండి. అజ్ఞానకాలపు దురాచారాలన్నీ అంతమైపొయ్యాయి. అరబ్బు వ్యక్తికి అరబ్బేతరునిపై, అరబ్బేతరునికి అరబ్బుపై, తెల్లవారికి నల్లవారిపై, నల్లవారికి తెల్లవారిపై ఎలాంటి ఆధిక్యతా లేదు. మానవులంతా పరస్పరం సోదరులే.

మీ సేవకులను తక్కువ దృష్టితో చూడకండి. మీరు తినే భోజనమే వారికి పెట్టండి. మీరు ధరించేలాంటి బట్టలే వారికీ సమకూర్చండి. వడ్డీతినడం మానుకోండి.వడ్డీ అడిగే హక్కు ఇక ఎవ్వరికీ లేదు. మహిళల గురించి దైవానికి భయపడండి. వారూ మీలాంటి వారే. మీకు వారిపై ఏవిధంగా హక్కులున్నాయో, అదేవిధంగా వారికీ మీపై హక్కులున్నాయి. మీ రక్తం, అంటే మీ ప్రాణం, మీ ధనం ప్రళయకాలం వరకు ఒకరిదొకరికి పవిత్రం. పరస్పరం హాని తలపెట్టుకోరాదు.ప్రాణాలు తీసుకోరాదు.ప్రళయకాలం వరకు కూడా..

నేను మీకోసం రెండువస్తువులు వదిలి వెళుతున్నాను. మీరు వాటిని దృఢంగా పట్టుకోండి. ఎన్నటికీ దారి తప్పరు. ఒకటి పవిత్ర ఖురాన్, రెండవది సున్నత్ , అంటే నా సాంప్రదాయం'.


అంతేకాదు, ముహమ్మద్ ప్రవక్త మహనీయులు, పౌరుల వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడాన్ని కూడా నిరసించారు. మీరు ఇతరుల వ్యక్తిగత జీవితాల్లో కల్పించుకోకండి. ఇతరులపై గూఢచర్యానికి పాల్పడకండి. మీ స్వగృహం తప్ప ఇతరుల ఇళ్ళలోకి వారి అనుమతి లేకుండా ప్రవేశించకండి. అని హితవు చేశారు. ఇతరుల మతవిశ్వాసాలను గౌరవించాలని ఆదేశిస్తూ, వారి మతవిశ్వాసాలకు, హక్కులకు భంగం కలిగే చర్యలన్నిటినీ ఆయన నిషేధించారు. ఈ విధంగా ప్రవక్తమహనీయులు సమస్త హక్కులనూ నిర్వచించారు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

● సువార్త

దైవ కార్యార్థ సేవ

ప్రభువైన యేసును భోజనానికి రమ్మని వేడుకుంటున్న శిష్యులను చూసి– నన్ను పంపిన వాని చిత్తము తుదముట్టించుట నాకాహారమై యున్నదని చెప్పారు. అనగా ప్రభువైన యేసు నరావతారిగా వచ్చిన కారణం తనను పంపిన తండ్రియైన దేవుడు ఎందునిమిత్తం ఈ భూమ్మీదకు పంపాడో ఆ లక్ష్యం నెరవేర్చుటకు అనగా దైవ కార్యోన్ముఖుడగుటకు మాత్రమే పంపబడిన కార్యము నెరవేర్చుటే దైవిక కార్యలక్ష్యం (మిషన్), ప్రభువైన యేసు వారితో (శిష్యులతో) నేను ఎప్పుడూ మీ వద్ద వుండను గనుక వేరొక ఆదరణకర్తను అనగా సత్య స్వరూపియైన ఆత్మ మీకనుగ్రహింప బడునని, ఆ ఆత్మ ద్వారానే దైవకార్యలక్ష్యం (మిషన్) నెరవేర్చ బడునని శిష్యులతో చెప్పారు.



అట్టి దైవ కార్య నిర్వహణలో మోషే (ప్ర) ద్వారా సుమారు 430 సంవత్సరాల బానిసత్వంలో వున్న ఇశ్రాయేలీయులు మూల్గులు, కష్టాలు దేవుడు గుర్తించి మోషే (ప్ర) ద్వారా విడుదల పరిచారు. ఆ దైవకార్యంలో మోషే (ప్ర)ను ఇశ్రాయేలీయులు ఎన్ని శ్రమలు పెట్టినా భరించారు. కారణం సర్వోన్నతుడైన దేవుడు ఇశ్రాయేలీయుల బానిసత్వంలో వున్న వారి బాధల నుండి విడుదల పరచు నిమిత్తమే. మోషే (ప్ర) దేవుని కార్యం లక్ష్యం (మిషన్) నెరవేర్చాడు. అందుకే దేవుడు ఆయనను నిర్ణయించారు.

యేసుప్రభువు కూడా తనను పంపిన దేవుని (తండ్రి) కార్యం నెరవేర్చుటకు మనుషుల మనసులను పరివర్తన చెందించుటకున్నూ, ఆత్మల రక్షణ కొరకున్నూ ఎన్నో ఉపమానాలు, ఉదాహరణలూ చెపుతూ ఎన్నో అద్భుతాలు చేశాడు. కుష్ఠు వ్యాధి గ్రస్తులను స్వస్థపరిచారు, పక్షవాయువుగల వారిని స్వస్థపరిచారు. కుంటివారికి కాళ్ళు, గుడ్డివారికి చూపు, మూగవారికి మాట, చివరికి మరణించిన వారిని సైతం వారిని మరణం నుండి సజీవులగునట్లు బ్రతికించారు. అటువంటి సందర్భంలో మత ఛాందసవాదులైన శాస్త్రులు, పరిసయ్యులు ప్రభువును ఏ అధికారం చొప్పున ఈ కార్యం చేస్తున్నావని ప్రశ్నించారు. అప్పుడు వారితో ప్రభువు 'నా తండ్రిచేత సమస్తమూ అప్పగించబడిన అధికారంతో'' అన్నారు. మిషన్ అర్థం పంచబడుట.

ప్రభువైన యేసు తన పన్నెండు మంది శిష్యులను పిలిచి–సమస్తమైన దయ్యముల మీద అధికారాన్ని సంపాదించుటకు, రోగులను స్వస్థపరచుటకు, దేవుని రాజ్యం ప్రకటించుటకు వారిని పంపారు. సమస్త జనులను శిష్యులుగా చేయమన్నారు కానీ క్రైస్తవులుగా చేయమనలేదు. తండ్రి పరిశుద్ధాత్మ నామములో బాప్తిస్మం ఇవ్వమన్నారు. బాప్తీస్మం అనేది ఇశ్రాయేలీయుల సంస్కారం, కానీ ఇశ్రాయేలీయుల సంస్కారాన్ని ఆచరించే క్రైస్తవులకు అది. మన భారతదేశ సంస్కారంలో మారుమనస్సు పొందమని అర్థం మాత్రమే (మత్తయి 28:19-20). దానినే జ్ఞానస్నానమని అంటారు.

ఏ అధికారం చొప్పున చేస్తున్నావని పరిసయ్యులు, శాస్త్రులు అడిగిన ప్రశ్నకు–ప్రభువైన క్రీస్తు వారితో సమస్తము నా తండ్రి ఆది సంభూతడు) చేత నాకప్పగింపబడిన చిత్త ప్రకారమే అని చెప్పారు (మత్తయి 11:27). కావున ఇంత గొప్ప సాక్ష్యం మనకగుపడుతున్నందున సందేహమేల. నేడే మీరు మారుమనస్సు, పాప క్షమాపణ కోరుకొందురుగాక.

–కోట బిపిన్ చంద్రపాల్

'బ్యాటరీ సర్వీస్' ఆప్షన్‌తో విడా ఎలక్ట్రిక్ స్కూటర్



న్యూఢిల్లీ: వచ్చే నెల ప్రవేశపెట్టే ఎలక్ట్రిక్ స్కూటర్ విడా వీఎక్స్2 కోసం సబ్‌స్క్రిప్షన్ ఆధారిత బ్యాటరీ–యాజ్–ఎ–సర్వీస్ (బీఏఏఎస్) ఆప్షన్‌ను అందించనున్నట్లు టూ–వీలర్ల దిగ్గజం హీరో మోటోకార్ప్ తెలిపింది. దీనితో వాహనానికి ముందుగా చెల్లించాల్సిన మొత్తం గణనీయంగా తగ్గుతుందని, మరింత మందికి ఎలక్ట్రిక్ మొబిలిటీ చేరువయ్యేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొంది. కస్టమర్లు తమ రోజువారీ, నెలవారీ బడ్జెట్, వినియోగాన్ని బట్టి సరళతరమైన సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లను ఎంచుకోవచ్చని వివరించింది. స్కూటర్ చాసిస్, బ్యాటరీకి వేర్వేరుగా ఫైనాన్స్ తీసుకునే ఆప్షన్ ఉండటం వల్ల ముందస్తుగా పెద్ద మొత్తం చెల్లించాల్సిన భారం తగ్గుతుందని కంపెనీ తెలిపింది. బీఏఏఎస్ మోడల్, సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లు, ధర మొదలైన పూర్తి వివరాలను జూలై 1న కంపెనీ ప్రకటించనుంది.

రెడిట్ ప్రచారకర్తగా సచిన్ టెండుల్కర్

న్యూఢిల్లీ: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ తాజాగా సోషల్ మీడియా ప్లాట్‌ఫాం రెడిట్‌కు ప్రచారకర్తగా వ్యవహరించనున్నారు. ఇకపై తన రెడిట్ ప్రొఫైల్ ద్వారా తన అభిప్రాయాలు, మ్యాచ్‌ల విశ్లేషణ, ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను ఆయన షేర్ చేస్తారు. అలాగే భారత్‌తో పాటు ఇతరత్రా మార్కెట్ల కోసం రూపొందించే కొత్త మార్కెటింగ్ ప్రచార ప్రకటనల్లో ఆయన కనిపిస్తారని కంపెనీ వివరించింది. వివిధ వర్గాలందరినీ ఒక చోటికి చేర్చే రెడిట్‌తో జట్టు కట్టడం సంతోషకరమైన విషయమని టెండుల్కర్ తెలిపారు. శ్రేష్టమైన క్రికెట్‌కు టెండుల్కర్ పేరు పర్యాయపదమని రెడిట్ వైస్ ప్రెసిడెంట్ దుర్గేశ్ కౌశిక్ వివరించారు. తమ ప్లాట్‌ఫాంలో క్రీడలపై ఆసక్తి వార్షికంగా 30 శాతం పెరగడంతో స్పోర్ట్స్ కంటెంట్‌కి మరింత ప్రాధాన్యం ఇవ్వడం మీద రెడిట్ దృష్టి పెడుతోంది. ఈ మధ్యే ఇటాలియన్ ఫుట్‌బాల్ లీగ్ సిరీ ఏ, గతేడాది ఎన్ఎఫ్ఎల్, ఎన్‌బీఏ, ఎంఎల్‌బీ తదితర అమెరికన్ ప్రొఫెషనల్ స్పోర్ట్స్ లీగ్‌లతో ఒప్పందాలు కుదుర్చుకుంది.



బిజినెస్ రీల్

ఆప్టీమస్ ఎలక్ట్రానిక్స్‌తో వన్‌ప్లస్ జట్టు

భారత్‌లో ఐవోటీ డివైజ్‌ల తయారీ

న్యూఢిల్లీ: ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) పరికరాలను భారత్‌లో తయారు చేసే దిశగా ఆప్టీమస్ ఎలక్ట్రానిక్స్‌తో (ఓఈఎల్) ఒప్పందం కుదుర్చుకున్నట్లు చైనా స్మార్ట్‌ఫోన్స్ తయారీ దిగ్గజం వన్‌ప్లస్ వెల్లడించింది. ఐవోటీ ఉత్పత్తుల్లో టీడబ్ల్యూఎస్ (ట్రూ వైర్‌లెస్ స్టీరియో) ప్రోడక్టులు, వైర్‌లెస్ నెక్‌బ్యాండ్‌లు మొదలైనవి ఉంటాయి. ఇప్పటికే దేశీయంగా బులెట్స్ వైర్‌లెస్ జెడ్3 నెక్‌బ్యాండ్ ఉత్పత్తి ప్రారంభమైందని వన్‌ప్లస్ తెలిపింది. భారత్‌కి సంబంధించి తమ దీర్ఘకాలిక విజన్‌కి ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం నిదర్శనమని పేర్కొంది. వ్యయాలు తగ్గించేందుకు, సరఫరా వ్యవస్థను పటిష్టం చేసేందుకు ఇది తోడ్పడుతుందని వివరించింది.

నిప్పన్ కోయి ఇండియా ఎండీగా హైదరాబాదీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జపాన్‌కి చెందిన ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ సేవల సంస్థ ఐడీ అండ్‌ఈ హోల్డింగ్స్ భారత విభాగం నిప్పన్ కోయి ఇండియాకు హైదరాబాదీ జి. సంపత్ కుమార్ నియమితులయ్యారు. నిప్పన్ కోయి ఇండియాకు భారతీయుడు ఎండీగా నియమితులు కావడం ఇదే తొలిసారి. సంపత్ ఇప్పటివరకు మార్కెటింగ్ తదితర విభాగాల డైరెక్టరుగా విధులు నిర్వర్తించారు. భారత్, పశ్చిమాసియా. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో తమ స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు సంపత్ నియామకం దోహదపడుతుందని సంస్థ తెలిపింది. ఇప్పటిదాకా ఎండీగా సేవలందించిన కత్సుయా ఫ్యుకాసకు ఇకపై చైర్మన్‌గా వ్యవహరిస్తారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-6-2025

విశాఖ	555-00
చిత్తూరు	583-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	847.1	4.69
TITAN	3,478.80	2.15
TRENT	5,728.00	1.8
MARUTI	12,750.00	1.23
M&M	3,038.00	1.02

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TCS	3,455.00	-1.72
ADANIPORTS	1,370.50	-1.57
HINDUNILVR	2,295.10	-1.44
NESTLEIND	2,330.20	-1.35
JSWSTEEL	986.9	-1.28

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	5,507
ఎన్ఎస్ఈ	89,893
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,47,891
ఎఫ్ఐఐ	+ 891
డీఐఐ	+ 1,091

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	73.24 (రాత్రి 11.30కు)	$ 73.27 (క్రితం ముగింపు)
బ్రెంట్	76.37 (రాత్రి 11.30కు)	$ 76.45 (క్రితం ముగింపు)

ఏసీ అమ్మకాల్లో వృద్ధి అంతంతే..!



ఈ ఏడాది 10-15 శాతమే

- అంచనాలు తగ్గించిన కంపెనీలు
- ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలు
- ఉష్ణోగ్రతలు తగ్గడంతో తక్కువ విక్రయాలు
- జూన్‌లో తిరిగి పుంజుకున్న అమ్మకాలు
- గతేడాది 25 శాతం వృద్ధి నమోదు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా భిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది రూమ్ ఏసీల విక్రయాలు 10–15 శాతమే పెరగొచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా అధిక డిమాండ్ ఉండే జూన్‌లో ఉత్తర, పశ్చిమ భారత్‌లో వేడి వాతావరణం నెలకొనగా, మిగిలిన ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో కంపెనీలు తమ అంచనాలను తగ్గించుకున్నట్టు తెలుస్తోంది. సాధారణంగా ఏసీల అమ్మకాలకు వేసవి సీజన్ ఎంతో కీలకం. అధిక శాతం అమ్మకాలు ఈ సీజన్‌లోనే నమోదవుతుంటాయి. కానీ ఈ ఏడాది వేసవిలో మధ్యంతర వర్షాలు ఈ రంగం ఆశలపై నీళ్లు చల్లింది. జూన్‌లో ఉత్తరాది అంతటా వేడి వాతావరణం నెలకొనడం ఒక్కటి విక్రయాలకు కాస్తంత మద్దతునిచ్చే అంశం. నిజానికి ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఫిబ్రవరి, మార్చిలోనే రూమ్ ఏసీల అమ్మకాలకు అధికంగా నమోదు కావడం గమనార్హం. దీంతో గతేడాది సీజన్‌తో పోల్చితే ఈ ఏడాది 25 శాతం అధిక అమ్మకాలపై కంపెనీలు అంచనాలు వేసుకున్నాయి. తర్వాత మారిన వాతావరణ పరిస్థితులతో ఈ అంచనాలు నిజం కాలేదు. ''25–30 శాతం మేర అమ్మకాల వృద్ధిని ఆశించాం. కానీ, అనుకున్న స్థాయిలో అమ్మకాలు సాధించలేదు. ఈ వేసవి నిరాశపరిచిందనడంలో సందేహం లేదు. కానీ, వ్యాపారంలో ఇదొక భాగమే. ఈ పరిస్థితులను అధిగమించి ముందుకు వెళ్లాల్సిందే''అని బ్లూస్టార్ ఎండీ బి.త్యాగరాజన్ తెలిపారు. మొత్తానికి ఈ ఏడాది ఆర్ఏసీ విక్రయాలు 10–15% వృద్ధికి పరిమితం కావొచ్చని చెప్పారు. జూన్ మధ్య నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పడతాయంటూ భారత వాతావరణ శాఖ గత వారం అంచనాలు వెల్లడించడం గమనార్హం.

సెప్టెంబర్ క్వార్టర్‌లో పుంజుకోవచ్చు..

ప్రస్తుత జూన్ త్రైమాసికం రూమ్ ఏసీ రంగానికి అనుకూలంగా లేదని.. సెప్టెంబర్ త్రైమాసికంలో విక్రయాలు పుంజుకోవచ్చని త్యాగరాజన్ పేర్కొన్నారు. పండుగల సందర్భంగా డిమాండ్ పెరగొచ్చన్నారు. ఎనర్జీ లేబుళ్లు మారుతుండడం, డిస్కౌంట్ ఆఫర్లతో గత నిల్వలను తగ్గించుకోగలమన్నారు. ఇంధన ఆదా లేబుళ్లను మార్చే ముందు ముందస్తు కొనుగోళ్లు పెరగడం సహజమేనన్నారు. 2024 అమ్మకాలతో పోల్చి చూసినప్పుడు గత రెండు నెలల్లో ఎలాంటి వృద్ధి కనిపించలేదని వోల్టాస్ ఎండీ, సీఈవో ప్రదీప్ బక్షి సైతం తెలిపారు. కనుక జూన్ త్రైమాసికంలో అమ్మకాల పరంగా పెద్ద వృద్ధి నమోదు కాకపోవచ్చని, గతేడాది మాదిరిగా 25 శాతం వృద్ధిని సాధించడం సవాలుగా పేర్కొన్నారు. వేసవిలో అమ్మకాలు గరిష్టంగా ఉండే సమయంలో వర్షాలు దెబ్బతీసినట్టు చెప్పారు. ఏప్రిల్, మే నెలలో అమ్మకాల వృద్ధిని కోల్పోవడంతో, మిగిలిన ఏడాదిలో కోలుకోవడం కష్టమని అభిప్రాయపడ్డారు. గత కొన్ని రోజుల నుంచి ఉత్తరాదిలో వేడి వాతావరణంతో ఏసీల అమ్మకాలు పుంజుకున్నాయంటూ, ఇదొక్కటే సానుకూలతగా పేర్కొన్నారు.

జూన్‌లో కాస్త మెరుగు..

హైయర్ అప్లయన్సెస్ ఇండియా మాత్రం ఈ ఏడాది ఇప్పటి వరకు మెరుగైన వృద్ధిని సొంతం చేసుకుంది. గతేడాదితో పోల్చితే రూమ్ ఏసీల అమ్మకాలు 30 శాతం పెరిగినట్టు సంస్థ ప్రెసిడెంట్ ఎన్ఎస్ సతీష్ వెల్లడించారు. ''ఏప్రిల్, మే నెలల్లో అమ్మకాలకు సానుకూలంగా లేవు. 10–15 శాతం మేర అమ్మకాలు తగ్గాయి. జూన్‌లో తిరిగి అమ్మకాలు పుంజుకున్నాయి. ఫిబ్రవరి, మార్చిలోనే ప్రణాళిక మేరకు ముందస్తు కొనుగోళ్లు జరిగాయి''అని వివరించారు. కానీ, ఏప్రిల్, మే నెలల్లో కొనుగోలు చేద్దామనుకున్న కస్టమర్లు.. ఉష్ణోగ్రతలు పెరగకపోవడంతో వాయిదా వేసుకున్నట్టు చెప్పారు. ముఖ్యంగా జూన్‌లో గత పది రోజులుగా ఉత్తరాది ప్రాంతంలో అమ్మకాలు పెరిగినట్టు తెలిపారు. 2025 సంవత్సరంలో మిగిలిన కాలానికి పరిశ్రమ అంచనాలు తగ్గించుకున్నట్టు సతీష్ తెలిపారు. గతేడాది స్థాయిలో వృద్ధి ఉండకపోవచ్చంటూ.. అమ్మకాలు 10–15 శాతం వృద్ధికి పరిమితం కావొచ్చన్నారు.

హైదరాబాదీ సంస్థకు డీబీఎస్ ఫౌండేషన్ అవార్డు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వృద్ధులకు సంరక్షణ సేవలు అందించే హైదరాబాదీ సంస్థ లైఫ్ సర్కిల్ హెల్త్ సర్వీసెస్‌కి (ఇండియా) డీబీఎస్ ఫౌండేషన్ ఇంపాక్ట్ బియాండ్ అవార్డు దక్కింది. దీనితో సంస్థకు సుమారు రూ. 3 కోట్ల గ్రాంట్ ఫండింగ్ లభించింది. ఈ తరహా సేవలకు గణనీయంగా ఉన్న ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు కార్యకలాపాలను విస్తరించనున్నట్లు సంస్థ సీఈవో అనంత్ కుమార్ తెలిపారు. లైఫ్ సర్కిల్ వృద్ధులకు ప్రొఫెషనల్‌గా సర్వీసులను అందించడమే కాకుండా సంరక్షకులకు శిక్షణతో పాటు జీవనోపాధి కూడా కల్పిస్తోందని డీబీఎస్ ఫౌండేషన్ హెడ్ కరెన్ నిగుయి చెప్పారు. వంద దరఖాస్తులు రాగా సింగపూర్, చైనా, హాంకాంగ్, భారత్‌కి చెందిన మొత్తం నాలుగు సంస్థలు విజేతలుగా నిల్చాయి. వాటిలో లైఫ్ సర్కిల్ కూడా ఒకటి. ఇప్పటివరకు 5,000 మంది సంరక్షకులకు ప్లేస్‌మెంట్ కల్పించింది.

అనుబంధ సంస్థగా జియో పేమెంట్స్

ఎస్‌బీఐ వాటా జియో ఫైనాన్షియల్ చేతికి



న్యూఢిల్లీ: జియో పేమెంట్స్ బ్యాంక్‌లో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ)కు గల మొత్తం 17.8 శాతం వాటాను జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 104.54 కోట్లు వెచ్చించినట్లు జియో ఫైనాన్షియల్ తాజాగా వెల్లడించింది. దీంతో జియో పేమెంట్స్ బ్యాంక్ పూర్తి అనుబంధ కంపెనీగా ఆవిర్భవించినట్లు పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ అనుమతి తదుపరి ఎస్‌బీఐ నుంచి 7,90,80,000 ఈక్విటీ షేర్లను రూ. 104.54 కోట్లకు సొంతం చేసుకున్నట్లు తెలియజేసింది.

హింద్ జింక్‌లో వాటా విక్రయం

- 1.6 శాతం అమ్మిన వేదాంతా
- షేరుకి రూ. 7 డివిడెండ్



న్యూఢిల్లీ: అనిల్ అగర్వాల్ గ్రూప్ దిగ్గజం వేదాంతా తాజాగా మైనింగ్ దిగ్గజం హిందుస్తాన్ జింక్‌లో మైనారిటీ వాటా విక్రయించింది. బుక్‌బిల్డ్ పద్ధతిలో సంస్థాగత ఇన్వెస్టర్లకు హిందుస్తాన్ జింక్‌లో 1.6 శాతం వాటాకు సమానమైన 66.7 మిలియన్ షేర్లను అమ్మినట్లు వేదాంతా పేర్కొంది. డీల్ విలువను రూ. 3,028 కోట్లుగా వెల్లడించింది. కంపెనీ వ్యూహాత్మక కార్యకలాపాలపై ఇన్వెస్టర్లకున్న విశ్వాసాన్ని తాజా లావాదేవీ ప్రతిఫలిస్తున్నట్లు పేర్కొంది. ప్రస్తుత ఏడాది(2025–26)కి కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 7 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకు అంగీకరించినట్లు మరో ప్రకటనలో స్టాక్ ఎక్స్చేంజీలకు వేదాంతా సమాచారమిచ్చింది. ఇందుకు ఈ నెల 24(మంగళవారం) రికార్డ్ డేట్‌గా ప్రకటించింది. కాగా.. వేదాంతా వివిధ బిజినెస్ విభాగాలను ప్రత్యేక కంపెనీలుగా విడదీసే ప్రణాళికలు అమలు చేయనున్న సంగతి తెలిసిందే. తాజాగా సమీకరించిన నిధులను రుణభారాన్ని తగ్గించుకోవడం ద్వారా బ్యాలన్స్ షీట్ పటిష్టతకు వినియోగించే వీలుంది. తద్వారా ఆర్థిక సౌలభ్యతతోపాటు.. స్వతంత్ర కంపెనీలుగా ఏర్పాటుకానున్న వివిధ బిజినెస్‌ల వృద్ధి ప్రణాళికలకు మద్దతు లభించనున్నట్లు పరిశ్రమవర్గాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లోగా విభిన్న బిజినెస్‌లను ప్రత్యేక కంపెనీలుగా విడదీయనున్నట్లు ఇప్పటికే వెల్లడించింది. విడదీత తదుపరి వేదాంతా అల్యూమినియం, వేదాంతా ఆయిల్ అండ్ గ్యాస్, వేదాంతా పవర్, వేదాంతా స్టీల్ అండ్ ఫెర్రస్ మెటీరియల్స్, వేదాంతా బేస్ మెటల్స్, వేదాంతా లిమిటెడ్ పేరుతో ఆరు సంస్థలుగా కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు వివరించింది.

యుగ్రో చేతికి ప్రొఫెక్టస్ క్యాపిటల్

డీల్ విలువ రూ. 1,400 కోట్లు

ముంబై: చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) రుణాలపై ప్రధానంగా దృష్టి పెడుతున్న డేటాటెక్ ఎన్‌బీఎఫ్‌సీ యుగ్రో క్యాపిటల్ తాజాగా ప్రొఫెక్టస్ క్యాపిటల్‌ను కొనుగోలు చేసింది. ఈ డీల్ విలువ రూ. 1,400 కోట్లు. ఇది పూర్తిగా నగదు రూపంలో ఉంటుంది. ప్రొఫెక్టస్ కొనుగోలుతో యుగ్రో వార్షిక లాభానికి సుమారు రూ. 150 కోట్లు జతవుతుందని అంచనా. అలాగే నిర్వహణలోని ఆస్తుల పరిమాణం తక్షణమే 29 శాతం పెరుగుతుందని, మధ్యకాలికంగా స్కూల్ ఫైనాన్సింగ్ మరో రూ. 2,000 కోట్లు పెరుగుతుందని, ప్రాపర్టీ.. మెషినరీ మొదలైన వాటిపై రుణాల పోర్ట్‌ఫోలియో పటిష్టమవుతుందని యుగ్రో వ్యవస్థాపకుడు శచీంద్రనాథ్ తెలిపారు. అలాగే రూ. 115 కోట్ల వ్యయాలు ఆదా అవుతాయని వివరించారు. 2025 మార్చి నాటికి ప్రొఫెక్టస్ ఏయూఎం రూ. 3,468 కోట్లుగా ఉండగా, ఏడు రాష్ట్రాల్లో 28 శాఖల నెట్‌వర్క్, సుమారు 800 మంది ఉద్యోగుల బృందం ఉంది.

ఆరు నెలల్లో ఇండస్ ఇండ్, జెన్సోల్ ఖాతాల సమీక్ష

ఐసీఏఐ ప్రెసిడెంట్ నందా



న్యూఢిల్లీ: మోసాలతో సంక్షోభం బారిన పడిన ఇండస్‌ఇండ్ బ్యాంక్, జెన్సోల్ ఇంజనీరింగ్ ఆర్థిక నివేదికల పూర్తిస్థాయి పరిశీలనకు, ఆడిట్ పరమైన లోపాలు ఉన్నాయా? అన్నది నిర్ధారించేందుకు కనీసం ఆరు నెలల సమయం పడుతుందని చార్టర్డ్ అకౌంటెంట్ల అత్యున్నత మండలి ఐసీఏఐ ప్రకటించింది. ఇప్పటికే ఐసీఏఐకు చెందిన ఫైనాన్షియల్ రిపోర్టింగ్ రివ్యూ బోర్డ్ (ఎఫ్ఆర్ఆర్‌బీ) ఈ రెండు సంస్థల ఆర్థిక నివేదికల సమీక్షను ప్రారంభించిందని, ఇందులో గుర్తించిన వాస్తవాల ఆధారంగా, అవసరమైతే ఆడిటర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్టు తెలిపింది. ''ఖాతాల్లో అసలు ఎం జరిగిందన్నది తెలుసుకోవడానికి కనీసం ఆరు నెలలు లేదా అంతకంటే ఎక్కువే సమయం తీసుకోవచ్చు'' అని ఐసీఏఐ ప్రెసిడెంట్ చరణ్‌జీత్ సింగ్ నందా తెలిపారు. ఇండస్‌ఇండ్ బ్యాంక్, జెన్సోల్ ఇంజనీరింగ్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లలో వాస్తవాలు, పారదర్శకత లేదని ఎఫ్ఆర్ఆర్‌బీ గుర్తించినట్టయితే, అప్పుడు ఐసీఏఐ క్రమశిక్షణ చర్యల కమిటీ ముందుకు ఈ అంశం వెళుతుందని చెప్పారు. జెన్సోల్ ఇంజనీరింగ్ ఖాతాల నుంచి నిధులు మళ్లించినట్టు సెబీ దర్యాప్తులో వెల్లడి కావడం తెలిసిందే. ఇండస్‌ఇండ్ బ్యాంక్ డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో రూ.1,979 కోట్ల మేర ఖాతాల్లో లోపాలున్నట్టు, స్వయంగా బ్యాంకు వెల్లడించడం గమనార్హం.

ఎంజీఐ టెక్‌తో జీన్‌పవర్‌ఎక్స్ జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లైఫ్ సైన్సెస్ రంగానికి ఉపయోగపడే ఉత్పత్తులు, టెక్నాలజీలను అందించే దిగ్గజం ఎంజీఐ టెక్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు హెల్త్‌టెక్ కంపెనీ జీన్‌పవర్‌ఎక్స్ తెలిపింది. దేశీయంగా పర్సనలైజ్డ్ మెడిసిన్‌లో ఏఐ ఆధారిత జీనోమిక్ సొల్యూషన్స్‌ను వేగవంతం చేసేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని వివరించింది. అధునాతన సీక్వెన్సింగ్, అనలిటిక్స్ దన్నుతో ప్రెడిక్టివ్ హెల్త్‌కేర్, ప్రెసిషన్ మెడిసిన్ తదితర విభాగాల్లో ఇది విప్లవాత్మక మార్పులు తేగలదని జీన్‌పవర్‌ఎక్స్ వ్యవస్థాపకులు కల్యాణ్ రామ్ ఉప్పలూరి, ఎండీ హిమ జ్యోతి చల్లా తెలిపారు. పటిష్టమైన ఎంజీఐ సీక్వెన్సింగ్ ప్లాట్‌ఫాంలకు తమ ఏఐ ఆధారిత ఇంజిన్ తోడైతే విశ్లేషణల్లో కచ్చితత్వం మరింత పెరుగుతుందని వారు చెప్పారు. వ్యక్తిగతీకరించిన ప్రివెంటివ్ హెల్త్‌కేర్ సొల్యూషన్స్‌ను సకాలంలో అందించడానికి వీలవుతుందని పేర్కొన్నారు. మధుమేహం, క్యాన్సర్ వంటి 100కు పైగా జీవన విధానాలపరమైన, తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలను అంచనా వేయడానికి, నివారించడానికి, నయం చేసుకోవడానికి ఉపయోగపడే సేవలను జీన్‌పవర్‌ఎక్స్ అందిస్తోంది.

బోట్‌తో యాక్సిస్ బ్యాంక్ జత



న్యూఢిల్లీ: కొత్తగా ప్రవేశపెట్టిన వేవ్ ఫార్చూన్ స్మార్ట్ వాచీలతో చెల్లింపులకు వెసులుబాటు కల్పించేలా వేరబుల్స్ సంస్థ బోట్, పేమెంట్స్ దిగ్గజం మాస్టర్‌కార్డ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్ వెల్లడించింది. కార్డ్ పిన్‌ను ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండా పీవోఎస్ డివైజ్‌ల ద్వారా రూ. 5,000 వరకు చెల్లింపులు జరపవచ్చని వివరించింది. యూజర్లు తమ డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలను టోకెనైజ్ చేసి, స్మార్ట్‌వాచ్ స్ట్రాప్‌లో సురక్షితంగా భద్రపర్చుకుని, పేమెంట్స్ చేసేందుకు మాస్టర్‌కార్డ్ సాంకేతికత ఉపయోగపడుతుందని బ్యాంకు పేర్కొంది. ఈ ఎన్ఎఫ్‌సీ టెక్నాలజీ ఆధారిత వాచీల ధర రూ. 3,299గా (ఆఫర్ సందర్భంగా రూ. 2,599) ఉంటుందని తెలిపింది.

పీఎస్‌యూల డీలిస్టింగ్ సరళతరం

- నిబంధనలను సడలించనున్న సెబీ
- ఎన్ఎస్ఈఎల్ స్టాక్ బ్రోకర్ల కోసం స్కీము
- బోర్డ్ మీటింగ్‌లో నిర్ణయాలు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థలు స్వచ్ఛందంగా డీలిస్ట్ అయ్యేందుకు వెసులుబాటు కల్పించేలా నిబంధనలను సడలించాలని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిర్ణయించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ప్రమోటర్ షేర్‌హోల్డింగ్ 90 శాతానికి చేరితేనే డీలిస్టింగ్ విజయవంతమైనట్లవుతుంది. దీని కోసం షేరు కనీస ధరను 60 రోజుల సగటు రేటు, గత 26 వారాల్లో గరిష్ట ధర తదితర అంశాల ప్రాతిపదికన నిర్ణయిస్తున్నారు. అయితే, బుక్ వేల్యూ తక్కువగా ఉన్నా లేక ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నా గానీ మార్కెట్‌లో రేటు చాలా ఎక్కువగా ఉండటం వల్ల ఈ విధానంతో డీలిస్టింగ్ ప్రక్రియ పీఎస్‌యూలకు చాలా ఖరీదైన వ్యవహారంగా మారింది. ఈ నేపథ్యంలోనే 90 శాతం పైగా ప్రభుత్వ వాటాలున్న పీఎస్‌యూల స్వచ్ఛంద డీలిస్టింగ్‌కి సంబంధించి కనీస ధరను లెక్కించే విధానాన్ని, మూడింట రెండొంతుల మంది పబ్లిక్ షేర్‌హోల్డర్లు ఆమోదం తెలపాలన్న నిబంధనను సడలించాలని సెబీ భావిస్తోంది. మరోవైపు, కేవలం భారతీయ ప్రభుత్వ బాండ్లలోనే ఇన్వెస్ట్ చేసే విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) పాటించాల్సిన నిబంధనలను సడలించాలని చైర్మన్ తుహిన్ కాంత పాండే సారథ్యంలో జరిగిన రెండో బోర్డు మీటింగ్‌లో నిర్ణయించింది.

స్టార్టప్ వ్యవస్థాపకులకు ఊరట..

పబ్లిక్ ఇష్యూకి వెళ్లాలనుకునే అంకుర సంస్థల వ్యవస్థాపకులకు ఊరటనిచ్చే ప్రతిపాదనకు సెబీ ఆమోదముద్ర వేసింది. దీని ప్రకారం ఐపీవో ప్రాథమిక పత్రాలను దాఖలు చేయడానికి కనీసం ఒక్క ఏడాది ముందు కేటాయించిన ఎసాప్స్‌ను (ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్లు) వారు అట్టే పెట్టుకునేందుకు వీలుంటుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఐపీవోకెళ్లే సమయంలో ఎసాప్స్ సహా ఇతరత్రా షేర్ల కేటాయింపు రూపంలో ప్రయోజనాలేవీ అంకురాల ప్రమోటర్ల వద్ద ఉండకూడదు. ఒకవేళ ఉంటే, వాటిని ఐపీవోకి ముందుగానే విక్రయించాలి. విదేశాల నుంచి భారత్‌కు తమ ప్రధాన కార్యాలయాన్ని మార్చుకోవాలనుకుంటున్న సంస్థలకు తాజా సడలింపు ఉపయోగపడనుంది. అటు ఎన్ఎస్ఈఎల్ పేమెంట్ సంక్షోభంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు ఎదుర్కొన్న నిర్దిష్ట స్టాక్ బ్రోకర్ల కోసం సెటిల్మెంట్ స్కీమును ప్రవేశపెట్టినట్లు సెబీ తెలిపింది. ఈ స్కీమును ఎంచుకోవడం ద్వారా తమపై ఉన్న పెండింగ్ కేసులను పరిష్కరించుకునేందుకు వారికి వీలుంటుంది. ఇక, ఐపీవో పత్రాల ఫైలింగ్‌కు ముందు కీలక మేనేజ్‌మెంట్ సిబ్బంది, ప్రస్తుత ఉద్యోగులు, డైరెక్టర్ల దగ్గర షేర్లు డీమ్యాట్ రూపంలో ఉండాలనే ప్రతిపాదనకు కూడా సెబీ ఆమోదముద్ర వేసింది.



‘బిర్యానీ’తో రెచ్చగొట్టి...

షమీతో ఫలితం రాబట్టిన రవిశాస్త్రి

న్యూఢిల్లీ: భారత పేసర్ బౌలర్ మొహమ్మద్ షమీకి బిర్యానీ అంటే చాలా ఇష్టం. పేసర్‌గా ఒకవైపు తన ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూనే బిర్యానీపై ఇష్టాన్ని అతను ఎప్పుడూ దాచుకోలేదు. సహచర క్రికెటర్లు కూడా చాలా సందర్భాల్లో ఈ విషయాన్ని చెప్పారు. అయితే షమీ–బిర్యానీకి సంబంధించి మరో ఆసక్తికర అంశాన్ని మాజీ కోచ్ రవిశాస్త్రి పంచుకున్నాడు. అతనికి ఇష్టమైన బిర్యానీ ద్వారానే షమీని రెచ్చగొట్టి ఫలితం సాధించిన విషయాన్ని అతను గుర్తు చేసుకున్నాడు. 2018 దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా తొలి రెండు టెస్టులు ఓడి భారత్ సిరీస్ కోల్పోయింది. చివరి టెస్టులోనూ పరాజయం దిశగా సాగుతోంది. లక్ష్య ఛేదనలో చేతిలో 8 వికెట్లతో మరో 100 పరుగులు మాత్రమే దక్షిణాఫ్రికా సాధించాల్సి ఉంది. ఇలాంటి స్థితిలో లంచ్ విరామ సమయంలో డ్రెస్సింగ్ రూమ్‌లో షమీ ఒక పెద్ద ప్లేటు నిండుగా బిర్యానీ పెట్టుకొని తినేందుకు సిద్ధమయ్యాడు. దాంతో ‘ఇంత తింటే నీ ఆకలి తీరుతుందా’ అని రవిశాస్త్రి అసహనాన్ని ప్రదర్శించాడు. ఇది షమీకి బాగా కోపం తెప్పించింది. ‘ఇదిగో, ఈ ప్లేట్ తీసేసుకో. నాకేమీ అవసరం లేదు. నీ బిర్యానీ ఎక్కడైనా పోనీ’ అని అతను ఆగ్రహంగా స్పందించాడు. పరిస్థితిని గమనించిన రవిశాస్త్రి బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్‌ను పక్కకు పిలిచి ‘అతడిని ఒంటరిగా వదిలేయండి. ఏదైనా నాతో మాట్లాడాలంటే వికెట్లు తీసిన తర్వాత రమ్మనండి’ అని చెప్పాడు. ఈ ఘటనతో షమీ రెచ్చిపోయాడు. అతను వరుసగా వికెట్లు తీయడంతో దక్షిణాఫ్రికా కుప్పకూలింది. చివరి 8 మంది బ్యాటర్లు కలిపి 22 పరుగులు మాత్రమే చేయడంతో 63 పరుగులతో భారత్ విజయం సాధించింది. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో షమీ 5 వికెట్లు పడగొట్టడం విశేషం. మ్యాచ్ ముగిశాక అదే ప్లేట్‌ను ఇచ్చి ‘ఇప్పుడు ఎంత బిర్యానీ కావాలో తిను’ అంటూ భరత్ అరుణ్ చెప్పడంతో పరిస్థితి సాధారణంగా మారిపోయింది.

‘తీవ్ర వేదన అనుభవించా’

2018లో అవకాశం రాకపోవడంపై కరుణ్ నాయర్

లీడ్స్: భారత జట్టు 2018 ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్టుల సిరీస్‌ను 1–4తో కోల్పోయింది. నాలుగో టెస్టు ముగిసేసరికే ఇంగ్లండ్ 3–1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. టూర్‌లో ఆరంభం నుంచి ఉన్న కరుణ్ నాయర్‌కు నాలుగు మ్యాచుల్లోనూ ఆడే అవకాశం రాలేదు. సిరీస్ ఫలితం ఖాయమైన నేపథ్యంలో కనీసం చివరి టెస్టులోనైనా చోటు దక్కవచ్చని అతను ఆశించాడు. అయితే కోహ్లి కెప్టెన్, రవిశాస్త్రి కోచ్‌గా ఉన్న టీమ్ మేనేజ్‌మెంట్ అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఒకవైపు నాయర్ టీమ్‌తోనే ఉండగా... అసలు ప్రధాన జట్టులోనే లేని హనుమ విహారిని భారత్ నుంచి ఇంగ్లండ్‌కు రప్పించి అతనితో అరంగేట్రం చేయించింది. దాంతో నాయర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఆ తర్వాత అతను భారత జట్టుకూ పూర్తిగా దూరమయ్యాడు. నాటి ఘటన తనను తీవ్రంగా బాధించిందని నాయర్ గుర్తు చేసుకున్నాడు. ఇప్పుడు ఏడేళ్ల తర్వాత అదే ఇంగ్లండ్ గడ్డపైనే అతనికి టెస్టు మ్యాచ్ ఆడే అవకాశం రానుండటం విశేషం. ‘చివరి టెస్టులోనూ నాకు అవకాశం లేదని తెలిసిన తర్వాత తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. మైదానంలోనే కుప్పకూలిపోయినట్లుగా అనిపించింది. నేను ఆడటం లేదని చెప్పడంతో ఒక్కసారిగా ఒంటరితనం ఆవహించింది. ఆ సమయంలో ఏం చేయాలో అర్థం కాలేదు. చివరకు ఆక్స్‌ఫర్డ్ స్ట్రీట్‌లో నడుచుకుంటూ వెళ్లిపోయాను. బ్రాండెడ్ షూస్ మొదలు కనిపించిన ప్రతీ వస్తువును కొంటూ పోయాను. నేను గతంలో ఇలా ఎప్పుడూ చేయలేదు. ఎక్కువగా ఖర్చు చేసే అలవాటు కూడా లేదు. కానీ ఈసారి ఏం చేస్తున్నానో నాకే అర్థం కాలేదు. బ్యాగుల నిండా వస్తువులు తీసుకొని తిరిగొచ్చాను. ఆ సమయంలో షాపింగ్ చేస్తే నాకు సంతోషం కలుగుతుందేమో అన్నట్లుగా భావించాను కానీ అది అర్థం లేని ఆలోచన. భారత్‌కు ఆడటం తప్ప మరేదో ఆనందం ఇవ్వలేదని అర్థమైంది. నాకు సంబంధించి సిరీస్ అయిపోయింది. కానీ చివరి మ్యాచ్ ముగిసి ఎప్పుడెప్పుడు ఇంటికి వెళదామా అనే ఆలోచనలో ప్రతీ రోజు ఒక నరకంగా అనిపించింది’ అని కరుణ్ నాయర్ తన బాధను వ్యక్తీకరించాడు.



హంపి ఓటమి... హారిక గేమ్ ‘డ్రా’





సెయింట్ లూయిస్ (అమెరికా): కెయిన్స్ కప్ అంతర్జాతీయ మహిళల చెస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, స్టార్ ప్లేయర్ కోనేరు హంపికి తొలి పరాజయం ఎదురైంది. అమెరికాకు చెందిన కారిసా యిప్‌తో బుధవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో హంపి 31 ఎత్తుల్లో ఓడిపోయింది. ఆరో రౌండ్ ముగిసేసరికి 4.5 పాయింట్లతో ఆధిక్యంలో నిలిచిన హంపిపై నెగ్గడం ద్వారా కారిసా యిప్ 4.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలోకి వచ్చింది. మరోవైపు భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఖాతాలో నాలుగో ‘డ్రా’ చేరింది. బీబీసారా అసవుబయేవా (కజకిస్తాన్)తో జరిగిన ఏడో రౌండ్ గేమ్‌ను హారిక 41 ఎత్తుల్లో ‘డ్రా’గా ముగించింది. పది మంది మేటి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. ఈ టోర్నీలో కోనేరు హంపి 2020లో విజేతగా నిలువగా... 2024లో హారిక మూడో స్థానంలో నిలిచింది.



ముష్ఫికర్

లిటన్ దాస్

బంగ్లాదేశ్ 484/9

శ్రీలంకతో తొలి టెస్టు

గాలె (శ్రీలంక): మిడిలార్డర్ సమష్టిగా సత్తా చాటడంతో శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ భారీస్కోరు నమోదు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 292/3తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్... బుధవారం ఆట ముగిసే సమయానికి 151 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 484 పరుగులు చేసింది. వర్షం కారణంగా ఆటకు రెండు గంటలపాటు అంతరాయం వాటిల్లగా... రెండో రోజు 61 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ముష్ఫికర్ రహీమ్ (350 బంతుల్లో 163; 9 ఫోర్లు) భారీ సెంచరీతో కదంతొక్కగా... కెప్టెన్ నజ్ముల్ హుసేన్ షంటో (279 బంతుల్లో 148; 15 ఫోర్లు, 1 సిక్స్) క్రితం రోజు స్కోరుకు మరో 12 పరుగులు జోడించి పెవిలియన్ చేరాడు. నజ్ముల్ అవుటయ్యాక క్రీజులోకి వచ్చిన వికెట్ కీపర్ బ్యాటర్ లిటన్ దాస్ (123 బంతుల్లో 90; 11 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. నాలుగో వికెట్‌కు నజ్ముల్‌తో కలిసి 264 పరుగులు జోడించిన ముష్ఫికర్... ఐదో వికెట్‌కు లిటన్ దాస్‌తో కలిసి 149 పరుగులు జతచేశాడు. దీంతో ఒకదశలో బంగ్లాదేశ్ 458/4తో పటిష్ట స్థితిలో కనిపించింది. అయితే చివర్లో తేరుకున్న లంక బౌలర్లు... బంగ్లాదేశ్ మరింత భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నారు. జాకీర్ (8), నయీమ్ (11), తైజుల్ (6) వెంటవెంటనే పెవిలియన్ చేరారు. హసన్ మహమూద్ (0 బ్యాటింగ్), నహీద్ రాణా (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. శ్రీలంక బౌలర్లలో అశిత ఫెర్నాండో, మిలన్ రత్ననాయకే, తరిందు రత్ననాయకే తలా 3 వికెట్లు పడగొట్టారు. చేతిలో ఒక వికెట్ ఉన్న బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో మరెన్ని పరుగులు జోడిస్తుందో చూడాలి.

క్విటోవాకు ‘వైల్డ్ కార్డు’

వింబుల్డన్ టోర్నీ బరిలో మాజీ చాంపియన్



లండన్: ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ‘వైల్డ్ కార్డు’ పొందిన ప్లేయర్ల వివరాలను నిర్వాహకులు వెల్లడించారు. మహిళల సింగిల్స్‌లో రెండుసార్లు చాంపియన్, చెక్ రిపబ్లిక్ స్టార్ ప్లేయర్ పెట్రా క్విటోవా ‘వైల్డ్ కార్డు’తో ఈసారి పునరాగమనం చేయనుంది. 2011లో, 2014లో వింబుల్డన్ మహిళల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచిన క్విటోవా చివరిసారి 2023లో ఈ టోర్నీలో ఆడింది. గత ఏడాది వింబుల్డన్ టోర్నీ సమయంలో మగబిడ్డకు జన్మనిచ్చిన క్విటోవా 17 నెలలపాటు ఆటకు దూరంగా ఉంది. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరిలో టెక్సస్‌లో జరిగిన డబ్ల్యూటీఏ టోర్నీ ద్వారా క్విటోవా మళ్లీ రాకెట్ పట్టింది. 2011లో వింబుల్డన్ టైటిల్ నెగ్గిన తర్వాత కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌కు చేరిన క్విటోవా ప్రస్తుతం 572వ ర్యాంక్‌లో ఉంది. 35 ఏళ్ల క్విటోవా తన కెరీర్‌లో 31 సింగిల్స్ టైటిల్స్ సాధించింది.

యూకీ జోడీకి నిరాశ



లండన్: క్వీన్స్ క్లబ్ ఏటీపీ–500 టెన్నిస్ చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్)–రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీకి నిరాశ ఎదురైంది. బుధవారం జరిగిన మెయిన్ ‘డ్రా’ తొలి రౌండ్ మ్యాచ్‌లో యూకీ–గాలోవే ద్వయం 6–4, 1–6, 10–8తో ‘సూపర్ టైబ్రేక్’లో టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)–జీరీ లెహెస్కా (చెక్ రిపబ్లిక్) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో–అమెరికన్ ద్వయం మూడు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. తొలి రౌండ్‌లో ఓడిన యూకీ–గాలోవే జోడీకి 10,820 యూరోలు (రూ. 10 లక్షల 76 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. వాస్తవానికి ఈ టోర్నీలో యూకీ–గాలోవే క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లోనే రోహన్ బోపన్న (భారత్)–సాండర్ జిలె (బెల్జియం) చేతిలో ఓడిపోయి నిష్క్రమించారు. అయితే డబుల్స్ మెయిన్ ‘డ్రా’లోని అలెక్సీ పాపిరిన్–డిమినార్ (ఆస్ట్రేలియా) జోడీ గాయం కారణంగా చివరి నిమిషంలో వైదొలిగింది. దాంతో క్వాలిఫయింగ్‌లో ఓడిన ఉత్తమ ర్యాంక్ జంటగా నిలిచిన యూకీ–గాలోవే జట్టుకు నిర్వాహకులు మెయిన్ ‘డ్రా’లో ఆడే అవకాశాన్ని కల్పించారు.

క్వార్టర్స్‌లో బోపన్న ద్వయం

మరోవైపు క్వాలిఫయింగ్ ద్వారా మెయిన్ ‘డ్రా’కు అర్హత పొందిన రోహన్ బోపన్న–సాండర్ జిలె జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో బోపన్న–సాండర్ 7–6 (7/1), 6–7 (5/7), 10–6తో ‘సూపర్ టైబ్రేక్’లో జాకుబ్ మెన్‌సిక్ (చెక్ రిపబ్లిక్)–హోల్గర్ రూనె (డెన్మార్క్)లపై విజయం సాధించారు. క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ జూలియన్ క్యాష్–లాయిడ్ గ్లాస్‌పూల్ (బ్రిటన్)లతో బోపన్న–సాండర్ పోటీపడతారు.

ఇంగ్లండ్‌కు సూర్యకుమార్ యాదవ్

స్పోర్ట్స్ హెర్నియాకు శస్త్రచికిత్స!



న్యూఢిల్లీ: చాన్నాళ్లుగా ‘స్పోర్ట్స్ హెర్నియా’తో బాధపడుతున్న భారత టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇంగ్లండ్‌లో చికిత్స తీసుకోవడానికి సిద్ధమయ్యాడు. ఇటీవల ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున అదరగొట్టిన సూర్యకుమార్... ఆ తర్వాత ముంబై టి20 లీగ్‌లో సైతం పాల్గొన్నాడు. అయితే ముంబై లీగ్‌లో మ్యాచ్‌లు ఆడుతున్న సమయంలో నొప్పి ఎక్కువవడంతో... ‘స్పోర్ట్స్ హెర్నియా’కు చికిత్స తీసుకోవాలని 33 ఏళ్ల సూర్య భావిస్తున్నాడు. ‘సూర్య చాన్నాళ్లుగా నొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. దీనికి సంబంధించిన ఇంగ్లండ్ వైద్యులతో సంప్రదింపులు జరుగుతున్నాయి. ఒకవేళ అవసరమైతే శస్త్రచికిత్స చేయించుకుంటాడు’ అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది ఆగస్టు వరకు భారత జట్టుకు అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు లేవు. ఈ నేపథ్యంలో చికిత్సకు ఇదే సరైన సమయమని సూర్య భావిస్తున్నాడు. ఒకవేళ సర్జరీ జరిగినా... కోలుకునేందుకు తగినంత సమయం ఉండటంతో అతడు వైద్యులను సంప్రదించాడు.

ప్రపంచ పారా అథ్లెటిక్స్ పోటీలకు అంబాసిడర్‌గా కంగనా రనౌత్

న్యూఢిల్లీ: బాలీవుడ్ నటి, లోక్‌సభ సభ్యురాలు కంగనా రనౌత్ ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 5 వరకు న్యూఢిల్లీ వేదికగా ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జరగనుంది. వందకు పైగా దేశాల నుంచి పారా అథ్లెట్లు ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారు. ‘పారా అథ్లెట్లకు ఎప్పుడూ నా సహకారం ఉంటుంది. వాళ్లు ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని ప్రపంచ స్థాయికి వచ్చారు. వారి ఘనతలను గుర్తించాల్సిన అవసరముంది. పారా అథ్లెటిక్స్ అనేవి కేవలం క్రీడలు మాత్రమే కాదు. దాని వెనక వారి పోరాటం, గుండె ధైర్యం దాగి ఉంటుంది. అలాంటి చాంపియన్‌లకు అంబాసిడర్‌గా వ్యవహరించనుండటం గర్వంగా భావిస్తున్నా’ అని కంగనా వెల్లడించింది. భారత పారాలింపిక్ కమిటీ అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు దేవేంద్ర ఝఝారియా... కంగనా అంకితభావం, స్ఫూర్తిని కొనియాడాడు.

ప్రపంచకప్ టోర్నీకి సన్నాహాలు

- నాలుగు దేశాల జూనియర్ హాకీ టోర్నీ బరిలో భారత్
- జర్మనీ, ఆస్ట్రేలియా, స్పెయిన్‌తో మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: జూనియర్ హాకీ ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా... భారత జట్టు నాలుగు దేశాల సిరీస్‌కు సిద్ధమైంది. ఈ నెల 21 నుంచి 25 వరకు జర్మనీ వేదికగా జరగనున్న ఈ టోర్నీలో ఆతిథ్య జర్మనీ, ఆస్ట్రేలియా, స్పెయిన్‌లతో యువ భారత జట్టు తలపడనుంది. భారత జూనియర్ జట్టుకు అరిజీత్ సింగ్ హుందల్ సారథ్యం వహిస్తుండగా... అమీర్ అలీ వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ సిరీస్ కోసం భారత జట్టు బుధవారం బెంగళూరు నుంచి బెర్లిన్‌కు బయలుదేరింది. శనివారం జరగనున్న తొలి పోరులో ఆతిథ్య జర్మనీతో భారత్ తలపడనుంది. అనంతరం ఆదివారం ఆస్ట్రేలియాతో, మంగళవారం స్పెయిన్‌తో మ్యాచ్‌లు ఆడనుంది. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరగనున్న ఈ సిరీస్‌లోని అన్నీ మ్యాచ్‌లు బెర్లిన్‌లో నిర్వహించనున్నారు. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఈ నెల 25న ఫైనల్ జరగనుంది. ‘2025 జూనియర్ హాకీ వరల్డ్‌కప్‌నకు ముందు ఈ టోర్నమెంట్ భారత జట్టుకు ఎంతో కీలకం కానుంది. మెగా టోర్నీకి ఎక్కువ రోజులు లేకపోవడంతో... ఇది సన్నద్ధతకు చక్కగా తోడ్పడనుంది. బలాబలాలను బేరీజు వేసుకోవడంతో పాటు జట్టు కూర్పును సిద్ధం చేసేందుకు ఉపకరిస్తుంది. ఇంకా మెరుగవ్వాల్సిన అంశాలేంటి అనేదానిపై కూడా ఒక స్పష్టత వస్తుంది. బలమైన ప్రత్యర్థులతో తలపడ్డప్పుడే మన బలహీనతలు బయటపడతాయి’ అని హాకీ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 10 వరకు భారత్ వేదికగా జూనియర్ హాకీ ప్రపంచకప్ జరగనుంది.



సాక్షి ప్లస్
గురువారం। 19-6-2025



భూమి నుంచి కోటి కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న స్కల్‌ప్టర్ నక్షత్రమండలం (గెలాక్సీ) అత్యంత స్పష్టమైన ఫొటో ఇది. వేయి వర్ణాల చిత్రమైన ఈ ఫొటోను యురోపియన్ సదరన్ అబ్జర్వేటరీ వారి వెరీ లార్జ్ టెలిస్కోప్(వీఎల్‌టీ) సాయంతో తీశారు.

కశ్మీర్‌లో రాజకీయ దుమారం

- ఉప ఎన్నికల్లో రెండు స్థానాల్లో పరస్పర పోటీకి సిద్ధమవుతున్న నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్
- ఈ సీట్లపై కన్నేసిన బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌లో ఉప ఎన్నికలకు ముందే రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. మిత్రపక్షాలైన నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ కూటమిపై నీలినీడలు కమ్ముకున్నాయి. బడ్గాం, నగ్రోటా అసెంబ్లీ నియోజకవర్గాలలో జరుగనున్న ఉప ఎన్నికలు ఒమర్ ప్రభుత్వానికి సమస్యలను పెంచాయి. నగ్రోటా ఉప ఎన్నికలో పోటీ చేయడంపై రెండు రాజకీయ పార్టీలు దాదాపుగా ముఖాముఖి తలపడుతున్నాయి. ఈ స్థానం నుంచి పోటీకి అటు నేషనల్ కాన్ఫరెన్స్, ఇటు కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గడానికి సిద్ధంగా లేవు. నగ్రోటాలో రెండు పార్టీల మధ్య ఎటువంటి ఒప్పందం కుదరకపోతే కాంగ్రెస్ పార్టీ కూటమి నుంచి బయటికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా ఈ సీట్లపై ఇప్పుడు బీజేపీ దృష్టి సారించింది.

నిజానికి, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే ఒమర్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నారు. దీని తరువాత, కాంగ్రెస్ కూడా నేషనల్ కాన్ఫరెన్స్‌తో ఘర్షణ మూడ్‌లో ఉంది. కాంగ్రెస్ నాయకులు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా అంశంపై గళం విప్పుతూ, ముఖ్యమంత్రిని కూడా బెదిరిస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీలో నేషనల్ కాన్ఫరెన్స్‌కు 41 సీట్లు ఉన్నాయి. ఇది కాకుండా, ప్రభుత్వానికి ఆరుగురు కాంగ్రెస్, ఏడుగురు స్వతంత్రులు, ఒక సీపీఐ(ఎం) ఎమ్మెల్యే మద్దతు ఉంది. మిత్రపక్షాల మద్దతుదారుల సంఖ్యతో కలిపి నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వానికి 55 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ నగ్రోటా ఉప ఎన్నిక బరి నుంచి వెనక్కి తగ్గడానికి సిద్ధంగా లేదు. అందువల్ల ఈ స్థానానికి జరిగే ఉప ఎన్నికలో నేషనల్ కాన్ఫరెన్స్ తన అభ్యర్థిని నిలబెడితే, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకొనే అవకాశాలున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించుకుంటే, ఒమర్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేల సంఖ్య 49కి తగ్గుతుంది.

మరోవైపు నగ్రోటా స్థానంలో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ మధ్య ఘర్షణ వల్ల బీజేపీకి ప్రత్యక్ష ప్రయోజనం చేకూరనుంది. ఉప ఎన్నికకు సంబంధించి బీజేపీ కూడా గట్టి పోటీ ఇవ్వాలని నిర్ణయించింది. కాగా బడ్గాం స్థానంలోనూ కమలదళం తన అభ్యర్థిని నిలబెట్టడానికి సన్నాహాలు చేస్తోంది. ఇప్పటివరకు ఇక్కడ ప్రధాన పోటీ నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీల మధ్యే ఉండేది. అయితే అమర్‌నాథ్ యాత్ర తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం నగ్రోటా, బడ్గాంల్లో ఉప ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఈ రెండు సీట్లు ఖాళీగా ఉండి ఆరు నెలలు అయ్యింది. అయితే ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే ఆరు నెలల తర్వాత ఏదైనా సీటును ఖాళీగా ఉంచవచ్చు. ఆరు నెలల వ్యవధి తర్వాత కూడా ఒక సీటును ఖాళీగా ఉంచడానికి ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని నిబంధనలను పాటించాల్సి ఉంటుంది.

ఢిల్లీలో మళ్లీ కరోనా కలకలం

మహమ్మారి వ్యాప్తిలో దేశంలోనే రెండో స్థానం

కరోనాతో మరో వ్యక్తి మృతి • 13కి చేరిన మృతుల సంఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో కరోనా వైరస్ మళ్లీ తీవ్ర ప్రభావం చూపుతోంది. కరోనా కారణంగా బుధవారం 65 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. అతడు నోటి క్యాన్సర్, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు సమాచారం. ఇప్పటివరకు ఢిల్లీలో కరోనా కారణంగా 13 మంది మరణించగా, ప్రస్తుతం 620 యాక్టివ్ కేసులు ఉన్నాయి. జూన్ 15న ఒక్కరోజే ముగ్గురు మరణించారు. వీరిలో 57 ఏళ్ల మహిళకు డయాబెటిస్, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నాయి. 57 ఏళ్ల పురుషుడికీ అదే రకమైన అనారోగ్య సమస్యలున్నాయి. మరణించిన 83 ఏళ్ల మహిళకు డయాబెటిస్, హైబీపీ, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ ఉంది.

తగ్గుతున్న కేసుల సంఖ్య

ఢిల్లీలో గత మూడు రోజులుగా కరోనా యాక్టివ్ కేసుల సంఖ్యలో కొంత తగ్గుదల కనిపిస్తోంది. యాక్టివ్ కేసులు తగ్గాయి. కొత్త కేసులు నమోదు కాలేదు. ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం గత 24 గంటల్లో 212 మంది బాధితులు కోలుకున్నారు. ఢిల్లీలో ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటివరకు 1,960 కేసులు నమోదయ్యాయి. కాగా, దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం కరోనా కేసుల్లో ఢిల్లీ రెండో స్థానంలో ఉంది. కొత్త వేరియంట్లు సాధారణంగా వేగంగా వ్యాపిస్తాయి. అయితే ఇవి గత వేరియంట్ల మాదిరిగా ప్రాణాంతకం కాకపోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిలో కరోనా కొత్త వేరియంట్లతో ముప్పు అధికంగా ఉంటుంది. కేసుల పెరుగుదలపై భయపడాల్సిన అవసరం లేదని నిపుణులు సూచిస్తున్నారు. జలుబు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు. మాస్కులు ధరించడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం, జన సమూహాల్లోకి వెళ్లకపోవడం వంటి జాగ్రత్తలు పాటిస్తే వైరస్ వ్యాప్తిని నియంత్రించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

'నో ఫ్లయింగ్ జోన్'గా అమర్‌నాథ్ యాత్రా మార్గం

శ్రీనగర్: అమర్‌నాథ్ యాత్రా మార్గాన్ని 'నో ఫ్లయింగ్ జోన్'గా జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం ప్రకటించింది. భద్రతా కారణాల దృష్ట్యా డ్రోన్లు, బెలూన్లు, ఇతర విమానయాన వస్తువుల వాడకాన్ని నిషేధించింది. జూలై 1 నుంచి ఆగస్టు 10 వరకు నిషేధం అమల్లో ఉంటుందని తెలిపింది. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసారన్ గడ్డి మైదానంలో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత, తీవ్రవాద ముప్పును నిఘా సంస్థలు హెచ్చరించడంతో గగనతలంపై ఆంక్షలు విధించాలనే నిర్ణయం వచ్చింది. కేంద్ర హోం శాఖ భద్రతా సలహా మేరకు అమర్‌నాథ్ యాత్రకు భద్రతా ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టంచేసింది. అమర్‌నాథ్ యాత్ర జూలై 3న ప్రారంభమై ఆగస్టు 8న ముగియనుంది. హిమాలయాల్లోని ఈ పుణ్యక్షేత్రానికి వేలాది మంది యాత్రికులు ప్రతి సంవత్సరం వెళ్లే ఈ తీర్థయాత్ర అత్యంత సున్నితమైన మతపరమైన కార్యక్రమాల్లో ఒకటి. దీంతో పహల్గాం, బాల్టాల్ దారుల్లో యాత్రికుల భద్రతను నిర్ధారించడానికి భద్రతా దళాలు 'ఆపరేషన్ శివ'ను ప్రారంభించాయి. జమ్మూ కశ్మీర్ పోలీసులతో సమన్వయంతో దాదాపు 50,000 మంది పారామిలిటరీ సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. తీర్థయాత్ర మార్గాల్లో పేలుడు పదార్థాలు, ఇంప్రూవైజ్డ్ పేలుడు పరికరాలను గుర్తించి, నిర్వీర్యం చేయడానికి రోజువారీ రోడ్ ఓపెనింగ్ ఆపరేషన్లను నిర్వహిస్తారు. భద్రతా దళాలు ఇప్పటికే నిర్దేశించిన యాత్రా మార్గాలను స్వాధీనం చేసుకున్నాయి. కేంద్రపాలిత ప్రాంతం అంతటా అదనపు మోహరింపులు అమలులో ఉన్నాయి.

శుభాన్షు అంతరిక్ష యాత్ర మరోసారి వాయిదా

న్యూఢిల్లీ: భారత వ్యోమగామి కెప్టెన్ శుభాన్షు శుక్లా అంతరిక్ష యాత్ర మరోసారి వాయిదా పడింది. సాంకేతిక కారణాలతో ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన మిషన్‌ను.. నేడు ప్రయోగించాల్సి ఉంది. అయితే.. యాక్సియమ్-4 మిషన్ ప్రయోగాన్ని వాయిదా వేస్తున్నట్టు ఆక్సియమ్ స్పేస్ తెలిపింది. తిరిగి జూన్ 22న ప్రయోగించనున్నట్టు వెల్లడించింది. యాక్సియమ్-4 మిషన్ ఇప్పటికే నాలుగు సార్లు వాయిదా పడింది. మొదట వాతావరణ పరిస్థితులు అనుకూలించక, ఆ తరువాత రాకెట్‌లో ద్రవ ఆక్సిజన్ లీక్ అవుతున్నట్టు గుర్తించిన ప్రయోగాన్ని వాయిదా వేశారు. అయితే మరమ్మతులు, వాతావరణ పరిస్థితులు, సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని 22న ప్రయోగించనున్నట్లు యాక్సియమ్ స్పేస్ తెలిపింది.

మూడు నెలల క్రితమే ఇంజన్ మార్చారు

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానం ఏఐ171 ఇంజన్‌ను మూడు నెలల క్రితమే మార్చారని దర్యాప్తులో తేలింది. 12 ఏళ్ల నాటి బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్‌ను చివరిసారిగా జూన్ 2023లో పూర్తిస్థాయిలో నిర్వహణ తనిఖీలు నిర్వహించారని, ఈ ఏడాది చివరిలో డిసెంబర్‌లో మళ్లీ తనిఖీ ఉందని వెల్లడించింది. ప్రమాదం తరువాత.. ఎయిర్ ఇండియా ఫ్లీట్‌లోని అన్ని డ్రీమ్‌లైనర్ విమానాలను ఒకేసారి భద్రతా తనిఖీ చేయాలని భారత విమానయాన నియంత్రణ సంస్థ, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆదేశించింది. ఇప్పటివరకు, ఎయిర్‌లైన్స్‌కు చెందిన 33 బోయింగ్ 787లలో తొమ్మిదింటిపై తనిఖీలు పూర్తయ్యాయి. మిగిలిన విమానాలపై తనిఖీలు కొనసాగుతున్నాయి.

సమస్యలకు పరిష్కారాలు యుద్ధ క్షేత్రాల్లో కాదు

ప్రధాని మోదీ స్పష్టీకరణ

జాగ్రెబ్: సమస్యలకు పరిస్కార మార్గాలు యుద్ధ క్షేత్రాల్లో లభించవని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. వివాదాలు తలెత్తితే చర్చలు, దౌత్య మార్గాల్లో పరిష్కరించుకోవాలని చెప్పారు. యూరప్ అయినా ఆసియా అయినా.. ఎక్కడైనా ఇదే విధానం అవసరమని స్పష్టంచేశారు. ఆయన బుధవారం క్రొయేషియా ప్రధానమంత్రి అంద్రెజ్ ప్లెంకోవిక్‌తో ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు ఉమ్మడిగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఇండియా-క్రొయేషియా మధ్య రక్షణ రంగంలో సహకారం కోసం ఒక ప్రణాళిక రూపొందించబోతున్నట్లు తెలిపారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఉగ్రవాదంపై పోరాటంలో ఇండియాకు క్రొయేసియా మద్దతు ఇస్తోందని మోదీ గుర్తుచేశారు.

రాజ్యాంగాన్ని ఎగతాళి చేస్తారా?

కేంద్రంపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మండిపాటు

కోల్‌కతా: కేంద్ర ప్రభుత్వ తీరుపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత మమతా బెనర్జీ బుధవారం ఆగ్రహం వ్యక్తంచేశారు. జూన్ 25వ తేదీని సంవిధాన్ హత్యా దివస్(రాజ్యాంగ హత్య దినం)గా పాటించాలని నిర్ణయించడాన్ని తప్పుపట్టారు. ఇది భారత రాజ్యాంగాన్ని ఎగతాళి చేయడమే అవుతుందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య సంస్థలను ధ్వంసం చేయడానికి కేంద్రం కుట్ర పన్నిందని ఆరోపించారు. దేశంలో కేంద్ర హోంశాఖ అమిత్ షా అసలైన పెత్తనం చెలాయిస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ ఎల్లప్పుడూ విదేశాల్లోనే పర్యటనల్లో ఉంటున్నారు కాబట్టి అమిత్ షాను ప్రధానమంత్రిగా అధికారికంగా ప్రకటించాలని మమతా బెనర్జీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. జూన్ 25వ తేదీని రాజ్యాంగ హత్య దినంగా పాటించడానికి వీల్లేదని డిమాండ్ చేశారు. మన రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం లేని వ్యక్తులు అదే రాజ్యాంగం గురించి గొప్పగా మాట్లాడుతున్నారని, మనసులో ఒకటి పెట్టుకొని పైకి నటిస్తున్నారని బీజేపీ నేతలపై ధ్వజమెత్తారు. 1975 జూన్ 25న అప్పటి ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించిన నేపథ్యంలో ఈ ఏడాది అదే తేదీని సంవిధాన్ హత్యా దివస్‌గా పాటించాలని కేంద్ర హోం శాఖ ఆదేశించిన సంగతి తెలిసిందే.

రాకపోకల్లేక ఎయిర్‌పోర్టులు వెలవెల

బీరుట్: వేలు, లక్షలు పెట్టి టికెట్ కొన్న ప్రయాణికులతో కిక్కిరిసిన కనిపించే అంతర్జాతీయ విమానాశ్రయాలు ఇప్పుడు వెలవెలబోతున్నాయి. యుద్ధాల నేపథ్యంలో పశ్చిమాసియాలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుల పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఇరాన్, ఇజ్రాయెల్ ఎయిర్‌పోర్టుల నుంచి అంతర్జాతీయ విమానసర్వీసులు ఇప్పటికే రద్దయ్యాయి. పొరుగున ఉన్న లెబనాన్ సైతం తమ దేశంలోని ఎయిర్‌పోర్టులను మూసేసింది. అత్యవసర అవసరాల కోసం పాక్షికంగా సేవలను పునరుద్ధరించింది. అయినాసరే ప్రయాణికులు ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య గగనతలం గుండా వెళ్లే విమానాల్లో ప్రయాణించడానికి భయపడుతున్నారు. ఇజ్రాయెల్‌కు రావాల్సిన విమానాలను సైతం మార్గమధ్యంలో మళ్లిస్తున్నారు.

బాలిలో బద్ధలైన అగ్ని పర్వతం

గగనతలం మూసివేత • వెనుదిరిగిన ఎయిరిండియా విమానం

బాలి: ఇండోనేషియాలో అత్యంత చురుకైన అగ్నిపర్వతాలలో ఒకటైన మౌంట్ లెవోటోబి లకి-లకి మంగళవారం సాయంత్రం బద్దలైంది. భారీ బూడిద ఆకాశంలోకి ఎగిసిపడింది. ఈ బూడిద మేఘం దాదాపు 150 కి.మీ దూరం నుండి కనిపిస్తోంది. దీంతో అధికారులు అత్యున్నత స్థాయి అగ్నిపర్వత హెచ్చరికను జారీ చేశారు. ముందు జాగ్రత్త చర్యగా గగనతలాన్ని మూసేశారు. బాలిలోని న్గురా రాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అనేక విమాన కార్యకలాపాలను నిలిపివేశారు. వర్జిన్ ఆస్ట్రేలియా, జెట్‌స్టార్, ఎయిర్ న్యూజిలాండ్, సింగపూర్‌కు చెందిన టైగర్ ఎయిర్, చైనాకు చెందిన జున్యావో ఎయిర్‌లైన్స్, ఎయిరిండియా విమానాలను రద్దు చేశాయి. కొన్ని దారి మళ్లించాయి. ఢిల్లీ నుంచి బాలికి వెళ్తున్న ఎయిరిండియా విమానాన్ని గాల్లో ఉండగానే తిరిగి రావాలని సూచించడంతో.. అది ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ (ఐజీఐ) విమానాశ్రయానికి తిరిగి చేరుకుంది. ప్రయాణికులందరూ సురక్షితంగా దిగారని ఎయిర్‌లైన్స్ ధ్రువీకరించింది. భారీ వర్షాల వల్ల లావా ప్రవాహాలు పెరిగే అవకాశం ఉందని ఇండోనేషియా జియాలజీ ఏజెన్సీ హెచ్చరించింది. నివాసితులు, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని కోరింది.

ఇండోనేషియాలోని ఫ్లోర్స్ తైమూర్ జిల్లాలో ఉన్న మౌంట్ లెవోటోబి లకి-లకి పర్వతం 5,197 అడుగుల ఎత్తున్నది. ఇది 'రింగ్ ఆఫ్ ఫైర్'వెంబడి ఉండటంతో ఇండోనేషియాలో తరచుగా అగ్నిపర్వతాలు బద్దలవుతూ ఉంటాయి. ఇలాంటి విస్ఫోటనాల సమయంలో ప్రసిద్ధ పర్యాటక గమ్యస్థానమైన బాలిలో గగనతలాని మూసివేస్తారు. ఇదే మౌంట్ లెవోటోబి లకి లకి గతేడాది నవంబర్‌లో విస్ఫోటనం చెందడంతో తొమ్మిది మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు.



పాత్రికేయుల ఎదుటే పౌరునిపై పోలీసు కాల్పులు

- నైరోబీలో ఘటన
- కెన్యాలో మితిమీరిన పోలీస్ జులుం

నైరోబీ: పోలీసుయంత్రాంగం కొన్ని దేశాల్లో కారాగారాలను నరకానికి నకలుగా మార్చేస్తుంటే మరికొన్ని దేశాల్లో పోలీసులు యమునికి ప్రతిరూపాలుగా అవతరిస్తున్నారు. కొట్టే అధికారం ఉందనే గర్వంతో లాఠీలతోపాటు తూటాలకూ పనిచెప్పిన ఓ పోలీసు ఉదంతం ఇప్పుడు కెన్యాలో వివాదమైంది. పాత్రికేయుల ఎదుటే ఒక పౌరునిపై పోలీస్ అధికారి అన్యాయంగా తుపాకీ గురిపెట్టిన కాల్చిన ఘటన తాలూకు వీడియో ఇప్పుడు సామాజికమాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మంగళవారం నైరోబీలోని అత్యంత రద్దీగా ఉన్న ఒక రహదారిలో నిరసన ర్యాలీ జరిగింది. జూన్ ఆరో తేదీన ఆల్బర్ట్ ఒజ్వాంగ్ అనే బ్లాగర్‌ను పోలీసులు లాకప్‌డెత్ చేశారు. పోలీసుపై తప్పుడు కథనం రాశాడని అరెస్ట్‌చేసి పట్టుకొచ్చి చితకబాదడంతో అతను లాకప్‌లో కన్నుమూశాడు. సంబంధిత పోలీసులను అరెస్ట్‌చేయాలంటూ బుధవారం నైరోబీలో నిరసనర్యాలీ జరిగింది. ఆందోళనకారులను అడ్డుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగి లాఠీచార్జ్‌చేశారు. అదేసమయానికి మాస్కలను అమ్ముకునే 22 ఏళ్ల వీధి వ్యాపారి బొనిఫేస్ కరియుకీ అటుగా వచ్చాడు. వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపో అంటూ ఇద్దరు సాయుధ పోలీసులు హెచ్చరించారు. ఉద్యమకారులతో తనకేం సంబంధంలేదని వివరణ ఇచ్చేలోపే ఒక పోలీసు ఇతని తలకు తుపాకీ గురిపెట్టి కాల్చాడు. దీంతో రక్తమోడుతూ కరియుకీ కుప్పకూలాడు. జర్నలిస్టుల ఎదుటే ఈ దారుణం జరిగింది. అదృష్టవశాత్తు అతడికి వెంటనే శస్త్రచికిత్సచేసి బుల్లెట్‌ను తీసేయడంతో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్సపొందుతున్నాడు. విషయం తెల్సి ఆందోళనకారులు మళ్లీ నిరసనచేపట్టారు. దీంతో చివరకు ఆ అధికారిని అరెస్ట్‌చేశామని పోలీస్‌విభాగం ఒక ప్రకటన విడుదలచేసింది.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి హత్య

పనాజీ: గోవాలోని ప్రతాప్‌నగర్ అటవీ ప్రాంతంలో ఘోరం జరిగింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువకుడు తన ప్రియురాలిని తీసుకొచ్చి హత్య చేశాడు. పోలీసులు అతడిని అరెస్టు చేశారు. గోవా పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటకలోని ఉత్తర బెంగళూరుకు చెందిన 22 ఏళ్ల సంజయ్ కెవిన్ అదే ప్రాంతానికి చెందిన తన ప్రియురాలు రోహిణి మోజెస్‌తో కలిసి బస్సులో ఆదివారం గోవాకు చేరుకున్నాడు. వారిద్దరూ ఇక్కడ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. కానీ, బస్సులో ఉన్నప్పుడే వారిద్దరి మధ్య గొడవ జరిగింది. దాంతో గోవాకు చేరుకున్నాక సంజయ్ తన ప్రియురాలిని దక్షిణ గోవాలోని ప్రతాప్‌నగర్ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమె గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం బస్సులో కర్ణాటకకు పరారయ్యాడు. సోమవారం ఉదయం రోహిణి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. హత్య కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహం సమీపంలో పడిఉన్న పర్సులో బస్సు టికెట్ లభించింది. దాని ఆధారంగా సంజయ్ కెవిన్ ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. కర్ణాటకలోని హుబ్బళ్లిలో సోమవారం రాత్రి అతడిని అదుపులోకి తీసుకున్నారు.

గాజాలో ఆగని మృత్యుఘోష

- మానవతా సాయం కోసం వేచి ఉన్న వారిపై దాడులు
- మరో 59 మంది పాలస్తీనియన్లు మృతి

ఖాన్‌యూనిస్: గాజా స్ట్రిప్‌లో మరణఘోష ఆగడం లేదు. మానవతా సాయం కోసం వేచి ఉన్నవారిని కూడా ఇజ్రాయెల్ సైనికులు కరుణించడం లేదు. తమపై తిరగబడుతున్నారన్న సాకుతో నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరుపుతుండడంతోపాటు వైమానిక దాడులు చేస్తుండడంతోపాటు అమాయక ప్రజలు మృత్యువాత పడుతున్నారు. మంగళవారం మరో 59 మంది పాలస్తీనియన్లు మరణించారు. 200 మందికిపైగా గాయపడ్డారు. దక్షిణ గాజాలోని ఖాన్‌యూనిస్ నగరంలో గోధుమ పిండి, ఆహారం, మానవతా సాయం తీసుకొచ్చిన వాహనాల వద్ద జనం గుమికూడారు. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా వారిపై ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులకు దిగింది. అనంతరం తుపాకులతో కాల్పులు జరిపింది. క్షతగాత్రుల్లో పలువురు మరణించడంతో మృతుల సంఖ్య 59కి చేరినట్లు స్థానిక అధికారులు చెప్పారు. ఇదొక మారణహోమం అని యూసుఫ్ నోఫాల్ అనే స్థానికులు ఆవేదన వ్యక్తంచేశాడు. మేము మనుషులం కాదా? మాపై ఎందుకీ రాక్షసత్వం అని ప్రశ్నించాడు.

బిహార్ రాజకీయాల్లోకి నితీశ్ కుమారుడు!

హర్నాట్ స్థానం నుంచి బరిలోకి నిశాంత్?

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు అన్ని పార్టీలు కార్యాచరణ సిద్ధం చేస్తున్న వేళ అధికార జేడీయూలో వారసుడి రాజకీయ ఆరంగేట్రం హాట్‌టాపిక్‌గా మారింది. జేడీయూ అధినేత, సీఎం నితీశ్ కుమార్(74) కుమారుడు నిశాంత్ కుమార్ క్రియాశీలక రాజకీయాల్లోకి అడుగిడనున్నారనే వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో తండ్రితో కలిసి నిశాంత్ కుమార్ బహిరంగ వేదికలపై దర్శనమిస్తున్న నేపథ్యంలో ఆయన రాజకీయాల్లోకి రావడం ఖాయంగానే కనిపిస్తోంది. నిశాంత్‌ను రానున్న ఎన్నికల్లో పోటీకి నిలపాలని పార్టీ ఎమ్మెల్యే వినయ్ చౌదరి ఇటీవల డిమాండ్ చేశారు. మరో మంత్రి జామా ఖాన్ దీనిని బలపరుస్తూ వ్యాఖ్యలు చేశారు. నిశాంత్‌కు మంచి రాజకీయ అవగాహన ఉందని, ఆయన యువతకు స్ఫూర్తిని ఇవ్వగలరని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఎన్నికల్లోనే పోటీ చేయించేలా త్వరలో జరిగే శాసనసభా పక్ష భేటీల్లో ఈ విషయం ప్రస్తావిస్తామని ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రకటనలు చేస్తున్నారు. మొన్నటి వరకు రాజకీయాలకు దూరంగా ఉన్న నిశాంత్, గడిచిన ఆరు నెలలుగా తండ్రితో కలిసి పార్టీ వేదికలపై కనిపిస్తున్నారు. నిశాంత్ నలంద జిల్లాలోని హర్నాట్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయాలంటూ ఆ పార్టీ నేతల నుంచి సైతం డిమాండ్లు వస్తున్నాయి. హర్నాట్ స్థానంలో జేడీయూకు బలమైన పట్టుంది. గత 20 ఏళ్లుగా అక్కడ ఆ పార్టీ నేతలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వాస్తవానికి, నితీశ్ తన ఎన్నికల ప్రయాణాన్ని ఈ స్థానం నుండే ప్రారంభించారు. ప్రస్తుతం పార్టీకే చెందిన హరినారాయణ్ సింగ్ ఆ స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. వరుసగా మూడుసార్లు ఈ స్థానాన్ని గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలోనే హర్నాట్ స్థానం నుంచి పోటీపై చర్చ జరుగుతోంది. దీనిపై ప్రతిపక్ష ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్..'ఇది ప్రజాస్వామ్యం. ఎవరైనా, ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చు. నిశాంత్‌ను రాజకీయాల్లోకి స్వాగతిస్తున్నా'అని వ్యాఖ్యానించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ గుర్తింపు హాజరు తప్పనిసరి

కేంద్ర ప్రభుత్వం ఆదేశం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు, కౌమార బాలికలకు పౌష్టికాహారం సరఫరా చేస్తుంటారు. లబ్ధిదారుల హాజరును ముఖ గుర్తింపు ద్వారా నమోదు చేయాలని కేంద్రం స్పష్టంచేసింది. ఈ మేరకు గత నెలలో రాష్ట్రాలకు లేఖలు రాసింది. లబ్ధిదారుల ముఖ గుర్తింపు హాజరు కోసం పోషణ్ ట్రాకర్ అప్లికేషన్‌ను తీసుకొచ్చారు. ఇందులోని సిటిజెన్ మాడ్యూల్ ద్వారా సెల్ఫ్ రిజిస్టర్ చేసుకోవచ్చు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలకు ముఖ గుర్తింపు హాజరును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. పౌష్టికాహార పంపిణీలో అక్రమాలు అరికట్టడానికి ఈ నిర్ణయం తీసుకుంది.

పోర్ట్‌ఫోలియో విధానాన్ని ప్రవేశపెట్టిన వైస్రాయ్ ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

భారత రాజ్యాంగ పరిణామ క్రమం

1. రాజ్యాంగ భావనను తొలిసారి శాస్త్రీయంగా వివరించిన తత్త్వవేత్త ఎవరు?
   1) సోక్రటీస్ 2) అరిస్టాటిల్
   3) మాఖియవెల్లి 4) రూసో
2. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) ప్రపంచంలో మొదటి లిఖిత రాజ్యాంగం - అమెరికా
   బి) ప్రపంచంలో మొదటి అలిఖిత రాజ్యాంగం - బ్రిటన్
   1) ఎ సరైంది 2) బి సరైంది
   3) ఎ, బి సరైనవి 4) ఏదీకాదు
3. రాజ్యాంగ పాలన ప్రజల్లో చైతన్యానికి, స్ఫూర్తి నింపడానికే తప్ప నియంత్రణకు, బాని సత్వానికి సంకేతం కాదని పేర్కొన్న రాజ నీతిజ్ఞుడు ఎవరు?
   1) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 2) ఉడ్రో విల్సన్
   3) అరిస్టాటిల్ 4) లాక్
4. ఫోర్త్ ఎస్టేట్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   1) బ్రిటన్ పార్లమెంట్‌లో సభ్యుడు ఎడ్‌బర్గ్ ఈ పదాన్ని తొలిసారి ప్రయోగించాడు
   2) ప్రభుత్వ అంగాలైన శాసన నిర్మాణ శాఖను మొదటి ఎస్టేట్‌గా, కార్యనిర్వాహక శాఖను రెండో ఎస్టేట్‌గా, న్యాయశాఖను మూడో ఎస్టేట్‌గా వ్యవహరిస్తారు
   3) పత్రికలను లేదా ఎలక్ట్రానిక్ మీడియాను ఫోర్త్ ఎస్టేట్‌గా వ్యవహరిస్తారు
   4) పైవన్నీ సరైనవే
5. రెగ్యులేటింగ్ చట్టం - 1773కి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) భారతదేశానికి సంబంధించిన తొలి లిఖిత చట్టం
   బి) ఈ చట్టాన్ని 1773 మే 18న అప్పటి బ్రిటిష్ ప్రధాని లార్డ్ వార్త్ బ్రిటిష్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాడు
   సి) బెంగాల్ గవర్నర్ హోదాను గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్‌గా మర్చారు
   డి) ఈ చట్టం ప్రకారం మొదటి గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్
   1) ఎ, బి మాత్రమే సరైనవి
   2) బి, డి, మాత్రమే సరైనవి
   3) ఎ, బి, సి, డి 4) ఏదీకాదు
6. రెగ్యులేటింగ్ చట్టం - 1773కి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ఈ చట్టం ఆధారంగా 1774లో కలకత్తాలోని పోర్ట్ విలియంలో సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు
   2) ఒక ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు సాధారణ న్యాయ మూర్తులు ఉన్నారు
   3) మొదటి ప్రధాన న్యాయమూర్తి సర్ ఎలిజా ఇంపే
   4) పైవన్నీ సరైనవే
7. రెగ్యులేటింగ్ చట్టం-1773లోని లోపాలను సవరించడానికి బ్రిటిష్ పార్లమెంట్ పిట్స్ ఇండియా చట్టాన్ని ఎప్పుడు చేసింది?
   1) 1780 2) 1784
   3) 1793 4) 1833
8. దేశంలో మొదటిసారిగా ద్వంద్వ పాలనకు నాంది ప్రస్తావన చేసిన చట్టం ఏది?
   1) రెగ్యులేటింగ్ చట్టం - 1773
   2) రెగ్యులేటింగ్ చట్టం -1784
   3) భారత కౌన్సిళ్ల చట్టం - 1909
   4) రెగ్యులేటింగ్ చట్టం - 1861
9. పిట్స్ ఇండియా చట్టం-1784కి సంబంధించి కింది వాటిలో సరైంది?
   1) ఈ చట్టం ప్రకారం ఇండియాలోని పరిపాలనాంశాలను రెండు రకాలుగా వర్గీకరించారు
   2) రాజకీయ వ్యవహారాలు - బోర్డ్ ఆఫ్ కంట్రోలర్, వాణిజ్య వ్యవహారాలు కోర్ట్ ఆఫ్ డైరక్టర్స్
   3) గవర్నర్ కార్యనిర్వాహక మండలి సంఖ్య నాలుగు నుంచి మూడుకు తగ్గించారు
   4) పైవన్నీ సరైనవే
10. చార్టర్ చట్టం-1793 చేసినప్పుడు గవర్నర్ జనరల్ ఎవరు?
    1) వారెన్ హేస్టింగ్స్
    2) కారన్ వాలీస్
    3) విలియం బెంటింక్ 4) ఎవరూకాదు
11. భారత్‌లో క్రైస్తవ మిషనరీలు, చర్చిలు, క్రైస్తవ మిషనరీ హాస్టళ్లను ఏ చట్టం ద్వారా నెలకొల్పారు?
    1) రెగ్యులేటింగ్ చట్టం -1773
    2) రెగ్యులేటింగ్ చట్టం -1784
    3) రెగ్యులేటింగ్ చట్టం -1793
    4) రెగ్యులేటింగ్ చట్టం -1813
12. పన్నులు విధించడానికి, అవి చెల్లించడానికి, చెల్లించని వారిపై చర్యలను తీసుకొనే అధికారాన్ని స్థానిక సంస్థలకు ఏ చట్టం ద్వారా కల్పించారు?
    1) రెగ్యులేటింగ్ చట్టం -1813
    2) భారత కౌన్సిళ్ల చట్టం - 1909
    3) భారత కౌన్సిళ్ల చట్టం - 1919
    4) భారత ప్రభుత్వ చట్టం - 1935
13. చార్టర్ చట్టం -1813కి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
    1) భారతీయ విద్యాభివృద్ధికి ఒక లక్ష రూపాయాలతో నిధి ఏర్పాటు చేశారు
    2) సివిల్ సర్వెంట్లకు శిక్షణా సదుపాయాన్ని కల్పించారు
    3) ఈ చట్టం ద్వారా మత మార్పిడులకు అవకాశం ఏర్పడింది
    4) మత నియోజక వర్గాలను ఏర్పాటు చేశారు
14. చార్టర్ చట్టం-1833కి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) బెంగాల్ గవర్నర్ జనరల్ హోదాను ఇండియన్ గవర్నర్ జనరల్‌గా మార్చరు
    బి) తొలి ఇండియన్ గవర్నర్ జనరల్ విలియం బెంటింక్
    1) ఎ సరైంది, బి సరికాదు
    2) ఎ సరైంది కాదు, బి సరైంది
    3) ఎ, బి రెండూ సరైనవే
    4) ఎ, బి రెండూ సరైనవి కాదు
15. చార్టర్ చట్టం-1833 ప్రకారం భారతీయ లా కమిషన్ అధ్యక్షుడు ఎవరు?
    1) లార్డ్ మెకాలే 2) లార్డ్ కారన్ వాలీస్
    3) లార్డ్ మింటో 4) ఎవరూ కాదు
16. 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని ఉద్దేశించి 'బానిసత్వానికి ఒక నూతన చట్టాన్ని భారత దేశంపై రుద్దారు. ఇంజిన్ లేకుండా గట్టి బ్రేకులున్న యంత్రం' అని వ్యాఖ్యానించిన వారు?
    1) జవహర్ లాల్ నెహ్రూ
    2) గాంధీజీ 3) జిన్నా
    4) సుభాష్ చంద్రబోస్
17. చార్టర్ చట్టాల్లో చివరిది ఏది?
    1) చార్టర్ చట్టం - 1853
    2) చార్టర్ చట్టం - 1833
    3) చార్టర్ చట్టం - 1813
    4) చార్టర్ చట్టం - 1793
18. జతపరచండి.
    జాబితా-I
    i) సివిల్ ప్రొసిజర్ కోడ్
    ii) ఇండియన్ పీనల్ కోడ్
    iii) క్రిమినల్ ప్రొసిజర్ కోడ్
    iv) POTA చట్టం
    జాబితా-II
    a) 1859 b) 1860
    c) 1861 d) 2002
    1) i-a, ii-b, iii-c, iv-d
    2) i-d, ii-c, iii-b, iv-a
    3) i-b, ii-a, iii-d, iv-c
    4) i-c, ii-d, iii-a, iv-b
19. భారత ప్రభుత్వం చట్టం - 1858 (కౌన్సిల్ చట్టాలు)లో పొందుపరిచిన అంశం ఏది?
    1) గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా హోదాను వైస్రాయ్ ఆఫ్ ఇండియాగా మార్చారు
    2) తొలి వైస్రాయ్ లార్డ్ కానింగ్
    3) బోర్డ్ ఆఫ్ కంట్రోల్ రద్దు 4) పైవన్నీ
20. భారత ప్రభుత్వ చట్టం - 1935కి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
    1) సమాఖ్య వ్యవస్థ ప్రతిపాదన
    2) ఆర్‌బీఐ ఏర్పాటు
    3) ఫెడరల్ న్యాయస్థానం ఏర్పాటు
    4) సార్వజనీన ఓటు హక్కు
21. పిట్స్ ఇండియా చట్టం-1784 ద్వారా ప్రవేశపెట్టిన బోర్డ్ ఆఫ్ కంట్రోల్/ కోర్ట్ ఆఫ్ డైరక్టర్స్ అనే ద్వంద్వ పాలన ఏ చట్టం ద్వారా రద్దయింది?
    1) భారత కౌన్సిల్ చట్టం -1858
    2) కౌన్సిళ్ల చట్టం - 1861
    3) కౌన్సిళ్ల చట్టం - 1792
    4) భారత కౌన్సిళ్ల చట్టం-1909
22. భారత కౌన్సిళ్ల చట్టం - 1858 ప్రకారం వైస్రాయ్ పదవీకాలం ఎన్నేళ్లు?
    1) 3 2) 5 3) 1 4) 4
23. భారత కౌన్సిళ్ల చట్టం-1858 సారాంశాన్ని వైస్రాయ్ లార్డ్ కానింగ్ ఏ నగరంలో చదివి వినిపించాడు?
    1) ఢిల్లీ 2) ఆగ్రా
    3) అలహాబాద్ 4) లండన్
24. పోర్ట్‌ఫోలియో విధానం ప్రవేశపెట్టిన వైస్రాయ్ ఎవరు?
    1) లార్డ్ కానింగ్ 2) మింటో
    3) విలియం బెంటింక్ 4) వెవేల్
25. ఇండియా పాలన బ్రిటిష్ చక్రవర్తి లేదా రాణి అధీనంలో వచ్చినట్లు బ్రిటిష్ విక్టోరియా రాణి ఎప్పుడు ప్రకటన చేసింది?
    1) 1857 నవంబర్ 1
    2) 1857 డిసెంబర్ 1
    3) 1858 అక్టోబర్ 11
    4) 1858 నవంబర్ 1
26. భారత వైస్రాయ్/ గవర్నర్ జనరల్‌కు ఆర్డినెన్స్ జారీ చేసే అధికారం కల్పించిన చట్టం?
    1) రెగ్యులేటింగ్ చట్టం - 1861
    2) భారత ప్రభుత్వ చట్టం -1935
    3) భారత కౌన్సిళ్ల చట్టం - 1909
    4) రెగ్యులేటింగ్ చట్టం - 1858
27. 1860లో బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పద్ధతి ఏది?
    1) పోర్ట్‌పోలియో పద్ధతి 2) బడ్జెట్ పద్ధతి
    3) 1, 2 4) ఏదీకాదు
28. బ్రిటిష్ ప్రభుత్వం సివిల్ సర్వీస్‌ల వయోపరిమితిని 1878లో 19 ఏళ్లకు తగ్గించింది. మళ్లీ ఏ సంవత్సరం నుంచి దాన్ని 24 సంవత్సరాలకు పెంచారు?
    1) 1892 2) 1905
    3) 1895 4) 1891
29. మతతత్వ నియోజక వర్గాల పితామహుడిగా ఎవరిని పిలుస్తారు?
    1) వారన్ హేస్టింగ్స్ 2) లార్డ్ కానింగ్
    3) విలియం బెంటింక్ 4) లార్డ్ మింటో
30. మత ప్రాతిపదికన తొలిసారి నియోజకవర్గణాల ఏర్పాటుకు అవకాశం కల్పించిన చట్టం?
    1) భారత కౌన్సిళ్ల చటం-1919
    2) భారత ప్రభుత్వ చట్టం - 1935
    3) భారత కౌన్సిళ్ల చటం-1909
    4) భారత స్వాతంత్ర్య చట్టం-1947
31. భారత కౌన్సిళ్ల చట్టం-1909కి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) ఈ చట్టాన్ని మింటో - మార్లే సంస్కరణలు అని పేర్కొంటారు
    బి) అప్పటి గవర్నర్/ వైస్రాయ్ లార్డ్ - మింటో, భారత వ్యవహారాల కార్యదర్శి - మార్లే
    సి) గవర్నర్ కార్యనిర్వాహక మండలిలో తొలిసారి భారతీయులకు సభ్యత్వాన్ని కల్పించారు
    డి) సభ్యత్వాన్ని పొందిన తొలి భారతీయుడు సత్యేంద్ర ప్రసాద్ సిన్హా
    1) ఎ, బి సరైనవి 2) బి, సి సరైనవి
    3) సి, డి సరైనవి 4) ఎ, బి, సి, డి
32. భారత కౌన్సిళ్ల చట్టం - 1909ను ఉద్దేశించి హిందువులకు, ముస్లింలకు మధ్య వేర్పాటు బీజాలు వేసి, వారి మధ్య అడ్డుగోడలు సృష్టించిందని, భారత విభజనకు నాంది పలికిందని వ్యాఖ్యానించింది ఎవరు?
    1) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 2) గాంధీజీ
    3) జవహర్‌లాల్ నెహ్రూ 4) ఎవరూకాదు
33. 1919 చట్టానికి సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
    ఎ) 1919 భారత ప్రభుత్వ చట్టాన్ని మాంటేగు - ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలు అని పేర్కొంటారు
    బి) నాటి భారత కార్యదర్శి మాంటేగు
    సి) నాటి భారత వైస్రాయ్ ఛేమ్స్‌ఫర్డ్
    డి) ఈ చట్టాన్ని 1919లో రూపొందించినప్పటికీ 1921 నుంచి అమల్లోకి వచ్చింది
    1) ఎ, బి, సి, డి 2) ఎ, డి
    3) ఎ, బి, సి 4) పైవేవీకాదు
34. మాంటెగు - చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు -1919కు సంబంధించి కింది వాటిలో సరైంది?
    1) రాష్ట్రస్థాయిలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టారు
    2) దేశంలో మొదటిసారిగా ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు
    3) భారత హైకమిషనర్ అనే పదవిని సృష్టించారు 4) పైవన్నీ సరైనవే
35. ఏ కమిటీ సూచన మేరకు భారత్‌కు విడిగా ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేశారు?
    1) లీ కమిషన్ 2) సైమన్ కమిషన్
    3) క్రిప్స్ కమిషన్ 4) ఏదీకాదు
36. మత ప్రాతినిధ్యం ప్రకారం సిక్కులకు, క్రిస్టియన్లకు, ఆంగ్లో ఇండియన్లకు, ఐరోపా వారికి ప్రత్యేక నియోజక వర్గాలను ఏ చట్టం ప్రకారం ప్రకటించారు?
    1) భారత కౌన్సిళ్ల చట్టం - 1909
    2) భారత కౌన్సిళ్ల చట్టం -1919
    3) భారత ప్రభుత్వ చట్టం-1935
    4) భారత స్వాతంత్ర్య చట్టం - 1947
37. '1919 సంస్కరణలు అసంతృప్తి, నిరాశతో పాటు సూర్యుడులేని ఉదయం'గా ఉందని అభిప్రాయపడింది ఎవరు?
    1) బాలగంగాధర్ తిలక్
    2) బిపిన్ చంద్రపాల్
    3) లాలా లజపతిరాయ్
    4) అరవింద ఘోష్
38. ఏ సంస్కరణలను బ్రిటిషర్లు ప్రకటించి ఉండాల్సింది కాదని, ఏ చట్టాన్ని భారతీయులు స్వీకరించడం తగదని శ్రీమతి అనీబిసెంట్ ఏ చట్టాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు?
    1) భారత కౌన్సిళ్ల చట్టం - 1919
    2) భారత కౌన్సిళ్ల చట్టం -1909
    3) భారత ప్రభుత్వ చట్టం-1935
    4) భారత స్వాతంత్ర్య చట్టం - 1947
39. సైమన్ కమిషన్‌ను బ్రిటిష్ ప్రధాని బాల్డ్విన్ ఎప్పుడు ప్రకటించాడు?
    1) 1927 జనవరి 2) 1927 ఆగస్టు
    3) 1927 నవంబర్ 4) 1927 డిసెంబర్
40. సైమన్ కమిషన్ భారతదేశానికి ఏ సంవత్సరంలో వచ్చింది?
    1) 1927 2) 1928
    3) 1929 4) 1930



సమాధానాలు

1) 2	2) 3	3) 3	4) 4	5) 3
6) 4	7) 2	8) 2	9) 4	10) 2
11) 4	12) 1	13) 4	14) 3	15) 1
16) 1	17) 1	18) 1	19) 4	20) 4
21) 1	22) 2	23) 3	24) 1	25) 4
26) 1	27) 3	28) 1	29) 4	30) 3
31) 4	32) 3	33) 1	34) 4	35) 1
36) 2	37) 1	38) 1	39) 3	40) 2

జానపద కళారూపాలపై విశిష్ట గ్రంథం రాసిందెవరు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

జానపద సాహిత్యం

డీఎస్సీలో 'జానపద సాహిత్యం' తప్పనిసరి అంశం. లాంగ్వేజ్ పండిట్-తెలుగు, స్కూల్ అసిస్టెంట్ -తెలుగు ఇలా పరీక్షల స్వభావాన్ని బట్టి మార్కుల ప్రాధాన్యముంటుంది. అభ్యర్థులు ఈ విభాగంలో మార్కులు సాధించాలంటే డా॥ జి.ఎస్. మోహన్ 'జానపద విజ్ఞానాధ్యయనం', ఆర్వీయస్ సుందరం 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' గ్రంథాలను సేకరించి అధ్యయనం చేయాలి. ప్రత్యేకంగా నోట్స్ తయారు చేసుకోవాలి. అప్పుడే మంచి స్కోరు సాధించవచ్చు. ఈ విభాగంలో ప్రత్యేకించి 'జానపద సాహిత్య పరిచయం - లక్షణాలు - వర్గీకరణ - జానపద సాహిత్య సేకరణలో తెలుగువారి కృషి - పాశ్చాత్యుల కృషి - జానపద సాహిత్య విశేషాలు - జానపద కళారూపాలు - జానపద కళాకారులు, వారి వాద్య విశేషాలు - జానపద సాహిత్యంపై వచ్చిన పరిశోధనలు' మొదలైన అంశాలను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.

రిచర్డ్ ఎం. డార్సన్ 1972లో 'ఫోక్‌లోర్ అండ్ ఫోక్‌లైఫ్' గ్రంథ ఉపోద్ఘాతంలో జానపద విజ్ఞానాన్ని నాలుగు విధాలుగా వర్గీకరించారు. అవి..

1. **మౌఖిక జానపద విజ్ఞానం:** జానపద గేయాలు, కథా గేయాలు, జానపద పురాణాలు, ఇతిహాసాలు, గద్య కథనాలు, సామెతలు, పొడుపు కథలు, మాండలికాలు, నుడికారాలు, తిట్లు, ఒట్లు మొదలైనవన్నీ ఈ విభాగంలోకి వస్తాయి.
2. **సాంఘిక జానపదాచారాలు:** పుట్టుక, వివాహం ,మరణం తదితరాంశాలకు సంబంధించిన ఆచారాలు, కుటుంబం, సంబంధ బాంధవ్యాలు, పండుగలు, వినోదాలు, ఆటలు, జానపద వైద్యం, మతం, నమ్మకం మొదలైనవన్నీ ఈ విభాగంలో చేరతాయి.
3. **వస్తు సంస్కృతి:** భౌతిక జీవితానికి సంబంధించిన అన్ని వస్తువులే కాకుండా కళారూపాలు కూడా వస్తు రూపంలో ఉంటే ఈ విభాగంలోనే చోటు పొందుతాయి. చిత్రకళ, వాస్తుకళ, వివిధ వృత్తుల పరికరాలు, దుస్తులు, అలంకరణ, ఆభరణాలు, ఆహార సామగ్రి, పూజా సామగ్రి, శిలా విగ్రహాలు, దారు విగ్రహాలు తదితర వస్తు రూపాంశాలెన్నో ఈ విభాగంలో వస్తాయి.
4. **జానపద కళలు:** సంగీతం, నృత్యం, అభినయం ఉండే ప్రదర్శన కళలన్నీ ఈ విభాగంలో చేరతాయి. గాత్ర సంగీతం, వాద్య సంగీతం, తోలు బొమ్మలాటలు, యక్షగానం, వీధి భాగోతం, కోలాటం, పగటి వేషాలు, బహురూపుల గారడీ విద్యలు మొదలైనవి ఈ విభాగంలో వస్తాయి.

భిక్షకులు - ఆశ్రయం

1. పిచ్చుకుంట్లు - రెడ్డి కులాశ్రితులు
2. వీరముష్టివారు -వైశ్యాశ్రితులు
3. భట్రాజులు - క్షత్రియాశ్రితులు
4. విప్రవినోదులు - బ్రాహ్మణాశ్రితులు

జానపద సాహిత్యం- పరిశోధనలు

1. జానపద గేయ సాహిత్యం - రుదురాజు రామరాజు
2. జానపద గేయగాథలు - నాయని కృష్ణకుమారి
3. జానపద కళాసంపద -తూమాటి దోణప్ప
4. జానపద కళారూపాలు - మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
5. తోలుబొమ్మలాట -మొదలి నాగభూషణశర్మ
6. వీరగాథ వాఙ్మయం -తంగిరాల సుబ్బారావు
7. యక్షగాన వాఙ్మయం - ఎస్వీ జోగారావు
8. జానపద కథా స్రవంతి - కె.సుమతి
9. జానపద సాహిత్యం - పురాగాథలు - రావి ప్రేమలత
10. తెలుగు సామెతలు - చిలుకూరి నారాయణరావు
11. స్త్రీల రామాయణ పాటలు - శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

భిక్షకులు - ఆశ్రయం

1. పిచ్చుకుంట్లు - రెడ్డి కులాశ్రితులు
2. వీరముష్టివారు - వైశ్యాశ్రితులు
3. భట్రాజులు - క్షత్రియాశ్రితులు
4. విప్రవినోదులు - బ్రాహ్మణాశ్రితులు

జానపద సిద్ధాంతాలు - ప్రతిపాదకులు

1. మానవ శాస్త్రీయ సిద్ధాంతం - ఆండ్రూలాంగ్
2. భారతమూల సిద్ధాంతం - థియొడర్ బెన్ఫె
3. వలసవాదం - థియొడర్ బెన్ఫె
4. ఇండో -యూరోపియన్ సిద్ధాంతం - గ్రిమ్ సోదరులు
5. స్వప్నమూల సిద్ధాంతం - లుడ్విగ్, లైస్నర్
6. చారిత్రక భౌగోళిక సిద్ధాంతం - ఫిన్నిస్ (ఫిన్నిస్ వాదం)

మాదిరి ప్రశ్నలు

1. 'Folk Lore' అంటే?
   1) జానపదుల అధ్యయనం
   2) జానపద విజ్ఞానం
   3) జానపద సాహిత్యం
   4) జానపదుల మూఢనమ్మకం
2. జానపద గేయాల ప్రధాన లక్షణాలు?
   1) లిఖిత ప్రచారం, ఏక కర్తృకం
   2) మౌఖిక ప్రచారం, జ్ఞాత కర్తృకం
   3) ఆశురచన, అనామక కర్తృతం
   4) అకృతక శైలి, గానయోగ్యతారాహిత్యం
3. ఆంధ్రుల జానపద సాహిత్య సేకరణలో తీవ్ర కృషి చేసినవారు?
   1) ఆర్వీయస్ సుందరం
   2) నేదునూరి గంగాధరం
   3) జి.ఎస్.మోహన్
   4) బిరుదురాజు రామరాజు
4. 'జానపద వాఙ్మయోద్ధారక' బిరుదాంకితులు?
   1) నేదునూరి గంగాధరం
   2) బిరుదురాజు రామరాజు
   3) తంగిరాల సుబ్బారావు
   4) ఆర్వీయస్ సుందరం
5. శారద కాండ్రు ఏ ప్రాంతానికి చెందినవారు?
   1) తెలంగాణ 2) కోస్తాంధ్ర
   3) రాయలసీమ 4) బీదర్
6. 'తోలుబొమ్మలాట' జానపద విజ్ఞానంలో ఏ విభాగానికి చెందింది?
   1) మౌఖిక జానపద విజ్ఞానం
   2) సాంఘిక జానపదాచారాలు
   3) వస్తు సంస్కృతి 4) జానపద కళలు
7. తెలుగు జానపద సాహిత్యాన్ని మానవశాస్త్ర దృష్టితో పరిశీలించిన తొలి మహిళా పరిశోధకురాలు?
   1) నాయని కృష్ణకుమారి
   2) కుసుమ కుమారి 3) డి. లలిత కుమారి
   4) రావి ప్రేమలత
8. యక్షగానం దేనికి సంబంధించింది?
   1) జానపద కళ 2) శిల్పకళ
   3) నాట్య కళ 4) అదృశ్య కళ
9. 'పసిడిపలుకులు', 'మిన్నేరు', 'సెలయేరు' జానపద రచనలు ఎవరు చేశారు?
   1) బిరుదురాజు రామరాజు
   2) ఆర్వీఎస్ సుందరం
   3) నేదునూరి గంగాధరం
   4) జి.ఎస్. మోహన్
10. జానపద సాహిత్య స్వరూపం ఎవరి రచన?
    1) నేదునూరి గంగాధరం
    2) ఆర్వీఎస్ సుందరం 3) జి.ఎస్. మోహన్
    4) బిరుదురాజు రామరాజు
11. 'జానపద కళాసంపద' పేరుతో ఎనిమిది ఉత్తమ వ్యాస సంపుటాలను ఎవరు వెలువరించారు?
    1) నేదునూరి గంగాధరం
    2) ఆర్వీఎస్ సుందరం
    3) తంగిరాల సుబ్బారావు
    4) తూమాటి దోణప్ప
12. జానపద కళారూపాలపై విశిష్ట గ్రంథం రాసిందెవరు?
    1) యస్వీ జోగారావు
    2) మొదలి నాగభూషణ శర్మ
    3) శ్రీపాద గోపాలకృష్ణమూర్తి
    4) మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
13. సంగీత, నృత్య ప్రధానమైన దేశీ రూపకం?
    1) కోలాటం 2) తప్పెటగుళ్లు
    3) యక్షగానం 4) బుర్రకథ
14. ఏ ప్రక్రియకు ప్రాచీన రూపంగా 'కొరవంజిని' ని పేర్కొంటారు?
    1) కథా కావ్యం 2) యక్షగానం
    3) చారిత్రక కావ్యం 4) ఇతిహాసం
15. జానపదుల కథల మీద విశేషంగా కృషి చేసిన పాశ్చాత్యుడు?
    1) రిచర్డ్ ఎం. డార్సన్ 2) స్టిత్ థాంప్సన్
    3) జె.ఎ.బోయల్ 4) సి.పి. బ్రౌన్
16. తెలుగులో జానపద గేయాలను ప్రచురించిన వారిలో మొదటివారు?
    1) నేదునూరి గంగాధరరావు
    2) నందిరావు చలపతిరావు
    3) జె.ఎ.బోయల్ 4) సి.పి. బ్రౌన్
17. తోలుబొమ్మలాట, వీధి భాగవతం అనేవి ఏ కళలలోకి వస్తాయి?
    1) జానపద కళలు 2) నృత్య కళలు
    3) నాటక కళలు 4) సంగీత కళలు
18. వంతపాట గల కళారూపమేది?
    1) హరికథ 2) బుర్రకథ
    3) తోలుబొమ్మలాట 4) ప్రహసనం
19. కృష్ణ చెంచులక్ష్మీ సంవాదం, గంగా గౌరీ సంవాదం అనే జానపద గేయాల్లో ఉన్న రసమేది?
    1) శృంగారం 2) హాస్యం
    3) కరుణ 4) అద్భుతం
20. 'జానపద గేయవాఙ్మయ పరిచయం' ఎవరు రచించారు?
    1) ఆచార్య నాయని కృష్ణకుమారి
    2) ఆచార్య బి. రామరాజు
    3) ఆచార్య యస్వీ జోగారావు
    4) హరి ఆదిశేషువు
21. 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' రచయిత?
    1) ఆర్వీయస్ సుందరం
    2) బి. రామరాజు
    3) తంగిరాల సుబ్బారావు
    4) యస్వీ జోగారావు
22. 'తెలుగు హరికథా సర్వస్వం' జానపద పరిశోధన గ్రంథం ఎవరిది?
    1) తూమాటి దోణప్ప
    2) బిరుదురాజు రామరాజు
    3) తంగిరాల సుబ్బారావు
    4) ఆర్వీయస్ సుందరం
23. తెలుగులో జానపద గేయాల్లో పల్నాటి వీర చరిత్ర కథాగేయాన్ని ఎవరు సేకరించారు?
    1) సి.పి. బ్రౌన్ 2) జె.ఎ.బోయల్
    3) మెకంజీ 4) కాంప్‌బెల్
24. జుట్టు పోలిగాడు, కేతిగాడు, బంగారక్క పాత్రలున్న కళారూపం?
    1) ఒగ్గు కథ 2) తోలు బొమ్మలాట
    3) వీధి భాగోతం 4) పగటి వేషాలు
25. గోండుల నృత్య విశేషం?
    1) బంజారా 2) మామిడి
    3) గుస్సాడి 4) లంబాడీ
26. జానపద కళాకారులగు బవనీల వాద్య విశేషం?
    1) డమరుకం 2) తప్పెట
    3) గంట, శంఖం 4) జమిడిక
27. 'కనికట్టు' విద్యను ప్రదర్శించే జాన పదులు?
    1) బుడబుక్కలోళ్లు 2) బవనీలు
    3) కాటిపాపలు 4) బైరూపులోళ్లు
28. వీరగాథ చిత్రానికి ఇది ఉదాహరణ?
    1) సర్వాయి పాపడి కథ
    2) బాలనాగమ్మ కథ
    3) కాటమరాజు కథ 4) బొబ్బిలి కథ
29. బ్యాలడ్ అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
    1) గ్రీకు 2) లాటిన్
    3) ఇంగ్లిష్ 4) ఫ్రెంచ్
30. జానపద సంగీతం దేనిలో అంతర్భాగం?
    1) వస్తు సంస్కృతి 2) ప్రదర్శన కళలు
    3) మౌఖిక సాహిత్యం
    4) జానపద ఆచారం

సమాధానాలు

1) 2;	2) 3;	3) 2;	4) 1;	5) 1;
6) 4;	7) 1;	8) 1;	9) 3;	10) 2;
11) 4;	12) 4;	13) 3;	14) 2;	15) 2;
16) 3;	17) 1;	18) 2;	19) 2;	20) 4;
21) 1;	22) 1;	23) 1;	24) 2;	25) 3;
26) 4;	27) 3;	28) 1;	29) 2;	30) 2;

సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రాంతం పేరును ఏమని మార్చారు?

మాదిరి ప్రశ్నలు

1. 'పునరుజ్జీవనోద్యమ సాహిత్య పిత'గా ఎవరిని పేర్కొంటారు?
   1) గిట్టో 2) బొకాషియో
   3) పెట్రార్క్ 4) డ్యూరర్
2. జతపరచండి.
   జాబితా - I
   i) కాక్స్‌టన్ ii) జాన్ గూటన్‌బర్గ్
   iii) ఛాసర్ iv) డాంటే
   జాబితా - II
   ఎ) జర్మనీలో ముద్రణా యంత్రం నెలకొల్పాడు
   బి) ఇంగ్లండ్‌లో ముద్రణా యంత్రం నెలకొల్పాడు
   సి) డివైన్ కామెడీ గ్రంథం రాశాడు
   డి) ఆంగ్ల కవితాపిత
   1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
   2) i- డి, ii- బి, iii- సి, iv-ఎ
   3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
   4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
3. 'ఈ విశ్వాన్ని సృష్టించిందీ, నడిపిస్తున్నదీ మేధస్సే' అని వ్యాఖ్యానించిన వారు?
   1) థామస్ అక్వినాస్ 2) ఫ్రాన్సిస్ బేకన్
   3) జాన్ గూటన్ బర్గ్ 4) గెలీలియో
4. జతపరచండి.
   జాబితా - I
   i) విప్లవాల మాత ii) పార్లమెంట్‌ల మాత
   iii) ఐరోపా జబ్బు మనిషి
   iv) దైవ శాపగ్రస్త దేశం
   జాబితా - II
   ఎ) జర్మనీ బి) టర్కీ
   సి) ఇంగ్లండ్ డి) ఫ్రాన్స్
   1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
   2) i- డి, ii- సి, iii- బి, iv-ఎ
   3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
   4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
5. వ్లాదిమిర్ ఇల్యిచ్ ఉల్యనోవ్ అనేది ఎవరి అసలు పేరు?
   1) లెనిన్ 2) స్టాలిన్
   3) ట్రాట్స్కీ 4) మొదటి జేమ్స్
6. ఆంగ్లేయ మహా విప్లవం ఎప్పుడు సంభవించింది?
   1) క్రీ.శ. 1666 2) క్రీ.శ. 1676
   3) క్రీ.శ. 1688 4) క్రీ.శ. 1698
7. పార్లమెంట్ అనే పదానికి మూలమైన 'పార్లీ' అనే పదానికి అర్థం?
   1) చర్చలు, సంప్రదింపులు
   2) రాయడం, వ్యాఖ్యానించడం
   3) ఆసక్తి, పరిశీలన 4) ఆదాయం, వ్యయం
8. కింది వాటిలో ఇంగ్లండ్ 'బిల్ ఆఫ్ రైట్స్'లో ఉండే అంశం ఏది?
   1) పార్లమెంట్ అనుమతి లేనిదే పన్నులు వసూలు చేయకూడదు
   2) పార్లమెంట్‌ను ఎన్నుకోవాలి, తరచూ సమావేశాలు నిర్వహించాలి
   3) శాంతి నెలకొన్న తరుణంలో పార్లమెంట్ అనుమతి లేకుండా శాశ్వత సైన్యాన్ని పోషించకూడదు
   4) పైవన్నీ సరైనవే
9. జతపరచండి.
   జాబితా - I
   i) లాంగ్ పార్లమెంట్ (ఇంగ్లండ్)
   ii) మొదటి చార్లెస్ (ఇంగ్లండ్) పాలనాకాలం
   iii) లెనిన్ (రష్యా) పాలనాకాలం
   iv) 15వ లూయీ (ఫ్రాన్స్) పాలనాకాలం
   జాబితా - II
   ఎ) 1625 - 1649 బి) 1640 - 1660
   సి) 1715 - 1774 డి) 1917 - 1924
   1) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
   2) i- డి, ii- సి, iii- బి, iv-ఎ
   3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
   4) i- బి, ii- ఎ, iii- సి, iv-డి
10. అమెరికాలో సంపూర్ణ స్వాతంత్ర్య ప్రకటన చేసిన ప్రాంతం ఏది?
    1) ఫిలడెల్ఫియా 2) జార్జియా
    3) న్యూయార్క్ 4) వర్జీనియా
11. బ్రెజిల్ పోర్చుగల్ నుంచి ఎప్పుడు స్వాతంత్ర్యం పొందింది?
    1) 1813 2) 1822
    3) 1833 4) 1843
12. 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి. పోరాడితే పోయేదేమీ లేదు. బానిస సంకెళ్లు తప్ప' అని పిలుపునిచ్చిందెవరు?
    1) ఫ్రెడరిక్ ఏంజెల్ 2) కారల్ మార్క్స్
    3) బెనిటో ముస్సోలిని
    4) నెపోలియన్ బోనాపార్టే
13. వర్జీనియాలోని యార్క్‌టౌన్ ద్వీపకల్పం వద్ద అమెరికా సేనలకు లొంగిపోయిన బ్రిటిష్ సైన్యాలకు నాయకుడు ఎవరు?
    1) వారన్ హేస్టింగ్స్ 2) వెల్లస్లీ
    3) రాబర్ట్ క్లైవ్ 4) కారన్ వాలీస్
14. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) న్యూడీల్ పథకం - ఎఫ్.డి. రూజ్‌వెల్ట్ (అమెరికా)
    2) నూతన ఆర్థిక విధానం - లెనిన్ (రష్యా)
    3) రక్తపాత విధానం - ఆటోవాన్ బిస్మార్క్ (జర్మనీ)
    4) కాల్బర్టిజం - నెక్కర్ (ఫ్రాన్స్)
15. రెండో నల్లమందు యుద్ధానికి తక్షణ కారణం ఏది?
    1) లోర్చాయారో నౌక ఉదంతం
    2) చైనా మకావో ఓడరేవును మూసి వేయడం
    3) ఇంగ్లండ్‌లో చైనా వారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం
    4) చైనా భూగర్భంలో తలపెట్టిన రైలు మార్గ నిర్మాణం
16. 'విముక్తినిచ్చిన జార్' అని ఎవరిని అంటారు?
    1) జార్ మొదటి అలెగ్జాండర్
    2) జార్ మొదటి నికోలస్
    3) జార్ మూడో అలెగ్జాండర్
    4) జార్ రెండో అలెగ్జాండర్



17. నాజీ పార్టీ స్థాపకుడు ఎవరు?
    1) అడాల్ఫ్ హిట్లర్ 2) డ్రెక్లర్
    3) రిబ్బెన్ ట్రాప్ 4) వాన్‌రూన్
18. గ్రంథం, దాని రచయితకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
    జాబితా - I
    i) మైన్‌కాంఫ్
    ii) ఎ స్టడీ ఆఫ్ ఫిజికల్ కల్చర్
    iii) సోషల్ కాంట్రాక్ట్
    iv) స్పిరిట్ ఆఫ్ లాస్
    జాబితా - II
    ఎ) మావోట్సేటుంగ్ బి) అడాల్ఫ్ హిట్లర్
    సి) మాంటెస్క్యూ డి) రూసో
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
    3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
    4) i- బి, ii- ఎ, iii- సి, iv-డి
19. కింది వాటిలో సరైన జత ఏది?
    1) ఇండల్జెన్సెస్ - పాప పరిహార పత్రాలు
    2) లెజాఫేర్ - జోక్యం చేసుకోకు
    3) అపార్థీడ్ - వర్ణ వివక్ష
    4) పైవన్నీ సరైనవే
20. యూరప్‌లో ఆచరణలో ఉన్న 'పుట్టింగ్ ఔట్ పద్ధతి' అంటే?
    1) ముడి సరుకులను వృత్తి పని వారికి అప్పగించి పని చేయించడం
    2) ఓడరేవులను కార్మికులకు అప్పగించడం
    3) సముద్రాలపై వ్యాపార గుత్తాధిపత్యం కలిగి ఉండటం
    4) వ్యవసాయాన్ని వాణిజ్యీకరణ చేయడం
21. 'ది ప్రిన్స్' గ్రంథ రచయిత ఎవరు?
    1) మాఖియవెల్లి 2) రాఫెల్
    3) డ్యూరర్ 4) ఎరాస్మస్
22. జతపరచండి.
    జాబితా - I
    i) దైవ దత్తాధికార సిద్ధాంతం అనుసరించిన వారు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

వరల్డ్ హిస్టరీ

    ii) మానవుడు సమాజం అనే సంకెళ్లలో బంధించబడ్డాడు అని వ్యాఖ్యానించిన వారు
    iii) 'వర్గ పోరాటపు రికార్డే చరిత్ర' అని పేర్కొన్నవారు
    iv) 'నేనే రాజ్యం' అని వ్యాఖ్యానించిన వారు
    జాబితా - II
    ఎ) 14వ లూయీ బి) కారల్ మార్క్స్
    సి) రూసో డి) మొదటి జేమ్స్
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- డి, ii- సి, iii- బి, iv-ఎ
    3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
23. 'రాజుల్లో సూర్యుడు' అని పేరొందిన వారెవరు?
    1) 4వ హెన్రీ 2) 14వ లూయీ
    3) 15వ లూయీ 4) 16వ లూయీ
24. 'ఫ్రెంచ్ ఈస్టిండియా కంపెనీ'ని ఎప్పుడు స్థాపించారు?
    1) 1664 2) 1654
    3) 1668 4) 1678
25. పవిత్ర రోమన్ సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేసిందెవరు?
    1) 16వ లూయీ
    2) నెపోలియన్ బోనాపార్టే
    3) 7వ హెన్రీ 4) రెండో ఛార్లెస్
26. జతపరచండి.
    సంవత్సరం
    i) 1865 ii) 1869
    iii) 1898 iv) 1929
    ప్రాధాన్యం
    ఎ) ప్రపంచ ఆర్థిక మాంద్యం
    బి) అబ్రహం లింకన్ హత్య
    సి) చైనాలో వంద రోజుల సంస్కరణలు
    డి) సూయజ్ కాలువ తెరవడం
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
27. 'ఉదయించే సూర్యుడి భూమి'గా పేరొందిన దేశం?
    1) జర్మనీ 2) జపాన్
    3) ఇంగ్లండ్ 4) ఫ్రాన్స్
28. 'కార్బోనారీ' అంటే?
    1) బొగ్గు కాల్చేవారు 2) స్వేచ్ఛాపుత్రులు
    3) పన్నులు చెల్లించేవారు
    4) విద్యాధికులు
29. జతపరచండి.
    జాబితా - I
    i) ది మోనాలిసా చిత్రం
    ii) ప్రైస్ ఆఫ్ పాలీ గ్రంథం
    iii) గైడ్ టు జాగ్రఫీ
    iv) ది లాస్ట్ జడ్జిమెంట్ చిత్రం
    జాబితా - II
    ఎ) టాలమీ బి) మైఖెలాంజిలో
    సి) ఎరాస్మస్ డి) లియొనార్డో డావెన్సీ
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- డి, ii- సి, iii- ఎ, iv- బి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
30. కింది వాటిలో హిట్లర్ స్థాపించనిది ఏది?
    1) గెస్ట్ పో (రహస్య పోలీస్ దళం)
    2) పీపుల్స్ అబ్జర్వర్ (పత్రిక)
    3) రెడ్ షర్ట్స్ (ఎర్ర చొక్కాల దళం)
    4) ఎలైట్ గార్డ్స్ (అత్యున్నత రక్షక దళం)
31. జతపరచండి.
    ప్రముఖుడు
    i) బెనిటో ముస్సోలిని ii) హిట్లర్
    iii) జోసెఫ్ మాజినీ iv) ఆలీవర్ క్రాంవెల్
    బిరుదు
    ఎ) ఫ్యూరర్ బి) ఇల్‌డ్యూస్
    సి) లార్డ్ ప్రొటెక్టర్
    డి) ఇటలీ జాతీయోద్యమ ప్రవక్త
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- డి, ii- సి, iii- ఎ, iv- బి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
32. 'అన్ని సముద్రాలు కలిసే ఉన్నాయి' అనే విషయాన్ని తొలిసారి తన భౌగోళిక యాత్రల ద్వారా వివరించిందెవరు?
    1) ఫెర్డినాండ్ మాజిలాన్
    2) క్రిస్టఫర్ కొలంబస్
    3) వాస్కోడిగామా 4) ఫ్రెడరిక్ బార్బోసా
33. 'రినైజాన్స్' అనేది ఏ భాషాపదం?
    1) ఫ్రెంచ్ 2) జర్మన్
    3) గ్రీక్ 4) స్పానిష్
34. మధ్యయుగం నాటి ఐరోపా వాస్తు శైలిని ఏమంటారు?
    1) సమురాయ్ 2) పైటా
    3) మీర్ 4) గోథిక్
35. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) నిజమైన క్రైస్తవుడు - జాన్ కాల్విన్
    2) మత సంస్కరణోద్యమానికి వేగు చుక్క - జాన్ విక్లిఫ్
    3) ది నావిగేటర్ - హెన్రీ
    4) ఆధునిక జస్టీనియన్ - లూయీ ఫిలిప్
36. 1830 నాటికి ప్రపంచంలోనే తొలి రైలు ఏయే ప్రాంతాల మధ్య నడిచింది?
    1) మాంచెస్టర్ - బ్రిస్టల్
    2) బ్రిస్టల్ - లివర్‌పూల్
    3) లివర్‌పూల్ - మాంచెస్టర్
    4) స్టాకేటన్ - డార్లింగ్‌టన్
37. జతపరచండి.
    జాబితా - I
    i) మరమగ్గం ii) ఆవిరి యంత్రం
    iii) వాటర్ ఫ్రేమ్ iv) స్పిన్నింగ్ మ్యూల్
    జాబితా - II
    ఎ) రిచర్డ్ ఆర్క్‌రైట్
    బి) శామ్యూల్ క్రాంప్టన్
    సి) ఎడ్మండ్ కార్ట్‌రైట్ డి) జేమ్స్‌వాట్
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- సి, ii- డి, iii- ఎ, iv-బి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
38. ఫ్రాన్స్ జాతీయ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహించుకుంటారు?
    1) జూన్ 14 2) జూలై 14
    3) ఆగస్టు 14 4) సెప్టెంబర్ 14
39. 'ఫ్రెంచ్ విప్లవానికి బైబిల్' అని ఏ గ్రంథాన్ని అంటారు?
    1) సోషల్ కాంట్రాక్ట్
    2) వెల్త్ ఆఫ్ నేషన్స్
    3) స్పిరిట్ ఆఫ్ లాస్
    4) ప్రిన్సిపియా మ్యాథమెటికా
40. ఫ్రాన్స్‌లో బానిసత్వాన్ని అధికారికంగా ఎప్పుడు రద్దు చేశారు?
    1) 1789 2) 1794
    3) 1796 4) 1799
41. ఐక్య జర్మనీ తొలి రాజధాని ఏది?
    1) బెర్లిన్ 2) ఫ్రాంక్‌ఫర్ట్
    3) బాండెన్‌బర్గ్ 4) ఉర్టెంబర్గ్
42. బోయర్ల యుద్ధం ఎప్పుడు జరిగింది?
    1) 1899-1902 2) 1905-1909
    3) 1907-1911 4) 1909-1912
43. సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రాంతం పేరు ఏమని మార్చారు?
    1) లెనిన్ గ్రాడ్ 2) స్టాలిన్ గ్రాడ్
    3) కెరెన్స్కీ గ్రాడ్ 4) ట్రాట్స్కీ గ్రాడ్

సమాధానాలు

1) 3	2) 4	3) 1	4) 2	5) 1
6) 3	7) 1	8) 4	9) 1	10) 1
11) 2	12) 2	13) 4	14) 4	15) 1
16) 4	17) 2	18) 2	19) 4	20) 1
21) 1	22) 2	23) 2	24) 1	25) 2
26) 2	27) 2	28) 1	29) 3	30) 3
31) 4	32) 1	33) 1	34) 4	35) 4
36) 3	37) 3	38) 2	39) 1	40) 2
41) 1	42) 1	43) 1		

What is the THIRD sentence after rearrangement?

Model Questions

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Many economists and expert committees (1)/ have in the past argued that the RBI is holding (2)/ much higher capital than required (3)/ to cover all its risks and contingency. (4)/ No error (5)
2. Harmanpreet became the first Indian woman cricketer to score a century in T-20 Internationals. (1)/ Earlier this year, she is embroiled in controversy (2)/ after the Punjab government withdrew her DSP rank (3)/ saying her degree had been found to be fake. (4)/ No error (5)
3. Sri Lankan President Maithripala Sirisena on Sunday stoutly defended his controversial move (1)/ to dissolve the parliament, saying it was taken to prevent clashes (2)/ between rival lawmakers (3)/ and also blamed Speaker for not accepting his presidential powers. (4)/ No error (5)
4. The Election Commission on Friday imposed a near month-long ban (1)/ on holding exit polls (2)/ beginning November 12 (3)/ in the five poll-bound states include Telangana. (4)/ No error (5)
5. The National Flag will fly at half-mast throughout the country on Monday (1)/ to pay homage Union minister Ananth Kumar (2)/ who died in the early hours. (3)/ The Central government will also accord a state funeral to the senior BJP leader. (4)/ No error (5)

Directions (Q.No. 6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. She looked at him, and laughed; a cold laugh, ____, yet not bitter.
   1) Disdainful 2) respectful
   3) deferential 4) referential
   5) reverent
7. My brother was ____; he has attached himself to the retinue of a wealthy Baroness.
   1) Servile 2) imply 3) comply
   4) entail 5) authoritative
8. Punishment is____in deterring from crime only if it be certain and ____.
   1) Useless, slow 2) futile, leisurely
   3) ineffectual, dawdling
   4) vain, sluggish
   5) efficacious, speedy
9. The Trump administration's ____ indifference to European concerns boils the blood of even the most ____ of Eurocrats.
   1) simple, bustling
   2) basic, docile
   3) ambiguous, serene
   4) undetectable, quite
   5) Apparent, placid
10. The hotel's shabby, outdated exercise room was its ____ attempt at a health spa.
    1) hefty 2) paltry
    3) substantial 4) generous
    5) considerable

Directions: (Q.No. 11 - 15) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. <u>She recommended that John should take the ferry.</u>
    1) She recommended that John takes the ferry.
    2) She recommended that John is taking the ferry.
    3) She recommended that John has taken the ferry.
    4) She recommended that John take the ferry.
    5) No correction required
12. After the attack on the World Trade Center, the President ordered intelligence agencies <u>should prepare lists of who were America's most wanted terrorists.</u>
    1) would do the preparation of lists of America's most wanted terrorists



BANK EXAMS

ENGLISH

    2) preparing lists of most wanted terrorists in America
    3) the preparing of a list of the most wanted terrorists in America
    4) to prepare lists of the most wanted terrorists in America
    5) No correction required
13. The exhibit, created by painstaking craftsmanship in the jungles of Burma, consisted of hundreds of paintings, <u>each painting a tiny etched landscape inside its</u> own ceramic work of pottery.
    1) all the paintings a tiny etched landscape inside their
    2) all the paintings a tiny etched landscape inside its
    3) every painting a tiny etched landscape inside their
    4) each painting a tiny etched landscape inside their
    5) No correction required
14. More than one hundred years ago, students of ornithology reported that hummingbirds can hover <u>as insects flitting gracefully from one flower to another.</u>
    1) like insects flitting gracefully from one flower to another
    2) as insects do that flit gracefully from one flower to others
    3) like insects do that flit gracefully from one flower to others
    4) as do insects that flit gracefully from one flower to some other one
    5) No correction required
15. Forced to cut back their stock, automobile dealers in the area have cut prices; <u>have been priced to sell, and they are</u>
    1) are priced to sell, and they have
    2) are priced to sell, and they do
    3) are being priced to sell, and have
    4) had been priced to sell, and they have
    5) No correction required

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The jump in the ranking, from 100 to 77, is correlated with an improvement in the ratings, a jump of 6.6 per cent over last year.
B) Such questions are critical to help evolve a more focussed set of policy priorities for India.
C) What was even more interesting was that construction permits and cross-border trade were two aspects that showed maximum improvement.
D) What did the government do right? If business has become so much easier, why don't we see a boom in new businesses and investment?
E) The improvement in India's "Doing Business" rankings was quite a surprise, and among the few pleasant ones in recent weeks.
F) This is the second year that India has seen a massive jump in the same ratings with its ranking going up by 23 places this year, on top of 30 places last year.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) E
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

KEY

1) 4	2) 2	3) 3	4) 4	5) 2
6) 1	7) 1	8) 5	9) 5	10) 2
11) 4	12) 4	13) 5	14) 2	15) 2
16) 1	17) 2	18) 3	19) 5	20) 3

విద్య, ఉద్యోగ సమాచారం

బీఆర్ఐసీ-ఎన్ఐఐ, ఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

ఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ(బీఆర్ఐసీ-ఎన్ఐఐ) ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ సైంటిస్ట్-1, జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 03.
» **ఖాళీల వివరాలు:** ప్రాజెక్ట్ సైంటిస్ట్1-01, జూనియర్ రీసెర్చ్ ఫెలో-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ, ఎంఎస్సీ, నెట్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ సైంటిస్ట్‌కు రూ.56,000, జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)కు రూ.37,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** mompcoe@nii.ac.in.
» **దరఖాస్తులకు చివరితేది:** 21.06.2025.
» **వెబ్‌సైట్:** https://www.nii.res.in

ఎస్‌సీసీఎల్‌లో అడ్వైజర్ లీగల్ పోస్టులు

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్) ఒప్పంద ప్రాతిపదికన అడ్వైజర్ లీగల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎల్ఎల్‌బీ/బీఎల్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.1,50,000.
» **వయసు:** 50 ఏళ్లు పైబడిన న్యాయ నిపుణులకు ప్రాధాన్యత ఇస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.06.2025
» **వెబ్‌సైట్:** https://scclmines.com

ఆర్‌వీఎన్ఎల్, చెన్నైలో చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టులు

చెన్నైలోని రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్ఎల్) రెగ్యులర్ ప్రాతిపదికన చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(సివిల్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 19.06.2025 నాటికి 57 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.1,00,000 నుంచి రూ.2,60,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.06.2025
» **వెబ్‌సైట్:** https://rvnl.org

ఆర్‌వీఎన్ఎల్‌లో చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టులు

రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్ఎల్) రెగ్యులర్ ప్రాతిపదికన చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్(సివిల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(సివిల్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 19.06.2025 నాటికి 57 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.1,00,000 నుంచి రూ.2,60,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 19.06.2025.
» **వెబ్‌సైట్:** https://rvnl.org

మిధాని, హైదరాబాద్‌లో అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

హైదరాబాద్‌లోని మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్(మిధాని) అసిస్టెంట్ మేనేజర్ (మెడికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 21.05.2025 నాటికి 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును మేనేజర్(హెచ్ఆర్), కార్పొరేట్ ఆఫీస్, మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్, కాంచన్‌బాగ్, హైదరాబాద్-500058 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.06.2025.
» **వెబ్‌సైట్:** https://midhani-india.in